
సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 181
శుక్రవారం 17-3-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'


**గార్సెట్టి ఎంపిక ఖరారు**
త్వరలో భారత్‌లో అమెరికా రాయబారిగా నియామకం - 6లో


**కూలిన చీతా హెలికాప్టర్**
అరుణాచల్‌ప్రదేశ్‌లో ప్రమాదం.. ఇద్దరు సైనికాధికారుల దుర్మరణం - 6లో


**పారిశ్రామిక ప్రాభవం**
పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించి.. యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం రూ.4,112.5 కోట్లు కేటాయించింది.
వివరాలు 12లో ▸


**ప్రాజెక్టులకు నిధుల పరవళ్లు**
సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. జలవనరుల శాఖకు రూ.11,908.10 కోట్లు ఖర్చు చేయనుంది.
వివరాలు 10లో ▸


**అక్కచెల్లెమ్మలకు అగ్రపీఠం**
ప్రభుత్వం మహిళల అభివృద్ధికి రూ.77,914 కోట్లు, చిన్నారుల సంక్షేమం కోసం రూ.20,593 కోట్లు వెచ్చించనుంది.
వివరాలు 13లో ▸


**పేదల సొంతింటి కల సాకారం**
పేదల సొంతింటి కల సాకారం చేసే దిశగా ప్రభుత్వం మరో అడుగు వేసింది. పేదల ఇళ్లకు రూ.6,291.70 కోట్లు ఖర్చు చేయనుంది.
వివరాలు 12లో ▸

• సంక్షేమంతో కూడిన పురోగతే లక్ష్యం

# ఐదవసారీ అభివృద్ధి దారే

## రూ.2,79,279.27 కోట్లతో 2023-24 వార్షిక బడ్జెట్





బడ్జెట్ ప్రతులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అందజేస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, అధికారులు

కళ్ల ముందు అభివృద్ధి కనిపిస్తున్నా దాన్ని కనీసం ఆలోచనల్లో నైనా అందుకోలేనంత దూరంలో ఎక్కువ మంది ఉండిపోతే.. ఆ అభివృద్ధికి అర్థం ఉందా? అందుకే... నాలుగేళ్ల కిందట రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసినప్పటి నుంచీ సామాన్యులతోనే ప్రయాణిస్తున్నారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఎన్ని సవాళ్లెదురైనా మనసా వాచా మ్యానిఫెస్టోనే అనుసరిస్తున్నారు. చదువు రూపంలో ఆస్తిని అందించటం... ఆరోగ్య పరిరక్షణతో అప్పులపాలు కాకుండా చూడటం... రైతన్నలను, మహిళల్ని, అవ్వాతాతలను ఆదుకుని ఆర్థిక, సామాజిక చక్రాన్ని ముందుకు నడిపించటమే తొలి ప్రాధాన్యాలుగా చేసుకున్నారు. సామాజికంగా... ఆర్థికంగా వెనకబడిన వారిని ముందుకు తెస్తేనే అభివృద్ధికి అర్థం ఉంటుందన్నది ఆయన ఎకనమిక్స్. ఈ 5వ బడ్జెట్లో కూడా స్పష్టంగా కనిపించింది అదే!!.

2లో

**మరోసారి సంక్షేమ, అభివృద్ధి బడ్జెట్**
మంచి చదువు, మంచి వైద్యం, మంచి ఆరోగ్యం, రైతుల్లో సంతోషం, నా అక్క చెల్లెమ్మల్లో సాధికారత, జోరైన పారిశ్రామికాభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా మరోసారి సంక్షేమ–అభివృద్ధి బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం. అసమానతలు తగ్గించి, పేదరికాన్ని నిర్మూలించే దిశగా ఈ బడ్జెట్ ద్వారా మరో అడుగు ముందుకేశాం.
- సీఎం వైఎస్ జగన్

- అన్ని రంగాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనే ధ్యేయం
- వైఎస్సార్ పెన్షన్ కానుక కోసం రూ.21,434 కోట్లు
- వచ్చే ఏడాది జనవరిలో పెన్షన్ రూ.3 వేలకు పెంపు
- మహిళల పథకాలకు రూ.77,914.43 కోట్లు
- పిల్లల పథకాలకు రూ.20,593.38 కోట్లు
- సంక్షేమం, విద్య, వైద్యం, వ్యవసాయం, సాగు నీరు, మౌలిక రంగాలకు పెద్ద పీట

**ముఖ్య కేటాయింపులు** (రూ.కోట్లలో)

| | |
|---|---|
| బీసీ సబ్‌ప్లాన్ | 38,605 |
| ఎస్సీ సబ్‌ప్లాన్ | 20,005 |
| ఎస్టీ సబ్‌ప్లాన్ | 6,929 |
| మైనారిటీ కాంపొనెంట్ | 4,203 |
| కాపుల సంక్షేమం | 4,887 |
| సంక్షేమం | 51,345 |
| విద్యా రంగం | 32,198 |
| ఆరోగ్య రంగం | 15,882 |
| వ్యవసాయ అనుబంధ రంగాలు | 14,043 |
| గ్రామీణాభివృద్ధి | 17,531 |



## టీడీపీ దుష్ట పన్నాగం
- ప్రజాప్రయోజన బడ్జెట్ ప్రవేశ పెట్టకుండా అడుగడుగునా అడ్డంకులు
- బుగ్గన స్పీచ్ మొదలుపెట్టగానే అడ్డుతగులుతూ నినాదాలు
- బడ్జెట్‌ను అడ్డుకునేందుకు పక్కా ప్రణాళికతో సభలోకి టీడీపీ సభ్యులు
- స్పీకర్‌పై కాగితపు ముక్కలు విసురుతూ గందరగోళం.. స్పీకర్, సీఎం, ఇతర సభ్యులు వారించినా మారని టీడీపీ సభ్యుల తీరు
- ప్రజా ప్రయోజనాల దృష్ట్యా 14 మంది ఒకరోజు సస్పెన్షన్

2లో


## ఢిల్లీలో సీఎం జగన్
**నేడు ప్రధాని మోదీతో భేటీ**
- వివరాలు 2లో

## ఇంటి వద్దే విచారించండి


- ఈడీకి తెలంగాణ ఎమ్మెల్సీ కవిత లేఖ
- సుప్రీంకోర్టులో విచారణ జరిగే వరకు వాయిదా వేయాలని విజ్ఞప్తి.. గురువారం ఈడీ విచారణకు గైర్హాజరు
- 20న తమ ఆఫీసులోనే విచారణకు రావాలంటూ కవితకు మళ్లీ ఈడీ నోటీసులు
- ఈ కేసులో కవిత అనుమానితురాలని ప్రత్యేక కోర్టుకు ఈడీ వెల్లడి

- వివరాలు 16లో

**రూపాయి వచ్చేదిలా.. ఖర్చయ్యేదిలా(రూ.కోట్లలో)**




**సుస్థిరాభివృద్ధే ప్రభుత్వ విధానం**
జీవనోపాధి, సాధికారత, సామాజిక భద్రత, పారిశ్రామికాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. కోవిడ్ వంటి సంక్షోభాలున్నా నాలుగేళ్లలో గణనీయమైన ప్రగతి సాధించాం. ప్రభుత్వం ఇప్పటివరకు డీబీటీ విధానంలో రూ.1.97 లక్షల కోట్లను ప్రజల ఖాతాల్లో జమ చేసింది. 2018–19లో జీఎస్‌డీపీ వృద్ధి రేటులో 22వ స్థానంలో ఉన్న ఏపీ.. 2021–22 నాటికి మొదటి స్థానానికి చేరింది.
- ఆర్థిక మంత్రి బుగ్గన

బడ్జెట్‌పై మరిన్ని కథనాలు 2, 10, 11, 12, 13 పేజీల్లో..




**ఇదండీ సంగతి**



పెండింగ్ ఫైల్స్ గురించి అడిగినప్పుడల్లా యోగా చేస్తున్నాడ్సార్!!

# 'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్

- మొత్తం 9 స్థానాలనూ కైవసం చేసుకున్న వైఎస్సార్‌సీపీ
- 5 స్థానాల్లో ఏకగ్రీవం
- ఎన్నికలు జరిగిన 4 స్థానాల్లోనూ జయకేతనం
- కొనసాగుతున్న పట్టభద్రుల, టీచర్ల ఓట్ల లెక్కింపు


వంకా రవీంద్రనాథ్


కవురు శ్రీనివాస్


నర్తు రామారావు



మధుసూదన్


సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసింది. మొత్తం 9 స్థానాలనూ కైవసం చేసుకుంది. వీటిలో 5 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలు జరిగిన మిగతా 4 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఈ నాలుగు స్థానాలకు ఈనెల 13న పోలింగ్ జరిగింది. గురువారం ఓట్లు లెక్కించారు. శ్రీకాకుళం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం నుంచి నర్తు రామారావు, కర్నూలు జిల్లా నుంచి మధుసూదన్, పశ్చిమ గోదావరి జిల్లాలోని రెండు నియోజకవర్గాల నుంచి వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ ఘనవిజయం సాధించారు. ఈ నాలుగు స్థానాల్లోనూ సంఖ్యా బలం లేకపోయినా స్వతంత్రుల ముసుగులో పోటీ చేసిన టీడీపీ అభ్యర్థులు ఘోర పరాజయం పాలయ్యారు. కాగా, 3 పట్టభద్రుల నియోజకవర్గాలు, 2 ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. స్థానిక సంస్థల కోటాలో అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తూర్పు గోదావరి..

మిగతా 3వ పేజీలో ▶




| | |
|---|---|
| మొత్తం ఆదాయం | రూ. 2,79,279.27 కోట్లు |
| కేంద్ర పన్నుల వాటా రూపంలో | రూ. 41,338.02 కోట్లు |
| కేంద్ర గ్రాంట్లు | రూ. 46,834.64 కోట్లు |
| రెవెన్యూ లోటు | రూ. 22,316.70 కోట్లు |
| ద్రవ్య లోటు | రూ. 54,587.52 కోట్లు |



మనం పనిచేస్తున్న విధానానికి
అదే పనిని చేయగల సామర్థ్యానికి
గల తేడాను అధిగమించగలిగితే
ప్రపంచంలో ఉన్న ఎన్నో సమస్యలను
పరిష్కరించగలము
- మహాత్మా గాంధీ

## మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం అంజాద్ బాషా

**సభలో ఆందోళనకు దిగిన టీడీపీ ఎమ్మెల్సీలు, వాకౌట్**

**సాక్షి, అమరావతి:** అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో భాగంగా గురువారం మండలిలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దాదాపు గంటన్నరకు పైగా ప్రసంగాన్ని ఆయన చదివి వినిపించారు. ఈ క్రమంలో ప్రసంగం మరో అరగంటలో ముగుస్తుందనగా టీడీపీ ఎమ్మెల్సీలు ఆందోళనకు దిగారు. దాదాపు 9 మంది సభ్యులు ప్లకార్డులు చేతబట్టుకుని వెల్‌లోకి దూసుకెళ్లారు.మండలి చైర్మన్ మోషేన్ రాజు వారిని వారించారు. బడ్జెట్ ప్రసంగం జరుగుతుండగా, ఇలా ఆందోళన, నినాదాలు చేయడం సబబు కాదని, ప్రసంగం ముగిశాక అభ్యంతరాలను తెలియజేయాల్సిందిగా సూచించారు. అయినా టీడీపీ ఎమ్మెల్సీలు పట్టించుకోకుండా కాగితాలు చించి నిరసన తెలిపారు. కొద్దిసేపు అనంతరం వారంతట వారే సభ నుంచి నిష్క్రమించారు. సాధారణ బడ్జెట్ అనంతరం స్వల్ప విరామం అనంతరం కొనసాగిన మండలిలో వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి సీదిరి అప్పలరాజు ప్రవేశపెట్టారు. కాగా వ్యవసాయ బడ్జెట్ ప్రసంగం జరుగుతుండగా సభా నిర్వహణ బాధ్యతలను మోషేన్ రాజు కొద్ది సమయం మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానమ్‌కు అప్పగించారు.

## బడ్జెట్ ప్రతులకు పూజలు


ప్రత్యేక పూజల అనంతరం బడ్జెట్ ప్రతులను అందుకుంటున్న ఆర్థిక శాఖ బృందం

రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా 2023 – 24 బడ్జెట్‌ను రూపొందించినట్లు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. గురువారం శాసన సభలో 2023 – 24 వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు ఆయన సచివాలయంలోని తన కార్యాలయంలో బడ్జెట్ ప్రతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్ రావత్, ఆ శాఖ కార్యదర్శులు కేవీవీ సత్యనారాయణ, ఎన్ గుల్జార్, ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, సీఎఫ్ఎంఎస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సునీల్ తదితరులు పాల్గొన్నారు. కాగా, అంతకు ముందు వీరు బడ్జెట్ ప్రతులను ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## అమరజీవికి సీఎం జగన్ నివాళి


పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

**సాక్షి,అమరావతి:**అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకుని సచివాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి సీఎం వైఎస్ జగన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మంత్రి బుగ్గన, సీఎస్ డాక్టర్ జవహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పార్టీ కేంద్ర కార్యాలయంలో..**
అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి వేడుకను గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ.. పొట్టిశ్రీరాములు జీవితం అందరికి ఆదర్శమన్నారు. ఎమ్మెల్యేలు వెలంపల్లి, మద్దాళి గిరి, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, పోతుల సునీత తదితరులు అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నవరత్నాల ప్రోగ్రాం వైస్ చైర్మన్ నారాయణమూర్తి, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, లిడ్ క్యాప్ చైర్మన్ రాజశేఖర్, పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య తదితరులు పాల్గొన్నారు. విజయవాడలోని విద్యుత్‌సౌధలో నిర్వహించిన అమరజీవి జయంతి ఉత్సవాల్లో ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్, ట్రాన్స్‌కో, జెన్‌కో డైరెక్టర్లు, విద్యుత్ శాఖాధికారులు పాల్గొన్నారు.

# సుస్థిరాభివృద్ధే ప్రభుత్వ విధానం

**జీవనోపాధి, సాధికారత, సామాజిక భద్రత, పారిశ్రామికాభివృద్ధే ప్రధాన లక్ష్యం**

- రూ.2,79,279.27 కోట్లతో శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన బుగ్గన
- కోవిడ్ వంటి సంక్షోభాలున్నా నాలుగేళ్లల్లో గణనీయమైన పురోగతి
- నాలుగేళ్లలో డీబీటీ విధానంలో రూ.1.97 లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లో జమ
- 2023–24లో రూ.54,228 కోట్లు పంపిణీ చేసేలా కేటాయింపులు
- 2018–19లో జీఎస్‌డీపీ వృద్ధి రేటులో 22వ స్థానంలో రాష్ట్రం
- 2021–22 నాటికి మొదటి స్థానం
- 10% వృద్ధితో 2023–24లో జీఎస్‌డీపీ అంచనా రూ.14,49,501 కోట్లు



**సాక్షి, అమరావతి:** సుస్థిరాభివృద్ధే ప్రభుత్వ విధానమని, ఇందుకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ 2023-24 బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నామని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు. జీవనోపాధి, సాధికారత, సామాజిక భద్రత, పారిశ్రామికాభివృద్ధే ప్రధానం అని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమంతో పాటు సమగ్రాభివృద్ధే లక్ష్యంగా 2023-24 సంవత్సరానికి రూ.2.79 లక్షల కోట్లతో వార్షిక బడ్జెట్‌ను గురువారం ఆయన శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుస్థిర అభివృద్ధి, సుపరిపాలన అనే సూత్రాల సమ్మేళనంగా మేనిఫెస్టోను రూపొందించామని, అధికారం చేపట్టిన తొలి సంవత్సరమే 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అమలు చేశామని తెలిపారు. కోవిడ్ వంటి సంక్షోభాలు ఉన్నప్పటికీ నాలుగేళ్లల్లో గణనీయమైన పురోగతిని సాధించామన్నారు. ఈ నాలుగేళ్లలో 15,004 గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటు, 1.34 లక్షల ప్రభుత్వ ఉద్యోగుల నియామకం, 2.65 లక్షల మంది వలంటీర్ల నియామకం, 51,488 మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ పరిధిలోకి తీసుకురావడంతో పాటు 15,715 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచామని చెప్పారు. 3,707 వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 461 పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం, 30.65 లక్షల మందికి ఇళ్ల పట్టాల పంపిణీ వంటి అనేక కార్యక్రమాలను అమలు చేశామని తెలిపారు. దాదాపు 21 పథకాల ద్వారా లబ్ధిదారులకు నాలుగేళ్లల్లో డీబీటీ ద్వారా రూ.1.97 లక్షల కోట్లు జమ చేశామన్నారు. 2023-24లో డీబీటీ విధానంలో రూ.54,228 కోట్లు పంపిణీ చేసే విధంగా కేటాయింపులు చేశామని చెప్పారు. 2018–2019 ఆర్థిక సంవత్సరంలో స్థిర ధరల ప్రకారం మన జీఎస్‌డీపీ వృద్ధి రేటులో మన రాష్ట్రం దేశంలోనే 22వ స్థానంలో ఉండగా, వైఎస్ జగన్ ప్రభుత్వం అభివృద్ధి విధానాల కారణంగా 2021–2022 లో 11.43 శాతం వృద్ధితో దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. వచ్చే ఏడాది జీఎస్‌డీపీ 10% వృద్ధితో రూ.14,49,501 కోట్లకు చేరుతుందని అంచనాగా ఉందన్నారు. రైతులకు చేదోడుగా ఉంటూ గత నాలుగేళ్లల్లో వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద ఇప్పటి వరకు రూ.27,063 కోట్లు రైతుల ఖాతాల్లో వేయడమే కాకుండా వచ్చే ఏడాది కోసం రూ.4,020 కోట్లు కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద ఇప్పటి వరకు రూ.6,872 కోట్లు ఇవ్వగా, వచ్చే ఏడాది కోసం రూ.1,600 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి కోసం రూ.3,000 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. మంత్రి బుగ్గన ఇంకా ఏం చెప్పారంటే..

**ఏటా 50,000 మందికి నైపుణ్య శిక్షణ**

- స్థానిక యువతకు ఉపాధి లభించేలా నైపుణ్య శిక్షణకు పెద్ద పీట వేస్తున్నాం. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో కనీసం ఒక స్కిల్ హబ్ చొప్పున మొత్తం 192 నైపుణ్య కేంద్రాలు, జిల్లా కేంద్రంలో ఒక స్కిల్ కాలేజీ, రాష్ట్ర స్థాయిలో స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఏటా 50,000 మందికి శిక్షణ ఇప్పించేలా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నాం. ఇందుకోసం 154 కార్పొరేట్స్‌తో 18 రంగాల్లో శిక్షణ ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నాం.
- వచ్చే ఏడాది నైపుణ్య శిక్షణ కోసం రూ.1,166 కోట్లు కేటాయిస్తున్నాం. పర్యాటక రంగానికి పెద్ద పీట వేస్తున్నాం. రూ.22,000 కోట్ల పెట్టుబడులు పెట్టే విధంగా 181 అవగాహన ఒప్పందాలు కుదిరాయి. పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద 2023 సంవత్సరం చివరి నాటికి 30.2 లక్షల శాశ్వత గృహాలను అర్హులైన లబ్ధిదారులందరికీ అందించడానికి వైఎస్ జగన్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇందుకోసం 2023–24 సంవత్సరానికి రూ.5,600 కోట్లు కేటాయిస్తున్నాం.

### పారిశ్రామిక మౌలిక వసతులకు పెద్ద పీట

- రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక ప్రగతికి పెద్ద పీట వేస్తోంది. విశాఖలో జరిగిన ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సుకు వచ్చిన అద్భుతమైన స్పందనే ఇందుకు నిదర్శనం. ఎన్టీపీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ గ్రూప్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, భారత్ బయోటెక్, జీఎంఆర్ గ్రూప్, దాల్మియా గ్రూప్, రెన్యూ పవర్, బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్, సెంచరీ ప్లైబోర్డ్స్, శ్రీ సిమెంట్, రామ్‌కో సిమెంట్స్, అపోలో హాస్పిటల్స్‌తోపాటు అనేక ప్రముఖ పారిశ్రామిక సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయి.
- ఈ సదస్సులో 48 దేశాల నుంచి రాయబారులు, దౌత్యవేత్తలు, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సు ద్వారా రూ.13.42 లక్షల కోట్ల పెట్టుబడులతో 6 లక్షలకు పైగా ఉద్యోగాలను సృష్టించే అవకాశం కలిగింది. 378 అవగాహన ఒప్పందాలు కుదరడం ఎంతో గర్వించదగ్గ విషయం.
- విశాఖ–చెన్నై కారిడార్‌లో పారిశ్రామిక క్లస్టర్స్‌తో పాటు ఎంఎస్ఎంఈ యూనిట్లను ప్రోత్సహించేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తున్నాం. 2023–24 ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమలు, వాణిజ్యం కోసం రూ.2,602 కోట్లు కేటాయిస్తున్నాం.

### రవాణా, రహదారుల మౌలిక సదుపాయాలు

- రాష్ట్రంలో దాదాపు 32,725 కిలోమీటర్ల మేర ప్రధాన జిల్లా రహదారులు, జిల్లాల్లోని ఇతర రోడ్ల నిర్వహణతోపాటు 4,000 కిలోమీటర్ల పొడవున ఉన్న బి.టి.రోడ్లను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకున్నాం.
- రూ.400 కోట్లతో దెబ్బతిన్న రోడ్ల నిర్వహణ, అత్యవసర మరమ్మతులను ప్రభుత్వం చేపట్టింది. రూ.2,205 కోట్లతో 8,268 కి.మీ.రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారులను అభివృద్ధి చేశాం. రహదారుల అనుసంధాన ప్రాజెక్ట్ కింద కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలకు 437.59 కి.మీ.పొడవుగల రోడ్లకు సంబంధించి రూ.391 కోట్లతో 46 పనులు మంజూరయ్యాయి. డిసెంబర్ 2022 నాటికి 383.66 కి.మీ. మేర రహదారి పనులు పూర్తయ్యాయి.
- 2023–24 ఆర్థిక సంవత్సరానికి రవాణా, రహదారులు, భవనాల శాఖకు రూ.9,118 కోట్లు కేటాయిస్తున్నాం. పేదరిక నిర్మూలన, ప్రజలందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలను అందించడమే మా ప్రభుత్వ ప్రధాన ధ్యేయం. దీనికి అనుగుణంగా సుస్థిరాభివృద్ధి లక్ష్యంతో 2023–24 బడ్జెట్‌ను సభ ఆమోదం కోసం ప్రవేశ పెడుతున్నాం.

## రంగాల వారీగా బడ్జెట్ ఇలా.. (రూ.కోట్లలో)

| ఆర్థిక సేవలకు కేటాయింపులు | |
|---|---|
| వ్యవసాయ, అనుబంధ సర్వీసులకు | 14,043.63 |
| గ్రామీణాభివృద్ధి | 17,531.79 |
| జలవనరులు, వరద నియంత్రణ | 11,908.10 |
| ఇంధన | 6,546.21 |
| పరిశ్రమలు, మినరల్స్ | 2,602.12 |
| రవాణా | 10,322.57 |
| శాస్త్ర సాంకేతిక, పర్యావరణం | 18.85 |
| సాధారణ ఎకో సేవలు | 4,617.78 |
| మొత్తం | 67,591.05 |

| సామాజిక సేవలకు.. | |
|---|---|
| సాధారణ విద్య | 32,198.39 |
| క్రీడలు, యువజన సర్వీసులు | 137.99 |
| సాంకేతిక విద్య | 512.37 |
| సాంస్కృతిక, కళలు | 26.34 |
| వైద్యం | 15,882.34 |
| తాగునీరు, పారిశుద్ధ్యం | 2,200.39 |
| గృహ నిర్మాణం | 6,291.70 |
| పట్టణాభివృద్ధి | 9,381.54 |
| సమాచార శాఖ | 294.38 |
| సంక్షేమం | 51,345.89 |
| కార్మిక, ఉపాధి | 1,051.10 |
| సామాజిక భద్రత, సంక్షేమం | 3,960.50 |
| మొత్తం | 1,23,282.93 |

సాధారణ సేవలు
**88,405.29**

మొత్తం
**2,79,279.27**

# ఐదవసారీ అభివృద్ధి దారే



**సాక్షి, అమరావతి :** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట నెరవేర్చడమే లక్ష్యంగా అన్ని వర్గాల అభ్యున్నతికి అండగా నిలిచే అభివృద్ధి, సంక్షేమ సమతుల్యతతో కూడిన బడ్జెట్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గురువారం అసెంబ్లీకి సమర్పించింది. జెండర్ బేస్డ్ బడ్జెట్ ద్వారా సమాజంలో సగం ఉన్న మహిళలకు ప్రత్యేక కేటాయింపులు చేశారు. పిల్లలకు కూడా ప్రత్యేక కేటాయింపులు చేయడం విశేషం. అన్ని రంగాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనగా వరుసగా ఐదోసారి రూ.2,79,279.27 కోట్లతో 2023-24 వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఉదయం 10 గంటలకు అసెంబ్లీకి సమర్పించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,28,540.71 కోట్లుగా, మూల ధన వ్యయం రూ.31,061 కోట్లుగా ఉంటుందని అంచనా వేసినట్లు బుగ్గన పేర్కొన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.23,316.70 కోట్లు రెవెన్యూ లోటు, రూ.54,587.52 కోట్లు ద్రవ్య లోటు ఉంటుందని అంచనా వేశామని తెలిపారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో రెవెన్యూ లోటు 3.77 శాతం, ద్రవ్యలోటు 1.54 శాతం ఉంటుందని, రెవెన్యూ ఆదాయం రూ.2,06,224.01 కోట్లుగా అంచనా వేశామన్నారు. ఇందులో కేంద్ర పన్నుల వాటా నుంచి రూ.41,338.02 కోట్లు వస్తాయని, కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో రూ.46,834.64 కోట్లు వస్తాయని అంచనా వేసినట్లు తెలిపారు. రెవెన్యూ లోటుతో పాటు ద్రవ్య లోటును అదుపులో పెట్టే చర్యలు తీసుకున్నట్లు బడ్జెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. అంతకు ముందు ఉదయం 8 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో కేబినెట్ సమావేశమై 2023–24 వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది.

### నవరత్నాలకు పెద్దపీట

ఎప్పటిలాగే మేనిఫెస్టోలోని నవరత్నాల పథకాల కొనసాగింపునకు బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికలతో పాటు మైనార్టీ యాక్షన్ ప్రణాళిక పేరుతో భారీ ఎత్తున నిధులు కేటాయించారు. మొత్తం మీద రాష్ట్రంలోని ఐదు కోట్ల ప్రజానీకాన్ని సంతృప్తి పరిచే స్థాయిలో బడ్జెట్ ప్రతిపాదనలు చేశారు. మరో పక్క వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, సాగునీటి రంగాల్లో మౌలిక రంగాలకు పెద్ద పీట వేశారు. బడ్జెట్‌లో ఎక్కడా దాపరికాలు లేకుండా పూర్తి పారదర్శకత ప్రదర్శించారు. ఏయే రంగాల్లో ఏయే పథకాలకు ఎన్ని నిధులు కేటాయించింది స్పష్టంగా వివరించారు. అవ్వా తాతల సామాజిక పెన్షన్లను వచ్చే ఏడాది జనవరిలో నెలకు 3 వేల రూపాయలు చేస్తామని ప్రకటించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో వైఎస్సార్ పెన్షన్ కానుకకు ఏకంగా రూ.21,434 కోట్లు కేటాయించారు. నవరత్న పథకాల్లోని అన్ని వర్గాలకు బడ్జెట్ కేటాయింపులు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, మైనార్టీ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు అందజేసే అన్ని సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ సంక్షేమ పథకాలన్నింటినీ ఆయా సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా అమలు చేస్తామని స్పష్టం చేసింది.

### సచివాలయాలకు కేటాయింపులు

చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, నాయీ బ్రాహ్మణులు, రజకులు, మత్స్యకారులు, దర్జీలు, చేనేత కార్మికులు, కాపులు, లాయర్లకు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. గ్రామ, వార్డు వలంటీర్లు.. గ్రామ, పట్టణ సచివాలయాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. నేరుగా నగదు బదిలీ చేసే 22 నవరత్నాల పథకాలకు బడ్జెట్‌లో రూ.54,228 కోట్లు కేటాయించారు. మహిళల పథకాలకు ప్రత్యేకంగా రూ.77,914.43 కోట్లు, పిల్లల పథకాలకు ప్రత్యేకంగా రూ.20,593.38 కోట్లు కేటాయించారు. బీసీ ఉప ప్రణాళికకు రూ.38,605 కోట్లు, ఎస్సీ ఉప ప్రణాళికకు రూ.20,005 కోట్లు, ఎస్టీ ఉప ప్రణాళికకు రూ.6,929 కోట్లు, మైనార్టీ కాంపొనెంట్‌కు రూ.4,203 కోట్లు కేటాయించారు. సంక్షేమానికి రూ.51,345 కోట్లు, సాధారణ విద్యా రంగానికి రూ.32,198 కోట్లు, ఆరోగ్య రంగానికి రూ.15,882 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.14,043 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.17,531 కోట్లు కేటాయించారు.

### రైతుల సంక్షేమంపై శ్రద్ధ

రైతుల సంక్షేమంపై శ్రద్ధ చూపుతూ బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. రైతులకు సంబంధించిన అన్ని పథకాలకు కేటాయింపులు కొనసాగించారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా జల వనరుల శాఖకు రూ.11,908 కోట్లు కేటాయించారు. మన బడి నాడు–నేడు కార్యక్రమానికి రూ.3500 కోట్లు.. వైద్య ఆరోగ్య రంగంలో నాడు–నేడు కార్యక్రమానికి రూ.2214.21 కోట్లు కేటాయించారు. పేదల గృహ నిర్మాణాలకు రూ.6291.70 కోట్లు, కాపుల సంక్షేమానికి రూ.4,887 కోట్లు, వైఎస్సార్ ఈబీసీ నేస్తంకు రూ.610 కోట్లు కేటాయించారు. రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా కోసం రూ.6,546 కోట్లు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీకి రూ.2,400 కోట్లు, గడప గడపకు మన ప్రభుత్వానికి రూ.532 కోట్లు కేటాయించారు.

### 2022-23 సవరించిన అంచనాలు

2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం మొత్తం బడ్జెట్ వ్యయం రూ.2,40,509.34 కోట్లుగా ఉంటుందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తెలిపారు. రెవెన్యూ వ్యయం రూ.2,05,555.95 కోట్లు కాగా, మూల ధన వ్యయం రూ.16,846.69 కోట్లు అని తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటు దాదాపు రూ.29,107 కోట్లు కాగా, ఇదే కాలానికి ద్రవ్యలోటు రూ.47,716 కోట్లు అని చెప్పారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో రెవెన్యూ లోటు 2.21 శాతం కాగా, ద్రవ్య లోటు 3.62 శాతంగా ఉందని పేర్కొన్నారు.

### 2022-23 సవరించిన అంచనాలు - 2023-24 ప్రతిపాదనల మేరకు నగదు బదిలీ పథకాల కేటాయింపులు (రూ.కోట్లలో)

| పథకం పేరు | 2022-23 | 2023-24 |
|---|---|---|
| వైఎస్సార్ పెన్షన్ కానుక | 17,850.71 | 21,434.72 |
| వైఎస్సార్ రైతు భరోసా | 3,988.52 | 4,020.00 |
| జగనన్న విద్యా దీవెన | 2,841.64 | 2,841.64 |
| జగనన్న వసతి దీవెన | 2,083.32 | 2,200.00 |
| వైఎస్సార్–పీఎం ఫసల్ బీమా యోజన | 2,943.21 | 1,600.00 |
| వైఎస్సార్ వడ్డీ లేని రుణాలు (పొదుపు సంఘాలు) | 600.00 | 700.00 |
| వైఎస్సార్ వడ్డీ లేని రుణాలు (పట్టణ పొదుపు సంఘాలు) | 236.10 | 300.00 |
| వైఎస్సార్ వడ్డీ లేని రుణాలు (రైతులు) | 286.34 | 500.00 |
| వైఎస్సార్ కాపు నేస్తం | 536.09 | 550.00 |
| వైఎస్సార్ జగనన్న చేదోడు | 346.08 | 350.00 |
| వైఎస్సార్ వాహన మిత్ర | 270.76 | 275.00 |
| వైఎస్సార్ నేతన్న నేస్తం | 199.07 | 200.00 |
| వైఎస్సార్ మత్స్యకార భరోసా | 123.09 | 125.00 |
| మత్స్యకారులకు బోట్లకు డీజిల్ సబ్సిడీ | 53.31 | 50.00 |
| రైతులకు ఎక్స్‌గ్రేషియా | 20.00 | 20.00 |
| వైఎస్సార్ లా నేస్తం | 15.00 | 17.00 |
| జగనన్న తోడు | 31.46 | 35.00 |
| ఈబీసీ నేస్తం | 9.43 | 610.00 |
| వైఎస్సార్ కళ్యాణమస్తు | 50.00 | 200.00 |
| వైఎస్సార్ ఆసరా | 4,000.00 | 6,700.00 |
| వైఎస్సార్ చేయూత | 5,007.26 | 5,000.00 |
| అమ్మ ఒడి | 5,749.04 | 6,500.00 |
| మొత్తం | 47,240.43 | 54,228.36 |



# టీడీపీ దుష్ట పన్నాగం

**సాక్షి, అమరావతి :** టీడీపీ సభ్యులు గురువారం శాసనసభలో దుష్టసంప్రదాయానికి తెరతీశారు. ఆర్థికమంత్రి బుగ్గన గురువారం బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ఉపక్రమించగానే అప్పటికే పక్కా వ్యూహంతో సభలోకి వచ్చిన టీడీపీ సభ్యులు పెద్ద ఎత్తున నినాదాలు అరుపులతో బడ్జెట్ ప్రసంగం వినపడనీయకుండా గందరగోళం సృష్టించారు. టీడీపీ సభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు పెద్దపెద్దగా నినాదాలు చేస్తుంటే, మరో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు వెంట తెచ్చుకున్న చిత్తు కాగితాల ముక్కలను స్పీకర్‌పైకి, గాలిలోకి విసిరారు. ప్రజా ప్రయోజనాలతో ముడిపడి ఉన్న బడ్జెట్‌ను ప్రవేశపెట్టకుండా అడ్డుపడటం మంచిది కాదని, ఏమైనా అభ్యంతరాలుంటే బడ్జెట్ చర్చలో తెలపవచ్చని మంత్రులు, స్పీకర్ చెప్పినా వారు వెనక్కు తగ్గకపోగా మరింత రెచ్చిపోయారు. ఈ సమయంలో సీఎం వైఎస్ జగన్ జోక్యం చేసుకుని టీడీపీ తీరును తప్పుబట్టారు. వార్షిక బడ్జెట్‌ను ప్రజలంతా ఆసక్తిగా చూస్తారని, అలాంటి బడ్జెట్ ప్రసంగానికి అడ్డుపడుతున్న ప్రతిపక్ష సభ్యులపై చర్యలు తీసుకోవాల్సిందిగా స్పీకర్‌ను కోరారు. బడ్జెట్ ప్రసంగం ప్రజలకు వినపడకూడదనే కుతంత్రంతోనే వారు గందరగోళం సృష్టిస్తున్నారని సీఎం మండిపడ్డారు. సభ సజావుగా జరిగేలా, ప్రజలకు బడ్జెట్ ప్రసంగం వివరంగా అర్థమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ.. 5 కోట్ల రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను అడ్డుకోవడం సరికాదని, ఇష్టం లేకపోతే వాకౌట్ చేసి వెళ్లిపోవాల్సిందిగా కోరారు. అయినా, టీడీపీ సభ్యుల తీరులో మార్పు లేనందున తప్పని పరిస్థితుల్లో కఠిన నిర్ణయం తీసుకుంటున్నానంటూ టీడీపీకి చెందిన 14 మంది సభ్యులను ఒకరోజు పాటు సమావేశాల నుంచి సస్పెండ్ చేశాకే, బుగ్గన ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. సస్పెండ్ అయిన తర్వాత కూడా సభ్యులు వెళ్లకుండా గొడవ చేస్తుండటంతో మార్షల్స్ వారిని బయటకు పంపించారు. ఎంతో కీలకమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టనీయకుండా ఇలా అడ్డుకోవడం సరికాదని, తాను ఇలాంటి సంఘటనలు ఎప్పుడూ చూడలేదని, ఈ దురదృష్టకరమైన ఘటనలను ఖండిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

## ఢిల్లీ చేరుకున్న సీఎం వైఎస్ జగన్

**నేడు ప్రధానితో భేటీ**

**సాక్షి,అమరావతి:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి సాయంత్రం 5.07 గంటలకు ఆయన ఢిల్లీకి బయలుదేరారు. రాత్రి 7.30 గంటల సమయంలో ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి తను బసచేస్తున్న వన్ జన్‌పథ్‌కి చేరుకున్నారు. ఆయన శుక్రవారం ప్రధాని మోదీతోను, పలువురు కేంద్రమంత్రులతోను సమావేశం కానున్నారు.


సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి

## క్లుప్తంగా...

### 'సెట్'ల షెడ్యూల్ విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పలు ఉన్నత విద్యా కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే పీజీఈసెట్, లాసెట్, ఎడ్‌సెట్, పీఈసెట్, పీజీసెట్ షెడ్యూళ్లను ఉన్నత విద్యా మండలి గురువారం విడుదల చేసింది. అపరాధ రుసుము లేకుండా, వివిధ అపరాధ రుసుములతో ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించేందుకు గడువులను ప్రకటించింది. ప్రవేశ పరీక్షల తేదీలను ఖరారు చేసింది. దరఖాస్తు స్వీకరణ ప్రక్రియలు పీజీఈసెట్ మార్చి 21, లాసెట్ మార్చి 23, ఎడ్‌సెట్ మార్చి 24, పీఈసెట్ మార్చి 23, పీజీసెట్ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతాయి. అపరాధ రుసుములతో పీజీఈసెట్‌కు మే 14 వరకు, లాసెట్‌కు మే 6, ఎడ్‌సెట్‌కు మే 10, పీఈసెట్‌కు మే 24, పీజీసెట్‌కు మే 31వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించవచ్చు. మే 28 నుంచి 30 వరకు పీజీఈసెట్, మే 20న లాసెట్, ఎడ్‌సెట్, మే 31 నుంచి పీఈసెట్, జూన్ 6 నుంచి 10 వరకు పీజీసెట్ ప్రవేశ పరీక్షలు జరుగుతాయి.

### ఎంబీబీఎస్ మొదటి ఏడాది ఫలితాలు విడుదల

లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో నిర్వహించిన ఎంబీబీఎస్ మొదటి ఏడాది పరీక్ష ఫలితాలు గురువారం విడుదల చేసింది. ఈ ఫలితాలపై రీటోటలింగ్ కోరే విద్యార్థులు ప్రతి సబ్జెక్టుకు రూ.2 వేలు చెల్లించి ఈ నెల 27 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ సీహెచ్.శ్రీనివాసరావు తెలిపారు.

### రిమాండ్ సమయంలో మినీ ట్రయల్ తగదు

- కింది కోర్టులు పరిధి దాటి వ్యవహరించడానికి వీల్లేదు
- విచారణ స్వీకరించదగ్గ సెక్షనా కాదా అన్నది మాత్రమే చూడాలి
- ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో హైకోర్టు కీలక ఉత్తర్వులు
- సీమెన్స్ మాజీ ఉద్యోగి భాస్కర్ రిమాండ్ తిరస్కరణ ఉత్తర్వులు రద్దు

సాక్షి, అమరావతి: కింది కోర్టులు రిమాండ్ సమయంలోనే మినీ ట్రయల్ నిర్వహిస్తూ నిందితులకు ఫలానా సెక్షన్ వర్తించదంటూ వారి రిమాండ్‌ను తిరస్కరిస్తుండటంపై సీఐడీ, పోలీసులు కొంత కాలంగా వ్యక్తం చేస్తూ వస్తున్న ఆందోళనను హైకోర్టు ఎట్టకేలకు పరిగణనలోకి తీసుకుంది. కింది కోర్టులు అనుసరిస్తున్న ఈ సరికొత్త విధానంలో జోక్యం చేసుకోకపోతే రిమాండ్ తిరస్కరణ అన్నది ఓ దుస్సంప్రదాయంగా మారిపోయే ప్రమాదం ఉందన్న అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలతో హైకోర్టు ఏకీభవించింది. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో కీలక పాత్రధారుల్లో ఒకరైన సీమెన్స్ మాజీ ఉద్యోగి జీవీఎస్ భాస్కర్ ప్రసాద్ రిమాండ్‌ను తిరస్కరిస్తూ విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. కింది కోర్టు ఉత్తర్వుల వల్ల స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో దర్యాప్తు పురోగతిపై తీవ్ర ప్రభావం పడుతుందని స్పష్టం చేసింది. రిమాండ్ సమయంలో కింది కోర్టులు మినీ ట్రయల్ నిర్వహించరాదని తేల్చి చెప్పింది. నిందితులపై నమోదు చేసిన సెక్షన్లు విచారణకు స్వీకరించదగ్గవా? కావా? అన్నది మాత్రమే చూడాలని కింది కోర్టుకు స్పష్టం చేసింది. రిమాండ్ సమయంలో పరిధి దాటి వ్యవహరించడానికి వీల్లేదంది. రిమాండ్ సమయంలో ఏ పని చేయాలో అది మాత్రమే చేయాలంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి. భానుమతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో పలు సుప్రీం కోర్టు తీర్పులను ఉదహరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో కీలక పాత్రధారి అయిన భాస్కర్ ప్రసాద్‌ను సీఐడీ అధికారులు ఈ నెల 7న నోయిడాలో అరెస్ట్ చేయడం తెలిసిందే. తర్వాత ట్రాన్సిట్ వారెంట్ మీద విజయవాడ తీసుకొచ్చి గురువారం ఏసీబీ ప్రత్యేక కోర్టు ముందు హాజరు పరచగా, స్పెషల్ జడ్జి సెక్షన్ 409 భాస్కర్ ప్రసాద్‌కు వర్తించదంటూ అతని రిమాండ్‌ను తిరస్కరించారు. దీనిని సవాలు చేస్తూ సీఐడీ డీఎస్పీ హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. బుధ, గురువారాల్లో పూర్తి స్థాయిలో వాదనలు విన్న న్యాయమూర్తి ఈ మేరకు ఉత్తర్వులు వెలువరించారు.

### రాష్ట్రంలో క్రీడా వర్సిటీ ప్రారంభిస్తాం: లోకేశ్



పెద్దతిప్పసముద్రం: టీడీపీ అధికారంలోకి రాగానే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో క్రీడా విశ్వవిద్యాలయం ప్రారంభిస్తామని టీడీపీ నాయకుడు లోకేశ్ చెప్పారు. అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలంలో గురువారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. కమ్మరపల్లె కళ్యాణమండపంలో జరిగిన యువజనుల సదస్సులో మాట్లాడారు. వైఎస్ జగన్ కేసుల్లో ఐఏఎస్ అధికారులు జైలుకు వెళ్లారని, ప్రస్తుత ప్రభుత్వంలో అక్రమ కేసులు బనాయిస్తున్న ఐపీఎస్ అధికారులు జైలుకు వెళతారన్నారు. అధికారంలోకి వచ్చాక అన్నా క్యాంటీన్లను తెరుస్తామని చెప్పారు. పరిశ్రమల మంత్రిగా గుడివాడ అమర్‌నాథ్ ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదన్నారు. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని మరోసారి స్పష్టం చేశారు.

# 'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్

▶ మొదటి పేజీ తరువాయి

కర్నూలు, శ్రీకాకుళం జిల్లాల్లో ఒక్కొక్కటి, పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు స్థానాలు మొత్తం 9 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎస్.మంగమ్మ, పి. రామసుబ్బారెడ్డి, సిపాయి సుబ్రమణ్యం, మేరుగ మురళీధర్, కుడిపూడి సూర్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**పశ్చిమలో రెండు స్థానాలూ వైఎస్సార్‌సీపీకే**

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎన్నికలు జరిగిన రెండు ఎమ్మెల్సీ స్థానాలు అధికార వైఎస్సార్‌సీపీ దక్కించుకుంది. గురువారం ఏలూరులో జరిగిన ఓట్ల లెక్కింపులో గంటన్నరలోనే ఫలితాలు వెలువడ్డాయి. మొత్తం 1105 ఓట్లకుగాను 1088 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 25 చెల్లుబాటు కాలేదు. వాటిలో 20 టీడీపీవి కాగా, మరో 5 వైఎస్సార్‌సీపీవి. వాస్తవ బలం కంటే వైఎస్సార్‌సీపీకి అదనంగా 50 ఓట్లు రావడం గమనార్హం. చెల్లుబాటైన 1063 ఓట్లలో మొదటి ప్రాధాన్యతలోనే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్‌కు 481 ఓట్లు, వంకా రవీంద్రనాథ్‌కు 460 ఓట్లు వచ్చాయి. టీడీపీ, జనసేన అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్‌కు 122 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో అధికారులు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్‌లను విజేతలుగా ప్రకటించారు.

**కర్నూలులో వైఎస్సార్‌సీపీకి బలానికి మించి ఓట్లు**

ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ బోయ మధుసూదన్ ఘన విజయం సాధించారు. కర్నూలులో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కాగా, 9.30 గంటలకే పూర్తయింది. ఇక్కడ మొత్తం 1,178 ఓట్లలో 1,136 పోలయ్యాయి. 53 ఓట్లు చెల్లలేదు. ఉన్న బలం కంటే ఎక్కువ ఓట్లు వైఎస్సార్‌సీపీకి పోలయ్యాయి. వాస్తవానికి వైఎస్సార్‌సీపీకి 959 ఓట్లు బలం ఉండగా, 988 ఓట్లు వచ్చాయి. అధికంగా నమోదైన 29 ఓట్లనుబట్టి చూస్తే టీడీపీ, బీజేపీ, వామపక్షాల ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీకే మద్దతు పలికినట్లు స్పష్టమవుతోంది. స్వతంత్ర అభ్యర్థులు ఎస్.మోహన్‌రెడ్డికి 85, భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డికి 10 ఓట్లు వచ్చాయి.



యలమంచిలిలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ వెంకటరమణ, పార్టీ నేతలు

**శ్రీకాకుళంలో రామారావు ఘన విజయం**

శ్రీకాకుళం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నర్తు రామారావు విజయ ఢంకా మోగించారు. మొత్తం 752 ఓట్లు పోలవగా.. అందులో నర్తు రామారావుకు 632 ఓట్లు వచ్చాయి. ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ఎ.రామకృష్ణకు 108 ఓట్లు వచ్చాయి. 12 ఓట్లు చెల్లలేదు. దీంతో 524 ఓట్ల ఆధిక్యతతో నర్తు విజయం సాధించారు.

# అప్రూవర్‌గా దస్తగిరి చట్టవిరుద్ధం

## హైకోర్టులో వివేకా పీఏ ఎంవీ కృష్ణారెడ్డి పిటిషన్

- వివేకాను హత్య చేసింది తానేనని ఒప్పుకున్న దస్తగిరి
- వివేకా రెండో పెళ్లి తర్వాత వారి ఇంట్లో గొడవలు
- ఆస్తి వారికి వెళ్లిపోతుందని కూతురు, అల్లుడే ఇలా చేయించి ఉండొచ్చు
- అందుకే సునీత దస్తగిరి తీరును ప్రశ్నించడం లేదు
- ఇతని మాటలు నమ్మి తప్పుదోవలో సీబీఐ దర్యాప్తు
- సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలి

సాక్షి, హైదరాబాద్ : 'మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని తామే హత్య చేశామని ఒప్పుకున్న నిందితుడు (ఏ–4) దస్తగిరిని అప్రూవర్‌గా పేర్కొంటూ సీబీఐ కోర్టు ఉత్తర్వులు జారీ చేయడం చట్టవిరుద్ధం. ఆ ఉత్తర్వులను కొట్టివేయాలి' అని వివేకా వ్యక్తిగత కార్యదర్శి, ఏపీలోని వైఎస్సార్ జిల్లాకు చెందిన ఎంవీ కృష్ణారెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. స్వయంగా హత్యలో పాల్గొన్న దస్తగిరికి బెయిల్ ఇవ్వడం కూడా సరికాదన్నారు. 'దస్తగిరి విషయంలో వివేకా కుమార్తె సునీత వ్యవహరిస్తున్న తీరు అనుమానాస్పదంగా ఉంది. అతనికి బెయిల్ ఇవ్వడం, అప్రూవర్‌గా మార్చడంపై ఆమె నుంచి ఎలాంటి స్పందన లేదు. ఆ అంశాన్ని ఏ కోర్టులోనూ సవాల్ చేయడం లేదు. ప్రశ్నించడం లేదు. అతన్ని కాపాడేందుకు ఎందుకు ప్రయత్నిస్తుందో అర్థం కావడం లేదు. వివేకాను హత్య చేయడానికి నగదు తీసుకున్నానని, చంపడం కోసం గొడ్డలి కూడా కొనుగోలు చేశానని అతను ఒప్పుకున్నాడు. అలాంటి హంతకుడైన దస్తగిరిని క్షమించడం చట్టవిరుద్ధం. వివేకాతో అతనే బలవంతంగా లేఖ రాయించినట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి. తద్వారా డ్రైవర్‌ను ఇరికించాలని పథకం వేశాడు' అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

**వారి కుటుంబ సభ్యులే హత్య చేయించి ఉంటారు..**

'షమీమ్ అనే ముస్లిం మహిళను వివేకా వివాహం చేసుకున్నారు. వారికి ఓ కుమారుడు కూడా ఉన్నాడు. ఈ కారణంగా మొదటి భార్య, కూతురితో మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఆ కోపంతో సునీత.. వివేకాను దూరం పెట్టారు. వివేకా మృతి చెందే వరకు ఆమె మాట్లాడ లేదు' అని కృష్ణారెడ్డి తెలిపారు. ఈ క్రమంలో పులివెందులలో ఉంటున్న వివేకా తన ఆస్తులను కుమారుడికి ఇవ్వాలని నిర్ణయించుకున్నారని, బెంగళూరులోని ఓ భూమి సెటిల్‌మెంట్‌లో వచ్చే రూ.8 కోట్లను షమీమ్, కుమారుడికి ఇవ్వాలని భావించారని చెప్పారు. 'ఇదంతా సునీతకు, అల్లుడు రాజశేఖర్‌రెడ్డికి తెలుసు. దీంతో వివేకా, వారి మధ్య వివాదం తార స్థాయికి చేరింది. కుటుంబ ప్రతిష్ట దెబ్బ తింటోందని, ఆస్తులు చేజారి పోతున్నాయని, వివేకాను కట్టడి చేయాలని వారు ప్రయత్నించారు. అయినా వివేకా వినక పోవడంతో ఆస్తులను కాపాడుకునేందుకు దస్తగిరి, ఇతర నిందితులకు వారే డబ్బిచ్చి ఉండవచ్చు. అందుకే దస్తగిరికి వ్యతిరేకంగా వారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ ఒప్పందంలో భాగంగానే సునీత, రాజశేఖర్‌రెడ్డిని కాపాడేందుకు దస్తగిరి అప్రూవర్‌గా మారి కేసును పక్కదారి పట్టించాడు. చాలా కాలంగా నేను వివేకా వద్ద పని చేస్తున్నా. వారి కుటుంబ వివాదాలు బాగా తెలుసు. వివేకాను హత్య చేయాల్సిన అవసరం ఆయన కుటుంబ సభ్యులకే ఎక్కువగా ఉంది. దస్తగిరి మాటలను నమ్మిన సీబీఐ కూడా కేసును తప్పుదారిలో దర్యాప్తు సాగిస్తోంది. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని దస్తగిరి అప్రూవర్ ఉత్తర్వులను కొట్టివేయాలి' అని కృష్ణారెడ్డి పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో సీబీఐ తప్పుదోవలో దర్యాప్తు చేస్తున్నందున తాను పులివెందుల జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశానని చెప్పారు. కాగా, కృష్ణారెడ్డి దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్ గురువారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేశారు. కాగా, ఈ పిటిషన్‌లో కూడా సునీత ఇంప్లీడ్ అయ్యారు.

# కేశ ఖండనశాలల్లో కనీసం రూ.20,000

- నాయీ బ్రాహ్మణులు ప్రతి నెలా కనీస ఆదాయం పొందేలా జీవో
- అదనపు ఆదాయం సమకూరితే అది కూడా వారికే
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ పరిధిలోని వివిధ ఆలయాల కేశ ఖండనశాలల్లో విధులు నిర్వహించే నాయీ బ్రాహ్మణులకు నెలకు కనీసం రూ.20 వేల ఆదాయాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేశ ఖండనశాలల్లో తలనీలాల కార్యక్రమం కనీసం వంద రోజులు కొనసాగే ఆలయాలలో ఇది వర్తిస్తుందని దేవదాయ శాఖ ప్రధాన కార్యదర్శి (ఎఫ్ఏసీ) హరిజవహర్‌లాల్ ఆదేశాలు జారీ చేశారు. భక్తులు తలనీలాలు సమర్పించే టిక్కెట్ ధరను రూ.40కి పెంచి ఆ మొత్తాన్ని సంబంధిత నాయీ బ్రాహ్మణులకే అందజేస్తారు. రద్దీ సమయాల్లో టికెట్ల విక్రయాల ద్వారా లభించే ఆదాయం రూ.20 వేల కంటే ఎక్కువగా ఉంటే అది కూడా మొత్తం సంబంధిత నాయీ బ్రాహ్మణులకే చెల్లిస్తారు. ఒకవేళ తగినంత డిమాండ్ లేక టికెట్ల అమ్మకం ద్వారా రూ. 20 వేల కంటే తక్కువ ఆదాయం లభిస్తే తలనీలాలు విక్రయాల ద్వారా సమకూరే మొత్తం నుంచి ఆమేరకు చెల్లించాలని నిర్ణయించారు. టికెట్టు ధర రూ.40కి పెంచడం ద్వారా కేశఖండన శాలలు వంద రోజుల లోపు పనిచేసే ఆలయాలలో సైతం నాయీ బ్రాహ్మణులు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని దేవదాయ శాఖ వర్గాలు తెలిపాయి.

**నాడు చంద్రబాబు చిందులు..**

టీడీపీ అధికారంలో ఉండగా తమకు కనీస ఆదాయం వర్తింపజేయాలని కోరుతూ సచివాలయానికి వచ్చిన నాయీ బ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తానంటూ చంద్రబాబు బెదిరించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం తాజాగా జీవో విడుదలైంది.

**సముచిత స్థానం..**

నాయీ బ్రాహ్మణులకు సీఎం జగన్ ప్రభుత్వం దేశ చరిత్రలోనే అరుదైన గౌరవాన్ని కల్పించిందని ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల ట్రస్టు బోర్డులో నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి ఒకరికి తప్పనిసరిగా స్థానం కల్పించాలని ఆర్డినెన్స్ జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. టీడీపీ హయాంలో అవమానాలు ఎదుర్కొన్న తమకు సీఎం జగన్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య, నాయీ బ్రాహ్మణ సంఘాల రాష్ట్ర నేతలు గుంటుపల్లి రామదాసు, ఇతర నాయకులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియచేశారు.

# ప్రజారోగ్యం, మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ విప్లవాత్మక చర్యలను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు
- ప్రశ్నోత్తరాల సమయంలో టీడీపీ సభ్యులపై మంత్రుల మండిపాటు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యం, మహిళా భద్రత, మత్తు పదార్థాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టిందని రాష్ట్ర మంత్రులు చెప్పారు. గురువారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల ప్రశ్నలకు మంత్రులు సమాధానాలిచ్చారు. ఇదే సమయంలో ప్రతిపక్ష టీడీపీ సభ్యులు సమాధానాలు చెప్పనివ్వకుండా మంత్రులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో మంత్రులు వాస్తవాలు చెబుతుంటే తట్టుకోలేక సభను తప్పుదారి పట్టించేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. సభలో సభ్యుల ప్రశ్నలకు మంత్రుల సమాధానాలిలా ఉన్నాయి.

**ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ మా లక్ష్యం**



రాష్ట్రంలోని ప్రజలందరికీ నాణ్యమైన, ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని 1142 పీహెచ్‌సీలలో 1125 పీహెచ్‌సీలను రూ.670 కోట్లతో ఆధునికీకరించాం. టీడీపీ హయాంలో 5 పీహెచ్‌సీలనే కొత్తగా ఏర్పాటు చేశారు. మా ప్రభుత్వం 88 కొత్త పీహెచ్‌సీలు ఏర్పాటు చేస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టాం. ప్రతి పీహెచ్‌సీలో కచ్చితంగా 14 మంది వైద్య సిబ్బంది ఉండేలా నియామకాలు చేపట్టాం. 175 రకాల మందులను ఉచితంగా ఇస్తున్నాం. దీంతో ఓపీల సంఖ్య పెరిగింది. పీహెచ్‌సీల్లోనే స్క్రీనింగ్, లేబొరేటరీ సదుపాయాలు తీసుకొచ్చాం. ప్రతి 2 వేల జనాభాకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్ తీసుకొచ్చాం. గ్రామాల్లోని చిన్నారుల ఆరోగ్య రక్షణ మా ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఉంది. సింగరాయకొండలో పీహెచ్‌సీని రూ.50 లక్షలతో ఆధునికీకరించాం. ఇక్కడ 60 వేల మంది ప్రజలకు ఒకే పీహెచ్‌సీ ఉంటే దానిని వికేంద్రీకరించాం. పక్కనే పాకాలలో రూ.2.53 కోట్లతో కొత్తది నిర్మిస్తున్నాం.

– విడదల రజిని, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి

**గంజాయి సాగు నుంచి గిరిజనులకు విముక్తి**



ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో మా ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ పరివర్తన్‌తో అమాయక గిరిజనులను గంజాయి సాగు ఉచ్చు నుంచి కాపాడుతున్నాం. ఆపరేషన్ పరివర్తన్‌కు దేశవ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయి. శాటిలైట్ ఫొటోల సాయంతో ఏజెన్సీ ప్రాంతాల్లోని 8,554 ఎకరాల్లోని గంజాయి పంటను ధ్వంసం చేశాం. మాపై విమర్శిస్తున్న ప్రతిపక్షాలు శాటిలైట్ చిత్రాలు చూసైనా వాస్తవాలు తెలుసుకోవాలి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 10 ఏజెన్సీ మండలాల్లో గంజాయి సాగు లేకుండా చేశాం. ఆరు మండలాల్లో గిరిజనులు స్వచ్ఛందంగా సాగును వదిలేశారు. వీరందరికీ స్వయం ఉపాధితో పాటు ఉద్యోగావకాశాలూ కల్పిస్తున్నాం. టీడీపీ హయాంలో 200 ఎకరాల్లో మాత్రమే గంజాయిని ధ్వంసం చేశారు. సరిహద్దు రాష్ట్రాల డీజీపీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గంజాయి రవాణాను అరికడుతున్నాం. మా ప్రభుత్వం మహిళా రక్షణకు అనేక చర్యలు చేపట్టింది. 18 దిశ పోలీసు స్టేషన్లు, 13 ప్రత్యేక న్యాయ స్థానాలను తెచ్చింది. లోకేశ్ ఆధ్వర్యంలో దిశ బిల్లు ప్రతులను తగలబెట్టిన టీడీపీ నాయకులకు మహిళా రక్షణ గురించి మాట్లాడే అర్హత లేదు. దిశ యాప్‌తో ఆపదలో ఉన్న మహిళలను క్షణాల్లోనే రక్షిస్తున్నాం. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు చదవడం మానేస్తే తప్ప టీడీపీ నాయకులకు వాస్తవాలు బోధపడవు. మహిళలకు అన్యాయం జరిగితే ప్రతిపక్షం బాధితులనే రోడ్డున పడేస్తూ నీచ రాజకీయాలు చేస్తోంది.

– తానేటి వనిత, హోంశాఖ మంత్రి

**రాష్ట్రమనే తులసి వనంలో టీడీపీ గంజాయి మొక్క**

రాష్ట్రమనే తులసి వనంలో టీడీపీ గంజాయి మొక్కగా మారింది. ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ పరివర్తన్ సత్ఫలితాలను ఇస్తుంటే చూసి ఓర్వలేకపోతోంది.

– అబ్బయ్య చౌదరి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే

**వైద్య రంగంలో సిబ్బందిని పెంచాలి**

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు తగినట్టుగా సిబ్బందిని పెంచాలి. అన్ని పీహెచ్‌సీలకు సమానంగా రోగులు రారు. రేషనలైజేషన్ పేరుతో పీహెచ్‌సీల్లో సిబ్బందిని తగ్గిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలి. నాడు–నేడులో పీహెచ్‌సీల అభివృద్ధితో రోగులు ఇక్కట్లు పడుతున్నారు.

– కింజరాపు అచ్చెన్నాయుడు, టీడీపీ ఎమ్మెల్యే

**దిశ బిల్లు చట్టంగా మారేలా చూడాలి**

దిశ బిల్లు చట్టంగా రూపుదిద్దుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలి. మూడేళ్లుగా కేంద్ర ప్రభుత్వం దిశ బిల్లుకు సవరణలు కోరుతూనే ఉంది. రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరుగుతున్నాయి. దీనిని అరికట్టాలి.

– ఆదిరెడ్డి భవాని, టీడీపీ ఎమ్మెల్యే

# తల్లీకొడుకుల ప్రాణాలు తీసిన కూర తగవు



సుబ్బమ్మ (ఫైల్)



వెంకటేశ్వరరావు (ఫైల్)

తాడేపల్లిగూడెం : పక్షవాతంతో మంచానపడ్డ భర్త.. మతిస్థిమితం లేకుండా ఉంటున్న కొడుకు.. కాయకష్టం చేసి వారిని పోషించుకుంటున్న తల్లి.. ఆ కుటుంబానికి పెద్ద కష్టమే వచ్చింది. కొడుకుకు అన్నం పెట్టే సమయంలో కూర విషయంలో వచ్చిన చిన్న తగవు.. లోకం తెలియని ఆ కొడుకు ఆగ్రహానికి కారణమైంది. ఇదే విషయంపై మర్నాడు గొడవ జరగడంతో అంతగా మతిస్థిమితం లేని ఆ కొడుకు చనిపోతానని, ఇంటి పక్కనే ఉన్న రైలు పట్టాలపైకి పరుగులు పెట్టాడు. ఆగరా నాయనా.. ఆగరా బాబూ.. అంటూ తల్లడిల్లుతూ ఆ తల్లి కొడుకు వెంట పడింది. అదే సమయంలో ఆ మార్గంలో వెళుతున్న రైలు వారిని ఢీకొనడంతో ఆ తల్లీకొడుకుల ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. శరీరాలు మాంసపు ముద్దలుగా మారాయి. ఈ హృదయ విదారక ఘటన పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రైల్వే పోలీసు పరిధిలోని నవాబుపాలెం గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన బొండాడ అప్పారావు, సుబ్బమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో చిన్న కుమారుడైన వెంకటేశ్వరరావు (47) మానసిక సమస్యతో ఇబ్బందిపడుతున్నాడు. ఈ నేపథ్యంలో వెంకటేశ్వరరావు భార్య తన ఇద్దరు కూతుళ్లతో కలిసి భర్తకు దూరంగా హైదరాబాద్‌లో ఉంటోంది. సుబ్బమ్మ భర్త అప్పారావుకు కొన్ని సంవత్సరాల క్రితం పక్షవాతం రావడంతో మంచానికి పరిమితమయ్యాడు. అప్పటి నుంచి మంచానపడ్డ భర్తను, మతిస్థిమితం లేని కొడుకును కులపరమైన రజక వృత్తిని చేసుకుంటూ సుబ్బమ్మ (65) పోషిస్తూ జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి కుమారుడు వెంకటేశ్వరరావుకు భోజనం పెట్టిన సమయంలో కూర వేయలేదని తల్లిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ విషయంలో గురువారం ఉదయం కూడా తల్లీ కొడుకుల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో వెంకటేశ్వరరావు తాను చనిపోతానంటూ ఇంటి పక్కనే ఉన్న రైలు పట్టాలపైకి పరుగుపెట్టాడు. అతనిని వారించి వెనక్కి తీసుకువచ్చేందుకు సుబ్బమ్మ అతని వెంట పరుగుతీసింది. అదే సమయంలో రాజమండ్రి వైపు నుంచి విజయవాడ వైపు వెళుతున్న సింహాద్రి ఎక్స్‌ప్రెస్ తల్లీ కొడుకులను ఢీకొనడంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ట్రాక్‌పై వారి శరీరాలు మాంసపు ముద్దలుగా తయారై గుర్తుపట్టని విధంగా మారాయి. సమాచారం అందుకున్న తాడేపల్లిగూడెం రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్ఐ జి.శ్రీహరిబాబు ఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తెలంగాణ

# ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలు ఏకగ్రీవం

- రిటర్నింగ్ అధికారి చేతుల మీదుగా ముగ్గురికి ధ్రువీకరణపత్రాలు
- ప్రగతిభవన్‌లో కేసీఆర్‌ను కలిసిన నవీన్‌రావు, దేశపతి, చల్లా

సాక్షి, హైదరాబాద్: శాసనసభ్యుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు అభ్యర్థులు కుర్మయ్యగారి నవీన్‌రావు, దేశపతి శ్రీనివాస్, చల్లా వెంకట్రామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ ముగ్గురు అభ్యర్థులు గురువారం అసెంబ్లీ ఆవరణలో రిటర్నింగ్ అధికారి చేతుల మీదుగా ధ్రువీకరణపత్రాలు అందుకున్నారు. శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డితోపాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన ముగ్గురు నేతలు ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఎమ్మెల్సీలు నవీన్‌రావు, గంగాధర్‌గౌడ్, ఎలిమినేటి కృష్ణారెడ్డి పదవీకాలం ఈ నెల 29న ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కోటాలో మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నిక కోసం ఈ నెల 7న నోటిఫికేషన్ విడుదల కాగా అదేరోజు సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థుల పేర్లను ఖరారు చేశారు. ఈ నెల 9న బీఆర్ఎస్ అభ్యర్థులుగా నవీన్‌రావు, దేశపతి శ్రీనివాస్ చల్లా వెంకట్రామిరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తికాగా, బీఆర్ఎస్‌కు ఆ ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. దీంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

# మల్టీపుల్ ఎంట్రీ గందరగోళం

**ఉన్నతవిద్య సదస్సులో నీపా వీసీ సుధాంశు భూషణ్**

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యాసంస్థల్లో తీసుకొచ్చిన మల్టీపుల్ ఎంట్రీ, ఎగ్జిట్ విధానం గందరగోళంగా ఉందని జాతీయ విద్యాప్రణాళిక, పాలన సంస్థ(నీపా) వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సుధాంశు భూషణ్ అన్నారు. మూడేళ్ల డిగ్రీ కాలపరిమితిని నాలుగేళ్లకు పెంచడంపై మరింత స్పష్టత ఇవ్వాలని సూచించారు. ఉన్నతవిద్యలో సంస్కరణలు, సవాళ్లపై వివిధ రాష్ట్రాల ఉన్నత విద్యామండళ్లతో నీపా హైదరాబాద్‌లో రెండురోజుల సదస్సు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా గురువారం తొలిరోజు సదస్సులో భూషణ్ కీలకోపన్యాసం చేశారు. ఉన్నతవిద్యలో నాణ్యతాప్రమాణాల పెంపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. రాష్ట్రాల్లోని యూనివర్సిటీలు, ఉన్నత విద్యామండళ్లతో యూజీసీ సమన్వయం చేసుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం దిశగా పాఠ్యప్రణాళికలుండాలని, పరిశోధనలు, జ్ఞానాన్ని ఈ దిశగా వినియోగించేలా చేయాలన్నారు. సదస్సులో క్రెడిట్ బేస్డ్ సిస్టమ్, మల్టీపుల్ ఎంట్రీ, ఎగ్జిట్‌పై చర్చించారు. కార్యక్రమంలో నీపా డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ మిశ్రా, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ, కార్యదర్శి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# వేదవిద్యలో అక్కాచెల్లెళ్లకు డాక్టరేట్లు

**సాంకేతిక యుగంలోనూ సంస్కృతంపై ఆసక్తి**

కొందుర్గు: రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎదిర గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు రజిత, సరిత వేదవిద్యలో డాక్టరేట్లు సాధించారు. సాంకేతికయుగంలోనూ వీరు సంస్కృతంపై ఆసక్తి చూపడం గమనార్హం. ఎదిర గ్రామానికి చెందిన ఆంచ సుమిత్ర, జంగారెడ్డి దంపతులది సాధారణ వ్యవసాయ కుటుంబం. వీరికి లక్ష్మి, కవిత, రజిత, సరిత నలుగురు కూతుళ్లు. ఎలాగైన తన కూతుళ్లను ఉన్నత చదువులు చదివించాలని జంగారెడ్డి దంపతులు భావించారు. ఈ క్రమంలో కాశీ పట్టణంలోని గురుకుల పాఠశాలలో చేర్పించారు. అక్కడి పానిని కన్యా మహావిద్యాలయంలో వేదవిద్యలో పీజీ పూర్తి చేసి, తిరుపతిలోని నేషనల్ సంస్కృత వ్యాకరణంలో పీహెచ్‌డీ పట్టాలు అందుకున్నారు. ప్రస్తుతం సరిత శంషాబాద్ ముచ్చింతల్ చినజీయర్ స్వామి ఆశ్రమంలో విద్యార్థులకు వేదవిద్యలో విద్యాబోధన చేస్తున్నారు. పురుషులకు దీటుగా తామేమి తీసిపోని రీతిగా వీరు వేద విద్యలో పీహెచ్‌డి అందుకోవడంపట్ల పలువురు అభినందనలు తెలిపారు. 'ప్రస్తుత సమాజంలో పురాణాలు, ఇతిహాసాలు కనుమరుగవుతున్నాయి. ఈ విద్యపై ఎవరు ఆసక్తి చూపడం లేదు. అందుకోసమే తాము వేద విద్యలో పట్టు సాధించి ఈ విద్యను నలుగురికి పంచాలని వేద విద్యను అభ్యసించాం' అని సరిత తెలిపింది.

ప్రతి రాత్రి నిద్రపోయే ముందు అందరినీ క్షమించి, స్వచ్ఛమైన హృదయంతో నిద్రించండి.
– ఇస్లాం ధర్మం



సాక్షి

శుక్రవారం, మార్చి, 17

# గాలిలోనూ గరళమేనా?

సంవత్సరాలు మారుతున్నా దేశంలో కాలుష్య పరిస్థితులు మాత్రం మెరుగుపడుతున్నట్టు లేదు. ప్రభుత్వాలు చర్యలు చేపట్టామంటున్నా, వాయు కాలుష్య స్థాయి ఆందోళనకరంగానే కొనసాగుతోంది. భారతదేశ వాయు నాణ్యతా సూచి ప్రమాదకర స్థాయికి పడిపోయింది. ప్రజలు స్వచ్ఛమైన గాలి పీల్చుకోవడం కూడా ఇబ్బందిగా మారింది. ప్రపంచంలోని వివిధ రాజధానుల్లోకెల్లా రెండో అత్యంత కలుషిత రాజధానిగా, మొత్తం నగరాల లెక్కలో నాలుగో స్థానంలో నిలిచి ఢిల్లీ అప్రతిష్ఠ మూటగట్టుకుంది. ప్రపంచంలోని 50 అగ్రశ్రేణి కాలుష్య నగరాల్లో 39 భారత్‌లోవే. స్విట్జర్లాండ్‌కు చెందిన వాయు నాణ్యతా టెక్నాలజీ సంస్థ 'ఐక్యూ ఎయిర్' మార్చి 14న విడుదల చేసిన అయిదో వార్షిక 'ప్రపంచ వాయు నాణ్యతా నివేదిక–2022'లోని సంగతులివి. ఇవన్నీ మనల్ని అప్రమత్తం చేస్తున్నాయి. పౌరులు స్వచ్ఛమైన గాలి పీల్చి, ఆరోగ్యంగా జీవించాలంటే కాలుష్య నివారణకు తక్షణ చర్యలే శరణ్యమని పాలకులకు గుర్తు చేస్తున్నాయి.

ప్రపంచంలోని 131 దేశాల్లో 7,327 ప్రాంతాల్లో 30 వేలకు పైగా వాయునాణ్యతా పరిశీలక కేంద్రాలు పెట్టి, డేటా సేకరించి, ఈ నివేదికను సిద్ధం చేశారు. దీన్నిబట్టి గడచిన 2022లో అత్యధిక కాలుష్య దేశాల్లో అగ్రభాగాన నిలిచినవి... ఉత్తర – మధ్య ఆఫ్రికాలోని ఛాడ్, ఇరాక్, బహ్రెయిన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్. భారత్ 8వ స్థానంలో నిలిచింది. వాయుకాలుష్యం దారుణంగా ఉన్న ప్రపంచంలోని 10 నగరాల్లో ఏకంగా 8 మధ్య, దక్షిణాసియా ప్రాంతాల్లోవే! మన దేశంలో దాదాపు 60 శాతం నగరాల్లో ఈ సర్వే సాగింది. మనం పీల్చే గాలి నాణ్యత ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల కన్నా ఏడు రెట్లు అధమంగా ఉందని ఇందులో తేలింది. పైకి చూస్తే, నిరుటి సర్వేలో కాలుష్యంలో ప్రపంచంలో 5వ స్థానంలో ఉన్న మనం ఈసారి 8వ స్థానానికి రావడం శుభవార్తే. కానీ, నిరుడు ప్రపంచంలోని 100 కాలుష్యనగరాల్లో 61 మనవైతే, ఈసారి ఆ సంఖ్య 65కు పెరగడం గమనార్హం.

చిత్రం ఏమిటంటే, ప్రపంచ నగరాల్లో ఢిల్లీ నాలుగో స్థానంలో ఉన్నా, మన దేశంలో అత్యంత కలుషిత నగరం మాత్రం ఢిల్లీ శివార్లలో రాజస్థాన్ పరిధిలోకి వచ్చే భివాడీ! ఆ తరువాతే ఢిల్లీ. వాయుకాలుష్యం ఎక్కువైన దేశ రాజధానిలో సహజమైన నేలను సైతం కాంక్రీట్ కాలిబాటలతో మార్చేసరికి, చెట్ల నరికివేత పెరిగి, జీవం పోతోంది. సహజమైన స్థానిక మొక్కలను కాక, వేరెక్కడివో నాటడం లాంటి సమస్యలూ ఉన్నాయి. అలాగే, వాహన ఉద్గారాలు కాలుష్యానికి మరో ప్రధాన కారణం. ఎయిర్ కండిషనర్లు, రిఫ్రిజిరేటర్లు అధిక స్థాయిలో ఉద్గారాలను వెలువరిస్తూ, మరింత వాయు కాలుష్యానికి దారి తీస్తున్నాయి. ఇవన్నీ ఆరుబయట పనిచేసే భవన నిర్మాణ కార్మికులు, వీధి వర్తకులు సహా పలువురిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. శరవేగపు పట్టణీకరణతో, 2020 నుంచి 2030 మధ్య మన పట్టణ ప్రాంత జనాభా 48.3 కోట్ల నుంచి 67.5 కోట్లకు, అంటే 40 శాతం పెరుగుతుందని అంచనా. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్ని స్థాయుల్లో గట్టి చర్యలు చేపట్టక తప్పదు.

అనూహ్యంగా ఇటీవల గ్రామీణ భారతావనిలోనూ వాయు నాణ్యతలో తేడాలొస్తున్నాయి. గ్రామాల్లో నైట్రోజన్ డయాక్సైడ్ (ఎన్‌ఓ2) స్థాయులు, దరిమిలా వాయు కాలుష్యం పెరుగుతున్నట్టు ఐఐటీ ఖరగ్‌పూర్‌కు చెందిన పరిశోధకుల అధ్యయనం గత నెలలో వెల్లడించింది. భారత్‌లో మొత్తం ఎన్‌ఓ2 కాలుష్యంలో 41 శాతం గ్రామీణ ప్రాంతాల్లో అదీ అధికంగా రవాణా తదితర రంగాల ద్వారా జరుగుతోంది. పెరుగుతున్న పట్టణీకరణ, శివార్లకు పరిశ్రమలు మారడం, జనాభా పెరుగుదల లాంటి అనేక కారణాల వల్ల ప్రబలుతున్న ఈ ధోరణి ఆందోళనకరం. నిజానికి, గాలిలో పార్టిక్యులేట్ మేటర్ 2.5 (పీఎం 2.5) సాంద్రతల్ని వచ్చే 2026 కల్లా 40 శాతం మేర తగ్గించడం లక్ష్యమని భారత్ 2022లో ప్రకటించింది. అందుకు తగ్గట్టు 2019లో పర్యావరణ శాఖ ఆరంభించిన 'జాతీయ స్వచ్ఛ వాయు పథకా'న్ని (ఎన్సీఏపీ) పునర్నిర్వచిస్తామనీ హామీ ఇచ్చింది. కానీ, లక్ష్యసాధనలో వెనుకడుగు వేసింది. బొగ్గు గనులకు పర్యావరణ నిబంధనల్లో సడలింపులు ఇవ్వడం, గాలిలో ధూళి కణాలకు కారణమయ్యే ఉత్పత్తుల పెంపునకు అనుమతులివ్వడం లాంటి అనేక ప్రభుత్వ నిర్ణయాలు సమస్యను పెంచిపోషించాయి. భారత లక్ష్యానికి అవన్నీ ప్రతిబంధకాలయ్యాయి.

ఇప్పటికైనా ప్రభుత్వం కాలుష్య నివారణకు సత్వర కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలి. పరిశ్రమలు, వాహనాలపై కఠిన నిబంధనలు విధించాలి. రోడ్లపై వాహనాల సంఖ్య తగ్గేలా అసలు సిసలు ప్రజా రవాణా వ్యవస్థలపై దృష్టి పెట్టాలి. పునరుత్పాదక శక్తిపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలి. అలాగే, పర్యావరణ, కాలుష్య సంక్షోభాల నుంచి బయటపడాలంటే, ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్ని మెరుగుపరుచుకొనే కృషి చేయాలి. కేవలం వ్యక్తిగత కృషి సరిపోదు. వ్యక్తివాదం నుంచి సమష్టివాదం వైపు మళ్ళాలి. అందరూ కలసికట్టుగా సుస్థిర విధానాలను అనుసరించడం కీలకమని గుర్తించాలి. సాముదాయక కృషి సత్ఫలితాలిస్తుంది.

కోవిడ్ కాలంలో దేశంలో కాలుష్యం కట్టడి అయినట్టు కనిపించినా, తిరిగి మళ్ళీ కోవిడ్ ముందు స్థాయికి చేరిపోయిందని గత ఏడాది ఇదే 'ఐక్యూ ఎయిర్' నివేదిక తేల్చింది. అనారోగ్యానికి రెండో అతి పెద్ద కారణంగా దేశ ప్రజానీకంపై పెను ప్రభావం చూపుతున్న గాలి కాలుష్యంతో ఏటా 15 వేల కోట్ల డాలర్ల పైగా ఆర్థికంగా నష్టపోతున్నట్టు లెక్క. ప్రపంచవ్యాప్తంగా ప్రతి 10 మందిలో ఒకరు ఆరోగ్యాన్ని దెబ్బతీసే వాయుకాలుష్య ప్రాంతంలో నివసిస్తున్న వేళ భావితరాల బాగు కోసమైనా దేశాలు నిద్ర లేవాలి. పీల్చే గాలిలోనూ ధనిక, పేద దేశాల మధ్య తేడాలు దుర్భరం.

# పొలం నుంచి వైఫల్యం వరకు...

విశ్లేషణ



దేవీందర్ శర్మ

**దేశ వ్యవసాయదారుల వ్యధలను ఎవరూ గుర్తిస్తున్నట్లు కనిపించడం లేదు. లేదా వారి గురించి కనీసంగానైనా సరే ఎవరూ ఆలోచిస్తున్నట్లు లేదు. 'నేను దాన్ని పెంచాను. నేనే దాన్ని ధ్వంసం చేస్తున్నాను. ఇలా చేయడం చాలా కష్టంగా ఉంది కానీ నేను ఏం చేయగలను? గిట్టుబాటు ధరైనా రాకుంటే..' అని కూరగాయలు, పండ్లు పండించే రైతు ఆవేదన చెందుతున్నాడు. పంట ఉత్పత్తికి ఎకరాకు వేలాది రూపాయలు ఖర్చు పెట్టిన తర్వాత ఆ పంట మొత్తాన్ని నాశనం చేయడమనేది రైతుల జీవితాలను దారుణంగా దెబ్బతీస్తుంది. 'పొలం నుంచి వైఫల్యం వరకు' అనే ఈ పునరావృత రైతు గాథ దేశంలో ప్రతిచోటా కనిపిస్తున్నదే. అంతేకాదు... కొన్ని సంవత్సరాలుగా ఈ విఫలగాథ మరింతగా విస్తృతమవుతూ వస్తోంది!**

ఈ సంవత్సరం క్వింటాల్ బంగాళా దుంపల ధర రూ. 500లకు పడిపోయినప్పుడు (గత సంవత్సరం రూ. 1,200లు సగటు ధర పలికింది) ఒక రైతు మీడియాతో ఏం చెప్పాడంటే... ''క్వింటాల్ బంగాళా దుంపలను 900 నుంచి 1000 రూపాయల ధరకు తక్కువ అస్సలు అమ్మలేము. ఎందుకంటే ఈ రేటు వద్ద అయితేనే మాకు దిగుబడి ఖర్చులు రావడమే కాకుండా కాస్త లాభం కళ్ల చూడగలం'' అని. అయితే ఇప్పుడు బంగాళాదుంపల ధర ఏమాత్రం పెరిగే సూచనలు కనిపించకపోవడంతో రానున్న కాలంలో బంగాళా దుంపల ఉత్పత్తిదారులు గడ్డు కాలాన్నే ఎదుర్కోనున్నారు. పంజాబ్‌లోనే కాదు, బెంగాల్, బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రలో కూడా బంగాళాదుంపల ధర ఘోరంగా పతనం కానుంది. క్యాలిఫ్లవర్, క్యాబేజి, టమోటా ధరలు కూడా పడిపోయాయి. కేజీకి 3 రూపాయల ధర కూడా పలకదని గుర్తించక ముందే పంజాబ్‌లో రైతులు తమ పంటను ఇప్పటికే ధ్వంసం చేయడం ప్రారంభించారు. 'నేను దాన్ని పెంచాను. నేను దాన్ని ధ్వంసం చేస్తున్నాను. ఇలా చేయడం చాలా కష్టంగా ఉంది. కానీ నేను ఏం చేయగలను..' అని కూరగాయలు పండించే రైతు ఒకరు అన్నారు. వీటి ఉత్పత్తికి ఎకరాకు రూ. 30 వేలు ఖర్చు పెట్టిన తర్వాత ఆ పంట మొత్తాన్నీ నాశనం చేయడమనేది ఈ రైతుల జీవితాలను దారుణంగా దెబ్బతీయకుండా ఉంటుందా?!



ఇటీవల తెలంగాణలోని జహీరాబాద్ జిల్లా ప్రాంతాల గుండా నేను ప్రయాణిస్తున్నప్పుడు, అక్కడ విరివిగా పండిన టమోటాకి కూడా ఇదే గతి పట్టడం చూశాను. టమోటా పంటను ఎందుకు పండించడం లేదని అడిగాను. నిరాశతో కనిపించిన టమోటా రైతు ఒకరు నాతో మాట్లాడుతూ, మార్కెట్ ధర కిలో టమోటాకు 2 రూపాయలు పలుకుతున్నప్పుడు టమోటాలను బుట్టల్లో సర్దడం, వాటిని రవాణా చేయడం వంటివాటికి అదనపు ఖర్చు పెట్టాలని తాననుకోవడం లేదని చెప్పాడు. 'మీకు ఎన్ని టమోటాలు కావాలంటే అన్నీ తీసుకోండి' అని అతను నిస్పృహతో అన్నాడు. 'పొలం నుంచి వైఫల్యానికి' సంబంధించిన ఈ గాథను నేను ప్రతి చోటా చూస్తున్నాను.

దేశ వ్యవసాయదారుల వ్యధలను ఎవరూ గుర్తిస్తున్నట్లు కనిపించడం లేదు. లేదా వారి గురించి కనీసంగానైనా సరే ఎవరూ ఆలోచిస్తున్నట్లు లేదు. నేను ఎందుకిలా చెబుతున్నానంటే, ఛత్తీస్‌గఢ్‌నుంచి పక్షం రోజుల క్రితం ఒక నివేదిక వచ్చింది. మహాసముండ్‌కి చెందిన ఒక రైతు రాయపూర్ మండీకి వంకాయ పంటను తీసుకెళితే అతడికి రూ. 1,475 రూపాయలు మాత్రమే ఆదాయం వచ్చిందనీ, రవాణా ఖర్చులు, ఇతర ఖర్చుల కింద అదనంగా 121 రూపాయలను రైతే చెల్లించాల్సి వచ్చిందనీ ఆ వార్త తెలిపింది. అంతకు ముందు నెల రోజుల క్రితం వెల్లుల్లి రైతులు తమ పంట మొత్తాన్ని స్థానిక నదుల్లో కలిపేశారన్న వార్తలు మీడియాలో రాజ్యమేలాయి. తర్వాత ఉల్లిపాయల సాగుదార్ల వ్యధలకు సంబంధించిన వార్తలు కూడా బయటికి వచ్చాయి. మరో మాటలో చెప్పాలంటే, దేశంలో ఈ పరిస్థితి రోజువారీ కార్యక్రమంలా సాగుతోంది. కొన్ని సంవత్సరాలుగా, పొలం నుంచి వైఫల్యానికి సంబంధించిన గాథ మరింతగా విస్తృతమవుతూ వచ్చింది. పొలంలో రైతు చిందిస్తున్న రక్తం మీడియాలో పేజీలకు మాత్రమే పరిమితమవుతోంది. స్టాక్ మార్కెట్‌లో రక్తపాతాన్ని దేశం చూస్తున్నప్పుడు కలుగుతున్నటువంటి తీవ్ర స్పందన రైతుల వ్యధల పట్ల కలగడం లేదు.

ఇది చాలదన్నట్లుగా, మార్కెట్‌లో జోక్యం చేసుకునే వ్యవస్థ (ఎమ్ఐఎస్)ను మరింతగా బలోపేతం చేయడంలో ఎలాంటి ప్రయోజనాన్నీ మన ఆర్థిక మంత్రి చూడడం లేదు! సమృద్ధిగా పంటలు పండి ధరలు పడిపోయినప్పుడు లేదా పంటలు చేతికొచ్చిన సమయంలో ఉత్పత్తి ధరకంటే తక్కువ ధరకు పడిపోయినప్పుడు ఎమ్ఐఎస్ రంగంలోకి దిగుతుందన్నది తెలిసిందే. 2023 బడ్జెట్ ఖర్చుల కింద, ధర మద్దతు పథకం (పీఎస్ఎస్), ఎమ్ఐఎస్‌లకు కేటాయింపులను బాగా తగ్గించినట్లు కనిపిస్తోంది. గత ఏడాది ఎమ్ఐఎస్‌కి బడ్జెట్‌లో రూ. 1,500 కోట్లు కేటాయించగా, ఈ సంవత్సరం దాన్ని కేవలం లక్ష రూపాయలకు కోసిపడేశారు. బడ్జెట్‌లో పొందుపర్చిన ఈ కేటాయింపు, కొద్దిమంది వెల్లుల్లి ఉత్పత్తిదారులకు కలిగిన నష్టాలను పూరించడానికైనా సరిపోతుందని నేను భావించడం లేదు.

2018–19 బడ్జెట్‌లో రూ. 500 కోట్ల కేటాయింపుతో ప్రారంభించిన ఆపరేషన్ గ్రీన్స్ స్కీమ్‌ను గుర్తుంచుకోండి. టమోటో, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు మామూలుగా ఎదుర్కొంటున్న అస్థిర ధరల నియంత్రణకు ఉద్దేశించినట్లు చూపించినప్పటికీ అవసరమైన దానికంటే తక్కువగా బడ్జెటరీ కేటాయింపులు చేశారు. ఆపరేషన్ ఫ్లడ్ ప్రాతిపదికన, కనీసం ఈ మొత్తాన్నయినా ప్రకటించారు. ఈ పథకాన్ని అన్ని పండ్లు, కూరగాయలకు వర్తింపచేస్తూ, ఆత్మనిర్భర్ అభియాన్ కింద ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఈ స్కీమ్‌ని మరింతగా విస్తరించింది. కానీ 2023 నాటికి ఈ పథకాన్ని దాదాపుగా విస్మరించేశారు. కూరగాయల ధరలు (పండ్ల విషయంలో కూడా) పడిపోయిన ప్రతి సందర్భంలోనూ నేను ట్వీట్ చేసినప్పుడు, ఇవి పాడైపోయే సరకులు అని సాధారణ పల్లవి పాడుతూ వచ్చేవారు. సాధారణ ప్రజానీకం నుంచి ఈ మాటలు వింటే వాటిని సులువుగా పక్కనపెట్టేయవచ్చు కానీ విధాన నిర్ణేతలు ఇంత భిన్నంగా ఉండ టానికి ఇది కారణం కాకూడదు.

అమెరికాలో కూడా, ధరలు పడిపోయినప్పుడు రైతులు నష్టపోకుండా ఒక యంత్రాంగాన్ని ఏర్పర్చారు. పాలధరలు పడిపోయిన సమయాల్లో స్కూల్ ఫీడింగ్ ప్రోగ్రామ్‌లలో పొందుపరిచేలా రైతులు మరింత చీజ్‌ని తయారు చేయాలని రైతులను కోరే యంత్రాంగాన్ని అమెరికా రూపొందించింది. అలాగే స్ట్రాబెర్రీ ధరలు పతనం అయే సమయాల్లో ఇదే విధమైన కార్యక్రమాలు ఉంటున్నాయి. ప్రతిదీ సజావుగా ఉంటుందని చెప్పలేం కానీ, వ్యవసాయ క్షేత్రాల నష్టాలను తగ్గించడానికి ఇప్పటికీ ప్రయత్నాలు జరుగుతున్నాయి.

భారత్‌లో తగిన ఉష్ణోగ్రతా నియంత్రిత నిల్వ సౌకర్యాలు, ప్రాసెసింగ్‌పై ఆధారపడి ఉండే వాల్యూ ఛెయిన్‌ని పునర్నిర్మించడానికి, స్థానికంగా అందుబాటులో ఉంచేందుకు చిత్తశుద్ధితో కూడిన ప్రయత్నాలు చేపట్టాలి. ధరల క్షీణత పథకాన్ని అమలు చేసే యంత్రాంగం ద్వారా దీన్ని అమలు చేయాలి. కానీ మధ్యప్రదేశ్‌లో గతంలో స్కీమ్ వైఫల్యం చెందడం అనేది పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలి. అయితే మరింత ముఖ్యంగా ధరల అస్థిరత్వాన్ని అధిగమించడానికి రైతుల కోసం గ్యారంటీ ధరకు హామీ పడటం మార్గదర్శక స్ఫూర్తిగా ఉండాలి. కూరగాయల పెంపకందార్లకు గ్యారంటీ ధరను అందిస్తున్న కేరళ స్కీమ్ నుంచి వెలికివచ్చిన పాఠాలను నేర్చుకోవలసి ఉంటుంది.

రైతుల కోసం భవిష్యత్తులో పండ్లు, కూరగాయల ధరలను స్థిరీకరించడంలోనే కాదు.. వైవిధ్యభరితమైన పంటల వైపు మారే విషయంలో వారికి సహకారం అందివ్వడంలో ఆపరేషన్ గ్రీన్స్‌కి అతి పెద్ద సవాలు ఎదురవుతోంది. వినియోగదారులు ఇప్పటికే అత్యధిక మార్కెట్ ధరను చెల్లిస్తున్నారు. కానీ భారీగా ఆర్గనైజ్ అయివుండే వ్యాపారంలో కూడా జరిగే బేరసారాల్లో రైతులే నిండా మునిగిపోతున్నారు. కాబట్టి పొలం నుంచి వైఫల్యానికి చెందిన గాథ మారాల్సి ఉంది. కొనసాగుతున్న వ్యవసాయ దుస్థితికి గాను సప్లయ్ – డిమాండును మాత్రమే మనం నిందిస్తూ కూర్చోలేము.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### సాహస సేనాని



రచనా బిష్త్ రాసిన 'బిపిన్: ది మ్యాన్ బిహైండ్ ది యూనిఫాం' కాపీని అందుకున్నాను. ఈ పుస్తకం భారత దేశపు గొప్ప సైనిక నాయకులలో ఒకరైన జనరల్ బిపిన్ రావత్‌కు సముచితమైన నివాళి. నేడు (16 మార్చి) ఆయన జయంతి.
– రాజ్‌నాథ్ సింగ్, రక్షణ మంత్రి

### వాళ్లకేనా మైకు?!



గత మూడు రోజులుగా చూస్తున్నా, స్పీకర్ ఓం బిర్లా ప్రతిపక్ష సభ్యులలో ఒక్కరిని కూడా మాట్లాడేందుకు అనుమతించడం లేదు. ప్రజాస్వామ్యంపై జరుగుతున్న ఈ దాడికి స్పీకర్ నాయకత్వం వహిస్తున్నారు! ఇలా ట్వీట్ పెట్టినందుకు నేను జైలుకు వెళ్లవలసి వచ్చినా ఆశ్చర్యం లేదు.
– మహువా మొయిత్రా, తృణమూల్ ఎంపీ

### ఆరోగ్య భారత్



ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణంలో వ్యాధుల నిర్మూలనదే కీలకమైన భాగస్వామ్యం. పోలియోను ఓడించడం నుండి కోవిడ్–19కు వ్యతిరేకంగా పోరాటం చేయడం వరకు రోగ నిరోధకతలో మనమెన్నో చారిత్రక మైలురాళ్లను దాటి వచ్చాము. భారత ప్రజలందరికీ 'జాతీయ టీకా దినోత్సవ' శుభాకాంక్షలు.
– డా॥ మన్సుఖ్ మాండవీయా, ఆరోగ్య మంత్రి

### సాధువుల ఆగ్రహం



అయోధ్యలో డ్రెయిన్‌లు వేయడానికి 'శ్రీరామ్' అని రాసి ఉన్న ఇటుకల్ని ఉపయోగించడం వివాదం అయింది. అయితే 'శ్రీరామ్' అన్నది ఆ ఇటుకల్ని తయారు చేసిన బట్టీ పేరు అని ప్రభుత్వం చెబుతోంది. ఏమైనా వారి కాంట్రాక్ట్‌ను తక్షణం రద్దు చేయాలని సాధువులు డిమాండ్ చేస్తున్నారు.
– పూజా అవస్థీ, చరిత్రకారిణి

### మాతృ హృదయం



కదులుతున్న రైలు బోగీ ప్రవేశ ద్వారంలో నిలుచుని ప్లాట్‌ఫాంపై ఉన్న కన్నబిడ్డకు కన్నీళ్లతో వీడ్కోలు చెబుతూ విధులకు వెళుతున్న ఒక బి.ఎస్.ఎఫ్. యువ సైనికురాలిని చూశా. యూనిఫామ్‌లో తల్లిగా ఉండటం అంత సులభం కాదు.
– షీలా ఖాన్, ట్రావెలర్

## ఇన్‌బాక్స్

# నిద్ర ఆరోగ్యదాయని

నిద్ర ఆరోగ్యానికి అత్యంత అవసరం. అది కరవైతే అనేక రోగాలు వస్తాయి. ఈ యాంత్రిక జీవన కాలంలో నిద్రలేమి అనేది ప్రపంచ వ్యాప్తంగా మనుషులను పీడిస్తున్న ప్రధానమైన సమస్య అయ్యింది.. అన్నీ ఉండి కూడా ప్రపంచ వ్యాప్తంగా 45 శాతం మంది నిద్రలేమితో బాధపడుతున్నారని సర్వేలు తెలియజేస్తూ ఉన్నాయి. సకల మనోరుగ్మతలకూ, శారీరక రుగ్మతలకూ సుఖ నిద్రే మందు.

పిల్లలు అందరూ పరీక్షలు రాసే సమయమిది. నిద్ర పోకుండా తీవ్రంగా కష్టపడటం కంటే మంచి నిద్ర తీసుకోవడం వలన ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయి. నిద్రకు కచ్చితంగా 6 గంటల పాటు సమయాన్ని కేటాయించాలి. సరైన నిద్ర తీసుకొన్నప్పుడే బ్రెయిన్ యాక్టివ్‌గా పని చేయడానికి అవకాశం ఉంటుంది. మెదడు చురుగ్గా పనిచేయాలంటే పిల్లలు సరైన పౌష్టిక ఆహారాన్ని తీసుకోవడం, మంచి నిద్రపోవడం అవసరం. మంచి జ్ఞాపక శక్తిని పెంచేందుకు కూడా నిద్ర ఉపయోగపడుతుంది.

వయసును బట్టి నిద్ర పోయే వేళలు మారినప్పటికీ కనీసం సగటున ప్రతిరోజూ ఏడు గంటలైనా నిద్రపోవాలి. నిద్రలేమి వల్ల శరీర బరువు పెరుగుతుందనేది అక్షర సత్యం. మెదడు పనితనం సన్నగిల్లుతుంది. సగటు ఆయుర్దాయం తగ్గుతుంది. ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్ర పోవడం, నిద్ర లేవడం అలవాటు చేసుకోవాలి. సెలవు రోజు అంటూ నిద్రకు ఎలాంటి మినహాయింపూ లేదు. ప్రతి రోజూ వ్యాయామం చేసినట్లయితే శరీరం సుఖ నిద్రను కోరుకుంటుంది. పుట్టిన పిల్లలకు 18 గంటల నిద్ర, చిన్న పిల్లలకు 11 గంటల నిద్ర, టీనేజీలో ఉండే వారికి 8–10 గంటల నిద్ర తప్పనిసరి.

ఒకప్పుడు బెడ్‌రూమ్ అంటే విశ్రాంతికి చిహ్నంగా ఉండేది. ప్రస్తుతం పడక గదిలో కూడా ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు అత్యధికంగా ఉపయోగిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్‌లకు బానిసలుగా మారి నిద్రను తగ్గిస్తూ మానసిక రుగ్మతలు పెంచుకుంటున్నారు. నిద్రపోయే సమయాని కంటే అరగంట ముందుగానే ఎలక్ట్రానిక్/సమాచార ఉపకరణాలకు దూరంగా ఉండాలి. నిద్రకు ఉపక్రమించే ముందు మొబైల్‌ఫోన్లు స్విచాఫ్ చేయాలి. ఈ సమయంలో కుటుంబ సభ్యులు, ఆత్మీయ సన్నిహితులతో గడపాలి. నిద్రలేమి సమస్యకు నిద్రమాత్రలు పరిష్కారం కానే కాదు. మంచి తిండి, వ్యాయామం, ఆలోచనా విధానంలో మార్పు వంటివి మంచి నిద్రకు దోహదం చేస్తాయి.

– డా॥ అట్ల శ్రీనివాస్; రీహ్యాబిలిటేషన్ సైకాలజిస్ట్, కరీంనగర్
(నేడు ప్రపంచ నిద్రా దినోత్సవం)

# 'ఉపా' దుర్వినియోగాన్ని ప్రశ్నించాలి!

సందర్భం



అంకాళ్ళ పృథ్వీ రాజ్

చట్టాలు దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడాలి. అయితే వాటిని దేశ ప్రజల పాలిట శాపంగా పాలక వర్గాలు మారుస్తున్నాయి. దీంతో రాజ్యాంగం కల్పించిన హక్కుల హననం దారుణంగా జరిగిపోతోంది. అది ఏ రాజకీయ పక్షమైనా కావచ్చు, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిపక్షంపై లేదా ప్రశ్నించే ప్రజలు, సంఘాలపై రాజ్యాంగ విరుద్ధంగా కొన్ని చట్టాలను ప్రయోగించి అణచివేత సాగించడం పరిపాటిగా మారిపోయింది. అటువంటి అణచివేతపూరిత చట్టాలను ఏర్పర్చుకోవడం ఆయా పాలక వర్గాల మనుగడకు ఒక అవసరంగా పరిణమించింది. 'అన్ లాఫుల్ యాక్టివిటీస్ (ప్రివెన్షన్) ఏక్ట్ –1967 (ఉపా చట్టం–1967) ఇందుకు ఒక ఉదాహరణగా నిలుస్తుంది.

ప్రాథమికంగా ఈ చట్టం రెండు విభాగాలుగా విభజితమయ్యింది. ఒకటి అక్రమ లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడం, రెండు ఉగ్రవాద కార్యకలాపాల నివారణ. ఉపా చట్టం–1967, సెక్షన్ 2 (ఒ)... వ్యక్తులు లేదా సంఘాలు తమ పనుల ద్వారా అనగా రాతలతోను, మాటలతోను, విషయాలతోనూ, సంకేతాలతోనూ దేశంలోని ఏదైనా భాగాన్ని పరిత్యజించాలని లేదా వేర్పాటు చెయ్యాలని ఉద్దేశం కలిగి ఉండటం; అటువంటి వాదానికి మద్దతు తెలపడాన్నీ, అలాగే భారతదేశ ప్రాదేశిక సమగ్రతను, సార్వభౌమత్వాన్నీ త్యజించే, ప్రశ్నించే, భేదించే చర్యలు; భారతదేశంపై విరోధ భావన కలిగి ఉండటాన్నీ అక్రమ లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలుగా నిర్వచిస్తోంది. అలాగే ఉపా సెక్షన్ 2 (పి)... ఏదైనా సంఘం అక్రమ లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలను ప్రోత్సహించినా, అందుకుగాను సహాయం చేసినా అదేవిధంగా భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 153 (ఏ) ప్రకారం విభిన్న వర్గాల మధ్య మత, జాతి, భాష తదితర విభేదాలను ఆధారం చేసుకొని వైషమ్యాలను ప్రేరేపించుటం... భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 153 బి ప్రకారం జాతీయ సమగ్రతను భంగపరిచే చర్యలను ప్రోత్సాహించడం, అందుకు సహకరించడం చేసినా... ఆ సంస్థను 'అక్రమ' లేదా 'చట్టవిరుద్ధ' సంస్థగా నిర్వచిస్తోంది. సెక్షన్ 2 (కె), సెక్షన్ 15లు వరుసగా ఉగ్రవాదులనూ, ఉగ్రవాద చర్యలనూ నిర్వచిస్తున్నాయి.

అయితే వ్యక్తుల రూపంలో లేదా సంస్థల రూపంలో ఉగ్రవాద చర్యలకు దిగడం, అందులో భాగం కావడం, ఉగ్రవాదానికి సన్నాహపరచడం; ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినా, సమర్థించినా లేదా మరొక విధంగా భాగస్వామి అయినా అవి ఉగ్ర వాద చర్యలు అవుతాయి. ఉగ్రవాద చర్యలలో వ్యక్తులు లేదా సంస్థలు భాగస్వామ్యం కలిగి ఉంటే ఉగ్రవాదులుగా నాలుగవ షెడ్యూల్ లోనూ, సంస్థలను ఉగ్రవాద సంస్థలుగా



మొదటి షెడ్యూల్‌లోనూ చేర్చుతుంది. అయితే ఉపా చట్టం సెక్షన్ 36 ప్రకారం ఎవరైతే ఉగ్రవాదులుగా, ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించబడి బాధింపబడతారో వారు... తాము కేంద్ర ప్రభుత్వానికి ఉగ్రవాద కార్యకలాపాల్లో భాగస్వాములం కామనీ, కాబట్టి తమను ఆ జాబితా నుండి తొలిగించమనీ దరఖాస్తును చేసుకోవచ్చు. కేంద్ర పభుత్వం ఈ దరఖాస్తును తిరస్కరించిన ఎడల రివ్యూ కమిటీకి అర్జీ పెట్టుకోవచ్చు. ఈ అర్జీపై విచారణ అనంతరం వచ్చే నిర్ణయాన్ని బట్టి కేంద్ర ప్రభుత్వం ఆయా వ్యక్తులను లేదా సంస్థలను ఉగ్రవాద జాబితా నుండి తొలగించాలి.

ఉగ్రవాదులు లేదా ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించబడిన వారిపైన, సంస్థలపైన మాత్రమే పోలీసువారు లేదా నేర విచారణా సంస్థలు ఉపా చట్టం కింద... కేసులు నమోదు చేసి తమ విచారణను కొనసాగించవచ్చు. అయితే ఆ చట్టం సెక్షన్ 2 (ఐ) ఉగ్రవాద సంస్థ కానటువంటి ఏదైనా సంఘం క్రమానుగుణంగానూ లేదా మరొక విధంగానూ ఉగ్రవాద చర్యలలో భాగం అయితే వాటిని ఉగ్రవాద ముఠాలుగా నిర్వచిస్తోంది. సెక్షన్–2 (ఎ) వ్యక్తుల సమూహాన్ని సంఘంగా నిర్వచిస్తోంది. కేంద్రం వ్యక్తులను ఉగ్రవాదులుగా నోటిఫై చేసి నాలుగో షెడ్యూల్‌లో చేర్చినప్పుడు మాత్రమే ఉగ్రవాద చర్యలలో పాల్గొనే వ్యక్తుల గుంపులపై, నేరుగా పోలీసులు కేసులు కట్టవచ్చు, దర్యాప్తు చేయవచ్చు.

అయితే ఇటీవల ఉపా చట్టాన్ని ఉగ్రవాద సంస్థల్లోనూ, ఉగ్రవాదుల జాబితాలోన్లూ లేనటువంటి వారిపై ప్రయోగించడాన్ని గమనించవచ్చు. రాజ్యాంగబద్ధంగా ఉన్నటువంటి సంస్థలపై, సాధారణ హక్కుల సంఘాలపై, ఆయా కార్యకర్తలపై ఉపా చట్టాన్ని మోపడం చూస్తున్నాం. ఇది తీవ్ర ఆక్షేపణీయం. ఆయా వ్యక్తులపై, సమూహాలపై ఉపా కేసులు బనాయించడం, కొనసాగించడం, వారిని జైళ్లల్లో అక్రమ నిర్బంధంలో ఉంచడం అమానుషం. ఈ దుర్వినియోగం శాసనం ద్వారా స్థాపితమైన ప్రక్రియను అనుసరించి తప్ప వ్యక్తి స్వాతంత్ర్యం హరించరాదని స్పష్టం చేసిన భారత రాజ్యాంగం ఆర్టికల్ 21ని ఉల్లంఘించడమే. అక్రమ లేదా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని చెబుతూ... వివిధ మత సంస్థలపైనా, వివిధ జాతుల స్వాతంత్ర్య పోరాట వాదులతోపాటూ ఆయా తమకు వ్యతిరేకంగా ఉన్నారని భావిస్తున్న వ్యక్తులూ, సంస్థలపైనా ఈ చట్టాన్ని ప్రయోగించడాన్ని అడ్డు కోకపోతే ముందు ముందు విపరిణామాలు చోటు చేసుకోవచ్చు.

పరిస్థితి ఇలాగే కొనసాగితే... భవిష్యత్తులో కుల, జాతి, భాష ప్రాతిపదికగా పని చేసే సంఘాలపైనా ఈ చట్టాన్ని బనాయించే అవకాశం ఉంది. అందుకే ఇప్పుడే ఈ ఉపా చట్ట దుర్వినియోగాన్ని వ్యతిరేకిస్తూ గొంతులు కలపాలి.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది

# గూఢోక్తి

నలుగురిలో ఉన్నప్పుడు అన్ని వేళలా ముక్కుసూటిగా మాట్లాడటం సమంజసం కాదు. కొన్ని కొన్ని సందర్భాలలో దేనిమీదనో పెట్టి అన్యాపదేశంగా చెప్పాలి. ఆ చెప్పే పద్ధతి నిగూఢంగా ఉండాలి. ఎవరికి ఉద్దేశించినదో వారికే అర్థమయ్యేట్లు ఉండాలి. చుట్టూ ఉన్నవారికి తెలియకూడదు. నిగూఢ భాషణ కూడా ఒక కళా నైపుణ్యమే! భాషణ కళలో ఒక భాగమే! నిగూఢ భాషణను అర్థం చేసుకుని ఆచరించగలిగే నైపుణ్యం సంబంధిత శ్రోతకు ఉండాలి.

విరాట పర్వంలో విరటుని కొలువుకి ద్రౌపది వేగంగా వస్తున్నప్పుడు ఆమెను వెంబడించి వస్తున్న కీచకుని చూసి భీముడు కోపంతో అక్కడ ఉన్న పెద్ద వృక్షాన్ని చూస్తాడు. ధర్మరాజు కనుసైగతో వారిస్తాడు. వంటలవాడైన వలలుడు (విరాట పర్వంలో భీముని పేరు) పండ్లు బాగా పండిన పెద్ద కొమ్మలతో ఉన్న విశాలమైన నీడ నిచ్చే, ఆశ్రయించుకున్న వారి శ్రమను పోగొట్టే వృక్షాన్ని వంట చెరకు కోసం నరకటం దేనికి? ఇంకో చోట చెట్లుండవా? అంటాడు. ఇది ధర్మరాజు పలికిన గూఢోక్తి. వృక్షాన్ని కేంద్రంగా చేసి అన్యాపదేశంగా పలికాడు. వలలుడు కీచకుని చంపటానికి ఆయుధంగా ఆ వృక్షాన్ని భావించాడు. ధర్మరాజు ఆ వృక్షం అంటే విరటుడే అని అన్యాపదేశంగా చెప్పాడు. ఆ వృక్షం (విరటుడు) పాండవుల అజ్ఞాతవాస కాలంలో ఆశ్రయమిచ్చి, వారి వ్రతాన్ని ఫలవంతం చేస్తోంది. ఆ చెట్టును పెరికితే, అజ్ఞాత వాసం భంగమై, తమ ఆశ్రయాన్ని తామే నాశనం చేసుకున్నట్లు అవుతుంది. విరాటునితో శత్రుత్వం వద్దని భీమునికీ, ద్రౌపదికీ మాత్రమే అర్థమయ్యేట్లు ధర్మరాజు మాట్లాడాడు.



జ్యోతిర్మయం

ఉమ్మడి కుటుంబాలలో చిన్నవారు తప్పు చేస్తే, ఇంటి పెద్ద ఆ వ్యక్తికి మాత్రమే అర్థమయ్యేట్లు, సరిదిద్దేట్లు మాట్లాడవలసి వచ్చినప్పుడు ఈ గూఢోక్తి అవసరమవుతుంది. తరగతి గదిలో తప్పు చేసిన విద్యార్థిని అందరిలో నిల్చోబెట్టి దండించకుండా సదరు విద్యార్థికి మాత్రమే అర్థమయ్యేట్లు గూఢోక్తిగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉంటారు.

ఈ గూఢోక్తి నైపుణ్యం ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సందర్భంలో అవసరమవుతూనే ఉంటుంది.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

## గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బ.దశమి ఉ.10.59 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: ఉత్తరాషాఢ రా.12.13 వరకు, తదుపరి శ్రవణం, వర్జ్యం: ఉ.9.19 నుండి 10.46 వరకు, తిరిగి తె.3.58 నుండి 5.27 వరకు (తెల్లవారితే శనివారం), దుర్ముహూర్తం: ఉ.8.33 నుండి 9.23 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.21 వరకు, అమృతఘడియలు: సా.6.14 నుండి 7.44 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 6.12, సూర్యాస్తమయం: 6.06.

## వీఐపీ, ప్రొటోకాల్ దర్శనాలకు టికెట్లు తప్పనిసరి

- సర్క్యులర్ జారీ చేసిన దేవదాయ కమిషనర్
- ఇంద్రకీలాద్రిపై నోటీసు బోర్డులో ఏర్పాటు

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** వీఐపీ, ప్రొటోకాల్ దర్శనాలకు తప్పని సరిగా రూ.500 టికెట్ కొనుగోలు చేయాల్సిందేనని దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ సర్క్యులర్ జారీ చేశారు. దుర్గగుడి సమాచార కేంద్రం, టికెట్ల విక్రయ కేంద్రాలతో పాటు స్కానింగ్ పాయింట్ల వద్ద ఈ సర్క్యులర్ కాపీలను నోటీసు బోర్డులో ఏర్పాటు చేశారు. దుర్గగుడిలో అమ్మవారి దర్శనానికి వచ్చే వారందరూ టికెట్లు కొనుగోలు చేసేలా చూడాలని ఆలయ సిబ్బందికి ఈవో భ్రమరాంబ ఆదేశాలు జారీ చేశారు. దుర్గగుడి చైర్మన్, పాలక మండలి సభ్యులు తమ కుటుంబ సభ్యులలో రోజుకు ఆరుగురికి మినహాయింపు ఇస్తున్నట్లు ఈ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే వివిధ శాఖలకు చెందిన వీఐపీలను ఇకపై నేరుగా దర్శనానికి తీసుకువెళ్లడం సాధ్యం కాదు. ఆయా శాఖల ముఖ్య అధికారులు దేవస్థాన ప్రొటోకాల్ కార్యాలయంలో వివరాలను నమోదు చేయించుకోవాలి. ఆ తర్వాత ఆలయ సిబ్బందే స్వయంగా వీఐపీలతో టికెట్లు కొనుగోలు చేయించి ప్రత్యేక క్యూలైన్‌లో అమ్మవారి దర్శనం చేయించడం జరుగుతుంది.

# పోలవరం ముంపు జాబితాలోకి మరో 36 గ్రామాలు

## కొత్తగా చేరనున్న నిర్వాసితుల సంఖ్య 13,937


ముంపు జాబితాలో చేరిన తూర్పుమెట్ట గ్రామం

**వేలేరుపాడు (ఏలూరు జిల్లా):** పోలవరం ప్రాజెక్ట్ ముంపు కాంటూర్ లెవల్స్‌తో సంబంధం లేకుండా గత ఏడాది వచ్చిన గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం మరో 36 గ్రామాలను మొదటి దశ ముంపు జాబితాలోకి చేరుస్తోంది. ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో మొత్తం 20,946 మంది నిర్వాసితులు ఉండగా.. కొత్త జాబితా ప్రకారం ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు, కుక్కునూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని చింతూరు, వీఆర్ పురం, కూనవరం మండలాల్లోని 36 గ్రామాలకు సంబంధించిన మరో 13,937 మంది నిర్వాసితులను చేర్చనున్నారు. దీంతో మొత్తం నిర్వాసితుల సంఖ్య 34,883కు పెరుగుతోంది. త్వరలో ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నారు.

**కాంటూర్ లెవల్స్‌తో సంబంధం లేదు**

కొత్త జాబితాలో చేర్చే గ్రామాలకు, పోలవరం ప్రాజెక్ట్ కాంటూర్ లెవల్స్‌కు సంబంధం లేదు. ఏటా వచ్చే వరదలకు వల్ల నిర్వాసితులు పడే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆయా జిల్లాల కలెక్టర్లు ఇచ్చిన నివేదికల ఆధారంగా రెండు జిల్లాల్లో 36 గ్రామాలను ముంపు జాబితాలో చేర్చే ప్రక్రియ ప్రారంభించాం. మొదటి ప్రాధాన్యతగా ఆర్ అండ్ ఆర్ పరిహారం అందిస్తాం.

– చెరుకూరి శ్రీధర్, ఆర్ అండ్ ఆర్ కమిషనర్

**కొత్తగా చేరిన గ్రామాలివీ**

కొత్త జాబితాలో వేలేరుపాడు మండలంలోని పేరంటపల్లి, తూర్పుమెట్ట, టేకూరు, కాకినూరు, కాచారం, ఎర్రమెట్ట, ఎడవల్లి, టేకుపల్లి గ్రామాల్లో 901 మంది నిర్వాసితులను జాబితాలో చేరనున్నాయి. కుక్కునూరు మండలంలోని కొడిన్యముక్తి, చీరవల్లి మాధవరం, బెస్తగూడెం, ఆంబోతులగూడెం, చెరువుకొమ్ముగూడెం, రావిగూడెం, ఎల్లప్పగూడెం, ఎర్రబోరు, గుడంబోరు, ముత్యాలంపాడు గ్రామాల్లో 2,123 మంది కొత్త నిర్వాసితులు చేరతారు. చింతూరు మండలంలోని చింతూరు, రామవరంపాడు, ప్రతిపాక, గుండుగూడెం, వడ్డిగూడెం, వీఆర్‌పురం మండలంలోని వీఆర్‌పురం, ధర్మతాళ్లగూడెం, రాజీపేటకాలనీ, ఎ.వెంకన్నగూడెం, చింతరేగుపల్లి, కూనవరం మండలంలోని టేకుబాక, కూనవరం, టేకులబోరు, కొండ్రాజుపేట, పెద్దార్కూరు, పండురాజుపల్లి, శబరికొత్తగూడెం తదితర గ్రామాలను కొత్త జాబితాలో చేరుస్తున్నారు.

## శ్రీశారదాపీఠంలో భారత క్రికెటర్ భరత్

**సింహాచలం:** విశాఖ శ్రీశారదాపీఠాన్ని భారత క్రికెట్ జట్టు వికెట్ కీపర్ కె.ఎస్.భరత్ సతీసమేతంగా గురువారం సందర్శించారు. రాజశ్యామల అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకున్నారు. గుజరాత్ టైటాన్ తరఫున ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడేందుకు అహ్మదాబాద్ క్యాంప్‌నకు వెళ్తున్నట్లు ఈ సందర్భంగా భరత్ చెప్పారు.



## సుందరయ్య జీవించి ఉంటే సంతోషించేవారు

- సీఎం జగన్ పాలనంతా పేదల సంక్షేమమే లక్ష్యంగా సాగుతోంది
- ఇన్నేళ్లకు మా కలలను వాస్తవ రూపంలో చూస్తున్నా
- మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య

**సాక్షి, అమరావతి:** పేద ప్రజల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు అద్భుతంగా ఉన్నాయని, సీపీఎం దివంగత నేత పుచ్చలపల్లి సుందరయ్య ఇప్పుడు జీవించి ఉంటే ఎంతో సంతోషించే వారని ప్రజాశక్తి పూర్వ సంపాదకుడు, మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య అన్నారు. కృష్ణా జిల్లా ఉయ్యూరులో రోటరీ వృద్ధాశ్రమ సముదాయంలోని నివాసంలో సి.రాఘవాచారి ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు గురువారం పాటూరిని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా పలు సామాజిక అంశాలపై రామయ్య తన అనుభవాలను పంచుకున్నారు. పేదల తరపున దశాబ్దాల పోరాటం చేశామని, ఇన్నేళ్లకు తమ కలలు వాస్తవ రూపం సంతరించుకోవడాన్ని చూస్తున్నామన్నారు. రాష్ట్రంలో 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు దక్కడం, వారి సొంత ఇంటి కలను సీఎం జగన్ నిజం చేయడం ఆనందాన్ని ఇస్తోందన్నారు. ప్రస్తుతం పరిపాలనంతా పేదల సంక్షేమమే లక్ష్యంగా జరుగుతోందని పేర్కొన్నారు. ఒక నిరుపేద వ్యవసాయ కార్మికుడి కుటుంబంలో వైద్యం కోసం అప్పులు చేసే పరిస్థితి ఇప్పుడు కనిపించడం లేదన్నారు. పేద బాల బాలికలు బూట్లు, యూనిఫామ్ ధరించి, పుస్తకాలు నిండిన బ్యాగ్‌తో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్తుండటం తమకు ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు. ప్రస్తుత కాలంలో జర్నలిజంలో విలువలు పూర్తిగా పడిపోవడం తనకు వేదన కలిగిస్తోందని ఆయన అన్నారు. ప్రస్తుతం పలు మీడియా సంస్థలు అదేపనిగా ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేస్తున్న దుష్ప్రచారం సరికాదన్నారు.


పాటూరు రామయ్యను సత్కరిస్తున్న కొమ్మినేని శ్రీనివాసరావు

## మిథునం సినిమా నిర్మాతకు తనికెళ్ల భరణి నివాళి


ముయిద ఆనందరావు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న తనికెళ్ల భరణి

**రేగిడి:** మిథునం సినిమా నిర్మాత, సంఘ సేవకుడు, విద్యా ప్రదాత ముయిద ఆనందరావు భౌతిక కాయానికి గురువారం సినీ రచయిత, నటుడు తనికెళ్ల భరణి నివాళులర్పించారు. విజయనగరం జిల్లా రేగిడి మండలంలోని వావిలవలస గ్రామానికి చేరుకున్న తనికెళ్ల భరణి ఆనందరావు పార్థివదేహాన్ని చూసి కంటతడి పెట్టారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మిథునం సినిమా అంతా వావిలవలస గ్రామంలోనే చిత్రీకరించారని గుర్తు చేసుకున్నారు. ఆనందరావు భార్య పద్మిని, సోదరుడు శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## ఇలాగే వదిలేస్తే రేపు తాపీమేస్త్రిని పంపుతారు..

- దక్షిణ మధ్య రైల్వే జీఎం, విజయవాడ డీఆర్‌ఎం గైర్హాజరుపై హైకోర్టు మండిపాటు
- ఇద్దరికీ నాన్ బెయిలబుల్ వారెంట్ల జారీకి సిద్ధమైన న్యాయస్థానం
- డీఎస్‌జీ అభ్యర్థనతో విచారణ 21కి వాయిదా
- ఆ రోజు ఇద్దరు అధికారులు హాజరై తీరాలన్న న్యాయమూర్తి

**సాక్షి, అమరావతి:** వ్యక్తిగత హాజరుకు తామిచ్చిన ఆదేశాలను దక్షిణ మధ్య రైల్వే జీఎం, విజయవాడ డివిజినల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) బేఖాతరు చేయడంపై హైకోర్టు మండిపడింది. వీరు హాజరుకాకుండా ఓ ఇంజనీర్ స్థాయి అధికారిని కోర్టుకు పంపడాన్ని తప్పుపట్టింది. ఇలాగే వదిలేస్తే రేపు తాపీమేస్త్రిని కూడా పంపుతారని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ కేసులో కోర్టు ఆదేశాల మేరకు విజయవాడ మునిసిపల్ కమిషనర్ ఇప్పటికే రెండుసార్లు హాజరయ్యారని, కమిషనర్ కన్నా తానే ఎక్కువని డీఆర్‌ఎం భావిస్తున్నట్లు ఉందని ఆగ్రహం వ్యక్తం చేసింది. డీఆర్‌ఎం స్థాయి అధికారిని కూడా కోర్టుకు రప్పించలేకపోతే ఇక హైకోర్టు ఉండి ప్రయోజనం ఏముందని ప్రశ్నించింది. అటు జీఎం, ఇటు డీఆర్‌ఎంలకు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీచేసేందుకు సిద్ధమైంది. ఈ దశలో డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) ఎన్.హరినాథ్.. వారెంట్ అవసరం లేదని, కోర్టుముందు హాజరయ్యేందుకు మరో అవకాశం ఇవ్వాలని పలుమార్లు అభ్యర్థించడంతో న్యాయస్థానం శాంతించింది. విచారణను ఈ నెల 21కి వాయిదా వేస్తూ ఆ రోజున జీఎం, డీఆర్‌ఎం స్వయంగా హాజరుకావాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. విజయవాడ మధురానగర్‌లోని అప్రోచ్‌రోడ్డు, రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ జవ్వాజి సూర్యానారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం మరోసారి విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కె.ఎస్.మూర్తి వాదనలు వినిపిస్తూ.. కోర్టు జోక్యంతో పనులు పునఃప్రారంభం అయ్యాయని చెప్పారు. కోర్టుకు హాజరైన విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ స్పందిస్తూ.. గడువు పెంచాలని కాంట్రాక్టర్ కోరారని, ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. ఈ సమయంలో రైల్వే జీఎం, డీఆర్‌ఎం కోర్టుకు హాజరుగాకపోవడంపై న్యాయమూర్తి మండిపడ్డారు.

## పాలపర్తికి ప్రతిభా శిరోమణి పురస్కారం

**విజయవాడ కల్చరల్:** ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరానికి చెందిన ప్రముఖ ద్విశతావధాని, అచ్చ తెలుగు అవధాన రూప శిల్పి పాలపర్తి శ్యామలానంద ప్రసాద్‌కు అరుదైన పురస్కారం లభించింది. ఈ నెల 15వ తేదీన వారణాసిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వారణాసిలోని విశ్వనాథ శోభనాద్రి సారస్వత ప్రతిష్ఠానం నుంచి ప్రతిభా శిరోమణి పురస్కారం అందుకున్నారు. విశ్వనాథ శోభనాద్రి సారస్వత పరిషత్ భారతీయ సాహిత్యంలో విశేషమైన కృషి చేసిన వారికి ఏటా ప్రతిభా శిరోమణి పురస్కారంతో సత్కరిస్తుంది. 2023 సంవత్సరానికి గాను పాలపర్తిని ఎంపిక చేసి బిరుదు ప్రదానంతో పాటు రూ.లక్ష నగదు బహుమతిని అతిథుల చేతుల మీదుగా అందజేశారు. పాలపర్తి గతంలో అనేక శతావధానాలు, సంస్కృత అవధానాలను విజయవంతంగా నిర్వహించారు. తెలుగు భాషమీద మమకారంతో అచ్చతెలుగులో అవధానం నిర్వహించిన తొలి తెలుగు వ్యక్తి పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ కావడం విశేషం.


ప్రతిభా శిరోమణి పురస్కారం అందుకున్న పాలపర్తి, చిత్రంలో శోభనాద్రి, పూర్ణచందు

## పెత్తందారుల ఉద్యమానికి కాలం చెల్లింది

**900వ రోజు రిలే దీక్షలో మండిపడ్డ బహుజన నాయకులు**

**తాడికొండ:** ముందస్తు వ్యూహంతో కొనుగోలు చేసిన భూములకు ధరలు పెంచుకునేందుకు రాష్ట్రంలో కులవాదులు, పెత్తందారులు కలిసి చేస్తున్న అమరావతి ఉద్యమం ముగిసిపోయిందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 900వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. అమరావతి పేరుతో నమ్మి భూములిచ్చిన రైతులను చంద్రబాబు నిలువునా ముంచేశాడన్నారు. రాష్ట్రంలో జగనన్న పాలనలో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ బహుజనుల ఆశలకు జీవం పోసేలా ఉందన్నారు. ఇకనైనా బాబు అండ్ కో రాజకీయాల నుంచి నిష్క్రమిస్తే మంచిదని, లేకుంటే 2024 ఎన్నికల్లో ప్రజలే తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. రాజధాని పేరుతో 3.50 లక్షల కోట్లు అవినీతి చేసిన చంద్రబాబును దర్యాప్తు సంస్థలు విచారించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కాగా అసెంబ్లీకి వెళుతూ మార్గమధ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మూడు రాజధానుల దీక్షా శిబిరం వద్ద తన వాహన శ్రేణిని వేగం తగ్గించి బహుజన పరిరక్షణ సమితి నాయకులకు చిరు మందహాసంతో అభివాదం చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, పులి దాసు, పెరికే వరప్రసాద్, ఇందుపల్లి సుభాషిణి, బేతపూడి సాంబయ్య, బొలిమేర శామ్యూల్, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

## మూడు రోజులు వానలే

**18న ఉత్తర, దక్షిణ కోస్తాల్లో భారీ వర్షాలు**

**సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం:** రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు వర్షాలు కొనసాగనున్నాయి. ఉత్తర తమిళనాడు నుంచి కర్ణాటక మీదుగా కొంకణ్ తీరం వరకు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. మరోవైపు బంగ్లాదేశ్ పరిసర ప్రాంతాల నుంచి ఒడిశా మీదుగా ఉత్తర కోస్తాంధ్ర వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. వీటి ఫలితంగా శుక్ర, శని, ఆదివారాల్లో దక్షిణ కోస్తా, ఉత్తర కోస్తా, రాయలసీమల్లో చాలాచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే వీలుంది. శనివారం దక్షిణ కోస్తా, ఉత్తర కోస్తాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలకు ఆస్కారం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) గురువారం రాత్రి నివేదికలో వెల్లడించింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవవచ్చని తెలిపింది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడవచ్చని పేర్కొంది. ఉరుములు, మెరుపులు, అక్కడక్కడ పిడుగులు పడే ప్రమాదం ఉందని, గంటకు 30నుంచి 40 కిలోమీటర్లు గరిష్ఠంగా 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. మూడు రోజులపాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ కోరారు.

**మూడు జిల్లాల్లో వడగళ్ల వాన:** రాయలసీమలోని వైఎస్సార్, అన్నమయ్య, ఉత్తరాంధ్రలోని అల్లూరి సీతారామరాజు ఏజెన్సీలో గురువారం నుంచి అకాల వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల వడగండ్ల వానలు పడ్డాయి. వానతోపాటు భారీ ఈదురు గాలులు వీచాయి. అన్నమయ్య జిల్లా వాయల్పాడు సమీపంలో పిడుగుపాటుకు గురై ఒకరు మృతి చెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో మధ్యాహ్నం వడగళ్ల వాన పడింది.


ముంచంగిపుట్టు మండలం గుమ్మ ఘాట్ వద్ద వడగళ్లు

## నేటి నుంచి విజ్ఞాన్‌లో 'సృజనాంకుర-2కే 23'

**చేబ్రోలు:** విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా శక్తిని పెంపొందించడం, అంతర్గతంగా ఉన్న ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో జాతీయ స్థాయి సృజనాంకుర ఆవిష్కరణలు శుక్ర,శనివారాల్లో నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ పి.నాగభూషణ్ తెలిపారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ వర్సిటీలో 'విజ్ఞాన్ సృజనాంకుర-2కే 23' పోస్టర్లు గురువారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ ప్రారంభ కార్యక్రమానికి షిబ్‌పూర్‌లోని ఐఐఈఎస్‌టీ డైరెక్టర్ ప్రొఫెసర్ పార్థసారథి చక్రవర్తి, కర్ణాటక- మైసూర్‌లోని ఎక్సెల్ సాఫ్ట్ టెక్నాలజీస్ సీఈవో సుధన్వ ధనంజయ హాజరుకానున్నారని తెలిపారు. సృజనాంకురలో భాగంగా శాస్త్ర, సాంకేతిక వైజ్ఞానిక ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. మొత్తం తొమ్మిది కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. రూ.9లక్షల విలువైన నగదు బహుమతులు విజ్ఞాన్ సృజనాంకుర-2కే 23 పోటీల విజేతలకు అందజేయనున్నట్లు చెప్పారు. రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.


ప్రాజెక్టుల రూపకల్పనలో విద్యార్థులు

## పోలీసుల అదుపులో దొంగనోట్ల ముఠా

**రూ 44.50 లక్షల నోట్లు స్వాధీనం**

**చింతూరు (అల్లూరి సీతారామరాజు):** జిల్లాలోని విలీన మండలాల్లో దొంగనోట్లు చెలామణి చేస్తున్న ముఠాను చింతూరు సబ్-డివిజన్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.44.50 లక్షల దొంగనోట్లు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం చింతూరులో వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం పాల్వంచ కేంద్రంగా చేసుకుని ఈ ముఠా దొంగనోట్లు ముద్రిస్తోంది. వాటిని జిల్లాలోని చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాకతో పాటు తెలంగాణలోని పాల్వంచ, భద్రాచలం, ఛత్తీస్‌గఢ్‌లోని కుంటలో రద్దీ ప్రదేశాలు, పెట్రోలు బంకులు, హోటళ్లు, కిరాణా షాపుల్లో రాత్రిపూట చెలామణి చేసేవారు. దొంగనోట్ల ముఠాను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి వీఆర్‌పురం మండలం రేఖపల్లి, తెలంగాణలోని పాల్వంచ, భద్రాచలంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడుల్లో పాల్వంచకు చెందిన పాదిల మురళి, జంగం శ్రీనివాస్, కిరణ్‌కుమార్, వేముల పుల్లారావు, చిట్టిబాబు, పాదిలి శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఉమేష్‌చంద్రతో పాటు సామ్రాజ్యం అనే మహిళను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ 44.50 లక్షల విలువైన రూ.500 నకిలీ నోట్లతో పాటు ప్రింటింగ్ సామగ్రి, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. రంపచోడవరం ఓఎస్డీ కృష్ణకాంత్, చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ యాదగిరి పాల్గొన్నారు.



## 'మిరాకిల్' ఆక్రమణ భూములు స్వాధీనం


ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

**భోగాపురం:** విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముంజేరు, కంచేరు, కొంగవానిపాలెం గ్రామాల పరిధిలో గల సర్వే నంబర్ 406-3, 143-1, 143-4, 92-19, 92-20, 92-21, 172-7, 8, 9, 10, 11లో సుమారు 8.52 ఎకరాల ప్రభుత్వ భూములు అక్రమణకు గురైనట్టు రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. ఏపీ అసైన్డ్ లాండ్స్ (పీఓటీ) చట్టం -1977 నిబంధనలను ఉల్లంఘించి రైతుల నుంచి మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ ఇండియా సంస్థ అక్రమించిన 4.13 ఎకరాలు, చికిని ఎంటర్‌ప్రైజెస్ ఇండియా సంస్థ అక్రమించిన 4.39 ఎకరాల ప్రభుత్వ భూములను గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఆ భూముల్లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఆర్ఐ కిశోర్, మండల సర్వేయర్ మధుకేశ్వరరావు పాల్గొన్నారు.

## మావోయిస్టు దళ సభ్యుడు బామన్ లొంగుబాటు

**చింతూరు (అల్లూరి సీతారామరాజు):** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా గాదెంకు చెందిన మావోయిస్టు పార్టీ దళ సభ్యుడు మడకం బామన్ గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఎదుట లొంగిపోయాడు. 2015లో పార్టీలో చేరిన బామన్ 2017 వరకు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో సభ్యుడిగా, 2018లో ముల్గేర్ ఎల్‌జీఎస్ సభ్యుడిగా, 2019లో కట్టేకళ్యాణ్ ఎల్‌జీఎస్ మెంబర్‌గా పనిచేశాడు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు ఘటనలతో ఇతనికి సంబంధాలు ఉన్నాయి. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలతో విసిగిపోయి, పార్టీకి ప్రజల్లో ఆదరణ తగ్గుతుండడంతో పోలీసులకు లొంగిపోయినట్లు మడకం బామన్ చెప్పాడు.

## 8 మంది గంజాయి స్మగ్లర్ల అరెస్టు


పెంటపాడు వద్ద పట్టుబడిన గంజాయి నిందితులతో పోలీసులు

**రేణిగుంట(తిరుపతి జిల్లా)/చింతపల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా):** రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి.. వారినుంచి సుమారు రూ. 3 కోట్ల, 75 వేల విలువైన 1,724 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) తుహిన్ సిన్హా, రేణిగుంట డీఎస్పీ రామచంద్ర వివరాలు వెల్లడించారు. ఒడిశాకు చెందిన సీతారామ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఫేకు యాదవ్, రవీంద్ర యాదవ్ ఒడిశాలోని పలు ప్రాంతాల్లో సుమారు రూ. 3 కోట్ల 1,700 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మీదుగా వ్యాన్‌లో ముంబై తరలించేందుకు బయలు దేరారు. ముందస్తు సమాచారంతో గురువారం చింతపల్లి మండలంలోని పెంటపాడు వద్ద చింతపల్లి పోలీసులు వీరిని పట్టుకున్నారు. గంజాయి తరలింపునకు సహకరించిన మరో ఆరుగురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని వ్యాన్‌ను సీజ్ చేశారు. అలాగే తిరుపతి జిల్లా రేణిగుంట రమణవిలాస్ సర్కిల్ వద్ద బుధవారం సీఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేస్తుండగా, ఓ కారు వేగంగా వస్తూ పోలీసుల జాడను చూసి కారును ఆపి అందులో ఉన్న వ్యక్తులు కిందకు దిగి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిలో పోలీసులు ఒకరిని వెంబడించి పట్టుకున్నారు. అతనిని రేణిగుంట మండలం తూకివాకం ఏఎస్ఆర్ కాలనీకి చెందిన కుమార్ (27)గా గుర్తించారు. అతని వద్దనుంచి 19కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కుమార్‌ను విచారించి అంకమ నాయుడు మిట్ట వద్ద ఉన్న పురుషోత్తం మణికంఠన్, రాజు, పెరుమాళ్ శివ, పెరుమాళ్ కన్నన్‌ను పట్టుకుని వారి వద్దనుంచి ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 24 కేజీల గంజాయి విలువ సుమారు రూ. 75 వేలు ఉంటుంది. పరారీలో ఉన్న తిరుపతి ఓటేరుకు చెందిన వంశీని త్వరలోనే అరెస్ట్ చేస్తామని డీఎస్పీ తెలిపారు.

## క్లుప్తంగా...

### కొత్తగా ఎర్నీ బాట్!

హాంకాంగ్: మైక్రోసాఫ్ట్ సంస్థ తీసుకొచ్చిన కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత చాట్‌బాట్ 'చాట్‌జీపీటీ' ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ పొందుతోంది. కోట్లాది మంది ఉపయోగిస్తున్నారు. రోజురోజుకూ యూజర్ల సంఖ్య పెరుగుతోంది. దీనికి పోటీగా చైనా సెర్చ్ ఇంజిన్ బైదూ కొత్తగా ఏఐ ఆధారిత చాట్‌బాట్ 'ఎర్నీబాట్'ను గురువారం ఆవిష్కరించింది. అయితే, ఇది యూజర్లను నిరాశపర్చింది. ఎర్నీబాట్ సంపూర్ణమేమీ కాదని, ఇంకా మెరుగుపరుస్తామని బైదూ సీఈఓ రాబిన్ లీ చెప్పారు. ఎర్నీబాట్ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో బైదూ కంపెనీ షేర్ల విలువ 10 శాతం పడిపోయింది. ఎర్నీబాట్‌ను ఉపయోగించుకొనేందుకు ఇప్పటిదాకా 650 కంపెనీలు ముందుకొచ్చాయని రాబిన్ లీ తెలిపారు. ఈ చాట్‌బాట్ మొదటి వెర్షన్‌ను 2019లో అభివృద్ధి చేశామన్నారు.

### టిక్‌టాక్‌పై యూకే నిషేధం



లండన్: ప్రభుత్వ ఫోన్లలో టిక్‌టాక్ యాప్ వినియోగంపై బ్రిటన్ నిషేధం విధించింది. చైనా మూలాలున్న ఈ సామాజిక మాధ్యమ యాప్‌ను భద్రతాపరమైన కారణాలతో నిషేధిస్తున్నట్లు తెలిపింది. యూకే మంత్రి ఆలివర్ డౌడెన్ గురువారం పార్లమెంట్‌లో ఈ విషయం ప్రకటించారు. ప్రభుత్వ డేటా, సమాచారాన్ని టిక్‌టాక్ వాడుకోవడం ప్రమాదకరమని ఆయన అన్నారు. టిక్‌టాక్‌పై ఇప్పటికే భారత్, అమెరికా, కెనడా, ఈయూ దేశాలు పూర్తిస్థాయిలో నిషేధం విధించిన విషయం తెలిసిందే. యాప్ వినియోగదారుల సమాచారాన్ని చైనా ప్రభుత్వంతో పంచుకున్నట్లు వస్తున్న ఆరోపణలను టిక్‌టాక్ ఖండిస్తోంది.

### 216 జడ్జీల పోస్టుల భర్తీకి సిఫారసులు రాలేదు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న హైకోర్టుల్లో మొత్తం 334 జడ్జీల పోస్టులు ఖాళీలుండగా 118 పోస్టుల భర్తీ కోసం హైకోర్టు కొలీజియంల నుంచి అందిన సిఫారసులు వివిధ దశల్లో పరిశీలనలో ఉన్నట్లు కేంద్రం తెలిపింది. మరో 216 జడ్జీల పోస్టులకు హైకోర్టుల కొలీజియంల నుంచి సిఫారసులు అందాల్సి ఉందని వివరించింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు గురువారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. మార్చి 10వ తేదీ నాటికి సుప్రీంకోర్టులో ఖాళీలు లేవన్నారు. 25 హైకోర్టుల్లో మంజూరైన 1,114 జడ్జీ పోస్టులకు గాను 334 ఖాళీలున్నాయన్నారు. జడ్జీ పోస్టుల ఖాళీల భర్తీ నిరంతర ప్రక్రియ అని వివరించారు.

## తోషఖానా టు బందీఖానా!

### ఇమ్రాన్ అరెస్ట్‌కు రంగం సిద్ధం

- మార్చి 18లోగా అరెస్ట్ చేసి హాజరుపరచాలని సెషన్స్ కోర్టు ఆదేశాలు
- 2 కోట్లు చెల్లించి 10 కోట్ల విలువైన కానుకలు సొంతం చేసుకున్న ఇమ్రాన్
- మూడు వాచీలు అమ్ముకొని మూడున్నర కోట్లు మూటగట్టుకున్న వైనం
- ఆత్మాహుతి దాడులు తప్పవని ప్రభుత్వానికి ఇమ్రాన్ అనుచరుల హెచ్చరికలు

పాకిస్తాన్ తెహ్రీకీ ఇన్సాఫ్ (పీటీఐ) అధ్యక్షుడు, మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ అరెస్ట్‌కు రంగం సిద్ధమైంది. తోషఖానా కేసులో తనపైనున్న నాన్‌బెయిలబుల్ వారెంట్లను రద్దు చేయాలంటూ ఇమ్రాన్‌ఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. పోలీసులకు లొంగిపోవాలని సూచించింది. ఇమ్రాన్ తనంతట తాను లొంగకపోతే మార్చి 18లోగా అరెస్ట్ చేసి కోర్టు ఎదుట ప్రవేశపెట్టాలని సెషన్స్ న్యాయమూర్తి జఫర్ ఇక్బాల్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే అరెస్ట్ చేయాలని ఆదేశించామని మళ్లీ వారెంట్ల రద్దు పిటిషన్ ఎందుకు వేశారని న్యాయమూర్తి సీరియస్ అయ్యారు. దీంతో ఇమ్రాన్ ఎదుట ఉన్న దారులన్నీ మూసుకుపోయాయి. శనివారం నాడు ఆయన అరెస్ట్ కాక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. ఇమ్రాన్‌ను అరెస్ట్ చేయడానికి 10 రోజుల క్రితం పోలీసులు ప్రయత్నించినప్పట్నుంచి పోలీసులకు, పార్టీ కార్యకర్తలకు మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటూనే ఉన్నాయి. పోలీసులు ఇమ్రాన్ నివాసానికి వెళ్లిన ప్రతీసారి ఆయన ఇంట్లో లేకపోవడం, కార్యకర్తలు పోలీసులపైకి రాళ్లు రువ్వుతూ ఘర్షణకు దిగడం సర్వసాధారణంగా మారింది.



### ఏమిటీ తోషఖానా కేసు..?

తోషఖానా.. అంటే ప్రభుత్వానికి దేశ విదేశీ ప్రతినిధుల నుంచి వచ్చే కానుకల ఖజానా. 1974లో ఇది ఏర్పాటైంది. ప్రభుత్వ అధికారులకొచ్చే కానుకల్ని ఇందులోనే ఉంచుతారు. ప్రభుత్వంలో ఉన్న పెద్దలు తమకు ఎవరు ఏ కానుక ఇచ్చినా తోషఖానాకు తప్పనిసరిగా అప్పగించాలి. ఇమ్రాన్‌ఖాన్ ప్రధాని పదవిని చేపట్టాక తనకు వచ్చిన కానుకలేమిటో చెప్పడానికి నిరాకరించారు. అంతేకాదు తనకు వచ్చిన కానుకల్ని ఎంతో కొంత ధర ఇచ్చి తోషఖానా నుంచి తీసుకొని వాటిని తిరిగి అమ్ముకోవడానికి అనుమతినివ్వాలంటూ ఎన్నికల సంఘానికి లేఖ కూడా రాశారు. ఇమ్రాన్ ప్రధానిగా ఉండగా 101 కానుకలు వచ్చాయి. 2018, సెప్టెంబర్ 24 నాటికి అలా వచ్చిన కానుకల్లో 10 కోట్ల విలువైన వాటికి 2 కోట్లు చెల్లించి ఇమ్రాన్ తీసుకున్నారని నివేదికలు వెల్లడించాయి. అంతేకాకుండా మూడు వాచీలను అమ్మేసి ఇమ్రాన్ సొమ్ము చేసుకున్న మొత్తం రూ.3.6 కోట్లుగా తేలింది. పాకిస్తాన్ ముస్లిం లీగ్–నవాజ్ (పీఎంఎల్–ఎన్) నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2022 ఆగస్టులో తోషఖానా వివాదంపై కేసు నమోదు చేసింది. ఇమ్రాన్ తనకు వచ్చిన కానుకల వివరాలు చెప్పకుండా కొన్ని అక్రమ మార్గాల్లో అమ్ముకున్నారంటూ కేసు పెట్టింది. ఇమ్రాన్ గద్దె దిగిన తర్వాత తోషఖానాలో కొన్ని పుస్తకాలు తప్ప మరే వస్తువు లేదు.

### పాకిస్తాన్ ఎన్నికల కమిషన్ ఏమంటోంది?

ఇమ్రాన్‌కు వ్యతిరేకంగా కేసు రిజిస్టర్ అయిన రెండు నెలల తర్వాత పాకిస్తాన్ ఎన్నికల కమిషన్ ఇమ్రాన్ ఆ కానుకల్ని అమ్ముకోవడం చట్ట వ్యతిరేకం కాదని తేల్చి చెప్పింది. ఎందుకంటే ఎంతో కొంత ధర చెల్లించి ఆయన ఆ కానుకల్ని తన సొంతం చేసుకున్నారని చెప్పింది. అయితే ఆయన అనైతికంగా ఈ పని చేస్తూ తప్పు దారి పట్టించే ప్రకటనలు చేశారంటూ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఇమ్రాన్‌పై అయిదేళ్ల నిషేధం విధించింది.

**ఇమ్రాన్ తీసుకున్న కానుకల ఖరీదు (పాకిస్తాన్ రూపాయలు)**



- డైమండ్ రిస్ట్ వాచీ 8.5 కోట్లు
- ఉంగరం: 87.5 లక్షలు
- 4 రోలెక్స్ వాచీలు: 87 లక్షలు
- కఫ్‌లింక్స్ పెయిర్ 56 లక్షలు
- పెన్ను: 15 లక్షలు
- ఇవే కాకుండా పెర్‌ఫ్యూమ్స్, ఐ ఫోన్లు, మౌంట్ బ్లాంక్ పెన్, మసీదు, అత్తర్ బాటిల్స్ నమూనాల వంటివి తీసుకున్నారు.




### 37 కేసులు


- ఇమ్రాన్‌ఖాన్‌పై తోషఖానాతో పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 37 కేసులు నమోదయ్యాయి.
- పాకిస్తాన్ ఎన్నికల కమిషన్ (ఈసీపీ) ప్రధాన ఎన్నికల అధికారి సికందర్ సుల్తాన్ రజాకు వ్యతిరేకంగా ఇమ్రాన్‌తో పాటు పీటీఐ పార్టీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఒక కేసు నమోదైంది
- ఎన్నికల కమిషన్ అయిదేళ్లపాటు ఎన్నికలకు దూరంగా ఉండాలంటూ అనర్హత వేటు వేసినప్పుడు ఈసీపీ కార్యాలయం ఎదుట నిరసనలు నిర్వహించడంపై కేసు దాఖలైంది
- పాకిస్తాన్ ఫారెన్ ఎక్స్ఛేంజ్ యాక్ట్ నియమాలను ఉల్లంఘిస్తూ విదేశాల నుంచి ఆర్థిక లావాదేవీలు నడిపారన్న ఆరోపణలపై కేసు
- పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో 144 సెక్షన్‌ని ఉల్లంఘిస్తూ ర్యాలీ నిర్వహించినందుకు కేసు
- పాకిస్తాన్ ముస్లిం లీగ్ (ఎన్) నేత మొహిసిన్ షానవాజ రంజా ఇమ్రాన్ ఆదేశాల మేరకే తనను పోలీసులు కొట్టి చంపడానికి వచ్చారంటూ హత్యాయత్నం కేసు పెట్టారు

### అరెస్టయితే అంతర్యుద్ధం తప్పదా..?

ఇమ్రాన్ ఖాన్ అరెస్ట్ అయితే పాకిస్తాన్‌లో అంతర్గత యుద్ధం తలెత్తే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తాను అరెస్ట్ అయితే ఏం చెయ్యాలన్న దానిపైనా ఇమ్రాన్ పక్కా ప్రణాళికతోనే ఉన్నారు. దానిని సరైన సమయంలో బయటపెడతానని ఆయన చెబుతున్నారు. తమ నేతపై చెయ్యి వేస్తే షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వంపై ఆత్మాహుతి దాడులకి దిగుతామని ఇప్పటికే పార్టీ నాయకులు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఆర్థికంగా, రాజకీయంగా గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్న పాక్ ప్రభుత్వానికి పీటీఐ కార్యకర్తల సవాల్ ఎదుర్కోవడం కూడా క్లిష్టంగా మారింది. మరోవైపు పంజాబ్ ర్యాలీలో ఇమ్రాన్‌పై దాడి జరిగిన దగ్గర్నుంచి ఆయనను హత్య చేస్తారన్న ఆందోళనలూ ఉన్నాయి. తనపై అవినీతి ఆరోపణలకు సంబంధించి ఆయన ఇప్పటివరకు కోర్టు ఎదుట కూడా హాజరు కాలేదు. ప్రభుత్వ పెద్దలే తనను హత్య చెయ్యడానికి కుట్ర పన్నుతున్నారంటూ ఇమ్రాన్ తనకు అనుమానం ఉన్న వారందరి పేర్లు వెల్లడిస్తూ ఒక వీడియో విడుదల చేశారు. తనని జైలుకు పంపినా, చంపేసినా ప్రభుత్వంపై పోరాటం ఆపవద్దంటూ అనుచరుల్లో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

## సిసోడియాపై మరో కేసు



న్యూఢిల్లీ: మద్యం విధానంలో అవకతవకల కేసులో అరెస్టయి జైలులో ఉన్న ఢిల్లీ రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) మరో కేసును నమోదుచేసింది. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఫీడ్ బ్యాక్ యూనిట్(ఎఫ్‌బీయూ) విషయంలో అధికార, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, ప్రత్యర్థి పార్టీలపై నిఘా కోసం వాడారని మనీశ్‌పై గతంలో ఆరోపణలు వచ్చాయి. దీంతో నేరపూరిత కుట్ర, నమ్మకద్రోహం, ఫోర్జరీసహా అవినీతి నిరోధక చట్టం కింద సీబీఐ మంగళవారం కేసు నమోదుచేసింది. సిసోడియాతోపాటు గతంలో విజిలెన్స్ విభాగ కార్యదర్శిగా పనిచేసిన ఐఆర్ఎస్ అధికారి సుకేశ్‌కుమార్, సీఎం కేజ్రీవాల్‌కు ప్రత్యేక సలహాదారు, ఎఫ్‌బీయూ జాయింట్ డైరెక్టర్, రిటైర్డ్ సీఐఎస్ఎఫ్ డీఐజీ రాకేశ్ కుమార్ సిన్హాలపై కేసు నమోదైంది. కస్టడీలోనే మనీశ్ మగ్గిపోయేలా చేయాలని ప్రధాని మోదీ ఇలా తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ సంస్థల పనితీరును నిఘావేసి సమాచారం(ఫీడ్‌బ్యాక్) సేకరించేందుకు ఉద్దేశించిన ఎఫ్‌బీయూను వీరంతా దుర్వినియోగం చేశారని ఎఫ్ఐఆర్‌లో సీబీఐ పేర్కొంది. 2016 నవంబర్ నాలుగోతేదీన ఢిల్లీ విజిలెన్స్ విభాగం ఫిర్యాదుతో సీబీఐ రంగప్రవేశం చేసి ఎఫ్‌బీయూ నియామకాలు, నిధుల్లో అవకతవకలు జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేల్చి ఆ నివేదికను తాజాగా 11 పేజీల ఎఫ్ఐఆర్‌లో జతచేసింది.

## అమెరికా ఎయిర్‌ఫోర్స్ అసిస్టెంట్ సెక్రటరీగా చౌధరి



వాషింగ్టన్: భారతీయ అమెరికన్ ఫ్లైట్ టెస్ట్ ఇంజినీర్ రవి చౌధరి చరిత్ర సృష్టించారు. అమెరికా రక్షణ శాఖలో ఎయిర్ ఫోర్స్ అసిస్టెంట్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ స్థాయికి ఎదిగిన మొట్టమొదటి భారతీయ అమెరికన్ ఈయనే. రక్షణ శాఖ కార్యాలయం పెంటగాన్‌లోని ఈ అత్యున్నత పదవికి రవి చౌధరిని నామినేట్ చేస్తూ అధ్యక్షుడు జో బైడెన్ చేసిన సిఫారసును సెనేట్ 65–29 ఓట్ల తేడాతో బుధవారం ఆమోదించింది. ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీకి చెందిన డజనుకు పైగా సభ్యులు సైతం రవి చౌధరికి మద్దతివ్వడం విశేషం. రవి అమెరికా ఎయిర్‌ఫోర్స్‌లో 1993–2015 నుంచి 22 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేశారు. ఆపరేషనల్, ఇంజినీరింగ్, సీనియర్ స్టాఫ్ అసైన్‌మెంట్లు వంటి వైవిధ్యమైన అంశాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్‌లో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా ఉన్నారు. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్ఏఏ)లోని అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామ్స్ అండ్ ఇన్నోవేషన్ విభాగానికి డైరెక్టర్ కూడా వ్యవహరించారు. సి–17 పైలట్‌గా అఫ్గానిస్తాన్, ఇరాక్ యుద్ధ విధుల్లో పాలుపంచుకున్నారు. సిస్టమ్స్ ఇంజినీర్ కూడా అయిన చౌధరి నాసాలోనూ పనిచేశారు.

## 13 మందిపై రేప్, వీడియో రికార్డింగ్

సిడ్నీ: ఉద్యోగాల పేరుతో ఇంటర్వ్యూలకు పిలిచి, మత్తు కలిపిన డ్రింక్స్ తాగించి వారిపై అత్యాచారానికి పాల్పడేవాడు.. ఆ దురాగతాలను వీడియో రికార్డింగ్ చేసేవాడు. కొరియా మహిళలంటే ఇతడికి పిచ్చి. బాధితుల్లో వీరే ఎక్కువమంది. వీరి పేర్లు, వివరాలను దాచుకున్నాడు. అతడి గదిలో బెడ్ పక్కనే అలారం క్లాక్‌లోని సీక్రెట్ కెమెరా ద్వారా అన్నీ రికార్డయ్యేవి...ఇవన్నీ ఆస్ట్రేలియాలోని సిడ్నీకి చెందిన భారత సంతతి వ్యక్తి బాలేశ్ ధన్‌కర్ అకృత్యాలు. 2018 జనవరి– అక్టోబర్‌కాలంలో ఇతడు 13 మంది ఇతడు మహిళలను రేప్ చేశాడు. 2018 అక్టోబర్‌లో పోలీసులు ఇతడి సొంత ఫ్లాట్‌తోపాటు ఓ హోటల్ గదిలో సోదాలు జరపగా మత్తు పదార్థాలు కలిపిన డ్రింక్స్ బాటిళ్లు, రేప్ దృశ్యాలు, మహిళలతో ఏకాంతంగా ఉండగా తీసిన మొత్తం 47 వీడియోలతో హార్డ్‌డ్రైవ్ దొరికింది. బాలేశ్ నేరాలపై న్యూసౌత్ వేల్స్ జిల్లా కోర్టులో విచారణ జరుగుతోంది. కొన్ని వీడియోల్లోని అసహ్యకర దృశ్యాలను జడ్జీలు కూడా చూడలేకపోయారని సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ పేర్కొంది.

## పార్లమెంట్‌లో జవాబిస్తా: రాహుల్



న్యూఢిల్లీ: లండన్‌లో తాను చేసిన వ్యాఖ్యలపై మోదీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తమాషా సృష్టించిందని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అదానీ వ్యవహారం నుంచి ప్రజల దృష్టిని మళ్లించాలన్నదే ప్రభుత్వ పన్నాగమని దుయ్యబట్టారు. బీజేపీ చేస్తున్న ఆరోపణలపై పార్లమెంట్‌లో సమాధానం చెబుతానని అన్నారు. రాహుల్ గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తనపై పార్లమెంట్‌లో నలుగురు కేంద్ర మంత్రులు ఆరోపణలు చేశారని, సమాధానం చెప్పడానికి తనకు వారికి ఇచ్చినంత సమయం ఇస్తారా? లేక నోరు నొక్కేస్తారా? అని అనుమానం వ్యక్తం చేశారు. అదానీ వ్యవహారం బయటపడడంతో ప్రభుత్వం, ప్రధాని మోదీ భయపడుతున్నారని, అందుకే జనం దృష్టిని మళ్లించడానికి లేనిపోని తమాషా సృష్టించారని మండిపడ్డారు. గురువారం స్పీకర్ బిర్లాను కలిశానని, చట్టసభ సభ్యుడిగా పార్లమెంట్‌లో మాట్లాడతానని చెప్పానన్నారు. మోదీ–అదానీ బంధంపై ప్రభుత్వానికి నాలుగు ప్రశ్నలు సంధించానని వివరించారు. తనపై వచ్చిన ఆరోపణలకు పార్లమెంట్‌లో సమాధానం చెప్పడం తన ప్రజాస్వామిక హక్కు అని స్పష్టం చేశారు. భారత ప్రజాస్వామ్యం నిజంగా సక్రమంగా పని చేస్తుంటే తన హక్కుకు రక్షణ లభిస్తుందని, చట్టసభలో మాట్లాడే అవకాశం లభిస్తుందని రాహుల్ గాంధీ అన్నారు.

**స్పీకర్‌తో రాహుల్ భేటీ**

కాంగ్రెస్ లోక్‌సభ పక్షనేత అధిర్ రంజన్ చౌదరితో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో సమావేశమయ్యారు. సభలో మాట్లాడేందుకు తనను అనుమతించాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. లండన్ పర్యటనలో భారత్‌కు వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని అన్నారు. సభలో అవకాశం ఇస్తే తాను చెప్పాలనుకున్నది చెప్తానన్నారు. సభలో అవకాశం రాకపోతే సభ బయట మాట్లాడతానని పేర్కొన్నారు. లండన్‌లో చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెబుతారా? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, రాహుల్ చిరునవ్వులు చిందించారు.

## నాలుగో రోజూ ప్రతిష్టంభన

**పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కొనసాగిన గందరగోళం**

న్యూఢిల్లీ: లండన్‌లో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు, అదానీ గ్రూప్ వ్యవహారం పార్లమెంట్‌ను కుదిపేస్తున్నాయి. తమ డిమాండ్ల నుంచి అధికార, విపక్షాలు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. విదేశీ గడ్డపై భారత ప్రజాస్వామ్యాన్ని అవమానించేలా మాట్లాడిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్ క్షమాపణ చెప్పాలని అధికార బీజేపీ ఎంపీలు, అదానీ అంశంపై విచారణ కోసం జేపీసీ ఏర్పాటు చేయాలని విపక్ష సభ్యులు పట్టుబట్టారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు వరుసగా నాలుగో రోజు గురువారం సైతం స్తంభించాయి. .

**రాహుల్ గాంధీ రాక**

లోక్‌సభ గురువారం ఉదయం ప్రారంభం కాగానే యథావిధిగా అధికార, ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. పరస్పరం వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి ప్రవేశించారు. దీంతో కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే స్పీకర్ బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా వేశారు. లోక్‌సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సభలోకి ప్రవేశించారు. 'లండన్' వ్యాఖ్యల తర్వాత ఆయన సభకు రావడం ఇదే మొదటి సారి. అధికార బీజేపీ, విపక్ష ఎంపీలు నినాదాలు ఆపలేదు. దంతో స్పీకర్ సభను మరుటి రోజుకు వాయిదా వేశారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల నినాదాలు, అరుపులతో రాజ్యసభ స్తంభించింది.

**క్షమాపణ చెప్పాలి: మంత్రులు**

భారత ప్రజాస్వామ్యంపై బ్రిటన్‌లో చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, ప్రహ్లాద్ జోషీ డిమాండ్ చేశారు. అంతకంటే ముందు ఆయన తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేయాలన్నారు. గతంలో ఎంతోమంది సీనియర్ నాయకులు పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పారని వారు గుర్తుచేశారు.

**అదానీపై చర్చను ఎగ్గొట్టడానికే: ఖర్గే**

అదానీపై, పరిపాలనలో వైఫల్యాలపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా చూడాలన్నదే నరేంద్ర మోదీ ప్రభుత్వ కుతంత్రమని ఖర్గే ధ్వజమెత్తారు. అందుకే పార్లమెంట్ కార్యకలాపాలకు అడ్డు తగులుతోందని ఆరోపించారు. ఆయన గురువారం పార్లమెంట్ వద్ద మీడియాతో మాట్లాడారు. తాము బుధవారం పార్లమెంట్ నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కార్యాలయం దాకా శాంతియుతంగా ప్రదర్శన చేపడితే దుర్మార్గంగా అడ్డుకున్నారని ఆక్షేపించారు. ముందు వరుసలో మహిళా కానిస్టేబుళ్లను ఉంచారని అన్నారు.

**కలిసికట్టుగా ప్రభుత్వాన్ని నిలదీద్దాం**

రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే చాంబర్‌లో గురువారం విపక్ష నేతలు సమావేశమయ్యారు. పార్లమెంట్ ఉభయ సభల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించుకున్నారు. కలిసికట్టుగా ఉంటూ, ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్‌తోపాటు డీఎంకే, ఎస్పీపీ, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, జేడీయూ, జేఎంఎం, ఎండీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ, వీసీకే, ఐయూఎంఎల్ తదితర పార్టీల నేతలు ఈ భేటీకి హాజరయ్యారు. ఇదిలా ఉండగా, అదానీ అంశంపై చర్చించాలని, ఈ వ్యవహారంపై విచారణకు జేపీసీ ఏర్పాటు చేయాలని కోరుతూ పలువురు ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ, రాజ్యసభలో నోటీసులు ఇచ్చారు.

## కూలిన చీతా హెలికాప్టర్

**ఇద్దరు సైన్యాధికారుల దుర్మరణం**

ఈటానగర్: ఇద్దరు సైన్యాధికారులతో ప్రయాణిస్తున్న సైనిక చీతా హెలికాప్టర్ అరుణాచల్ ప్రదేశ్‌లో గురువారం ఉదయం ప్రమాదవశాత్తు కూలింది. ఈ ఘటనలో హెలికాప్టర్ పైలట్‌గా విధుల్లో ఉన్న లెఫ్టినెంట్ కల్నల్ వినయ్ భాను రెడ్డి, కోపైలట్‌గా ఉన్న మేజర్ జయంత్ ప్రాణాలు కోల్పోయారు. దట్టంగా మంచు కమ్ముకున్న మారుమూల మండళ కొండల్లో హెలికాప్టర్ కూలింది. రక్షణ శాఖ ప్రతినిధి తెలిపిన వివరాల ప్రకారం.. సాధారణ సన్నద్ధతలో భాగంగా హెలికాప్టర్ అరుణాచల్‌లోని పశ్చిమ కెమాంగ్ జిల్లాలోని సాంగే గ్రామం నుంచి అస్సాంలోని సోనిపట్ జిల్లా మిస్సామరికు తిరుగుపయనమైంది. మార్గమధ్యంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ)తో హెలికాప్టర్ సంబంధాలు తెగిపోయాయి. 9.15 గంటల ప్రాంతంలో బంగ్లాజాప్ గ్రామ శివారులోని కొండల్లో కుప్పకూలి మంటల్లో చిక్కుకుంది. హెలికాప్టర్ కూలిన ఘటనపై ఆర్మీ కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ మొదలుపెట్టింది.

**వీవీబీ రెడ్డి యాదాద్రి జిల్లా వాసి**



బొమ్మలరామారం: హెలికాప్టర్ కూలిన ప్రమాదంలో అసువులు బాసిన ఉప్పల వినయ్ భానురెడ్డి(వీవీబీ) స్వగ్రామం యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం. మండల కేంద్రానికి చెందిన ఉప్పల నర్సింహారెడ్డి ఇద్దరు కుమారుల్లో వినయ్ భానురెడ్డి చిన్నవాడు. వినయ్‌భానురెడ్డి తండ్రి నర్సింహారెడ్డి ఆర్‌పీఎఫ్‌లో ఉద్యోగరీత్యా కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వినయ్ భాను రెడ్డికి చిన్ననాటి నుంచి అమితమైన దేశ భక్తి. దేశం కోసం విధి నిర్వహణలో తాను మృతిచెందినా శోకించవద్దని తండ్రి నర్సింహా రెడ్డితో తరచూ చెప్పేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. 21 సంవత్సరాలుగా ఆర్మీలో విధులు నిర్వహిస్తూ లెఫ్టినెంట్ కల్నల్ స్థాయికి ఎదిగారు. వినయ్ భార్య స్పందన ఆర్మీలో డెంటిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వారికి ఇద్దరు కూతుళ్లు. వినయ్ మృతితో బొమ్మలరామారం మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి.




కశ్మీర్‌లోని బందిపొర జిల్లా గురెజ్ వ్యాలీలో భారీగా మంచు కురుస్తోంది. రంజాన్ పాస్ వద్ద రోడ్డుపై పేరుకుపోయిన మంచును తొలగిస్తున్న బీఆర్‌వో సిబ్బంది

## జోధా అక్బర్ ఫేమ్ అమన్ ధలివాల్‌పై దాడి

కాలిఫోర్నియా: జోధా అక్బర్‌సహా పలు హిందీ, పంజాబీ సినిమాల్లో నటించిన యువ పంజాబీ నటుడు అమన్ ధలివాల్‌పై అమెరికాలో ఒక ఆగంతకుడు కత్తితో దాడికి తెగబడ్డాడు. ఛాతీ, మెడ, తల, భుజంపై పలు చోట్ల తీవ్రంగా గాయపరిచాడు. ఘటన తర్వాత అమన్‌ను ఆస్పత్రిలో చేర్పించారు. ప్రాణాపాయం ఏమీలేదని వైద్యులు తెలిపినట్లు మీడియాలో వార్తలొచ్చాయి. గురువారం ఉదయం కాలిఫోర్నియా నగరంలోని గ్రాండ్ ఓక్స్ ప్రాంతంలోని ఒక జిమ్‌లో కసరత్తు చేస్తున్న అమన్‌పైకి ఒక ఆగంతకుడు కత్తితో దాడి చేసి బందీగా పట్టుకున్నాడు. తాగడానికి నీళ్లు కావాలని అక్కడి వారిని ఆగంతకుడు బెదిరించిన సమయంలో ఒక్కసారిగా అమన్ ఎదురుతిరిగి అతడిని పట్టుకోబోయాడు. ఈ ఘర్షణలో అమన్ గాయాలపాలై రక్తసిక్తమయ్యాడు. వెంటనే అప్రమత్తమైన జిమ్‌లోని తోటివారు ఆ ఆగంతకుడిని పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. అమన్‌పై ఆగంతకుడు దాడి దృశ్యం ప్రస్తుతం వైరల్‌గా మారింది.

## ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులు 3%

- కానీ వాటిల్లో 96 శాతం కేసుల్లో నేరనిరూపణ
- కేసులు, తదితర వివరాలు నివేదించిన ఈడీ



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రస్తుతం వార్తల్లో నిలుస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థ.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ). విపక్ష నేతలనే ఈడీ లక్ష్యంగా చేసుకుంటోందన్న ప్రతిపక్షాల ఆరోపణల నేపథ్యంలో తమ కేసుల దర్యాప్తు తదితర వివరాలను సంస్థ తాజాగా ప్రకటించింది. తాము నమోదుచేసిన కేసుల్లో ప్రస్తుత, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై దాఖలైన కేసులు కేవలం 2.98 శాతమేనని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) స్పష్టంచేసింది. అయితే మనీలాండరింగ్ చట్టం కింద నమోదైన ఈ 2.98 శాతం కేసుల్లో నేర నిరూపణ శాతం ఏకంగా 96 శాతం ఉండటం గమనార్హం. మనీ లాండరింగ్ నిరోధక చట్టం, ఫారెన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ చట్టం, పారిపోయిన ఆర్థిక నేరగాళ్ల చట్టం(ఎఫ్ఈఓఏ)ల కింద ఈ ఏడాది జనవరి 31వ తేదీ వరకు నమోదైన మొత్తం కేసుల తాలూకు తాజా స్థితిగతులను ఈడీ విడుదలచేసింది.

**ఈడీ గణాంకాల ప్రకారం...**

- మనీ లాండరింగ్ చట్టం అమల్లోకి వచ్చాక ఇప్పటిదాకా మొత్తంగా 5,906 ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్(ఈసీఐఆర్– ఎఫ్ఐఆర్ లాంటిదే)లు నమోదుకాగా వాటిలో ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలపై దాఖలైన కేసులు కేవలం 176 (2.98 శాతం) ఉన్నాయి.
- అన్నింటిపై కోర్టుల్లో మొత్తంగా 1,142 అభియోగ పత్రాలు నమోదుచేశారు. 513 మందిని అరెస్ట్‌చేశారు. కేవలం 25 కేసుల విచారణ పూర్తయింది. 24 కేసుల్లో నిందితులు దోషులుగా తేలారు. అంటే మొత్తంగా 45 మందిని కోర్టులు దోషులుగా నిర్ధారించింది. అంటే 96 శాతం నేరనిరూపణ జరిగింది.
- 5,906 కేసుల్లో 531 కేసులకు సంబంధించి మాత్రమే సోదాలు, ఆకస్మిక తనిఖీలు జరిగాయి. అంటే కేవలం 9 శాతం కేసుల్లోనే సోదాలు చేశారు.
- మొత్తం కేసుల్లో ఇప్పటిదాకా ఆస్తుల జప్తు/అటాచ్‌మెంట్‌కు సంబంధించి 1,919 ఉత్తర్వులను ఈడీ జారీచేసింది. రూ.1,15,350 కోట్ల ఆస్తులను జప్తుచేసింది.
- ఫెమా చట్టం కింద దాదాపు 34 వేల కేసులు నమోదయ్యాయి.
- ఎఫ్ఈఓఏ చట్టం కింద 15 మందిపై కేసులు నమోదుకాగా తొమ్మిది మందిని పరారైన నేరగాళ్లుగా ప్రకటించారు.

## ఫ్రాన్స్‌లో ప్రత్యేక అధికారాలతో పెన్షన్ బిల్లుకు ఆమోదం

పారిస్: ఫ్రాన్స్ ప్రభుత్వం పెన్షన్ సంస్కరణల్ని ప్రజలపై బలవంతంగా రుద్దుతోంది. దేశ పార్లమెంటులో ఓటింగ్ జరగకుండానే బిల్లు చట్టరూపం దాల్చేలా ప్రత్యేకమైన రాజ్యాంగ అధికారాన్ని పొందేలా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ చర్యలు తీసుకున్నారు. రిటైర్‌మెంట్ వయసును 62 ఏళ్ల నుంచి 64 సంవత్సరాలకు పెంచుతూ తీసుకుని వచ్చిన ఈ బిల్లు నేషనల్ అసెంబ్లీలోని దిగువ సభలో ఆమోదం పొందే అవకాశం లేదు. అందుకే ఓటింగ్‌కి కొన్ని నిమిషాల ముందు ప్రధానమంత్రి ఎలిజబెత్ బోర్న్ చట్టసభలు ఆమోదించకుండానే బిల్లు చట్టంగా మారేలా రాజ్యాంగంలోని ఆర్టికల్ 49:3ని వినియోగించుకున్నారు. ఈ కొత్త పెన్షన్ బిల్లుపై గత కొద్ది రోజులుగా ఫ్రాన్స్‌లో ఆందోళనలు మిన్నంటుతున్నాయి.

## కొలంబియా బొగ్గు గనిలో పేలుడు..11 మంది దుర్మరణం

బొగోటా: కొలంబియాలోని ఓ బొగ్గు గనిలో సంభవించిన భారీ పేలుడులో 11 మంది చనిపోయారు. లోపలి చిక్కుకుపోయిన మరో 10 మంది కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సుటటౌసా మున్సిపాలిటీ సమీపంలోని గనిలో మంగళవారం రాత్రి సంభవించిన పేలుడు ప్రభావం టన్నెళ్ల ద్వారా అనుసంధానమై ఉన్న మరో నాలుగు గనులపైనా పడిందని అధికారులు తెలిపారు. మీథేన్ గ్యాస్ ఒత్తిడే గనిలో పేలుడుకు కారణమన్నారు.

## ఎట్టకేలకు గార్సెట్టి ఎంపిక ఖరారు



వాషింగ్టన్: రెండు సంవత్సరాలకుపైగా ఎటూ తేలని భారత్‌లో అమెరికా రాయబారిగా ఎరిక్ గార్సెట్టి ఎంపిక ప్రక్రియ ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది. అమెరికా పార్లమెంట్ ఎగువసభలో జరిగిన ఓటింగ్‌లో 52–42 ఓటింగ్ ఫలితంతో గార్సెట్టి నామినేషన్ గండాన్ని విజయవంతంగా గట్టెక్కారు. దీంతో భారత్‌లో అమెరికా రాయబారిగా గార్సెట్టి త్వరలో నియామకం కానున్నారు. తొలిసారిగా 2021 జూలైలో గార్సెట్టిని భారత్‌లో అమెరికా రాయబారిగా నామినేట్ చేస్తున్నట్లు అధ్యక్షుడు బైడెన్ ప్రకటించారు. లాస్ ఏంజెలిస్ నగర మాజీ మేయర్ అయిన గార్సెట్టిపై పలు లైంగిక వేధింపులు, ఆధిపత్య ధోరణి ఆరోపణలు ఉన్నాయి. ఇన్నాళ్లూ అమెరికా నూతన రాయబారి వ్యవహారం సందిగ్ధంగా ఉండటంతో చరిత్రలో తొలిసారిగా 2021 జనవరి నుంచి ఇప్పటిదాకా భారత్‌లో అమెరికా రాయబారిగా ఎవరూ లేరు. కాగా, బైడెన్‌కు సన్నిహితుడు నూతన రాయబారిగా వస్తుండటంతో భారత్‌తో సత్సంబంధాలు మెరుగుపడతాయని భారతీయ అమెరికన్లు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

## ఉత్తరకొరియా ఖండాంతర క్షిపణి ప్రయోగం

సియోల్: ఉత్తరకొరియా గురువారం ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. టోక్యోలో జపాన్–దక్షిణ కొరియా నేతల శిఖరాగ్ర సమ్మేళనం ప్రారంభానికి ముందు ఉ.కొరియా ఈ దుందుడుకు చర్యకు పాల్పడటం గమనార్హం. ఉత్తరకొరియా ఈ నెలలో జరిపిన మొదటి ఐసీబీఎం ప్రయోగం కాగా, వారం వ్యవధిలో చేపట్టిన మూడో ఆయుధ పరీక్ష ఇది. ప్యాంగ్యాంగ్ సమీపం నుంచి గురువారం ఉదయం ప్రయోగించిన ఈ క్షిపణి సుమారు వెయ్యి కిలోమీటర్లు ప్రయాణించి తూర్పు వైపు సముద్రజలాల్లో పడిపోయినట్లు దక్షిణ కొరియా ప్రకటించింది.

## తాత్కాలిక టీచర్లకు వేతనం పెంపు

సాక్షి, చెన్నై : రాష్ట్రంలో ఆదిద్రావిడ, గిరిజన (ఎస్సీ, ఎస్టీ) పాఠశాలలో పనిచేస్తున్న తాత్కాలిక టీచర్లకు వేతనం పెంచుతూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. ఉపాధ్యాయ రిక్రూట్ మెంట్ ద్వారా ఖాళీల భర్తీలో నెలకొన్న జాప్యంతో తాత్కాలిక టీచర్ల నియమకంపై విద్యాశాఖ దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. వందలాది మందిని తాత్కాలిక టీచర్లుగా నియమిస్తూ వస్తున్నారు. వీరికి తొలుత రూ. 7500, రూ. 10 వేలు, రూ. 12 వేలు చొప్పున కేటగిరీల వారీగా జీతాలు ఇచ్చారు. అయితే, ఇది చాలడం లేదని టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తూ వచ్చారు. ఈ పరిస్థితుల్లో ఎస్సీ, ఎస్టీ తాత్కాలిక టీచర్ల నియామకంతో పాటు వేతనాల పెంపునకు సీఎం స్టాలిన్ ఆదేశించారు. యూజీ టీచర్లకు నెలకు రూ. 12 వేలు, పట్ట భద్రులకు రూ. 15 వేలు, పీజీ టీచర్లకు రూ. 18 వేలు చొప్పున జీతం పంపిణీకి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## న్యూస్‌రీల్

### కన్యాకుమారికి రాష్ట్రపతి రాక.. రేపు

సాక్షి, చెన్నై: రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ శనివారం కన్యాకుమారిలో పర్యటించనున్నారు. ఇందుకోసం పర్యాటక కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గత నెల శివరాత్రి సందర్భంగా మదురై, కోయంబత్తూరు పర్యటనకు రాష్ట్రపతి వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె కేరళ పర్యటనలో ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా ఈనెల 18వ తేదీ శనివారం కన్యాకుమారికి రానున్నారు. అక్కడి సముద్రం మధ్యలో ఉన్న వివేకానంద రాక్, తిరువళ్లువర్ విగ్రహం, గాంధీ మండపాన్ని ఆమె సందర్శించనున్నారు. ఆమె పర్యటన నేపథ్యంలో కన్యాకుమారిలో భద్రతను కట్టుదిట్టం చేశారు. గురువారం హెలికాప్టర్ ట్రైల్‌రన్, రాష్ట్రపతి పర్యటించే ప్రాంతాల్లో కాన్వాయ్ ట్రైల్ రన్ జరిగింది.

### మాతృభాషలో పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకోండి

విద్యా మంత్రితో తెలుగు సంఘాల భేటీ



మంత్రి అన్బిల్ మహేష్‌తో సీఎంకే రెడ్డి తదితరులు

కొరుక్కుపేట: రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళిని లింగ్విస్టిక్ మైనారిటీస్ ఫోరమ్ ఆఫ్ తమిళనాడు (లింఫాట్) చైర్మన్ డాక్టర్ సీఎంకే రెడ్డి నేతృత్వంలో తెలుగు సంఘాలు, మైనారిటీ సంఘాల ప్రతినిధులు గురువారం సచివాలయంలో కలిశారు. 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మాతృభాషలో పరీక్షలు రాసుకునేందుకు వెసులుబాటుకల్పిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నకలును మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా మైనారిటీ భాషలను రాష్ట్రంలో పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగు, ఉర్దూ, మలయాళం, కన్నడ, రాజస్థాని భాషలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

### ఆస్పత్రిలో చేరిన ఈవీకేఎస్



సాక్షి, చెన్నై: ఈరోడ్ తూర్పు నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ఎన్నికైన ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ ఆసుపత్రి పాలయ్యారు. ఛాతి నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ని ఆసుపత్రికి తరలించారు. ఈరోడ్ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్న తిరుమగన్ ఈవేరా గుండెపోటుతో ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ఈ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలలో ఆయన తండ్రి , కాంగ్రెస్ సీనియర్ నేత ఈవీకేఎస్ ఇళంగోవన్ పోటీ చేసి 66 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. రెండు రోజుల క్రితం అసెంబ్లీలోని స్పీకర్ అప్పావు ఛాంబర్‌లో ఎమ్మెల్యేగా ఆయన ప్రమాణ స్వీకారం కూడా చేశారు. ఈ పరిస్థితులలో బుధవారం రాత్రి ఆయనకు ఛాతి నొప్పి రావడంతో కుటుంబీకులు పోరూర్‌లో శ్రీరామ చంద్ర ఆసుపత్రికి తరలించారు.అ క్కడి ఆయనకు వైద్యులు చికిత్స అందించారు. వైద్య పరీక్షలు చేశారు. గురువారం ఉదయం ఆరోగ్య మంత్రి ఎం. సుబ్రమణియన్‌తో పాటు పలువురు ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు. వైద్యుల పర్యవేక్షణలో చికిత్సలోనే ఈవీకేఎస్ ఇలంగోవన్ ఉన్నారు. అయితే, ఐసీయూ నుంచి ప్రత్యేక వార్డుకు ఆయన్ని మార్చారు. ఆయన ఆరోగ్యం మెరుగు పడుతోందని, ఒకటి రెండు రోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశాలు ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి.

# శోభాయమానం

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి పట్టపురాణి పద్మావతి అమ్మవారికి చెన్నైలో అద్వితీయమైన ఆలయం రూపుదిద్దుకుంది. తిరుచానూరు అలమేలు మంగాపురంలోని అమ్మవారి ఆలయాన్ని తలపించే విధంగా నిర్మాణాలు చేపట్టడం విశేషం. ఈ మేరకు గురువారం శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. శుక్రవారం ఉదయం ప్రాణ ప్రతిష్ట, మహాకుంభాభిషేకం కనుల పండువగా సాగనుంది. ఇందుకోసం టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది.

- అద్వితీయంగా పద్మావతి అమ్మవారి ఆలయం
- పూర్తయిన నిర్మాణ పనులు
- శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహప్రతిష్ట
- హాజరైన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- నేడు ప్రాణప్రతిష్ట, మహాకుంభాభిషేకం
- పూర్తయిన ఏర్పాట్లు



పద్మావతి అమ్మవారి ఆలయం



అమ్మవారి విగ్రహానికి విశేష పూజలు చేస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి దంపతులు

సాక్షి, చెన్నై: నగరంలోని టీ నగర్ వెంకటనారాయణ రోడ్డులో ఇప్పటికే తిరుమల శ్రీవారికి అత్యద్భుతమైన ఆలయం ఉంది. తాజాగా తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు టీ.నగర్‌లోని జీఎన్ చెట్టి రోడ్డులో శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ నిర్మాణం చేపట్టారు. సకాలంలో పనులు పూర్తిచేసి ఉత్తరాయణం తర్వాత మహాసంప్రోక్షణ నిర్వహించేందుకు టీటీడీ అధికారులు చర్యలు తీసుకున్నారు. అనుకున్న సమయం కంటే ముందుగానే ఆలయ పనులు ముగించారు. తిరుచానూరు(అలమేలు మంగాపురం)లోని పద్మావతి అమ్మవారి ఆలయాన్ని తలపించే విధంగా ఈ ఆలయం అద్వితీయంగా రూపుదిద్దుకుంది. ఈనెల 12వ తేదీ నుంచి ఆలయ కుంభాభిషేకానికి సంబంధించిన హోమ పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అత్యంత వేడుకగా సాగింది. ఉదయం చతుష్టానార్చన, మూర్తిహోమం, ప్రాయశ్చిత్తం, పూర్ణాహుతి, ధ్వజస్తంభ ఛాయ జలాధివాసం, బింబ నయనోన్మీలనం నిర్వహించారు. సాయంత్రం శయనాధివాసం చేపట్టారు. టీటీడీ పాంచరాత్ర ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు సాగాయి.

**త్వరలో చెన్నై శ్రీవారి ఆలయం పునర్నిర్మాణం**

చెన్నై టీ నగర్‌లోని శ్రీవారి ఆలయాన్ని త్వరలో పునర్నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామని టీటీడీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి వెల్లడించారు. చెన్నై టీ.నగర్‌లోని జీఎన్ చెట్టి రోడ్డులో టీటీడీ నూతనంగా నిర్మించిన శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో గురువారం జరిగిన విగ్రహప్రతిష్ట కార్యక్రమానికి చైర్మన్ దంపతులు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ఉదయం 9 నుంచి 9.45 గంటల మధ్య అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వేడకగా చెప్పారు. ప్రఖ్యాత సినీ నటి కాంచనతోపాటు వారి కుటుంబ సభ్యులు రూ.40 కోట్లకు పైగా విలువైన ఈ స్థలాన్ని టీటీడీకి విరాళంగా అందించారని తెలిపారు. దాతలతోపాటు చెన్నై భక్తుల విజ్ఞప్తి మేరకు ఈ స్థలంలో పద్మావతి అమ్మవారి ఆలయం నిర్మించినట్లు తెలిపారు. టీటీడీ రూ.10 కోట్లతో ఈ ఆలయ నిర్మాణం చేపట్టిందని, దీంతోపాటు చెన్నై స్థానిక సలహా మండలి అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, సభ్యులు స్మిత ఇతర సభ్యుల ఆధ్వర్యంలో రూ.5 కోట్లతో గాలిగోపురం, కలశాలు ఏర్పాటు చేశారని వివరించారు.



ప్రత్యేక పూజల్లో టీటీడీ చైర్మన్





### నేడు కుంభాభిషేకం..

ఆలయంలో శుక్రవారం ఉదయం విశాఖ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానంద సరస్వతి స్వామివారి సమక్షంలో ప్రాణప్రతిష్ట, మహాకుంభాభిషేకం నిర్వహిస్తామని టీటీడీ చైర్మన్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం ప్రారంభమవుతుందని చెప్పారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం తరహాలోనే ఇక్కడ నిత్య కైంకర్యాలు, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, చెన్నై స్థానిక సలహా మండలి అధ్యక్షులు శేఖర్ రెడ్డి, డెప్యూటీ ఈవో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యానర్లు, ఫ్లెక్సీలు వద్దే వద్దు

- కేడర్‌కు డీఎంకే ఆదేశాలు
- ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్ఎస్ భారతి హెచ్చరిక

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో మళ్లీ బ్యానర్లు, ఫ్లెక్సీల ఏర్పాటు సంస్కృతి విశ్వరూపం దాల్చింది. ప్రధానంగా డీఎంకే కార్యక్రమాల్లో ఈ హంగామా మరింతగా పెరుగుతోంది. దీనిపై క్షేత్రస్థాయిలో విమర్శలు రావడంతో డీఎంకే అధిష్టానం మేల్కొంది. బ్యానర్లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని కేడర్‌కు గురువారం హెచ్చరికలు జారీ చేసింది. వివరాలు.. రాష్ట్రంలో ఫ్లెక్సీ, బ్యానర్, హోర్డింగ్‌ల ఏర్పాటు హోదాకు చిహ్నంగా భావించే వారు ఎక్కువే. రాజకీయ పక్షాలే కాదు, సంఘాలు, సంస్థలు, ఏ చిన్న వేడుకైనా సరే హంగమా చేయాల్సిందే. వీటికి అడ్డుకట్ట వేసే విధంగా ఇప్పటికే మద్రాసు హైకోర్టు పలుమార్లు ఉత్తర్వులు, ఆదేశాలు జారీ చేసినా ఫలితం శూన్యం. ఫ్లెక్సీ, బ్యానర్లు, హోర్డింగ్‌ల ఏర్పాటుకు అనుమతులు తప్పని సరి అని ప్రకటించినా ఖాతరు చేసే వారే లేరు. చివరకు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో ఓ కమిటీ రంగంలోకి దిగడంతో ప్రైవేటు ఫ్లెక్సీ, హోర్డింగ్, బ్యానర్ల వ్యవహారంలో నిబంధనలు అమల్లోకి వచ్చాయి. అయితే, రాజకీయ పక్షాలు మాత్రం ఈ ఆదేశాలను పట్టించుకోవడం లేదు. నాలుగేళ్ల క్రితం ఈ ఫ్లెక్సీ, బ్యానర్ల కారణంగా చెన్నైలో ఓ యువతి, కోయంబత్తూరులో ఓ యువకుడి ప్రాణాలు కోల్పోయారు. ఈ వ్యవహారంపై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో రాజకీయ పార్టీలు ముందుకు వచ్చాయి. తామంటే తాము ఇక, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయమని ప్రకటించాయి. కొంత కాలంగా వీటి వాడకం తగ్గడంతో డిజిటల్ బ్యానర్లు ఉత్పత్తి రంగంలో ఉన్న వారిలో ఆందోళన నెలకొంది. తమ బతుకు ఇక ప్రశ్నార్థకం అవుతుందని పలువురు వాపోయారు.



డీఎంకే ఫ్లెక్సీ (ఫైల్)

**మళ్లీ మొదటికి..**

డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినానంతరం ఇటీవల కాలంగా మళ్లీ రాష్ట్రంలో బ్యానర్లు, ఫ్లెక్సీల సంస్కృతి విశ్వరూపం దాల్చింది. సీఎం, మంత్రుల కార్యక్రమాలలో వారి మెప్పు పొందే విధంగా నేతలు హంగామా సృష్టిస్తున్నారు. దారి పాడవున బ్యానర్లు, ఫ్లెక్సీలను హోరెత్తిస్తున్నారు. తామేమి తక్కువ తిన్నామా..? అన్నట్లుగా అన్నాడీఎంకే శిబిరాలు , పీఎంకే, కాంగ్రెస్ తదితర పార్టీల కార్యక్రమాలలో ఆహ్వానాలు పలికే విధంగా ఏర్పాట్లను నాయకులు హోరెత్తిస్తున్నారు. డీఎంకే వర్గాలు అయితే, చిన్న పాటి కార్యక్రమాలకు సైతం హంగమా సృష్టిస్తున్నారు. ఇది ప్రజల్లో విమర్శలకు దారి తీస్తున్నాయి. దీనిపై డీఎంకే అధిష్టానానికి ఫిర్యాదులు పెరిగాయి.

**ఎట్టి పరిస్థితుల్లో అనుమతించం..**

సీఎం స్టాలిన్ ఆదేశాలతో డీఎంకే నిర్వాహక కార్యదర్శి ఆర్ఎస్ భారతి గురువారం ఓ ప్రకటన జారీ చేశారు. పార్టీ కార్యక్రమాలు, మంత్రులు, సీఎం వంటి వారికి ఆహ్వానం పలికే విధంగా ఇకపై బ్యానర్లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడానికి వీలు లేదని ప్రకటించారు. రోడ్లు, దారి పాడవున వీటిని ఏర్పాటు చేయడం వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. ఈ దృష్ట్యా, బ్యానర్లు, ఫ్లెక్సీల సంస్కృతికి స్వస్తి పలుకుతున్నామని ప్రకటించారు. ఇకపై ఎవరైనా పార్టీ ఆదేశాలను ఉల్లంఘించి ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడే రీతిలో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేసిన పక్షంలో పార్టీ పరంగా చర్యలు తప్పదన్న హెచ్చరికలు జారీ అయ్యాయి.

## పెన్నగరంలో బాణసంచా పేలుడు

- ఇద్దరు మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు

సాక్షి, చెన్నై: ధర్మపురి జిల్లా పెన్నగరం సమీపంలోని పాపర పట్టి సర్కిల్ నాగదాస పట్టిగ్రామంలో గురువారం ఉదయం బాణసంచా పేలుడు జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. నాగ దాస పట్టిలో శరవణన్ అనే వ్యక్తి బాణ సంచాతో పాటు గోడౌన్‌ను నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం ఇక్కడి 10 మంది విధులకు వెళ్లారు. టపాకాయలు నిల్వ ఉంచే గోడౌన్‌లో భారీ శబ్దంతో పేలుడు చోటు చేసుకుంది. గొడౌన్‌కు వెలుపల ఉన్న వారంతా భయంతో బయటకు పరుగులు తీశారు. గోడౌన్‌లో ఉన్న వారు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఆ భవనం నేల మట్టమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసి సహాయక చర్యలు ముమ్మరం చేశాయి. భారీ శబ్దం విన్న పరిసర ప్రాంతవాసులు పెద్దఎత్తున అక్కడికి తరలి రావడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనలో ఘటనా స్థలంలోనే మునియమ్మాల్(65), పళనియమ్మాల్ (52) మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం పెన్నగరం ఆసుపత్రికి తరలించారు. వీరిని శివశక్తి, పొన్నుమలైగా గుర్తించారు. ఈ ప్రమాద సమాచారంపై సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తలా రూ. 3 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించారు. గాయపడ్డ వారికి అత్యవసర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, రూ. లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.



పేలుడు కారణంగా కుప్పకూలిన బాణసంచా కర్మాగారం

# కారణజన్ముడు.. అమరజీవి

**తెలుగు జాతికి వెలుగు చూపే దివిటీ అమరజీవి పొట్టిశ్రీరాములు అని పలువురు ప్రముఖులు కొనియాడారు. గురువారం ఆయన జయంతి సందర్భంగా చెన్నైలో పెద్ద ఎత్తున సభలను నిర్వహించి ఘన నివాళులర్పించారు. అమరజీవి జయంతిని రాష్ట్ర పండుగగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించడాన్ని ప్రతి ఒక్కరూ అభినందించాలని పిలుపునిచ్చారు. ఏపీ సీఎం వైఎస్. జగన్ మోహన్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.**

- ఘనంగా పొట్టిశ్రీరాములు 122వ జయంతి
- మద్రాసు వర్సిటీలో జాతీయ సదస్సు
- ఏపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన వక్తలు
- స్మారక భవనంలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులు

సాక్షి చెన్నై : తెలుగు ప్రజల ఉనికికి.. ఉన్నతికి.. ప్రగతికి బాటలు వేయడంలో అమర జీవి పొట్టి శ్రీరాములు ఎన్నో త్యాగాలు చేశారు. చివరికి ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ఆమరణ దీక్షతో అశువులు బాశారు. ఆ మహనీయుడి త్యాగాన్ని స్మరిస్తూ గురువారం చెన్నైలో 122వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

**అమరజీవి స్మారక భవనంలో**

చెన్నైలోని మైలాపూర్‌లోని స్మారక భవనంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి తెలుగు సంఘాల నాయకులు, తెలుగు ప్రముఖులు, భాషాభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పుష్పాంజలి ఘటించారు. స్మారక భవన నిర్వాహక కమిటీ తరపున వి.కృష్ణారావు, డాక్టర్ ఏవీ శివకుమారి, ఎంవీ నారాయణ గుప్తా నివాళులర్పించారు. అలాగే అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) తరపున సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ సీఎంకే రెడ్డి తదితరులు అమరజీవికి అంజలి ఘటించి ఆయన గొప్పతనాన్ని తెలియజేశారు.

**సదరన్ ఇండియా వైశ్య సంఘంలో :**

చెన్నై జార్జిటౌన్‌లో 118 సంవత్సరాల చరిత్ర కలిగిన సదరన్ ఇండియా వైశ్య సంఘంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. అమరజీవి చిత్ర పటానికి సంఘం అధ్యక్షులు అజంతా డాక్టర్ కె . శంకర రావు పుష్పాంజలి ఘటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. వైశ్యుల జాతిరత్నంగా శ్రీరాములు మద్రాసు నగరంలోని జార్జి టౌన్ లో జన్మించి ప్రాథమిక విద్యాభ్యాసం కూడా ఇక్కడే పూర్తి చేశారని గుర్తు చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పడటానికి ఆద్యుడు అమరజీవి అని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ సంయుక్త కార్యదర్శులు ఎం .నరసింహులు, పి.ఆశోక్ కుమార్, కోశాధికారి పి. రమేష్, ఉపాధ్యక్షులు కాశీ విశ్వనాథన్, పి. బద్రీనారాయణ, వివాహ సంస్థ సెక్రెటరీ టీజీ పార్థసారథి పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో నివాళులర్పిస్తున్న తెలుగు ప్రముఖులు



సదరన్ ఇండియా వైశ్య సంఘంలో అమరజీవికి పుష్పాంజలి



మద్రాసు విశ్వవిద్యాలయం సదస్సులో..

**మద్రాసు వర్సిటీలో సదస్సు..**

మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ, అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో అమరజీవి..మూర్తిమత్వం అనే అంశం పై జాతీయ సదస్సును నిర్వహించారు. ఆ శాఖ అధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ అధ్యక్షులు కె. అనిల్ కుమార్ రెడ్డి, ద్రవిడ దేశం అధ్యక్షులు వి. కృష్ణారావు, తెలుగు మహాజన సమాజం కోశాధికారి కె. రంగారెడ్డి అతిథులుగా హాజరయ్యారు. అమరజీవి త్యాగం మరువలేమని ఆయన జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకం అని వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తణుకు ప్రాంతానికి చెందిన అమరజీవి జీవిత పరిశోధకులు వాడ్రేవు సుందర్రావు ఈ సదస్సులో కీలకోపన్యాసం చేశారు. అమరజీవి జీవిత విశేషాలను తెలియజేశారు. విస్తాలి శంకరరావు మాట్లాడుతూ, . ఎక్కడా నిర్వహించని రీతిలో మద్రాసు విశ్వవిద్యాలయంలో అమరజీవి పేరుతో జాతీయ సదస్సు ఈ సారి ఏర్పాటు చేశామని వివరించారు. ఇది ఒక విలక్షణమైన కార్యక్రమంగా పేర్కొన్నారు. ఈ సదస్సుకు అమరజీవి గురించి పుస్తకాలను సకాలంలో అందించిన మొట్ట మొదటి వ్యక్తి వై. రామకృష్ణ అని గుర్తు చేస్తూ, ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. అమరజీవి జయంతిని రాష్ట్ర పండుగగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించడాన్ని ప్రతి ఒక్కరూ అభినందించాలని పేర్కొంటూ, సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ సదస్సులో పలువురు అమర జీవిపై పరిశోధనా పత్రాలు సమర్పించారు. ముగింపు సమావేశంలో అమర జీవి పొట్టి శ్రీరాములు భవన నిర్వాహక కమిటీ సభ్యులు భువనచంద్ర, డాక్టర్ ఎంవీ నారాయణ గుప్తా, జేఎం నాయుడు, డాక్టర్ ఏవీ శివకుమారి, గుడిమెట్ల చెన్నయ్య, ఊరా శశికళ, ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ, తెలుగు ప్రముఖులు ఉమామహేశ్వర రెడ్డి, జనని అధ్యక్షురాలు నిర్మలా పళని వేలు, మాస్ అజరత్తయ్య, ఎల్‌బీ శంకర రావు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రుణం ఎగవేత కేసులో ఇద్దరి అరెస్టు

అన్నానగర్: కోయంబత్తూరు సమీపంలో విదేశాల్లో హోటల్ ప్రారంభిస్తామంటూ రూ.36 లక్షలు మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కోయంబత్తూరు బీలమేడు, అవరంపాళయం రోడ్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో పళనిస్వామి కుమారుడు సతీష్ కుమార్ (33) నివశిస్తున్నారు. విదేశాల్లో కోయంబత్తూరులో అన్నపూర్ణ హోటల్ బ్రాంచ్ లను ప్రారంభించబోతున్నామంటూ అదే ప్రాంతానికి చెందిన చిత్ర శ్రీరామసామి, కరుణేశ్వరన్ అతడికి చెప్పారు. ఇందుకు రూ.36 లక్షలు అప్పుగా ఇవ్వాలని, ఏడాదిలోగా డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పారు. దీంతో సతీష్ కుమార్ తన బ్యాంకు ఖాతాలో రూ.36 లక్షలు వారికి పంపించాడు. అయితే ఏడాది గడిచినా డబ్బు కూడా తిరిగి ఇవ్వలేదు. దీనిపై సతీష్ కుమార్ బీలమేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులైన చిత్ర, శ్రీరామస్వామి, కరుణేశ్వరన్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రూ.1.5 కోట్ల విలువైన పంచలోహ విగ్రహం స్వాధీనం


పంచలోహ విగ్రహం, నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

వేలూరు: వేలూరు సమీపంలోని అరియూర్ పంచాయతీ పరిధిలోని ఆవారంపాళ్యం వద్ద బుధవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా బైక్‌పై వచ్చిన వారిని నిలిపి ప్రశ్నించారు. వారి వద్ద ఉన్న గోనె సంచిను పరిశీలించగా అందులో కరువేపాకు మధ్యలో పంచలోహ అమ్మన్ విగ్రహం ఉన్నట్లు గుర్తించారు. నిందితులు తిరువణ్ణామలై జిల్లా పుదు వానికులం వీధికి చెందిన కణ్ణన్, సోమాజిగూడ పుదుమాదా వీధి నగర్‌కు చెందిన విన్సెంట్ రాజ్‌గా తేలింది. వీరిద్దరూ ఎలక్ట్రికల్ పనిచేస్తున్న సమయంలో గుంత తవ్వుతుండగా ఈ విగ్రహం లభ్యమైనట్లు వీటిని విక్రయించేందుకు తీసుకెళ్తుండగా పోలీసులకు చిక్కినట్లు తేలింది. ఈ విగ్రహం విలువ సుమారు రూ. 1.5 కోట్లు ఉండవచ్చునని పోలీసులు తెలిపారు.

# రాణిపేట, తిరువణ్ణామలైలో ఏసీబీ దాడులు


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

వేలూరు: వేలూరు, రాణిపేట, తిరువణ్ణామలై జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్, బీడీఓ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. వివరాలు.. రాణిపేట జిల్లా అరక్కోణంలోని గాంధీనగర్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉంది. ఇక్కడ బుధవారం సాయంత్రం ఉన్న ఫలంగా ఎనిమిది మందితో కూడిన ఏసీబీ అధికారులు దాడులు జరిపి కార్యాలయంలోని పలు చోట్ల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కార్యాలయంలో లెక్కలో లేని రూ. 2.34 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా తిరువణ్ణామలైలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ ఏజెంట్‌ల వద్ద నున్న రూ. 8.50 లక్షల నగదును సీజ్ చేశారు. ఇక సెయ్యారులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.2.50 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా వేలూరు కలెక్టరేట్‌లోని గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలోను తనిఖీలు చేపట్టగా రూ1.25 లక్షల నగదు లెక్కలో లేనట్లు గుర్తించారు. ఈ నగదును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు నిందితులపై శాఖా పర మైన చర్యలకు సిఫార్సు చేశారు. ఇదిలా ఉండగా ఒకేసారి నాలుగు చోట్ల ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు చేపట్టడంతో మిగిలిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గుబులు పుట్టించింది.

# వేలూరు కోర్టు నుంచి ఖైదీ పరారీ

– సినీ ఫక్కీలో వెంటబడి పట్టుకున్న పోలీసులు


రామ్‌కుమార్


సర్వీస్ రోడ్డులో నిందితుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

వేలూరు: వేలూరు అరుగందపూడి గ్రామానికి చెందిన రెడ్ అలియాస్ రామ్‌కుమార్ (23) తన స్నేహితుడి హత్య చేసి పాలారులో పాతి పెట్టిన కేసులో 2018 నుంచి పరారీలో ఉన్నాడు. ఇదిలా ఉండగా వేలూరు కాగిదపట్టరైకి చెందిన రంజిత్‌కుమార్, స్నేహితుడు ఏయుమలై ఇద్దరిపై ఈనెల 6న కత్తితో దాడి చేసిన కేసులో రామ్‌కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరు పరిచేందుకు గురువారం పోలీసులు వ్యాన్‌లో రామ్‌కుమార్‌ను తీసుకొచ్చారు. అయితే వ్యాన్ నుంచి రామ్‌కుమార్ ఉన్నఫలంగా కిందకు దిగి పరుగులు తీశాడు. పోలీసులు సినీ ఫక్కీలో వెంబడించారు. ఈ క్రమంలో నిందితుడు చెన్నై–బెంగుళూరు జాతీయ రహదారిని దాటి సర్వీస్ రోడ్డులోకి వెళ్లేందుకు 10 అడుగుల ఎత్తు నుంచి సర్వీస్ రోడ్డుపైకి దూకాడు. ఆ సమయంలో రామ్‌కుమార్ కాలు విరగడంతో పోలీసులు అతన్ని పట్టుకున్నారు. ప్రథమ చికిత్స చేసి కోర్టులో హాజరు పరిచారు.

## 21 కిలోల గంజాయి సీజ్

– ముగ్గురి అరెస్టు

అన్నానగర్: ఆంధ్రప్రదేశ్ నుంచి చెన్నైకి లగ్జరీ కారులో 21 కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురుని గురువారం వేకువజామున పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. చెన్నైలోని కాశిమేడు ప్రాంతంలో విక్రయించేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి కారులో గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్నట్లు స్పెషల్ పార్టీ పోలీసులకు బుధవారం అర్ధరాత్రి సమాచారం అందింది. దీంతో సబ్ ఇన్‌స్పెక్టర్ సెల్వకుమార్ ఆధ్వర్యంలో తిరువొత్తియూర్ టోల్‌గేట్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో పోలీసులు అనుమానాస్పదంగా వెళ్తున్న ఓ కారును ఆపి తనిఖీలు చేశారు. అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి చెన్నైకి గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు తేలింది. గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఈశ్వరప్రసాద్ (38), వెంకటపతి (30), శివకుమార్ (42)ను అరెస్టు చేశారు. వారి నుంచి 21 కిలోల గంజాయి, లగ్జరీ కారును స్వాధీనం చేసుకున్నారు. కాశిమేడు షిప్పింగ్ హార్బర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ చిదంబర భారతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మదురైలో కోట్స్ హబ్

సాక్షి, చెన్నై: ఆధ్యాత్మిక నగరం మదురై వేదికగా కోట్స్ సస్టైనబిలిటీ హబ్‌ను ఏర్పాటు చేశారు. వస్త్ర, పాదరక్షల ఉత్పత్తి రంగాలకు దోహద పడే విధంగా ఇక్కడ థ్రెడ్, స్ట్రక్చరల్ కాంపోనెంట్స్ తయారీ కోసం స్పిన్నింగ్, ట్విస్టింగ్ పైలట్ ప్లాంట్‌లను తొలి విడతగా ఏర్పాటు చేశారు. ఈ హబ్ గురించి కోట్స్ ఎగ్జిక్యూటివ్ రాజీవ్ శర్మ మీడియాకు వివరించారు. 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో తొలి ప్రయత్నంగా ఏర్పాటు చేసిన ఈ హబ్‌లో బహుళ ఫైబర్, మిశ్రమాలు, అరామిడ్ , ఫైబర్ ప్రాసెస్‌లకు ఉపయోగపడే అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించామని వివరించారు. కోట్స్‌లో స్పిన్నింగ్, ట్విస్టింగ్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అత్యాధునిక తయారీ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. రానున్న 5 ఏళ్ల కాలంలో 10 మిలియన్ యూఎస్ డాలర్ల పెట్టుబడే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. 2026లో సరికొత్త లక్ష్యాలను ప్రకటించనున్నామని 2030 నాటికి సుస్థిర స్థానాన్ని, భవిష్యత్ కార్యాచరణను వెల్లడిస్తామన్నారు.

## 38 సవర్ల బంగారు నగల చోరీ

అన్నానగర్ : మధురై ఈఎస్‌ఐ మహిళా ఆసుపత్రి ఉద్యోగిని ఇంట్లో బుధవారం రాత్రి 38 సవర్ల నగలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన పై పోలీసులు విచారణ చేపట్టారు. వివరాలు.. మదురై మహబూ పాలయం ట్రావెల్స్ బంగ్లా రోడ్డులో ఈఎస్‌ఐ హాస్పిటల్, స్టాఫ్ క్వార్టర్స్ ఉన్నాయి. ఇక్కడ ఈఎస్‌ఐ ఆసుపత్రి ఉద్యోగి చక్కమాల్ (60) ఒంటరిగా నివసిస్తున్నారు. బుధవారం డ్యూటీకి వెళ్లి సాయంత్రం ఆమె ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఇంట్లోని దుస్తులు, బట్టలు చెల్లాచెదురుగా పడి ఉండడంతో మొత్తం వెతికి చూసింది. 38 సవర్ల నగలు చోరీకి గురైనట్లు గుర్తించి ఎస్ఎస్ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ రాజదురై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గాంధీ విగ్రహం తరలింపునకు సన్నాహాలు

కొరుక్కుపేట: మెట్రో రైలు పనుల కారణంగా మెరీనా బీచ్‌లో ఉన్న గాంధీ విగ్రహాన్ని మరో 10 రోజుల్లో తరలించనున్నారు. చెన్నైలో మెట్రో రైలు సేవలకు ప్రజలలో మంచి ఆదరణ లభిస్తోంది. ఈనేపథ్యంలో మెట్రో రైలు సేవలను మరింతగా విస్తరిస్తున్నారు. తాజాగా మెట్రో 2వ దశ పనులు ప్రారంభమయ్యాయి. 118.9 కి.మీ మేర ఈ పనులు సాగుతుండగా.. ఇవి 2026 నాటికి పూర్తవుతాయని అంచనా. 2వ దశలో లైట్‌హౌస్ నుంచి పూందమల్లి వరకు ఓ మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నారు. లైట్ హౌస్ సమీపంలో రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. దీనికి సమీపంలోనే మెరీనా బీచ్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహం ఉంది. 12 అడుగుల పొడవైన కాంస్య విగ్రహాన్ని శిల్పి ప్రసాద్ రాయ్ చౌదరి రూపొందించారు. ఈ విగ్రహాన్ని 1959లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిష్టించారు. ఈ చారిత్రాత్మక విగ్రహం లైట్‌హౌస్ రైల్వే స్టేషన్ సమీపంలో ఉంది. సబ్‌వే స్టేషన్ నిర్మాణ పనుల్లో గాంధీ విగ్రహం దెబ్బతినే ప్రమాదం ఉంది. దీంతో విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగించి తాత్కాలికంగా మరో ప్రాంతానికి తరలించనున్నట్లు మెట్రోరైలు అధికారులు గురువారం వెల్లడించారు.

## ప్రభుత్వ పాఠశాల నూతన భవనాలకు భూమిపూజ


మద్దూరులో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి: తిరుత్తణి నియోజకవర్గంలో పది ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి రూ.2.80 కోట్లు వ్యయంతో నూతన భవనాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులకు గురువారం ఎమ్మెల్యే చంద్రన్ భూమిపూజ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో కనీస సదుపాయాలు కల్పించి, తరగతి గదుల ఇబ్బందులు లేకుండా నూతన భవనాలు నిర్మాణానికి వీలుగా విద్యాశాఖ ప్రత్యేక నిధులు విడుదల చేసింది. ఈ పథకం ద్వారా నియోజకవర్గంలోని మురుక్కంపట్టు, మద్దూరు, గొల్లాలకుప్పం, సామంతవాడ, వీరమంగళం, ఆర్కేపేట, చిన్ననాగపూండి పాఠశాలల్లోని నూతన భవనాల నిర్మాణం కోసం భూమిపూజ చేసి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు, మహేష్‌బాబు, యూనియన్ ఇంజినీరు జ్ఞానశేఖర్, యూనియన్ కార్యదర్శులు కృష్ణన్, ఆర్తిరవి, జిల్లా కోశాధికారి మిథున్‌చక్రవర్తి సహా స్థానిక సంస్థల ప్రతినిధులు, డీఎంకే కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాగునీరు, పారిశుధ్యానికి నిధుల కేటాయింపు


సమావేశంలో మాట్లాడుతున్న తిరువలంగాడు యూనియన్ చైర్‌పర్సన్ జీవ

తిరుత్తణి: తిరువలంగాడు యూనియన్‌లోని గ్రామాల్లో తాగునీరు. పరిశుభ్రతకు ప్రాధాన్యత కల్పించి నిధులు కేటాయించాలని తీర్మానించారు. తిరువలంగాడు యూనియన్ చైర్‌పర్సన్ జీవ అధ్యక్షతన యూనియన్ సమితి సమావేశం నిర్వహించారు. బీడీఓలు సెల్వకుమార్, కలైసెల్వి తదితరుల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో వైస్‌చైర్మన్ సుజాతతో పాటు 16 మంది కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్‌లోని 42 గ్రామ పంచాయతీల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తాగునీరు సరపరా చేయడం, విష జ్వరాలు విస్తరిస్తున్న క్రమంలో గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు జనరల్ ఫండ్ నుంచి నిధులు కేటాయించాలని తీర్మానించారు.

## కోలీవుడ్ టాక్స్


లారెన్స్‌తో కంగనా రనౌత్

# వెళుతున్నా.. వెళుతున్నా!

తమిళ సినిమా: వెళుతున్నా వెళుతున్నా.. వెళ్లాలని లేకున్నా వెళుతున్నా.. అంటూ చంద్రముఖి–2 చిత్రం సెట్‌ను కంగనా రనౌత్ వీడింది. వివరాలు.. ఈమె తాజాగా నటిస్తున్న తమిళ చిత్రం చంద్రముఖి 2. సుమారు 17 ఏళ్ల క్రితం పి.వాసు దర్శకత్వంలో రజనీకాంత్, నయనతార, జ్యోతిక, ప్రభు ప్రధాన పాత్రలు పోషించిన చంద్రముఖి చిత్రానికి సీక్వెల్ ఇది. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు పి.వాసునే దర్శకత్వం వహిస్తున్నారు. రజనీకాంత్ పాత్రలో రాఘవా లారెన్స్ నటిస్తుండగా జ్యోతిక పాత్రలో నటి కంగనా రనౌత్ నటిస్తున్నారు. అయితే నయనతార పాత్రను ఎవరు చేస్తున్నారు అన్నది యూనిట్ వర్గాలు ఇంకా రివీల్ చేరలేదు. కాగా చంద్రముఖి– 2 చిత్రం షూటింగ్ ఇప్పటికే హైదరాబాద్ , చెన్నై ప్రాంతాల్లో కొంత భాగాన్ని పూర్తి చేసుకుంది. తాజా షెడ్యూల్‌ను ముంబాయ్‌లో జరుపుకుని బుధవారంతో పూర్తి చేసుకుంది. అంతే కాదు ఈ షెడ్యూల్‌తో నటి కంగనా రనౌత్‌కు సంబంధించిన షూటింగ్ పార్ట్ పూర్తి అయ్యింది. దీంతో ఆమె చంద్రముఖి– 2 చిత్ర యూనిట్‌కు గుడ్ బై చెప్పింది. చిత్ర యూనిట్ భారీ కేక్‌పై మిస్ యూ కంగనా రనౌత్ అని రాసి.. ఆమెతో కట్ చేయించి వీడ్కోలు పలికారు. దీంతో చాలా ఎమోషనల్‌గా ఫీలైన కంగనా అద్భుతమైన మనుషుల మధ్య నుంచి వెళ్లడానికి కష్టంగా ఉంది. అయిష్టంగానే వెళ్లలేక వెళుతున్నా అని ట్విట్టర్లో పేర్కొన్నారు. అదే విధంగా లారెన్స్‌పై పొగడ్తల జల్లు కురిపిస్తూ మరో ట్వీట్ చేసింది. లారెన్స్‌పై ప్రత్యేక అభిప్రాయం ఏర్పడిందనీ, ఓ నృత్య కళాకారుడిగా ఈ రంగంలో ప్రవేశించి ఇప్పుడు సక్సెస్‌ఫుల్ నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా రాణిస్తున్నారన్నారు. అంతకు మించి మానవత్వం, కరుణ, దయ కలిగిన వ్యక్తి అని పేర్కొన్నారు. సెట్‌లో తాను లారెన్స్‌తో ఎప్పుడూ ఫొటో తీయించుకోలేదని, దీనికి ప్రధాన కారణం పాత్రలకు సంబంధించిన గెటప్పులో ఉండటమేనన్నారు. కాగా షూటింగ్ పూర్తి అయిన తరువాత లారెన్స్‌తో తీసుకున్న ఫోటోను ఈ సందర్భంగా ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## ప్రియా భవానీకి లక్కీచాన్స్



తమిళ సినిమా: నటి ప్రియా భవానీ శంకర్ లక్ మామూలుగా లేదు. ఈ అమ్మడి ఖాతాలో పలు హిట్ చిత్రాలు ఉన్నా ఇప్పటివరకు ఓ రేంజ్ హీరోలతోనే జతకడుతూ వస్తోంది. అలాంటిది ఏకంగా దళపతి విజయ్‌తో నటించే అవకాశం ప్రస్తుతం తలుపు తట్టినట్లు తెలుస్తోంది. లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో విజయ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం లియో. ఇది కాశ్మీర్లో ముమ్మరంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ చిత్రంలో ఇప్పటికే నటి త్రిష, ప్రియా ఆనంద్ హీరోయిన్‌లుగా నటిస్తున్న విషయం తెలిసిందే. అదే విధంగా బాలీవుడ్ స్టార్ నటుడు సంజయ్ దత్, దర్శకుడు మిష్కిన్, గౌతమ్ మీనన్, మన్సూర్ అలీ ఖాన్ వంటి పలువురు ప్రముఖ నటీనటులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఇందులో ఒక కీలక పాత్ర కోసం నటి ప్రియా భవానీ శంకర్‌ను నటింప చేయడానికి చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. కాగా విజయ్ వంటి స్టార్ చిత్రంలో నటించే అవకాశం వస్తే ఏ నటి మాత్రం వదులుకుంటుంది. వెంటనే ఓకే చెప్పినట్లు సమాచారం. అదే విధంగా నటి ప్రియా భవానీ శంకర్ ఇప్పటికే కాశ్మీర్‌లో ఉన్నట్లు ఫొటోలు సామాజి మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. అయితే లియో చిత్ర యూనిట్ మాత్రం ఈ విషయాన్ని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. మొత్తం మీద లియో చిత్రం రోజుకో ప్రత్యేక అంశంతో వార్తల్లో ఉంటూ మంచి హైప్‌ను క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రాన్ని సెవెన్ స్క్రీన్ స్టూడియో పథకంపై ఎస్ఎస్ లలిత్ కుమార్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

## తాప్సీ అందుకు చేసే ఖర్చు ఎంతో తెలుసా?


నటి తాప్సీ

తమిళ సినిమా: ఆడుగళం చిత్రంతో ధనుష్‌కు జంటగా కోలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చిన ఉత్తరాది బ్యూటీ తాప్సీ. ఆ చిత్రం మంచి విజయాన్ని సాధించడంతో పాటు జాతీయ అవార్డును గెలుచుకుంది. ఆ తర్వాత కొన్ని చిత్రాలను నటించినా ఇక్కడ తాప్సీకి ఎందుకనో అనుకున్న క్రేజ్ రాలేదు. టాలీవుడ్ లోనూ ప్రముఖ స్టార్స్‌తో జతకట్టింది. గ్లామర్ విషయంలోనూ ఏమాత్రం వెనుకాడలేదు. అలాంటిది ఎప్పుడైతే హిందీ చిత్రాల్లో నటించడం మొదలెట్టిందో, అప్పటి నుంచి తాప్సి రొట్టె విరిగి నేతిలో పడ్డట్టు అయ్యింది. అక్కడ నటించిన చిత్రాలు వరుసగా సక్సెస్ కావడం, అవీ హీరోయిన్ ఓరియన్‌టెడ్ కథా చిత్రాలు కావడంతో మంచి క్రేజ్‌ను సంపాదించుకుంది. అయితే ప్రస్తుతం ఆ క్రేజ్ లేదనుకోండి. అయితే ఈ అమ్మడి లైఫ్ స్టైల్ చూస్తే మాత్రం వామ్మో అనిపించక మానదు. 2008లో ఝుమ్మంది నాదం అనే తెలుగు చిత్రం ద్వారా కథానాయికగా పరిచయం అయ్యింది. ఇప్పటికి నటిగా దశాబ్దంన్నర పూర్తి చేసుకుంది. అయితే గత 15 ఏళ్లుగా తన సొగసులను కాపాడుకుంటూ వస్తోంది. అందుకు ఆరోగ్యం గురించి ఆమె తీసుకుంటున్న జాగ్రత్తలే కారణం. ఒక డైటీషియన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకుంది. అందుకు అతనికి నెలకు రూ.లక్ష జీతం చెల్లిస్తోందట. ఈ విషయాన్ని తనే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో చెప్పడం విశేషం. అతని సలహాలు, సూచనలతో అందాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నట్లు తాప్సీ చెప్పింది. అంత ఖర్చు అవసరమా అని తన తండ్రి కూడా తిడుతుంటారని నవ్వుతూ పేర్కొంది. అనారోగ్యానికి గురై, ఆస్పత్రిలకు ఖర్చు చేయడం కంటే ఇలాంటి ఖర్చే మేలని అంటోంది తాప్సీ.

## మళ్లీ మెగాఫోన్ పట్టనున్న భారతీరాజా


దర్శకుడు భారతీరాజా

తమిళ సినిమా: తమిళసినిమా ఎప్పటికీ మరచిపోలేని చిత్రాల దర్శకుడు భారతీరాజా. 16 వయదినిలే, ముదల్ మరియాదై, వేదం పందినాలు ఇలా పలు ఆణిముత్యాల్లాంటి చిత్రాలను తెరకెక్కించారు. ఈయన చివరిగా దర్శకత్వం వహించిన చిత్రం మీండుమ్ ఒరు మరియాదై. ఆ తరువాతి నటనపై దృష్టి సారించిన భారతీరాజా పలు చిత్రాల్లో ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల ధనుష్ కథానాయకుడిగా నటించిన తిరుచిత్రంఫలంలో భారతీరాజా కీ రోల్ పోషించారు. కాగా ప్రస్తుతం తంగర్ బచ్చన్ దర్శకత్వం వహిస్తున్న కరుమేఘంగళ్ కరుగిండ్రన చిత్రంలో ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. అదేవిధంగా విజయ్ సేతుపతి హీరోగా నిత్తిలన్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం, నిర్మల్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న నానా తదితర చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. అలాంటిది చాలా గ్యాప్ తరువాత మళ్లీ మెగాఫోన్ పట్టడానికి సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఇది మహిళా ఇతివృత్తంతో సాగే కథా చిత్రంగా ఉంటుందని తెలిసింది. దీనికి తాయ్‌మై అనే టైటిల్‌ను నిర్ణయించినట్లు సమాచారం. తేని నేపథ్యంలో కథ సాగుతుందని, ఇందులో భారతీరాజా కూడా ప్రధాన పాత్రలో నటించనున్నారని సమాచారం. దీన్ని నిర్మించే సంస్థ, హీరోయిన్ ఇతర నటీనటులు సాంకేతిక వర్గానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడించే అవకాశం ఉంది.

## నేడు తెరపైకి కుడిమహాన్


కుడిమహాన్ చిత్రంలో ఓ సన్నివేశం

తమిళ సినిమా: నవ నటుడు విజయ్ శివన్, నటి చాందిని తమిళరసన్ జంటగా నటించిన చిత్రం కుడిమహాన్. నటుడు నమో నారాయణన్, సురేష్ చక్రవర్తి తదితరులు ముఖ్య పాత్ర పోషించిన ఈ చిత్రాన్ని ప్రకాష్.ఎన్ దర్శకత్వం వహించారు. తనుజ్ మీనన్ సంగీతాన్ని, మెయ్యేంద్రన్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రాన్ని సీనారియో వర్క్స్ పతాకంపై ఎస్.శివకుమార్ నిర్మించారు. ఎస్.సుగంది, ఎస్.ప్రభంజ్ సహ నిర్మాతలుగా వ్యవహరించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని శుక్రవారం తెరపైకి రానుంది. కుడిమహాన్ అంటే మహా తాగుబోతు అని అర్థం. ఇది ఒక మధ్య తరగతి కుటుంబానికి చెందిన వ్యక్తికి సంబంధించిన కథా చిత్రం. భార్య, ఇద్దరు పిల్లలు, తండ్రి ఇలా జీవితం సాఫీగా గడిచిపోతుంటుంది. అలాంటివి అనుహ్యంగా ఒక సమస్య ఎదురవుతుంది. ఇందులో కథానాయకుడు తాగుబోతు కాదు. అతను మద్యం సేవించకపోయిన మత్తులో తూగిపోతూ ఉంటాడు. తను బ్యాంకు ఏటీఎంలో డబ్బులు నింపే ఉద్యోగి. అలా ఒకసారి మద్యం సేవించకుండానే మత్తులోకి వెళ్లడం వల్ల ఏటీఎంలో 100 రూపాయలు నోట్లు పెట్టాల్సింది పోయి రూ. 500 నోట్లు పెడతాడు. దీంతో బ్యాంకు ఖాతాదారులు పెద్ద మొత్తంలో డబ్బును డ్రా చేసుకుని పోతారు. దీంతో అతడి ఉద్యోగం పోతుంది. అతను ఎంత కాళ్లా.. వేళ్లా పడినా అధికారులు కనికరించారు. పోయిన డబ్బు తిరిగి ఇస్తేనే ఉద్యోగం ఇస్తానంటారు. అప్పుడు అతను ఏం చేశాడు? అసలు మద్యం సేవించకపోయిన మత్తులో తూలిపోవడానికి కారణం ఏమిటి? వంటి పలు ఆసక్తికరమైన సన్నివేశాలతో ఈ చిత్రం రూపొందినట్లు తెలుస్తోంది.

## క్లుప్తంగా

### జ్వరంతో బాలిక మృతి

**అన్నానగర్:** తూత్తుకుడిలో గురువారం జ్వరంతో బాలిక మృతిచెందింది. తమిళనాడులో కొద్ది రోజులుగా వైరల్ ఫీవర్ విస్తరిస్తోంది. దాని నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో తూత్తుకుడి రాజపాండి పట్టణానికి చెందిన మునీశ్వరన్ కుమార్తె మహాలక్ష్మి (6) దగ్గు, జ్వరం, వాంతులతో బాధపడుతోంది. ఆమెను తల్లిదండ్రులు ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. జ్వరం తగ్గకపోడంతో గత నెల 24న తూత్తుకుడి ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి బాలిక గురువారం మృతి చెందింది. దీంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. తూత్తుకుడి ప్రభుత్వాస్పత్రి డీన్ శివకుమార్ మాట్లాడుతూ గత నెల 24న బాలిక మహాలక్ష్మికి అత్యవసర విభాగంలో చికిత్స అందించినట్టు తెలిపారు. బాలికకు డెంగీ, కరోనా లక్షణాలు లేవని, మరొక సూక్ష్మక్రిమి ప్రభావంతో ఆమె శరీర అవయవాలు పనిచేయడం మానేసి మృతిచెందిందని తెలిపారు.

### బాలిక దహనం కేసులో యువకుడికి యావజ్జీవం

**తిరువొత్తియూరు:** నాగర్ కోయిల్ జిల్లాలో బాలికను దహనం చేసిన కేసులో యువకుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ నాగర్ కోయిల్ మహిళా కోర్టు తీర్పు చెప్పింది. కన్యాకుమారి జిల్లా వెళ్లి చందయ్ సమీపంలో ఉన్న అలికాల్ ప్రాంతానికి చెందిన బాలిక 10వ తరగతి చదువుతోంది. ఆమెను మాతా ఆలయ వీధికి చెందిన ఎవరెస్టు (25) ప్రేమించాడు. వీరి ప్రేమ వ్యవహారం పెద్దలకు తెలియడంతో బాలికను మందలించారు. దీంతో బాలిక ఎవరెస్ట్ నుంచి దూరమైంది. ఆగ్రహం చెందిన ఎవరెస్టు 2013 మే 25వ తేదీన బాలిక ఇంట్లోకి చొరబడి ఆమెపై డీజిల్ పోసి నిప్పు పెట్టాడు. బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి ఎవరెస్టును అరెస్టు చేశారు. ఈ కేసు నాగర్ కోయిల్‌లో ఉన్న మహిళ కోర్టులో విచారణ జరిగింది. నిందితుడిపై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి జోసెఫ్ జాయ్ యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

### మృత్యువులోనూ వీడని బంధం

**– భర్త మరణం తట్టుకోలేక ఆగిన భార్య గుండె**

**కొరుక్కుపేట:** పెళ్లిలో నాతిచరామి అని బాసలు చేసిన ఆ జంట ఎంతో అన్యోన్యంగా జీవనం సాగించారు. ఇద్దరూ ప్రేమగా ఉండేవారు. ఈ క్రమంలో గుండెపోటుతో భర్త మృతిచెందడంతో ఆమె తట్టుకోలేకపోయింది. కొద్ది సేటికే తానూ తనువు చాలించింది. ఈ సంఘటన తెన్‌కాశీలో జిల్లాలో జరిగింది. తెన్‌కాశీ జిల్లా సెంగొట్టై సమీపంలోని సెల్వ వినాయకర్ కోవిల్ వీధికి చెందిన మాడస్వామి అలియాస్ దురై (58) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. అతనికి భార్య కల్యాణి (50) ఉంది. గురువారం ఉదయం మాడస్వామి ఇంట్లో ఉండగా గుండె పోటుతో మరణించాడు. దీన్ని చూసిన భార్య కల్యాణి షాక్‌కు గురైంది. భర్త మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరైంది. ఒక్కసారిగా భర్త మృతదేహంపై పడి కుప్పకూలిపోయింది. దీంతో ఆ ప్రాంతంలో విషాదం అలుముకుంది.

### భార్యతో కలిసి కాంగ్రెస్ నేత ఆత్మహత్య

**కొరుక్కుపేట:** ఈరోడ్ జిల్లా గోబీ మున్సిపాలిటీలో కాంగ్రెస్ నేత భార్యతో కలిసి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు.. 26వ వార్డు పరిధిలోని శివ షణ్ముగం రోడ్డులో కాంగ్రెస్ నాయకుడు కాళీయప్పన్ (65), పలానా (52) దంపతులు నివాసం ఉంటున్నారు. వారి ఇంటి నుంచి దుర్గంధం వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లిచూడగా కాళీయప్పన్ ఉరివేసుకుని మృతిచెంది ఉన్నాడు. అతని భార్య పలానా నేలపై పడి ఉంది. వారి ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేస్తున్నారు.

### వేడి నీరు పోసి భర్త హత్య

**అన్నానగర్:** తిరుచ్చి జిల్లా భారతీపురంలో వేడి నీరు పోసి భర్తను హత్య చేసిన భార్యను పోలీసులు అరెస్టు చేశారు. భారతీపురానికి చెందిన సెల్వరాజ్ (27) ఆటో డ్రైవర్. అతను మద్యం సేవించి భార్య డయానా మేరీ (22)తో గొడవ పడేవాడు. గత 3 నెలల క్రితం భర్తపై కోపంతో డయానా మేరీ తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. సెల్వరాజ్ అక్కడికి వెళ్లి కాపురానికి రావాలని కోరాడు. ఆమె అంగీకరించకపోవడంతో ఆవేశంతో చేయి చేసుకున్నాడు. దీంతో ఆగ్రహించిన ఆమె స్టవ్‌పై ఉన్న మరుగుతున్న నీటిని భర్తపై పోసింది. సెల్వరాజ్ శరీరం కాలిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. ఇరుగుపొరుగు వారు అతన్ని తిరుచ్చి ప్రభుత్వ వైద్య కళాశాలలో చేర్పించారు. అక్కడ అతను గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. డయానా మేరీ, అత్త ఇన్నిసయమ్మాళ్ (43)ను తిరువెరుంబూర్ పోలీసులు అరెస్టు చేశారు.

### 34 కిలోల గంజాయి స్వాధీనం

**తిరువొత్తియూరు:** జోలార్‌పేట్ సమీపంలో గురువారం తెల్లవారుజామున ఎక్స్‌ప్రెస్ రైలులో తరలిస్తున్న 34 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. కన్యాకుమారి జిల్లా నాగర్ కోయిల్ రైల్వే పోలీసులు గురువారం హతియా ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు చేపట్టారు. రిజర్వేషన్ బోగీ టాయిలెట్ సమీపంలో మూడు బస్తాలను తనిఖీ చేయగా మూడు పార్శిళ్లలో 34 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని బెంగళూరుకు చెందిన చెందు (22), మనోజ్ (25)ను అరెస్ట్ చేశారు. వీరు ఒడిశా రాష్ట్రం జెర్సీగూడ నుంచి గంజాయి తీసుకొస్తున్నట్లు తెలిసింది. ఇద్దరిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

# 50 వేల మంది ఎక్కడ?

- అధికారులతో విద్యాశాఖ మంత్రి సమీక్ష


అన్బిల్ మహేష్

**సాక్షి, చెన్నై :** ప్లస్–1, ప్లస్–2 పరీక్షలకు గైర్హాజరైన 50 వేల మంది విద్యార్థులు ఏమయ్యారనే చర్చ జోరందుకుంది. వీరిని గుర్తించి పరీక్షలు రాయించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈనెల 13 నుంచి ప్లస్ –2, 14వ తేదీ నుంచి ప్లస్–1 పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ పరీక్షలకు దాదాపు 50 వేల మంది విద్యార్థుల హాజరుకావడం లేదు. వీరి గైర్హాజరు పెద్ద చర్చకు దారి తీసింది. కారణాల అన్వేషణపై విద్యాశాఖ దృష్టి పెట్టింది. ఒక్కో పరీక్ష సెంటర్‌లో కనీసం ఐదారుగురు విద్యార్థులు రాకపోవడాన్ని విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ తీవ్రంగా పరిగణించారు. గురువారం సచివాలయంలో అధికారులతో సమావేశం అయ్యారు. జిల్లాల వారీగా గైర్హాజరైన విద్యార్థుల వివరాలను సేకరించి, సమీక్షించారు. విద్యార్థులు అధిక శాతం మంది తమ తల్లిదండ్రులతో కలిసి కూలి తదితర పనులకు వెళ్తున్నట్లు తేలింది. మరి కొంత మంది విద్యార్థులు కరోనా పుణ్యమా పది, ప్లస్–1లో ఆల్ పాస్ రూపంలో గట్టెక్కి, ప్రస్తుతం పబ్లిక్ పరీక్ష రాయడానికి భయ పడి గైర్హాజరైనట్లు వెలుగు చూసింది. దీంతో ఈ విద్యార్థులతో పరీక్షలు రాయించేందుకు సిద్ధమవుతోన్నారు. వారి తల్లిదండ్రులతో ఆయా జిల్లా, డివిజన్లలో అధికారులు సంప్రదింపులు జరపడం, విద్యార్థుల్లో ఆందోళనను తొలగించడం వంటి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. మిగిలిన పరీక్షలు రాయించడం లేదా, సప్లిమెంటరీ ద్వారా విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు అవసరమైన అన్ని చర్యలపై దృష్టి పెట్టారు. ఈ విషయంపై మంత్రి అన్బిల్ మహేశ్ మీడియాతో మాట్లాడుతూ, ఈ వ్యవహారంపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, విద్యార్థులను ఎలాగైనా బడిబాట పట్టించడం, పరీక్షలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ గైర్హాజరీ కారణంగా పరీక్షల తేదీలలో ఎలాంటి మార్పులు చేయడం లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

## ఈస్ట్ కోస్ట్ రోడ్డు విస్తరణ పనులకు రూ.24 వేల కోట్లు

**కొరుక్కుపేట:** ఈస్ట్ కోస్ట్ రోడ్డు విస్తరణకు రూ.24,435 కోట్లు కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరి ప్రకటించారు. చెన్నైలోని ప్రధాన రహదారులలో ఈస్ట్ కోస్ట్ రోడ్ ఒకటి. దీన్ని విస్తరణపై ఎండీఎంకే చైర్మన్, ఎంపీ వైగో, డీఎంకే ఎంపీ బి.షణ్ముగం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనికి కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమాధానమిచ్చారు. తూర్పుతీర రహదారిని మహాబలిపురం నుంచి కన్యాకుమారి వరకు విస్తరిస్తామని చెప్పారు. ఈస్ట్ కోస్ట్ రోడ్డు విస్తరణకు రూ.24,435 కోట్లు కేటాయించామని, పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ రోడ్డు మహాబలిపురం నుంచి కన్యాకుమారి వరకు 697 కి.మీ ఉందని, దీన్ని 8 భాగాలుగా విభజించి విస్తరిస్తున్నట్టు చెప్పారు. ఇందులో పుదుచ్చేరి నుంచి కడలూరు పూండియాంకుబ్ ఫామ్ వరకు 38 కిలోమీటర్ల మేర పనులు శరవేగంగా సాగుతున్నాయని, నవంబర్ నాటికి పూర్తవుతాయన్నారు. అదేవిధంగా మహాబలిపురం –ముకయ్యూరు మధ్య 31 కి.మీ రోడ్డు పనులు కూడా ప్రారంభమయ్యాయి. వచ్చే ఏడాది మే నాటికి పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అలాగే పూండియంకుప్పం, చత్తనాథపురం, నాగపట్నం మధ్య 113 కిలోమీటర్ల మేర పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని, ముగైఊర్–మరకానం మధ్య 31 కిలోమీటర్ల మేర పనులు చేపట్టేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. నాగపట్టినం–రామనాథపురం–నివేదిత, తూత్తుకుడి మధ్య రోడ్డు విస్తరణ కోసం సవివరమైన ప్రాజెక్ట్ రిపోర్టు తయారు చేస్తున్నామని తెలిపారు. మరక్కాణం–పుదుచ్చేరి మధ్య 46 కి.మీ రహదారిని మెరుగుపరిచేందుకు జాతీయ రహదారుల సంస్థ చర్యలు చేపట్టింది. తూత్తుకుడి–తిరుచెందూరు–కన్యాకుమారి మధ్య రోడ్డు విస్తరణ ప్రాజెక్టు నివేదికను రూపొందించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని జాతీయ రహదారుల సంస్థ నిర్ణయించిందని తెలిపారు. రోడ్డు విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం మంచి రీతిలో సహకరిస్తున్నందున జాతీయ రహదారుల సంస్థ ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వంతో త్రైపాక్షిక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. గత జనవరి 9న ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. రోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని, వచ్చే ఏడాది నాటికి ఈ పనులన్నీ పూర్తవుతాయని జాతీయ రహదారుల శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలియజేశారు.

## న్యాయవాదుల రాస్తారోకో

**తిరుత్తణి:** న్యాయవాది, పోలీసు మధ్య చోటుచేసుకున్న ఘర్షణ రెండు శాఖల మధ్య పోరుగా మారింది. న్యాయవాదులు గురువారం రాస్తారోకో చేపట్టారు. తిరుత్తణికి చెందిన న్యాయవాది శ్రీరాములు (45) గత 8వ తేదీన చికిత్స కోసం తిరుత్తణి ప్రభుత్వాస్పత్రికి వెళ్లాడు. అక్కడ విధుల్లో వున్న ఎస్ఎస్ఐ సెల్వమణితో జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది. ఇద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మూడు రోజుల నుంచి న్యాయవాదులు కోర్టులో విధులను బహిష్కరించి నిరసన తెలుపుతున్నారు. గురువారం ఉదయం వంద మందికి పైగా న్యాయవాదులు కానిస్టేబుల్ సెల్వమణిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలనే డిమాండ్ చేస్తూ రాస్తారోకో చేపట్టారు కోర్టుకు ఎదురుగా అరక్కోణం రోడ్డు మార్గంలో గంటకు పైబడిన వాహన సేవలు స్తంభించాయి. డీఎస్పీ విగ్నేష్ న్యాయవాదులతో చర్చలు జరిపి ఇరువురి ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.


తిరుత్తణి అరక్కోణం రోడ్డు మార్గంలో ఆగిపోయిన వాహన సేవలు

## 31లోగా నీటి పన్నులు చెల్లించాలి

**కొరుక్కుపేట:** ఈనెల 31లోగా తాగునీరు, వ్యర్థపు నీరు పన్నులను చెల్లించాలని చెన్నై నీటి సరఫరా బోర్డు పేర్కొంది. పన్ను చెల్లించేందుకు నెలలోని అన్ని పని దినాలు, శనివారాలు, చివరి ఆదివారం ప్రాంతీయ కార్యాలయాలు, వర్క్‌షాప్ కార్యాలయాలు ప్రధాన కార్యాలయం పనిచేస్తాయని వెల్లడించింవది. ఈ నెల 26న కూడా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పన్నులు కట్టించుకుంటామని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. క్రెడిట్, డెబిట్ కార్డ్, నెట్ బ్యాంకింగ్ ద్వారా డబ్బు చెల్లించవచ్చని పేర్కొంది.

### పిటిషన్‌ను తిరస్కరించండి

**సాక్షి, చెన్నై:** పన్నీరు సెల్వం మద్దతుదారులు మనోజ్ పాండియన్ దాఖలు చేసిన పిటిషన్‌కు జరిమాన విధించి తిరస్కరించాలని అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళని స్వామి హైకోర్టును కోరారు. గురువారం రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళనిస్వామి, సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం శిబిరాల మధ్య వార్ జరుగుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది పళనిస్వామి నేతృత్వంలో జరిగిన సర్వ సభ్యసమావేశం తీర్మానాలను వ్యతిరేకిస్తూ పన్నీరు మద్దతు నేత మనోజ్ పాండియన్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై పళనిస్వామి గురువారం రిట్ పిటిషన్ వేశారు. అన్నాడీఎంకే కార్యాలయం నుంచి పన్నీరు సెల్వం శిబిరం ఎత్తుకెళ్లిన రికార్డులను మళ్లీ సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

### జ్వరాల నివారణకు చర్యలు

**సాక్షి, చెన్నై:** రాష్ట్రంలో హెచ్3ఎన్2 వైరస్ తగ్గుముఖం పడుతోందని, ప్రజలు అన్ని రకాలు చర్యలు తీసుకుంటోందని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణియన్ తెలిపారు. ఆయన గురువారం పూందమల్లిలోని ఓ ఆసుపత్రిలో రోగులను ఆయన పరామర్శించారు. ఇన్ ఉయర్‌కాప్పోం పేరిట తాము గత ఏడాది ఈ పథకం ప్రవేశ పెట్టామన్నారు. ప్రమాద బాధితులను రక్షించేందుకు 500 చోట్ల ప్రత్యేక ఏర్పాట్లతో పాటు 1083 ఆసుపత్రుల్లో అన్ని రకాల చికిత్సలకు చర్యలు తీసుకున్నామని వివరించారు. దేశవ్యాప్తంగా జ్వరాలు ఉన్నాయని, తమిళనాడులో తాము తీసుకున్న కట్టడి చర్యలతో వైరస్ తగ్గుముఖం పడుతోందని పేర్కొన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే కరోనా నిబంధనలను అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు.

### ఘనంగా రంగనాథ పెరుమాళ్ రథోత్సవం

**తిరువొత్తియూరు:** పంగుని బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పల్లావరం సమీపంలోని తిరునీర్ మలై రంగనాథ స్వామి పెరుమాళ్ ఆలయంలో గురువారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. 108 దివ్య క్షేత్రాల్లో ఒకటిగా వెలుగొందుతున్న రంగనాథ స్వామి ఆలయం హిందూ దేవదాయ శాఖ పరిధిలో వుంది. ఇక్కడ పంగుని మాసంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో పంగుని మాస బ్రహ్మోత్సవాలు గత గురువారం ప్రారంభమయ్యాయి. మంగళవారం గరుడ సేవ ఉత్సవం జరిగింది. గురువారం ఉదయము రథోత్సవం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయ తలుపులు తెరిచి స్వామికి తిరుమంజనం, ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి ఊరేగించారు. పల్లావరం నియోజకవర్గం శాసన సభ సభ్యుడు ఇ.కరుణానిధి, తాంబరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కామరాజ్, కాంచీపురం మండలం హిందూ దేవాలయ శాఖ జాయింట్ కమిషనర్ వలర్మతి, చెంగల్పట్టు జిల్లా సహాయ కమిషనర్ లక్ష్మి కాంతన్, భారతీదాసన్, ఎగ్జిక్యూటివ్ అధికారి కృష్ణనన్ తదితరులు రథాన్ని లాగారు. భక్తులకు ప్రసాదాలు, అన్నదానం చేశారు. చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి దర్శించుకున్నారు.

### బాలికపై సామూహిక లైంగిక దాడి

**– ఇద్దరు నిందితుల అరెస్టు**

**తిరువొత్తియూరు:** తెన్ కాశిలో బాలికను కిడ్నాప్ చేసి సామూహికంగా లైంగిక దాడికి పాల్పడిన కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. మరొకరి కోసం గాలిస్తున్నారు. తెన్ కాశి సమీపంలోని గ్రామానికి చెందిన బాలిక(17) మంగళవారం రాత్రి సెంగొట్టై పోలీసు స్టేషన్ వద్ద దుకాణంలో సెల్‌ఫోన్ సర్వీస్‌కు ఇచ్చింది. తిరిగి ఇంటికి వెళుతుండగా ఆటోలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు బాలికను బలవంతంగా ఎక్కించుకుని కొద్ది దూరం తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. తర్వాత బాలికను గురువారం వేకువజామున తెన్ కాశి, సెంగోట్టై రోడ్డులో దించి వెళ్లిపోయారు. దీనిపై బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెన్ కాశి కీల్ వాలిబాన్ మహిళా పోలీసులు కేసు నమోదు చేసి తెన్ కాశికి చెందిన ఆంథోని (20), మాధవన్ (33)ను అరెస్ట్ చేశారు. వెంకటేష్ (34) కోసం గాలిస్తున్నారు.

### గర్భిణి ఆత్మహత్య

**అన్నానగర్:** తంజావూరు జిల్లా తిరుక్కాట్టుపల్లి సమీపంలోని విష్ణంపేట మనల్ మేట్టులో గర్భిణి ఆత్మహత్యకు పాల్పడింది. విష్ణంపేట మనల్ మేట్టుకు చెందిన విజయమూర్తి తన మామ అన్నాదురై కూతురు శరణ్య (21)ను మూడేళ్లుగా ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. విషయం తెలుసుకున్న ఇరు కుటుంబాల పెద్ద వారికి గత నెల 13వ తేదీన అన్బిల్ మారియమ్మన్ ఆలయంలో పెళ్లి చేశారు. శరణ్యను విజయమూర్తి ఇంటిలో వదలి వెళ్లారు. ఈ స్థితిలో గురువారం శరణ్య తన ఇంటి వెనుక వున్న ఆవు గొట్టంలో తన చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న ఆమె తండ్రి అన్నాదురై తన కుమార్తె మృతిపై అనుమానం ఉందని తిరుక్కడుపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


# వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతి


వైద్యశాల వద్ద రోదిస్తున్న బాలింత


వీసీకే ఆధ్వర్యంలో వైద్యశాల వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

- బంధువుల ఆందోళన
- వైద్యులు, పోలీసులతో వాగ్వాదం

**తిరువళ్లూరు:** వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతో శిశువు మృతి చెందిందని ఆరోపిస్తూ బంధువులు గురువారం వీసీకే నేతలతో కలిసి ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. తిరువళ్లూరు జిల్లా అల్లికుళి గ్రామానికి చెందిన విజయన్ భార్య సంధ్య గర్భం దాల్చడంతో రెండు వారాల క్రితం కాన్పుకోసం ఊత్తుకోట తాలూకా కమ్మార్‌మేడులోని పీహెచ్‌సీలో చేర్చారు. పరిశీలించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గత నెల 8న సంధ్య మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం చేసే సమయంలో నర్సు సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ బిడ్డను కింద పడేసినట్టు సమాచారం. దీన్ని గమనించిన సంధ్య అక్క కవిత డాక్టర్లతో వాగ్వాదానికి దిగారు. అప్పట్లో కవితను సముదాయించిన డాక్టర్లు శిశువుకు జ్వరంగా వుందని ఐసీయూలో వుంచి చికిత్స అందిస్తున్నారు. గురువారం ఉదయం శిశువు బతకడం కష్టమని ఇంటికి తీసుకెళ్లాలని డాక్టర్లు చెప్పడంతో ఆగ్రహించిన బంధువులు వైద్యశాల ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యులు, నర్సుల నిర్లక్ష్యం వల్లే శిశువు మృతి చెందినట్టు వాపోయారు. బాధ్యులను సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న అసిస్టెంట్ ఎస్పీ వివేకానందశుక్లా, డీఎస్పీ చంద్రహాసన్, వైద్యశాల డీన్ అరసి శ్రీవాత్సవ, ఆర్ఎంఓ రాజ్‌కుమార్ తదితరులు వారితో మాట్లాడారు. ప్రసవం సమయంలో నిర్లక్ష్యం జరిగినట్టు నిర్ధారణ అయితే సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


మృతి చెందిన శిశువు

## విగ్రహాలు భద్రపరచడానికి 700 రహస్య గదులు

**తిరువళ్లూరు:** పురాతన విగ్రహాలను భద్రపరచడానికి 2023–24 నాటికి 700 రహస్య గదులను నిర్మిస్తామని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి శేఖర్ బాబు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు వెయ్యి సంవత్సరాలు దాటిన 104 దేవాలయాలకు మరమ్మతులు చేసి కుంభాభిషేకం చేస్తున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో పొన్నేరి సమీపంలోని న్యాయిరు గ్రామంలో రూ.58 లక్షలతో మరమ్మతులు చేస్తున్న శివాలయం, ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ పనులను మంత్రి శేఖర్‌బాబు గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రెండు ఆలయాలకు చెందిన సుమారు 90 ఎకరాల భూములను స్వాధీనం చేసుకుని, వాటి నుంచి వచ్చే ఆదాయాన్ని దినసరి పూజల కోసం వినియోగించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఆలయాల మరమ్మతులతోపాటు కుంభాభిషేకం చేయడానికి ప్రభుత్వం రూ.వంద కోట్లు విడుదల చేసిందన్నారు. మొదటి దశలో రూ.58 కోట్లతో 104 ఆలయాలను బాగు చేస్తున్నామని వివరించారు. అందరూ అర్చకులు కావొచ్చన్న పథకం కింద అర్హులైన 26 మందిని నియమించామని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్యాక్రాంతమైన ఆలయ భూములను పరిరక్షిస్తామన్నారు. ఎమ్మెల్యే దురైచంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పొన్నేరి సమీపంలోని ఆలయ పుష్కరిణికి పరిశీలిస్తున్న రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు

## 1.50 లక్షల మందికి ప్రయోజనం

**తిరువళ్లూరు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న కొత్త పథకం ద్వారా ఇప్పటి వరకు 1.50 లక్షల మందికి రూ.లక్ష చొప్పున వైద్యం కోసం సాయం చేశామని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం తెలిపారు. రోడ్డు ప్రమాదాల బారిన పడిన వారిని రక్షించి సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలకు 48 గంటల్లోపు తరలిస్తే వైద్యం కోసం అయ్యే ఖర్చులో ప్రభుత్వం రూ.లక్ష భరించాలన్న ఉద్దేశంతో కొత్త పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద ఎంపికైన లబ్ధిదారుడు తిరువళ్లూరు జిల్లా పూందమల్లిలోని పనిమలర్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. అతన్ని మంత్రి గురువారం పరామర్శించారు. రూ.లక్ష చెక్కు అందజేశారు. అనంతరం మంత్రి సుబ్రమణ్యం మీడియాతో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదానికి గురైన వారిని 48 గంటల్లో ప్రభుత్వం ఎంపిక చేసిన వైద్యశాలకు తరలించి నాణ్యమైన చికిత్స అందజేయాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి స్టాలిన్ కొత్త పథకాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు ఈ పథకం కింద ఒకటిన్నర లక్ష మంది లబ్ధి పొందారని వివరించారు. పథకం అమలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా అధిక ప్రమాదాలు జరిగే 500 ప్రాంతాలను గుర్తించామని తెలిపారు. ఈ ప్రాంతాలకు సమీపంలోని 235 ప్రభుత్వ, 448 ప్రైవేటు వైద్యశాలలను గుర్తించామని చెప్పారు. దేశ వ్యాప్తంగా ప్రతి ఏటా సరాసరిన 1.80 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో 17 వేల మంది మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సరైన సమయంలో నాణ్యమైన వైద్యం అందకపోవడం కారణమని తెలిపారు. ఈ పథకం కోసం 15 నెలల్లో రూ.132.52 కోట్లు ఖర్చు చేసినట్టు మంత్రి వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, ఎమ్మెల్యే కృష్ణస్వామి, పనిమలర్ డైరెక్టర్ శక్తికుమార్ పాల్గొన్నారు.


బాధితుడిని పరామర్శిస్తున్న మంత్రి సుబ్రమణ్యం, కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, ఎమ్మెల్యే కృష్ణస్వామి

## స్వచ్ఛంద సంస్థ అధికారి అరెస్టు

**అన్నానగర్:** బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న స్వచ్ఛంద సంస్థ అధికారిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నాగైలోని న్యూ బీచ్ రోడ్డులో ప్రైవేటు స్వచ్ఛంద సంస్థ బాలల వసతి గృహాన్ని నిర్వహిస్తోంది. ఇక్కడ 18 ఏళ్ల లోపు 15 మంది బాలికలు, 15 మంది బాలురు ఉంటూ చదువుకుంటున్నారు. 9వ తరగతి విద్యార్థిని నాగై ఆల్ మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. చారిటబుల్ ప్రతినిధి పరమేశ్వరన్ తనను గదిలోకి తీసుకెళ్లి లైంగికంగా వేధిస్తున్నట్లు వాపోయింది. దీనిపై రెవెన్యూ, శిశు సంక్షేమ అధికారులు విచారణ చేపట్టి పరమేశ్వరన్‌ను అరెస్టు చేశారు. పిల్లలను అన్నై సత్య ఇల్లంలోని ప్రభుత్వ ఆశ్రమ వసతి గృహానికి తరలించారు. పరమేశ్వరన్ కారైకల్ ఓఎన్‌జీసీలో ప్రొడక్షన్ విభాగంలో పనిచేస్తున్నట్లు గుర్తించారు.

## వేలూరు సెంట్రల్ జైలులో పోలీసుల తనిఖీలు

**వేలూరు:** వేలూరు తొర్రపాడిలోని సెంట్రల్ జైలులో ఖైదీలు గంజాయితోపాటు సెల్‌ఫోన్లు, పొగాకు, ఆయుధాలు తదితరాలను ఉపయోగిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనఖీలు చేపట్టారు. ఇక్కడ సుమారు 700 మందికి పైగా ఖైదీలు శిక్ష అనుభవిస్తున్నారు. గురువారం ఉదయం డీఎస్పీ తిరునావక్కరసు ఆధ్వర్యంలో సుమారు 56 మంది పోలీసులు, 65 మంది జైలు గార్డులు ఒకేసారి సెంట్రల్ జైలులో తనఖీలు జరిపారు. అదే విధంగా మహిళా సెంట్రల్ జైలులోను ఖైదీల వద్ద తనిఖీలు చేశారు. అక్కడ నిషేధిత వస్తువులు లభ్యమయ్యాయా లేదా అనే విషయంపై పోలీసులు సమాచారం ఇవ్వలేదు.


సెంట్రల్ జైలు ఎదుట బందోబస్తులో ఉన్న పోలీసులు

## నిర్మాత సీఎస్ జయకుమార్ కన్నుమూత

**తమిళ సినిమా:** సీనియర్ సినీ నిర్మాత సీఎస్.జయకుమార్ (75) గురువారం ఉదయం చెన్నైలో కన్నుమూశారు. దర్శకుడు భారతి రాజా రూపొందించిన పలు చిత్రాలకు నిర్వహణ బాధ్యతలను చేపట్టిన జయకుమార్ నటి సుకన్యను కథానాయకిగా పరిచయం చేస్తూ పుదు నెల్లు పుదు నాత్తు అనే చిత్రాన్ని నిర్మించారు. కాగా ఇటీవల అనారోగ్యానికి గురైన ఈయన గురువారం ఉదయం చెన్నై, షెనాయ్ నగర్‌లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. జయకుమార్ పుదియ నీతి కట్చి పార్టీ అధ్యక్షుడు ఏసీ షణ్ముగంకు బంధువు. కాగా ఈయన భౌతికాయానికి దర్శకుడు భారతీయ రాజా నివాళులు అర్పించి కంటతడి పెట్టారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా పుదీయ నీతి కచ్చి అధ్యక్షుడు ఏసీ షణ్ముగం, నిర్మాతలు కలైపులి ఎస్.ధాను, లక్ష్మణన్, మురళి, నటుడు మనోజ్ భారతీయ రాజా పలువురు సినీ ప్రముఖులు నివాళులర్పించారు. గురువారం సాయంత్రం నిర్మాత జయకుమార్ భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.



### 'ఇది మీ గళం' పేరుతో రేడియో నెట్ వర్క్ ప్రారంభం

**సాక్షి, చెన్నై :** ఇదు ఉంగ వాయిస్( ఇది మీ గళం ) పేరిట అద్భుతమైన సందేశంతో రేడియో నెట్ వర్క్‌ను చెన్నై నగరంలో పునరుద్ధరించినట్లు 92.7బిగ్ ఎఫ్ఎం ప్రకటించింది. ఎటువంటి పక్షపాతం లేకుండా ప్రజలు తమ అభిప్రాయాలను ఇందులో పంచుకునేందుకు వేదిక కల్పించామని గురువారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఆర్‌జేలు సరూ, మ్రిదులా, కరన్, శాంతి రాణి వివరాలను వెల్లడించారు. సరూ పేర్కొంటూ, కొత్త సాంకేతికతతో, వినోదాన్ని పంచడమే కాకుండా, శ్రోతులు వారి గొంతులను, గళాన్ని వినిపించేందుకు వీలుగా రేడియో నెట్ వర్క్‌ను పునరుద్ధరించామన్నారు.

## లోన్ ఇస్తామని రూ.4 కోట్ల మోసం

**– ముగ్గురి అరెస్టు**

**అన్నానగర్:** రూ.100 కోట్ల రుణం ఇస్తానని ముంబయి పారిశ్రామికవేత్త నుంచి రూ.4 కోట్లు మోసం చేసిన ముగ్గురిని సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. మహారాష్ట్రకు చెందిన వ్యాపారి శ్యామల్ చటర్జీ చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. నాగ్‌పూర్‌లోని సోలార్ పవర్ కంపెనీ విస్తరణకు డబ్బు అవసరం కావడంతో చెన్నైలోని ఇంజంబాక్కమ్ సాయిబాబా కాలనీలో నిర్వహిస్తున్న ప్రైవేటు సంస్థను సంప్రదించానని పేర్కొన్నారు. దాని డైరెక్టర్లు పన్నీర్‌సెల్వం, ఇంతియాజ్‌అహ్మద్, పవన్ కుమార్ రూ.100 కోట్ల రుణం ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. రుణం మొత్తానికి 6 నెలల వడ్డీగా రూ.4 కోట్లు ఇవ్వాలని చెప్పినట్టు పేర్కొన్నారు. తాను బ్యాంకు ఖాతా ద్వారా రూ.3.50 కోట్లు, మిగిలిన రూ.50 లక్షలను వ్యక్తిగతంగా అందజేసినట్టు వివరించారు. వారు తనకు రుణం ఇవ్వలేదని, ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదని వాపోయారు. కార్యాలయం వద్దకు వచ్చి చూడగా మూసేశారని తెలిపారు. తనకు న్యాయం చేయాలని కోరారు. దీంతో సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సుమతి విచారణ చేపట్టారు. ఇంజంబాక్కంలో నకిలీ పేరుతో ఓ ప్రైవేట్ కంపెనీ బంగ్లాను అద్దెకు తీసుకుని రుణం ఇప్పిస్తామని మోసం చేసినట్లు తేలింది. కోవలం సమీపంలోని ఓ లగ్జరీ హోటల్‌లో వారు తలదాచుకున్నట్లు గురువారం రహస్య సమాచారం అందింది. స్పెషల్ ఫోర్స్ పోలీసులు అక్కడికి వెళ్లి పన్నీర్‌సెల్వం (43), ఇంతియాజ్‌అహ్మద్(37), పవన్‌కుమార్ (45)ను అరెస్టు చేశారు.


### ఆవులకు విషం పెట్టిన నిందితుల కోసం గాలింపు చర్యలు

**అన్నానగర్:** ఆలంగులం సమీపంలో గురువారం విషం పెట్టి మూడు ఆవులను చంపిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. తెన్‌కాశి జిల్లా ఆలంగులం సమీపంలోని పుదుపట్టి వాటర్ ట్యాంక్ వీధికి చెందిన ముత్తయ్య కుమారులు ప్రభాకర్, పట్టముత్తు పుదుపట్టి పంచాయతీలో 50కి పైగా ఆవులను పెంచుకుంటూ పాల వ్యాపారం చేస్తున్నారు. వాటిని మేతకు తీసుకెళ్లి సాయంత్రం షెడ్లలో కట్టేస్తున్నారు. 13వ తేదీన పుదుపట్టి సమీపంలోని పొలం యజమాని కోరిక మేరకు చిన్నచిన్న మొక్కలను మేపేందుకు ఆవులను తోలారు. దీనిపై మరొక వ్యక్తి తన ఆవులను మేపేందుకు అంగీకరించాలని నిరసన తెలిపినట్టు సమాచారం. ఈ క్రమంలో బుధవారం అదే పొలంలో మళ్లీ ఆవులను మేపేందుకు తీసుకెళ్లారు. మూడు ఆవులు రాత్రి నోటి నుంచి నురగలు వచ్చి మృతిచెందాయి. ఇద్దరు వ్యక్తులు ఆలంగులం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం ఆవులను పరీక్షించిన వెటర్నరీ డాక్టర్ విషం తాగి ఆవులు చనిపోయాయని ధ్రువీకరించారు. ఎవరో ఆవులకు విషం పెట్టినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.




పదేళ్లుగా వ్యవసాయం, అనుబంధ రంగాలకు కేటాయింపులు రూ.కోట్లల్లో

| సంవత్సరం | మొత్తం బడ్జెట్ | వ్యవసాయ బడ్జెట్ |
|---|---|---|
| 2014-15 | 1,11,824 | 13,110 |
| 2015-16 | 1,13,049 | 14,184 |
| 2016-17 | 1,35,688.99 | 16,251 |
| 2017-18 | 1,56,999.40 | 18,214 |
| 2018-19 | 1,91,063.61 | 19,078 |
| 2019-20 | 2,27,974.99 | 28,866.23 |
| 2020-21 | 2,24,289.18 | 29,159.97 |
| 2021-22 | 2,29,779.27 | 31,256.35 |
| 2022-23 | 2,40,509.3 | 39,852.78 |
| 2023-24 | 2,79,279.27 | 41,436.29 |



భూమిని సాగు చేసేవారు అత్యంత ముఖ్యమైన పౌరులు. వీరు అత్యంత శక్తివంతులు, అత్యంత స్వతంత్రులు, అత్యంత ధర్మబద్ధులు. - థామస్ జఫర్సన్

# పొలానికి బలం!

## కేటాయింపుల్లో అన్నదాతకు అగ్రతాంబూలం

- వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.41,436.29 కోట్లు
- ఆర్బీకేల ద్వారా 40 శాతం రాయితీపై 10 వేల డ్రోన్లు
- 5 లక్షల సాయిల్ హెల్త్‌కార్డులు.. 10 లక్షల టన్నుల సూక్ష్మ పోషకాలు
- రైతులకు వ్యక్తిగతంగా వ్యవసాయ పరికరాలు
- అసెంబ్లీలో వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి కాకాణి



'స్వేదాన్ని చిందించి సిరులు పండిస్తున్న రైతన్నను చేయిపట్టి నడిపించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోంది. వ్యవసాయాన్ని పండుగ చేయాలన్న తపనతో శ్రమిస్తున్న సీఎం జగన్ చిత్తశుద్ధిని చూసి ప్రకృతి పరవశిస్తోంది. వరుణుడు హర్షించి వర్షిస్తుండడంతో రైతు మోములో చెరగని చిరునవ్వులు విరబూస్తున్నాయి' అని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.41,436.29 కోట్ల కేటాయింపులతో 2023-24 వ్యవసాయ బడ్జెట్‌ను గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. మంత్రి ఏమన్నారంటే..

- సాక్షి, అమరావతి

### జాతీయ వృద్ధి రేటు కంటే మిన్నగా..

దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న దివంగత వైఎస్సార్ కలను సాకారం చేసే దిశగా అడుగులు వేస్తుండడంతో వ్యవసాయ రంగంలో అగ్రపథాన ఉన్నాం. 2021-22లో జాతీయ వృద్ధిరేటు 10 శాతం కాగా మన రాష్ట్రం 13.07 శాతం వృద్ధి సాధించింది. 2022-23లో జాతీయ వృద్ధి రేటు 11.2 శాతం కాగా మన రాష్ట్రంలో 13.18 శాతం నమోదైంది. రాష్ట్ర జీఎస్‌డీపీ పరిశీలిస్తే 2018-19లో రూ.2.70 లక్షల కోట్లు ఉండగా 2022-23లో రూ.4.40 లక్షల కోట్లకు పెరిగింది. అంటే దాదాపు 1.70 లక్షల కోట్లు అధికంగా జీఎస్‌డీపీ నమోదైంది.

### 44 నెలల్లో రూ.1.54 లక్షల కోట్లు

గత 44 నెలల్లో వ్యవసాయం, ఇతర అనుబంధ రంగాలకు రూ.1.54 లక్షల కోట్లు ఖర్చు చేశాం. వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయంగా రూ.27,062.09 కోట్లు అందించాం. సున్నా వడ్డీ పంట రుణాల వడ్డీ రాయితీకి రూ.1442.66 కోట్లు, వైఎస్సార్ ఉచిత పంటల బీమాకి రూ.6,684.84 కోట్లు, పంట నష్ట పరిహారానికి రూ.1,911.81, ధాన్యం కొనుగోలుకు రూ.55,401.58 కోట్లు ఇతర పంటల కొనుగోలుకు రూ.7,156 కోట్లు, శనగ రైతుల బోనస్‌కు రూ.300 కోట్లు, ఆర్బీకే స్థాయిలో యంత్ర పరికరాల ఏర్పాటుకు సబ్సిడీ రూపంలో రూ.240.67 కోట్లు, సాగుకు పగటి పూట విద్యుత్ సరఫరా, ఫీడర్ల సామర్థ్యం పెంచడం, విద్యుత్తు రంగం బలోపేతానికి రూ.53,456 కోట్లు ఖర్చు చేశాం.

రంగాలవారీగా కేటాయింపులు రూ.కోట్లల్లో

| రంగం | కేటాయింపు |
|---|---|
| వ్యవసాయం | 12,369.59 |
| ఉద్యాన | 656.64 |
| పశుసంవర్థక | 1114.23 |
| మత్స్య | 500.83 |
| పట్టు పరిశ్రమ | 99.72 |
| మార్కెటింగ్ | 513.74 |
| సహకార | 233.71 |
| నీటిపారుదల విభాగం | 11,908 |



### కర్షక దేవాలయాలుగా ఆర్బీకేలు

గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన 10,778 ఆర్బీకేలను ఉత్పాదకుల విక్రయ, విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దాం. 535 ఆర్బీకేలకు సొంత భవనాలుండగా 1,513 భవనాల నిర్మాణం పూర్తైంది. 8730 భవనాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇతర రాష్ట్రాలు, విదేశాలు సైతం ఏపీ విధానాలను ప్రశంసిస్తున్నాయి. 2022-23 ఎఫ్‌పీఓ చాంపియన్ అవార్డుకు ఆర్బీకేలు నామినేట్ కావడం గర్వకారణం. 2 లక్షల సబ్‌స్క్రైబర్స్‌తో ఆర్బీకే యూట్యూబ్ చానల్, లక్ష మంది చందాదారులతో రైతు భరోసా మాసపత్రిక ఆదరణ పొందాయి.

### రికార్డు స్థాయి దిగుబడులు

సీఎం జగన్ పగ్గాలు చేపట్టిన తొలి ఏడాదే రికార్డు స్థాయిలో 175 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడులు వచ్చాయి. 2021-22లో గులాబ్ తుపాన్, అధిక వర్షాలు కురిసినప్పటికీ 155 లక్షల టన్నులు నమోదు కాగా 2022-23లో 169 లక్షల టన్నుల దిగుబడులు వస్తాయని అంచనా వేస్తున్నాం. వైఎస్సార్ ఉచిత పంటల బీమా తరహా పథకం దేశంలోనే ఎక్కడా లేదు. పంట సాగు చేసి ఈ-క్రాప్‌లో నమోదైతే చాలు రైతుల ఖాతాలోనే బీమా పరిహారం సొమ్ములు జమ చేస్తున్నాం.

### కరువు ఛాయలే లేవు

చంద్రబాబు హయాంలో ఏటా 100కు పైగా మండలాలు కరువు బారినపడితే ఇప్పుడు ఒక్క మండలం కూడా కరువు ఛాయల్లో లేదు. ఇప్పటిదాకా రూ.6.01 లక్షల కోట్ల వ్యవసాయ రుణాలిచ్చాం. పంటసాగుదారుల హక్కు చట్టం తెచ్చాం. 9.20 లక్షల మందికి రూ.6,229.28 కోట్ల పంట రుణాలిచ్చాం. దురదృష్టవశాత్తు ఆత్మహత్యలకు పాల్పడే రైతన్నల కుటుంబాలకు రూ.7 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నాం.

### ఏపీ సీడ్స్‌కు అవార్డుల పంట

ఆర్బీకేల ద్వారా 2022-23లో 12.56 లక్షల రైతులకు 7.17 లక్షల క్వింటాళ్ల రూ.202.66 కోట్ల రాయితీపై పంపిణీ చేశాం. పారదర్శకంగా అందించిన ఏపీ సీడ్స్‌కు పలు అవార్డులు దక్కాయి. ఆర్బీకేల ద్వారా ఈ ఏడాది 5 లక్షల మట్టి నమూనాలు సేకరించి విశ్లేషణ ఫలితాలతో ప్రతీ రైతుకు సాయిల్ హెల్త్ కార్డులు అందచేస్తాం. ఆర్బీకేల ద్వారా రూ.440 కోట్ల విలువైన ఎరువులందించాం. బస్తాపై రూ.10 నుంచి రూ.20 వరకు తగ్గించాం. వచ్చే ఏడాది 10 లక్షల టన్నుల ఎరువులు, సూక్ష్మపోషకాలను ఆర్బీకేల ద్వారానే పంపిణీ చేస్తాం.

వ్యవసాయం, అనుబంధ రంగాలకు కేటాయింపులు (రూ.కోట్లలో)

| పథకం | కేటాయింపు |
|---|---|
| వైఎస్సార్ రైతు భరోసా | 7220 |
| ధరల స్థిరీకరణ నిధి | 3000 |
| ప్రకృతి వైపరీత్యాల సహాయనిధి | 2000 |
| వైఎస్సార్ ఉచిత పంటల బీమా | 1600 |
| వైఎస్సార్ ఆర్బీకేల బలోపేతం | 41.55 |
| వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు | 500 |
| రాయితీ విత్తనాల పంపిణీ కోసం | 200 |
| వైఎస్సార్ పొలం బడులు | 13.33 |
| ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్ | 37.39 |
| రైతులకు ఎక్స్‌గ్రేషియా | 20 |
| వ్యవసాయ డ్రోన్లకోసం | 200 |
| ఫుడ్ ప్రాసెసింగ్ | 286.41 |
| వైఎస్సార్ జలకళ | 252 |
| వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ | 5500 |

కేంద్ర పథకాలకు కేటాయింపులు.. (రూ.కోట్లలో)

| పథకం | కేటాయింపు |
|---|---|
| నేషనల్ బ్యాంబూ మిషన్ పథకం | 10 |
| సూక్ష్మ సేద్య పరికరాలు (పర్ డ్రాప్ మోర్ క్రాప్ స్కీమ్) | 472.50 |
| సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకం | 83.33 |
| ఆయిల్ పామ్ తోటల పెంపకం | 50 |
| పీఎంకేఎస్‌వై 2.0 | 220 |

యూనివర్శిటీలకు కేటాయింపులు... (రూ.కోట్లలో)

| యూనివర్శిటీ | కేటాయింపు |
|---|---|
| ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం | 472.57 |
| వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ | 102.04 |
| శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం | 138.50 |
| వ్యవసాయ సహకార మార్కెటింగ్ (సచివాలయ శాఖ) | 154.24 |
| పశుసంవర్థక, డెయిరీ, మత్స్యశాఖ (సచివాలయ శాఖ) | 33.94 |


### రైతులకు వ్యక్తిగత పరికరాలు

ఈ ఏడాది 7 లక్షల మంది రైతులకు 50 శాతం రాయితీపై రూ.450 కోట్లతో టార్పాలిన్లు, స్ప్రేయర్లు అందచేస్తాం. దశల వారీగా పది వేల ఆర్బీకేల్లో కిసాన్ డ్రోన్లను అందుబాటులోకి తెస్తాం. అందులో భాగంగా రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.200 కోట్లతో 2 వేల కిసాన్ డ్రోన్లను 40 శాతం రాయితీపై అందుబాటులోకి తెస్తాం. నియోజకవర్గ స్థాయిలో 147, జిల్లా స్థాయిలో 9 ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్‌తో పాటు రీజనల్ స్థాయిలో 4 కోడింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం రాగులు, సజ్జలు, జొన్నలకు మాత్రమే కనీస మద్దతు ధర ప్రకటిస్తే మిగిలిన చిరుధాన్యాలకు క్వింటాల్‌కు రూ.2500 చొప్పున ఎమ్మెస్పీ ప్రకటించాం. హెక్టార్‌కు రూ.6 వేల ప్రోత్సాహాన్ని అందిస్తున్నాం. పట్టు సాగు విస్తరణ కోసం ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 90 శాతం రాయితీ అందిస్తున్నాం. సీఎం యాప్ ద్వారా పంట ఉత్పత్తులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట మార్కెట్‌లో జోక్యం చేసుకొని రైతులకు అండగా నిలుస్తున్నాం. మత్స్యకార భరోసా కింద గతేడాది 1.05 లక్షల మందికి రూ.106 కోట్ల నిషేధ భృతిని అందజేశాం. రూ.3,605.89 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్లు, 4 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు నిర్మిస్తున్నాం.

### ఉద్యాన హబ్‌గా రాష్ట్రం

ఆయిల్ పామ్, బొప్పాయి, నిమ్మ, కోకో, టమాటా, కొబ్బరి, మిరప సాగు, దిగుబడుల్లో ఏపీ మొదటి స్థానంలో ఉంది. 314.78 లక్షల టన్నులతో దేశీ పండ్ల ఉత్పత్తిలో 15.60 శాతం వాటాతో దూసుకెళ్తోంది. 2022లో వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ఐదుగురు ఉద్యాన రైతులు దక్కించుకున్నారు. ఉద్యాన రంగం 10.56 శాతం వృద్ధి నమోదు చేసింది. సూక్ష్మసాగు నీటిపథకం కింద 2022-23లో 1.38 లక్షల ఎకరాల్లో తుంపర, బిందు పరికరాలను అమర్చాం. ఆయిల్ సాగు విస్తరణను ప్రోత్సహించేందుకు మొక్కలు నాటేందుకు ఇచ్చే రాయితీని హెక్టార్‌కు రూ.12 వేల నుంచి రూ.29 వేలకు పెంచాం. పాత తోటల పునరుద్ధరణ కోసం ఒక్కో మొక్కకు రూ.250 చొప్పున ప్రత్యేక సాయం ఇస్తున్నాం

### దుర్గగుడి అభివృద్ధికి రూ.20 కోట్లు



సాక్షి, అమరావతి: విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (దుర్గగుడి)లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ. 20 కోట్లు కేటాయింపులు చేస్తూ ప్రతిపాదించింది. 'గ్రాంట్స్ ఇన్ ఎయిడ్' కేటగిరీలో ఈ నిధులను కేటాయింపులు జరుపుతున్నట్లు ఉదహరించారు. మరోవైపు, దేవదాయ శాఖ పరిధిలో పనిచేసే అర్చకుల సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు బడ్జెట్‌లో రూ. 120 కోట్లు కేటాయింపులు చేస్తూ ప్రభుత్వం ప్రతిపాదించింది.

### హోం శాఖకు నిధుల వరద

సాక్షి, అమరావతి: 2023-24 బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం హోం శాఖకు రూ.8,206.57 కోట్లు కేటాయించింది. గతేడాది కేటాయించిన రూ.7,586.83 కోట్ల కంటే ఈ ఏడాది రూ.619.74 కోట్లు అధికంగా కేటాయించడం విశేషం. పోలీస్ దళాల ఆధునికీకరణకు రూ.50 కోట్లు, దర్యాప్తు వ్యవస్థను బలోపేతం చేస్తూ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లకు రూ.34 కోట్లు, 'దిశ'వ్యవస్థకు రూ.15 కోట్లు కేటాయించింది.


### ఇది ప్రజా బడ్జెట్



తాడేపల్లిగూడెం అర్బన్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా బడ్జెట్. అన్ని వర్గాల ప్రజలకూ మేలు చేసే విధంగా ఉంది. ఎన్నికల ప్రణాళికలను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా చేసుకున్నట్టుగానే దానిని ప్రతిబింబించేలా బడ్జెట్ తయారు చేశారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే బడ్జెట్. గత సంవత్సరం కంటే బడ్జెట్ పెంచారు. ఇప్పటి వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందని అర్హులను గుర్తించి వారికి ఆ ఫలాలు అందజేసేందుకు వీలుగా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ప్రజామోద బడ్జెట్‌ను రూపొందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

### ఈ బడ్జెట్... పేదరిక నిర్మూలనకు పునాది



సాక్షి, అమరావతి: ఈ బడ్జెట్ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు పునాది లాంటి బడ్జెట్. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలకు ఆర్థికంగా ప్రోత్సాహాన్ని అందించేలా బడ్జెట్‌లో డీబీటీ పథకాలకు 54,228 కోట్ల కేటాయింపులు చేయడం హర్షణీయం. ఈ రాష్ట్రంలోని పేదలకు, మధ్యతరగతి ప్రజలకు ఈ బడ్జెట్ కొండంత భరోసాను కలిగించింది. ముఖ్యంగా ఒక మహిళా మంత్రిగా ఈ బడ్జెట్‌లో మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యతకు ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధి, ఉద్యోగాల కల్పన కోసం ప్రాధాన్యం ఇచ్చి, గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ తరువాత రాష్ట్ర ప్రజల్లో నమ్మకం రెట్టింపు అయ్యేలా ఈ బడ్జెట్‌ను రూపొందించారు. ఇలాంటి బడ్జెట్ ప్రతులను చించేసిన తెలుగుదేశం పార్టీ భవిష్యత్తును ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలు చించేయడం ఖాయం.

– ఆర్కే రోజా, పర్యాటక మంత్రి

### జనరంజక బడ్జెట్



తణుకు అర్బన్: వ్యవసాయం, సంక్షేమం, అభివృద్ధికి పట్టం కడుతూ జనరంజకమైన బడ్జెట్‌ను ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ముఖ్యంగా విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత కల్పించడాన్ని అన్ని వర్గాలూ స్వాగతిస్తున్నాయి. అత్యధికంగా వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.41,436 కోట్లు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేసి రైతన్నకు అండగా నిలబడ్డారు. పేదరికం నిర్మూలనకు సీఎం కృషిచేస్తున్నారు.

– మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

# ప్రాజెక్టులకు నిధుల పరవళ్లు

- బడ్జెట్‌లో జలవనరుల శాఖకు రూ.11,908.10 కోట్లు
- పోలవరానికి రూ.5,042.47 కోట్లు
- వంశధార, వెలిగొండ, గాలేరు–నగరికి ప్రాధాన్యం
- ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేలా ప్రభుత్వం ప్రణాళిక

సాక్షి, అమరావతి: సాగునీటి ప్రాజెక్టులకు 2023–24 వార్షిక బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు రూ.11,908.10 కోట్లను కేటాయించింది. సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించిన సీఎం వైఎస్ జగన్ గతేడాది పెన్నా డెల్టా జీవనాడులైన నెల్లూరు, సంగం బ్యారేజీలను పూర్తి చేసి సెప్టెంబరు 6న జాతికి అంకితం చేయడం తెలిసిందే. తద్వారా పెన్నా డెల్టాలో 4.85 లక్షల ఎకరాల ఆయకట్టుకు సమర్థంగా నీళ్లందేలా జలయజ్ఞం ఫలాలను రైతులకు అందించారు. ఈ ఏడాదీ ప్రాధాన్యతగా గుర్తించిన ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు వీలుగా నిధులు కేటాయించారు. ఉత్తరాంధ్రలో కీలకమైన వంశధార స్టేజ్–2 ఫేజ్–2, వంశధార–నాగావళి అనుసంధానం పనులు పూర్తయ్యేలా తగినన్ని నిధులు కేటాయించారు. వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ, గాలేరు–నగరిలో అంతర్భాగమైన అవుకు సొరంగం పనుల పూర్తికి నిధులు కేటాయించారు. హంద్రీనీవా నుంచి కృష్ణా జలాలను మళ్లించి కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో 68 చెరువులను నింపి సాగు, తాగునీటిని అందించే పథకాన్ని పూర్తి చేయడానికి అవసరమైన నిధులను కేటాయించారు.

### పోలవరంపై ప్రత్యేక దృష్టి..

పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోంది. కేంద్రం రూ.3 వేల కోట్లకుపైగా రీయింబర్స్ చేయడంలో జాప్యం చేస్తున్నా రాష్ట్రమే నిధులను వెచ్చిస్తోంది. ఈ బడ్జెట్‌లోనూ పోలవరంకు సింహభాగం నిధులు రూ.5,042.47 కోట్లు కేటాయించింది. చంద్రబాబు నిర్వాకాలతో దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్, ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో కోతతో ఏర్పడిన అగాధాల పూడ్చివేత పద్ధతులపై డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్ సూచనల మేరకు దృష్టి పెట్టాం. తర్వాత వరదల్లోనూ ప్రధాన డ్యామ్ పనులు చేపట్టి సత్వరమే పూర్తి చేసేలా అడుగులు వేస్తోంది.

### జలయజ్ఞం ఫలాలే లక్ష్యంగా..

సాగునీటి ప్రాజెక్టుల పనులపై ఖర్చు పెట్టే ప్రతి పైసా రైతుల జీవనోపాధులను పెంచడానికి దోహదం చేసేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. తోటపల్లి, పుష్కర, తాటిపూడి, తెలుగుగంగ, శ్రీశైలం కుడి గట్టు కాలువ(ఎస్సార్బీసీ), గుండ్లకమ్మ తదితర ప్రాజెక్టుల కింద మిగిలిపోయిన ఆయకట్టుకు నీళ్లందించే ఉప కాలువలు, పిల్ల కాలువలను పూర్తి చేయడానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు చేశాం. ఉత్తరాంధ్రలో కీలకమైన తారకరామ తీర్థసాగరం ప్రాజెక్టును పూర్తి చేయడానికి వీలుగా నిధులు కేటాయించింది. కర్ణాటక పరిధిలో తుంగభద్ర ఎగువ, దిగువ కాలువల ఆధునికీకరణ పూర్తి చేసి రాష్ట్ర కోటా నీటిని పూర్తి స్థాయిలో రాబట్టి రాయలసీమ రైతులకు నీళ్లందించడమే లక్ష్యంగా తుంగభద్ర బోర్డుకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఇచ్చింది.


ప్రాజెక్టుల వారీగా నిధుల కేటాయింపులు (రూ.కోట్లలో)

| ప్రాజెక్టు | కేటాయింపు |
|---|---|
| పోలవరం | 5,042.47 |
| గోదావరి డెల్టా వ్యవస్థ | 23.37 |
| పులిచింతల | 27.67 |
| సోమశిల రిజర్వాయర్ | 41.00 |
| తెలుగుగంగ | 232.08 |
| పెన్నా డెల్టా వ్యవస్థ | 77.54 |
| సోమశిల–స్వర్ణముఖి లింక్ కెనాల్ | 41.92 |
| కండలేరు ఎత్తిపోతల పథకం | 11.54 |
| తుంగభద్ర బోర్డు | 193.17 |
| గాలేరు–నగరి | 855.35 |
| పులివెందుల కెనాల్ వ్యవస్థ | 106.59 |
| వంశధార స్టేజ్–2 ఫేజ్–2 | 180.73 |
| తోటపల్లి | 80.84 |
| తారకరామతీర్థసాగరం | 50.00 |
| మహేంద్రతనయ | 60.12 |
| వెలిగొండ | 101.47 |
| గుండ్లకమ్మ | 50.00 |
| హంద్రీ–నీవా | 122.69 |
| పోలవరం ఎత్తిపోతల పథకం | 53.34 |
| ఉత్తరాంధ్ర సుజల స్రవంతి | 141.79 |
| తుంగభద్ర ఎల్లెల్సీ | 80.93 |
| కేసీ కెనాల్ | 225.22 |
| ఎస్సార్బీసీ | 42.05 |
| 68 చెరువుల పథకం | 56.50 |
| గాజులదిన్నె | 19.00 |
| కృష్ణా డెల్టా వ్యవస్థ | 202.61 |
| వరద నియంత్రణ, డ్రైనేజీ | 316.89 |
| కడా | 319.26 |
| భూగర్భ జలవనరులు | 38.66 |
| చిన్న నీటిపారుదల | 485.31 |





**వాహన మిత్రకు బడ్జెట్ ఇలా..**

| సంవత్సరం | రూ. కోట్లలో |
|---|---|
| 2019-20 | 236.34 |
| 2020-21 | 273.47 |
| 2021-22 | 254.64 |
| 2022-23 | 261.51 |
| 2023-24 | 275.00 |






సాక్షి
శుక్రవారం । 17 । మార్చి । 2023
చెన్నై ।
www.sakshi.com



అభ్యాసం సృజనాత్మకతను ఇస్తుంది. సృజనాత్మకత ఆలోచనకు దారితీస్తుంది. ఆలోచన జ్ఞానాన్ని అందిస్తుంది. జ్ఞానం నిన్ను గొప్పవానిగా చేస్తుంది.

- ఏపీజే అబ్దుల్ కలాం

# చదువుకు బడ్జెట్ భరోసా

విద్యపై చేసే ఖర్చు భవిష్యత్తుకు పెట్టుబడి అన్నది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రగాఢ విశ్వాసం. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అందుకు తగ్గట్లుగానే ఆయన అడుగులు వేస్తున్నారు. ఏటా విద్యారంగానికి బడ్జెట్‌లో అత్యధిక నిధులు కూడా కేటాయిస్తున్నారు. ఇందులో భాగంగానే 2023–24 ఆర్థిక సంవత్సరానికి కూడా గతంలో కన్నా అధిక నిధులను కేటాయించి బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. ఇక గురువారం అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.32,921 కోట్లను కేటాయించింది. ఇందులో పాఠశాల, ఉన్నత, సాంకేతిక విద్యలకు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ఈ నిధులను కేటాయించింది. పాఠశాల, ఉన్నత విద్యలకు కలిపి సాధారణ విద్య పద్దు కింద రూ.32,198.39 కోట్లు, సాంకేతిక, విద్య పద్దు కింద రూ.512.37 కోట్లుగా ఉంది. వీటితో పాటు నైపుణ్యాభివృద్ధికీ నిధులు కేటాయించింది. మరోవైపు.. విద్యార్థులకు సంక్షేమ విభాగాల ద్వారా అందించే జగనన్న విద్యాదీవెన (రూ.2,841 కోట్లు), జగనన్న వసతి దీవెన (రూ.2,200 కోట్లు).. అమ్మఒడి (రూ.6,500 కోట్లు) పథకాల నిధులు రూ.11,541 కోట్లను కూడా కలుపుకుంటే ఈ కేటాయింపులు మరింత పెరుగుతాయి.

- సాక్షి, అమరావతి


## ప్రభుత్వ విద్యా సంస్థలు బలోపేతం



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రైవేటు విద్యారంగాన్ని ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ విద్యారంగానికి అరకొర కేటాయింపులు చేసి ఆ వ్యవస్థను పూర్తిగా నీరుగార్చింది. కానీ, ప్రస్తుత సర్కారు ప్రభుత్వ విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తూ అందుకు తగ్గట్లుగా నిధులూ కేటాయిస్తోంది. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడమే కాకుండా అందులో చదువుకునే పేద విద్యార్థులకు అనేక రకాల కార్యక్రమాలు అమలు చేయిస్తూ అండదండలు అందిస్తోంది.

## అమ్మఒడి, గోరుముద్ద, విద్యాకానుక..

జగనన్న అమ్మఒడి కింద రానున్న ఏడాదిలో కూడా రూ.6,500 కోట్లను విద్యార్థుల తల్లులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించింది. జగనన్న గోరుముద్ద కింద రూ.1,164 కోట్లను ప్రతిపాదించింది. ఇందులో అచ్చంగా అదనపు మెనూ కోసమే రూ.611.23 కోట్లను ప్రభుత్వం కేటాయించడం గమనార్హం. ఇక జగనన్న విద్యాకానుక కింద రూ.560 కోట్లను ఖర్చుచేయనుంది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం మనబడి నాడు–నేడు కార్యక్రమం కోసం రూ.3,500 కోట్లను అందించనుంది. ఇంటర్మీడియెట్ విద్యకు రూ.779.47 కోట్లు అందించనుంది.




## డ్రైవరన్నలకు మరింత అండ...


**వైఎస్సార్ వాహనమిత్రకు రూ.275కోట్లు**

సాక్షి, అమరావతి: పాదయాత్రలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డ్రైవర్లకు మరింత సహాయం అందించనున్నారు. గత నాలుగేళ్ల కంటే ఈ సంవత్సరం వైఎస్సార్ వాహనమిత్ర పథకానికి అధికంగా నిధులు కేటాయించారు. వైఎస్సార్ వాహనమిత్ర పథకానికి 2023–24 బడ్జెట్‌లో రూ.275కోట్లు కేటాయించారు. తద్వారా ఈ ఏడాది వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద ఐదో విడత అర్హత కలిగిన ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్, ఎండీయూ డ్రైవర్లు కలిపి మొత్తం 2.75 లక్షల మందికి రూ.10వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించనుంది. ఈ ఏడాది కొత్తగా ఇంటింటికీ రేషన్ అందిస్తున్న ఎండీయూ డ్రైవర్లకు కూడా వాహనమిత్ర పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. దాంతో దాదాపు 10వేల మందిని అదనంగా ఈ పథకం పరిధిలోకి తీసుకువచ్చి లబ్ధి చేకూర్చనుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటికే నాలుగు దశల్లో 1.05కోట్ల మందికి మొత్తం రూ.1,025.96కోట్లు ఆర్థిక సహాయం చేసింది.



# ఉన్నత విద్య మరింత బలోపేతం

**వర్సిటీలు, కాలేజీలకు వెన్నుదన్నుగా బడ్జెట్‌లో అధిక నిధులు**




సాక్షి, అమరావతి: ఉన్నత విద్యను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు ముందుకేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ రంగానికి గతంలో కన్నా ఎక్కువ కేటాయింపులు చేసింది. వర్సిటీలు, కాలేజీ విద్య, సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి విభాగాలకు ఇతోధికంగా నిధులను కేటాయించింది. అత్యున్నత నైపుణ్యాలతో ప్రపంచస్థాయి అవకాశాలను అందిపుచ్చుకునేలా రాష్ట్రంలోని విద్యార్థులను తీర్చిదిద్దాలన్నది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష. అందుకనుగుణంగా ఉన్నత విద్యారంగానికి బడ్జెట్‌లో సముచిత స్థానం కల్పిస్తూ నిధులు కేటాయించారు. ఉన్నత విద్యలోని అన్ని విభాగాలకు రూ.2,064.71కోట్లు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు రూ.1,166.64 కోట్లు కలిపి మొత్తంగా రూ.3,231.35 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. 2021–22లో ఉన్నత విద్యకు ప్రభుత్వం రూ.1,973.15 కోట్లు కేటాయించింది. ఆ ఏడాది కేటాయింపులకన్నా అధికంగా రూ.2,031.24 కోట్లు ఖర్చుపెట్టింది. ఇక 2022–23లో రూ.2,014.30 కోట్లు కేటాయించగా ఈసారి అంతకన్నా అత్యధిక నిధులను బడ్జెట్‌లో పొందుపరిచింది. సంప్రదాయ వర్సిటీలకు, సాంకేతిక విశ్వవిద్యాలయాలకు ఈసారి బడ్జెట్‌లో నిధులు పెంచింది. రూసా కింద రూ.150 కోట్లతో వివిధ కార్యక్రమాలను చేపట్టడమే కాకుండా ప్రత్యేకంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీల భవనాల నిర్మాణం కోసం డిజిటల్ తరగతులు, వర్చువల్ లేబొరేటరీస్, ట్రైబల్ డిగ్రీ కాలేజీల కోసం అదనంగా రూ.9.98 కోట్లు కేటాయించింది. ప్రభుత్వ కాలేజీల నిర్వహణ ఇతర అవసరాల కోసం రూ.785.89 కోట్లు కేటాయించింది.

**వివిధ వర్సిటీలకు బడ్జెట్ కేటాయింపులు ఇలా.. (రూ.కోట్లలో)**

| వర్సిటీ | రూ.కోట్లలో |
|---|---|
| ఆదికవి నన్నయ | 8.69 |
| అంబేద్కర్ | 7.57 |
| ఏపీహెచ్‌ఈఆర్ఎంసీ | 4.10 |
| ఆంధ్రా వర్సిటీ | 302.40 |
| ఏపీఎస్‌సీహెచ్ఈ | 4.35 |
| క్లస్టర్ వర్సిటీ, కర్నూలు | 1.20 |
| ద్రవిడ వర్సిటీ | 19.96 |
| బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ | 5.40 |
| వైఎస్సార్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ | 7.89 |
| కృష్ణా వర్సిటీ | 8.10 |
| నాగార్జున వర్సిటీ | 54.00 |
| శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ | 4.93 |
| రాయలసీమ వర్సిటీ | 8.64 |
| శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ | 71.14 |
| పద్మావతి మహిళా వర్సిటీ | 56.41 |
| శ్రీవేంకటేశ్వర వర్సిటీ | 183.60 |
| ఉర్దూ వర్సిటీ | 1.50 |
| విక్రమ సింహపురి వర్సిటీ | 13.90 |
| యోగి వేమన వర్సిటీ | 32.84 |

**(సాంకేతిక వర్సిటీలకు నిధులు ఇలా)**

| జేఎన్‌టీయూ కాకినాడ | జేఎన్‌టీయూ అనంతపురం | ఆర్జీయూకేటీ |
|---|---|---|
| 54.00 | 57.25 | 94.32 |

**(వివిధ ఆస్తుల కల్పనకు మూలధన కేటాయింపులు ఇలా..)**

| | |
|---|---|
| ఆదికవి నన్నయ వర్సిటీ | 4.00 |
| క్లస్టర్ వర్సిటీ | 52.00 |
| సెంట్రల్ వర్సిటీలకు మౌలిక సదుపాయాలు | 12.66 |
| అబ్దుల్‌హక్ ఉర్దూ వర్సిటీ | 5.00 |
| రూసా కింద భవనాల నిర్మాణం | 150.00 |
| రాయలసీమ వర్సిటీ | 7.94 |
| పద్మావతి మహిళా వర్సిటీ | 1.35 |
| ట్రైబల్ ఇంజనీరింగ్ కాలేజీ, కురుపాం | 33.00 |

## నైపుణ్యాభివృద్ధిరస్తు

**బడ్జెట్లో రూ.1,166.64 కోట్లు కేటాయింపు**

**గతేడాది కన్నా అత్యధికంగా నిధులు**

**పాలిటెక్నిక్ కాలేజీల ఆధునికీకరణ**

సాక్షి, అమరావతి: విద్యార్థుల చదువులు ముగియగానే ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకునేలా వారిని తీర్చిదిద్దేందుకు వీలుగా ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలకు నిధుల కేటాయింపును పెంచింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో నైపుణ్యాభివృద్ధి కోసం 1,166.64 కోట్లను కేటాయించింది. 2021–22లో 774.01 కోట్లు ఖర్చు చేయగా, 2022–23లో రూ.969.91 కోట్లు కేటాయించింది. విద్యార్థుల చదువులు ముగిసే నాటికి ఉన్నతమైన నైపుణ్యాలు, సామర్థ్యాలను కలిగి జాతీయ అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునేలా వారిని తీర్చిదిద్దాలన్నది సీఎం వైఎస్ జగన్ లక్ష్యం. తదనుగుణంగా యువతకు నైపుణ్యాలను అందించేందుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. నైపుణ్య వర్సిటీ ఏర్పాటుతో పాటు.. నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక శిక్షణ సంస్థలనూ నెలకొల్పుతోంది. ఇందు కోసం గత రెండేళ్లుగా బడ్జెట్లో నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వం.. కేటాయింపులను పెంచింది.

### ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలను మరింత అభివృద్ధి పరిచేలా..

నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు రూ.197.06 కోట్లు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఎంప్లాయిమెంటు జనరేషన్ కార్యక్రమాలకు రూ.398.98 కోట్లు కేటాయించింది. ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలను మరింత అభివృద్ధి పరిచేలా సదుపాయాల కోసం కేపిటల్ నిధులను సమకూరుస్తోంది. ఐటీఐ భవనాల నిర్మాణానికి రూ.32.70 కోట్లు ఖర్చు చేయనుంది. పాలిటెక్నిక్ కాలేజీలకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపునకు వీలుగా వివిధ సదుపాయాలు కల్పించాలని నిర్ణయించింది. భవనాల నిర్మాణానికి రూ.54.76 కోట్లు, వర్చ్యువల్ ల్యాబ్‌ల కోసం రూ.కోటి కేటాయించింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల ఆధునికీకరణకు రూ.15 కోట్లు అందించనుంది.

## సుస్థిర అభివృద్ధికి దోహదపడే బడ్జెట్



సుపరిపాలన లక్ష్యాలు, సుస్థిర అభివృద్ధికి దోహదపడేలా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించింది. నవరత్నాల పథకాలకు నిధులు భారీగా కేటాయించడం ద్వారా పేదరిక నిర్మూలన, సామాజికాభివృద్ధి సాధనకు మార్గాన్ని మరింత సుగమం చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల సంక్షేమానికి ప్రభుత్వం మరోసారి అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. ధరల స్థిరీకరణకు రూ.3 వేల కోట్లు కేటాయించడం ద్వారా పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తోంది. సాగు రంగాన్ని ఆలంబనగా చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్న ప్రభుత్వ ఆచరణాత్మక విధానానికి ఈ కేటాయింపులు నిదర్శనం. విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో ప్రభుత్వం ప్రకటించిన పారిశ్రామిక అనుకూల విధానానికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. కీలకమైన ఇంధన రంగానికి రూ.6,454 కోట్లు కేటాయించడం సరైన నిర్ణయం. ఈ బడ్జెట్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుంది.

– ప్రొఫెసర్ హెచ్.లజపతిరాయ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పూర్వ వీసీ

# సరికొత్తగా పల్లెటూరు రోడ్లు

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్ అండ్ బీ శాఖకు ఏటా నిధుల కేటాయింపు పెంచుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. ఈ ఏడాది కూడా ఆ పరంపర కొనసాగించింది. 2023-24 వార్షిక బడ్జెట్‌లో ఆర్ అండ్ బీ శాఖకు రూ. 9,118.71 కోట్లు కేటాయించింది. గతేడాది కంటే ఇది రూ. 537.46 కోట్లు అధికం. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధుల కేటాయింపులో నిర్లక్ష్యానికి గురైన రోడ్ల నిర్మాణం, నిర్వహణను మళ్లీ గాడిలో పెట్టేందుకు ఈ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించింది. - సాక్షి, అమరావతి



సాక్షి, అమరావతి: పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.1,869.77 కోట్లతో కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టనుంది. 'ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారి ప్రాజెక్టు' కార్యక్రమంలో భాగంగా 250 మంది, ఆ పైబడి జనాభా నివసించే గ్రామాలకు కొత్తగా రోడ్ల నిర్మాణానికి రూ. 731 కోట్లు, పట్టణాలు, జాతీయ, రాష్ట్రీయ రహదారుల నుంచి సమీప గ్రామాలను కలుపుతూ పీఎంజీఎస్‌వై కార్యక్రమంలో కొత్తగా రోడ్ల నిర్మాణానికి రూ. 875 కోట్లు, ఏపీ రూరల్ డెవలప్‌మెంట్ ఫండ్, పంచాయతీరాజ్ రోడ్లు, ఆర్ఐడీఎఫ్ వంటి వివిధ కార్యక్రమాలకు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించే రోడ్లకు మరో రూ. 263 కోట్ల నిధులను బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రక్షిత మంచినీటి సరఫరాకు వీలుగా వివిధ కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో మొత్తం రూ. 2,200.38 కోట్లు ప్రతిపాదించింది.

**పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు బడ్జెట్‌లో భారీగా నిధులు**

**పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లకు రూ. 3,862 కోట్లు**

- గ్రామ పంచాయతీలతో పాటు, మండల, జిల్లా పరిషత్‌లకు వివిధ రూపాల్లో ఆర్థిక చేయూత అందజేసేందుకు రూ. 3,862.71 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించింది. అందులో.. 15వ ఆర్థిక సంఘం ప్రతిపాదనల మేరకు మూడు రకాల గ్రామీణ స్థానిక సంస్థలకు వచ్చే ఆర్థిక ఏడాది రూ. 2,031 కోట్ల మొత్తాన్ని బడ్జెట్‌లో కేటాయించింది.
- ఈ కేటాయింపులకు అదనంగా గ్రామ సచివాలయాలు, వలంటీర్ల కార్యక్రమాలకు రూ. 3,857 కోట్లను ప్రభుత్వం ప్రతిపాదించింది.

### గ్రామీణాభివృద్ధికి దండిగా నిధులు..

- ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు అదనంగా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో వివిధ ప్రజాభివృద్ధి కార్యక్రమాలకు మొత్తం రూ. 7,512.89 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించింది. అందులో ప్రధానంగా.. సెర్ప్‌కు రూ. 453 కోట్లు, పొదుపు సంఘాల మహిళల కోసం వైఎస్సార్ సున్నా వడ్డీ పథకానికి రూ. 700 కోట్లు ప్రభుత్వం ప్రతిపాదించింది.
- మెట్టభూముల్లో వైఎస్సార్ జలకళ పథకం ద్వారా రైతుల పొలాల్లో ఉచితంగా బోర్ల తవ్వకం పథకానికి రూ. 252 కోట్లు కేటాయించారు.
- గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనుల కల్పన కార్యక్రమాలకు రూ. 5,115.38 కోట్లను ప్రభుత్వం ప్రతిపాదించింది.
- వాటర్ షెడ్ల నిర్మాణం వర్షపు నీరు నిల్వ కార్యక్రమాల నిర్వహణకు మరో రూ. 195.88 కోట్లు ప్రభుత్వం కేటాయించింది.

# రయ్.. రయ్.. రహదారులు

**ఆర్ అండ్ బీకి రూ. 9,118.71కోట్లు.. గతేడాది కంటే రూ. 537.46 కోట్లు అధికం**

**ఆర్ అండ్ బీకి నిధుల పెరుగుదల ఇలా.. (రూ.కోట్లలో)**

| సంవత్సరం | రూ.కోట్లలో |
|---|---|
| 2020-21 | 6,588.57 |
| 2021-22 | 7,594.19 |
| 2022-23 | 8,581.25 |
| 2023-24 | 9,118.71 |

రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్(ఆర్‌డీసీ) ద్వారా రోడ్ల నిర్మాణం, రాష్ట్ర–జిల్లా ప్రధాన రహదారుల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం 2023–24 బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చింది. ఇప్పటికే దాదాపు 32,725 కి.మీ. మేర జిల్లా ప్రధాన రహదారులు, 4 వేల కి.మీ. మేర బీటీ రోడ్లను పునరుద్ధరించిన విషయాన్ని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తెలిపారు. రూ. 2,205 కోట్లతో 8,268 కి.మీ. మేర రాష్ట్ర, జిల్లా ప్రధాన రహదారులను నిర్మించినట్టు వెల్లడించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు రహదారుల అనుసంధాన ప్రాజెక్ట్ కింద 437.59 కి.మీ. రోడ్ల నిర్మాణాన్ని రూ. 391 కోట్లతో చేపట్టామన్నారు. 2023–24 బడ్జెట్‌లో కూడా రహదారుల నిర్మాణం, రోడ్ల భద్రత, రైల్వే ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రాధాన్యమిచ్చింది.

### కొన్ని ప్రధాన కేటాయింపులు ఇలా...

- గ్రామీణ ప్రాంతాల అనుసంధాన రోడ్లకు: రూ. 616 కోట్లు
- ఎన్‌డీబీ రోడ్ల నిర్మాణం– వంతెనల నిర్మాణం: రూ. 616 కోట్లు
- రాష్ట్ర ప్రధాన రహదారులు నిర్మాణం: రూ. 500 కోట్లు
- జిల్లా రహదారుల పునరుద్ధరణ: రూ. 400 కోట్లు
- ఆర్‌డీసీకి కేటాయింపులు: రూ. 300 కోట్లు
- ఆర్ఐడీఎఫ్ కింద రోడ్ల నిర్మాణం: రూ. 200 కోట్లు

**రైల్వే శాఖతో కలసి ప్రాజెక్టులు, భద్రతకు రాష్ట్ర వాటా: రూ. 408 కోట్లు**




### పారిశ్రామిక రంగానికి కేటాయింపులు ఇలా..

- పారిశ్రామిక మౌలిక వసతులకు రూ.1,295.22 కోట్లు
- పరిశ్రమలకు రూ.2,602.13 కోట్లు
- ఐటీ రంగానికి రూ.215.14 కోట్లు
- మచిలీపట్నం పోర్టుకు రూ.150 కోట్లు
- విశాఖ చెన్నై కారిడార్ అభివృద్ధికి రూ.761 కోట్లు
- ఎంఎస్ఎంఈ రాయితీలకు రూ.465 కోట్లు
- పారిశ్రామిక ప్రోత్సాహకాలకు రూ.412 కోట్లు
- ఎస్సీ పారిశ్రామికవేత్తల ప్రోత్సాహకాలకు రూ.175 కోట్లు

### వైద్య శాఖకు బడ్జెట్‌లో కేటాయింపులు ఇలా.. (రూ.కోట్లలో)

| | |
|---|---|
| గిరిజన మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటు | 120 |
| మైదాన ప్రాంతాల్లో ఆస్పత్రులతో కూడిన కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు | 220 |
| మానవ వనరులు, కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు | 284.46 |
| ప్రభుత్వ వైద్య కళాశాలల్లో యూజీ, పీజీ సీట్ల పెంపునకు మౌలిక సదుపాయాల కల్పన | 108.87 |
| పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి | 25 |
| రాష్ట్ర క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ | 44.30 |
| పీహెచ్‌సీలను హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లుగా మార్పు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, పీహెచ్‌సీలు, పట్టణ, ఆరోగ్య కేంద్రాల్లో రోగనిర్ధారణ సదుపాయాలు, ఇతర అవసరాలు | 514.14 |
| ఆయుష్ | 154.48 |
| 108 అంబులెన్స్ సేవలు | 187.42 |
| ఏపీవీవీపీలో పారిశుధ్యం, ఇతర సౌకర్యాల కల్పన | 120 |
| ఔషధ నియంత్రణ విభాగం | 32.24 |
| 104 ఎంఎంయూ సేవలు | 164.18 |
| మహాప్రస్థానం | 11.46 |
| వైఎస్సార్ కంటి వెలుగు | 20 |
| రేడియాలజీ సేవలు | 41.72 |
| మందుల కొనుగోలు, వైద్య సేవలు, ఇతర అవసరాలు | 2,134.02 |
| కుటుంబ సంక్షేమ కార్యకలాపాలు | 3,585.43 |



నిరంతరం
కార్యదీక్షత మరియు
విశాల దృక్పథంతో
మదిని మార్గదర్శనం
చేసేలా ఆ స్వేచ్ఛా స్వర్గంలోకి చేరేలా
నా దేశాన్ని జాగృతం చేయండి తండ్రీ.
- రవీంద్రనాథ్ ఠాగూర్

## మౌలిక వసతులకు పెద్దపీట



సంక్షేమంతో పాటు పారిశ్రామిక, రహదారులు, సాగునీటి రంగాలకు భారీగా నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. పారిశ్రామిక రంగంలో మౌలిక వసతులకు రూ.1,295 కోట్లు, నైపుణ్యాభివృద్ధికి రూ.1,166 కోట్లు, సాగు నీటి రంగానికి రూ.11,908 కోట్లు, రహదారులకు రూ.9,118 కోట్లు కేటాయించడం హర్షణీయం.

– జీఎస్ కరుణేంద్ర, అధ్యక్షుడు, ఫ్యాప్సీ (ఏపీ చాప్టర్)

## సంక్షేమంతోనే అభివృద్ధి



సంక్షేమం, అభివృద్ధి అనేవి వేర్వేరుగా చూడకూడదు. అభివృద్ధికి పర్యాయ పదంగా సంక్షేమాన్ని చెప్పవచ్చు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందినప్పుడు ఆ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సత్ఫలితాలు ఇస్తున్నట్టు కేంద్ర గణాంకాలే చెపుతున్నాయి. దేశంలోనే ఏపీ అత్యధిక వృద్ధిని నమోదు చేసింది. ప్రస్తుత రూ.2.79 లక్షల కోట్ల బడ్జెట్‌లో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ కేటాయింపులు చేయడం ఆహ్వానించదగ్గ పరిణామం.

–ఎం.ప్రసాదరావు, ఎకనమిక్స్ మాజీ విభాగాధిపతి, ఏయూ

## కేటాయింపులు బాగున్నాయ్



రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి కోసం రూ.1,166 కోట్లు కేటాయించడాన్ని ఏపీ చాంబర్స్ స్వాగతిస్తోంది. పారిశ్రామిక రంగానికి రూ.2,602.13 కోట్లు, మౌలిక వసతులకు రూ.1,295 కోట్లు కేటాయించారు. వైజాగ్ సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్లకు పైగా పెట్టుబడుల ప్రతిపాదనలు రావడంతో దానికి అనుగుణంగా పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనకు మరికొంత అధికంగా కేటాయిస్తే ఇంకా బాగుండేది.

– పొట్లూరి భాస్కరరావు, అధ్యక్షుడు, ఏపీ చాంబర్స్

## ఎస్సీ పారిశ్రామికవేత్తలకు తొలిసారి కేటాయింపులు



రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎస్సీ పారిశ్రామికవేత్తలకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయడాన్ని స్వాగతిస్తున్నాం. వైఎస్సార్ బడుగు వికాసం కింద ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు బడ్జెట్‌లో ఎస్సీ పారిశ్రామికవేత్తల ప్రోత్సాహకాల కోసం రూ.175 కోట్లు కేటాయించింది.

– మామిడి సుదర్శన్, జాతీయ అధ్యక్షుడు, దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్

# స్మార్ట్ మీటర్ల ఖర్చు సర్కారుదే

**18.74 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా**




**సాక్షి, అమరావతి:** 'సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఇంధన భద్రత తప్పనిసరి. వెనుకబడిన వర్గాలకు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి చౌకైన, నమ్మకమైన, సమర్థవంతమైన ఇంధన సేవలను 2030 నాటికి అందించడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 18.74 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు 9 గం. ఉచిత వ్యవసాయ విద్యుత్, ఎస్సీ, ఎస్టీ నివాసాల్లోని ప్రతి ఇంటికీ నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తోంది' అని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ గురువారం అసెంబ్లీ సమావేశంలో తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. 2023–24 బడ్జెట్‌లో ఇంధన రంగానికి ప్రభుత్వం రూ.6,546 కోట్లు కేటాయించింది. ఇందులో రూ.5,500 కోట్లను వ్యవసాయ ఉచిత విద్యుత్ సబ్సిడీకి ఇచ్చేలా ప్రతిపాదించింది. పంపుసెట్లకు అమర్చే స్మార్ట్ మీటర్ల ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. దోబీ ఘాట్లకు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న రజక కుటుంబాలకు, వెనుకబడిన కులాల వారికి, చేనేత కార్మికులకు, క్షౌర శాలలకు విద్యుత్ రాయితీ వర్తింప చేస్తున్నట్టు పేర్కొంది. విద్యుత్ రాయితీని చిన్న గ్రానైట్ యూనిట్లకు యూనిట్‌కి రూ.2గా ఇటీవల ప్రకటించారు. నాపరాతి యూనిట్లకూ కూడా ఇదే విధమైన ప్రయోజనాన్ని వర్తింపజేయాలని బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించింది.

### రాత్రి పూట పొలాల్లో జాగారం లేకుండా..

'రైతులకు రాత్రిపూట జాగారం వద్దు. పొలాల్లో కాపలాలు వద్దు. పగటి పూట నాణ్యమైన 9 గంటల విద్యుత్ ముద్దు. ఇది మా ప్రభుత్వ లక్ష్యం' అని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. ఆయన వ్యవసాయ బడ్జెట్‌లో పేర్కొన్న ప్రకారం నాణ్యమైన విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 96,300 కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశారు. ఆక్వా రైతులకూ రాష్ట్ర ప్రభుత్వం యూనిట్‌కు రూ.3.50 చొప్పున రాయితీనిస్తోంది. పదెకరాల వరకు యూనిట్‌కు రూ.1.50 మాత్రమే వసూలు చేస్తోంది.

### ఫీడర్లు బలపడ్డాయ్

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 6,663 ఫీడర్ల ద్వారా వ్యవసాయ విద్యుత్ సరఫరా చేసేవారు. ఇందులో 3,854 ఫీడర్లు మాత్రమే అప్పటికి ఉన్న మౌలిక సదుపాయాలతో 9 గంటల పగటిపూట సరఫరా చేయగల సామర్థ్యం కలిగి ఉండేవి. మిగిలిన 2,809 ఫీడర్లకు ఈ ప్రభుత్వం అదనపు సామర్థ్యం కల్పించి పగటిపూట విద్యుత్ సరఫరా చేస్తోంది. గత మూడేళ్లలో కల్పించిన మౌలిక సదుపాయాలతో.. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 6,770 వ్యవసాయ ఫీడర్లలో 6,640 ఫీడర్లు 9 గంటల పగటిపూట నిరంతర విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నాయి. మిగిలిన 130 ఫీడర్లు కూడా రెండు విడతలుగా పగటిపూట 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నాయి. మిగిలిన రైతులకు కూడా పగటిపూటే 9 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఇచ్చేలా పనులు పురోగతిలో ఉన్నాయి. రైతులకు ఉచిత విద్యుత్ సరఫరాకు సంబంధించిన నగదు బదిలీ కోసం వ్యవసాయ పంపుసెట్లకు ప్రభుత్వం మీటర్లు బిగించనుంది. ఇందుకయ్యే ఖర్చు మొత్తం రూ.5,692 కోట్లను ప్రభుత్వమే భరిస్తుంది. వ్యవసాయ రంగానికి రానున్న 30 ఏళ్లపాటు ఉచిత విద్యుత్ అందించాలనే కృతనిశ్చయంతో 7వేల మెగావాట్ల విద్యుత్‌ను 'సెకీ' (ఎస్ఈసీఐ) ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది.

# పేదల సంజీవని ఆరోగ్యశ్రీకి రూ.2,400 కోట్లు

## గతేడాది కంటే ఈసారి బడ్జెట్‌లో 8.32 శాతం అదనంగా కేటాయింపులు

- ఆరోగ్య ఆసరాకు రూ.445 కోట్లు
- 108 సేవల కోసం రూ.187 కోట్లు
- 104కి రూ.164 కోట్లు

**సాక్షి, అమరావతి:** 2023–24 బడ్జెట్‌లో ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. రాష్ట్రంలోని 95 శాతం కుటుంబాలకు సంజీవని అయిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకానికి రూ.2,400 కోట్లను ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించింది. అదేవిధంగా శస్త్ర చికిత్సల అనంతరం రోగులకు విశ్రాంత సమయానికి భృతి అందించే ఆరోగ్య ఆసరాకు రూ.445 కోట్లు కేటాయించింది. ఈ రెండింటికి గత బడ్జెట్‌లో రూ.2,300 కోట్లు అందించగా ఈసారి రూ.545 కోట్ల మేర అదనంగా కేటాయించారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌కు ప్రభుత్వ వాటా కింద రూ.140 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఇలా మొత్తంగా వైద్య, ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో రూ.15,882.33 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి రూ.498.07 కోట్లు కేటాయింపులు పెరిగాయి. ఈ లెక్కన 2022–23తో పోలిస్తే వైద్య, ఆరోగ్య రంగానికి ఈసారి 8.32 శాతం నిధులు అధికంగా కేటాయించారు.

**గిరిజన మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణానికి రూ.120 కోట్లు**

**వైద్య, ఆరోగ్య రంగానికి రూ.15,882 కోట్లు**



### నాడు-నేడు కోసం..



నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ముఖచిత్రాన్ని మార్చివేయడానికి సీఎం వైఎస్ జగన్ సర్కార్ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బడ్జెట్‌లో నాడు–నేడు కార్యక్రమానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. ఏపీ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేయడానికి రూ.350 కోట్లు కేటాయింపులు చేశారు. డీఎంఈ పరిధిలో మెడికల్ భవనాల కోసం రూ.941.32 కోట్లు, ఆయుష్ కళాశాలల అభివృద్ధికి రూ.10 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.500 కోట్లు ప్రభుత్వం వెచ్చించబోతోంది.

## ఆపద్బంధు.. వైఎస్సార్ బీమాకు రూ.372 కోట్లు

### బడ్జెట్‌లో కేటాయింపులు



**సాక్షి, అమరావతి:** అనుకోని ప్రమాదాల్లో పెద్ద దిక్కుని కోల్పోయే అసంఘటిత రంగాలకు చెందిన కార్మికుల కుటుంబాలకు ఉచిత బీమా అందించే వైఎస్సార్ బీమా పథకానికి బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.372 కోట్లు కేటాయించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. 18 నుంచి 70 ఏళ్ల మధ్య సంపాదించే అసంఘటిత రంగాల కార్మికులు మరణిస్తే బీమా కంపెనీలు, బ్యాంకులతో సంబంధం లేకుండా ఆ కుటుంబానికి ప్రభుత్వమే నేరుగా బీమా సాయం అందిస్తోంది. గత రెండేళ్లలో ఈ పథకం కింద రూ.512 కోట్ల మేర క్లెయిమ్‌లను ప్రభుత్వం పరిష్కరించింది. వైఎస్సార్ బీమాకు రూ.372 కోట్లతో కలిపి కార్మిక శాఖకు ప్రభుత్వం 2023–24కు రూ.795.80 కోట్ల నిధులను కేటాయించింది. ఈఎస్ఐ డిస్పెన్సరీలకు రూ.340.3 కోట్లు కేటాయించారు. అలాగే అనంతపురంలోని లేబర్ కోర్టుకు రూ.1.21 కోట్లు, విశాఖపట్నం లేబర్ కోర్టు, ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్‌కు రూ.1.25 కోట్లు, గుంటూరు లేబర్ కోర్టుకు రూ.83.23 లక్షలు కేటాయించింది.

# పట్టణాభిషేకం



**మొత్తంగా రూ.9,381.54 కోట్లు కేటాయింపు**

- స్మార్ట్ సిటీస్ కింద నాలుగు నగరాలకు నిధులు
- పట్టణాల్లో వ్యర్థాలు, మురుగు నీటి శుద్ధికి ప్రాధాన్యం
- అమృత్ 2.0 ప్రాజెక్టులకు రూ.480 కోట్లు
- సీఆర్డీఏ అవసరాలకు రూ.500 కోట్లు
- టిడ్కో ఇళ్లకు రూ.1,300 కోట్లు
- నూతన రాజధానిలో మౌలిక వసతులకు రూ.500 కోట్లు



**సాక్షి, అమరావతి:** పట్టణ ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. పురపాలక సంఘాల్లోని ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. పేదలకు టిడ్కో ఇళ్ల కేటాయింపునకు, ఘన వ్యర్థాల నిర్వహణకు, మురుగు నీటి శుద్ధికి, స్మార్ట్ సిటీస్ అభివృద్ధిలో భాగంగా 4 ముఖ్య నగరాలకు, స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు వడ్డీ లేని రుణాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. మొత్తంగా 2023–24 బడ్జెట్‌లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.9,381.54 కోట్లు కేటాయించింది. ఇందులో టిడ్కో ప్రాజెక్టుకు రూ.1,300 కోట్లు, సీఆర్డీఏ అవసరాలకు రూ.500 కోట్లు, కొత్త రాజధాని నగరానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రూ.500 కోట్లు, కొత్త రాజధాని భూ సేకరణకు రూ.240.09 కోట్లు కేటాయించింది. ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యమిచ్చారు. మున్సిపల్ వార్డు కార్యదర్శుల కోసం రూ.925.63 కోట్లు, వలంటీర్ల గౌరవ వేతనాలకు 434.86 కోట్లు.. అలాగే ప్రజారోగ్య శాఖలో పనిచేస్తున్న కార్మికుల ఆరోగ్య భృతికి రూ.241.99 కోట్లు, మున్సిపాలిటీల ఏర్పాటు, అవసరాల కోసం రూ.1,150 కోట్లు, స్మార్ట్ సిటీస్‌లో ప్రాజెక్టుల్లో భాగంగా అమరావతికి రూ.300 కోట్లు, కాకినాడ, తిరుపతి, విశాఖపట్నం నగరాలకు రూ.50 కోట్ల చొప్పున కేటాయింపులు చేశారు. పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాలు ఇచ్చేందుకు రూ.300 కోట్లు, అమృత్ 2.0 ప్రాజెక్టుల కోసం ఈసారి ప్రత్యేకంగా రూ.480 కోట్లు కేటాయించారు. స్వచ్ఛభారత్ మిషన్(అర్బన్)లో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణకు రూ.250 కోట్లు, మురుగు నీటి శుద్ధి, నిర్వహణకు రూ.300 కోట్లు.. అలాగే అర్బన్ కెపాసిటీ బిల్డింగ్‌తో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ కోసం రూ.20 కోట్లు, ఎస్‌బీఎంలో భాగమైన అర్బన్ ఐఈసీ అండ్ బిహేవియర్ కార్యక్రమానికి రూ.40 కోట్లు, వివిధ పట్టణాల్లో యాస్పిరేషనల్ టాయిలెట్ల నిర్మాణానికి రూ.27.74 కోట్లు కేటాయించారు.

## పేదల సొంతింటి కల సాకారం



**2023-24 బడ్జెట్‌లో పేదల ఇళ్లకు రూ.6,291 కోట్లు కేటాయింపు**

**గతంతో పోలిస్తే 3.30 శాతం అదనంగా నిధులు**

**సాక్షి, అమరావతి :** రాష్ట్రంలోని నిరుపేదల సొంతింటి కల సాకారం చేసే దిశగా ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలు ఉండరాదన్న లక్ష్యంతో సీఎం జగన్ నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద రాష్ట్రంలో 30 లక్షల మందికి పైగా పేదలకు పక్కా గృహ యోగం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో 30.65 లక్షల మంది మహిళలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు విలువ చేసే ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి, ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఈ ఇళ్ల నిర్మాణం కోసం 2023–24 బడ్జెట్‌లో రూ.6,291.70 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌తో పోలిస్తే 3.30 శాతం మేర అదనంగా కేటాయింపులు చేపట్టింది.

### ఆర్థిక సాయంతో పాటు..



2022–23 బడ్జెట్‌లో పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.4,791.69 కోట్లు ఖర్చు చేసింది. కాగా, ఈ అంచనాలు రూ.7,277.18 కోట్లకు చేరాయి. ప్రభుత్వం ఇప్పటి వరకూ రెండు దశల్లో 21.25 లక్షల ఇళ్ల నిర్మాణాలకు అనుమతులిచ్చింది. వీటిలో 20 లక్షల వరకూ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేపట్టి వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. వీటిలో ఇప్పటికే నాలుగు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయింది. లబ్ధిదారులకు ఉచితంగా స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల మొత్తాన్ని ప్రభుత్వం అందిస్తోంది. దీంతో పాటు ఒక్కో లబ్ధిదారుకు పావలా వడ్డీకి రూ.35 వేల చొప్పున రుణ సాయం చేస్తోంది. అంతేకాకుండా ఉచితంగా ఇసుక, సబ్సిడీపై సిమెంట్, ఐరన్ సహా ఇతర నిర్మాణ సామాగ్రినీ సరఫరా చేస్తోంది.

# పారిశ్రామిక రంగానికి నిధుల ధార

**పరిశ్రమలు, ఐటీ రంగానికి రూ.4,112.5 కోట్లు** | **గత ఏడాదితో పోలిస్తే 146 శాతం పెరిగిన నిధులు**



### మరికొన్ని కేటాయింపులు ఇలా.. కేటాయింపు (రూ. కోట్లలో)

| | |
|---|---|
| సాగరమాల ప్రాజెక్టు | 100 |
| రామాయపట్నం పోర్టు | 100 |
| భావనపాడు పోర్టు | 100 |
| కడప స్టీల్ ప్లాంట్ | 250 |
| వైఎస్సార్ ఈఎంసీ | 100 |
| ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు | 100 |
| సూక్ష్మ పరిశ్రమల క్లస్టర్ | 25 |
| ఎంఎస్ఎంఈ క్లస్టర్స్ | 30 |
| ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ స్కీం | 50 |

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించి తద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో 2023–24 బడ్జెట్‌లో వైఎస్ జగన్ ప్రభుత్వం భారీగా కేటాయింపులు చేసింది. గతేడాది సవరించిన బడ్జెట్ అంచనాలతో పోలిస్తే పరిశ్రమలు, పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన, ఐటీ రంగాల కేటాయింపులను 146 శాతం పెంచింది. 2022–23లో రూ.1,672.36 కోట్లుగా ఉన్న కేటాయింపులను 2023–24కు రూ.4,112.5 కోట్లకు పెంచారు. పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధి, ఎంఎస్ఎంఈ, పారిశ్రామిక ప్రోత్సాహకాలకు భారీ కేటాయింపులు చేసింది. ఇందులో పరిశ్రమలకు రూ.2,602.13 కోట్లు కేటాయించగా.. పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనకు రూ.1,295.22 కోట్లు కేటాయించింది. విశాఖ–చెన్నై కారిడార్‌లో భాగంగా నక్కపల్లి క్లస్టర్, కొప్పర్తి, చిత్తూరు క్లస్టర్ల అభివృద్ధి కోసం రూ.761 కోట్లు కేటాయించింది. సుదీర్ఘ తీరప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూ 4 పోర్టుల కోసం రూ.450 కోట్లు కేటాయించింది. గత ప్రభుత్వం మాదిరిగా బకాయిలు పెట్టకుండా ఏటా క్రమం తప్పకుండా పారిశ్రామిక రాయితీలు, ప్రోత్సాహకాలను చెల్లిస్తున్న ప్రభుత్వం అందుకు అనుగుణంగా వచ్చే ఏడాదీ భారీగా కేటాయింపులు చేసింది. ఎంఎస్ఎంఈ రంగానికి రాయితీలిచ్చేందుకు రూ.465 కోట్లు, పారిశ్రామిక ప్రోత్సాహకాలకు రూ.412 కోట్లు, ఎస్సీ పారిశ్రామిక రాయితీలకు రూ.175 కోట్లు కేటాయించింది. కడప స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి కూ.250 కోట్లు, వైఎస్సార్ ఈఎంసీకి రూ.100 కోట్లు, ఐటీ రంగానికి రూ.215.14 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలోని పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంలో భాగంగా నైపుణ్యాభివృద్ధి కోసం రూ.1,166 కోట్లను కేటాయించారు.

## విపత్తువేళ ఆదుకునేలా..

# రీసర్వే ముమ్మరంగా సాగేలా..

**బడ్జెట్‌లో రెవెన్యూ శాఖకు రూ.5,379 కోట్లు కేటాయింపు**

- విపత్తుల నిర్వహణ నిధికి రూ.2 వేల కోట్లు
- రీసర్వేకు ప్రత్యేకంగా రూ.321 కోట్లు
- వైఎస్సార్ గృహ వసతి పథకానికి రూ.500 కోట్లు



**సాక్షి, అమరావతి:** ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు తక్షణమే ఆదుకునేందుకు ఈ ఏడాది కూడా ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియ మరింత వేగంగా ముందుకు సాగేలా బడ్జెట్‌లో ప్రత్యేకంగా రూ.321 కోట్లు కేటాయింపులు చేసింది. వైఎస్సార్ గృహ వసతి పథకానికి రూ.500 కోట్లు కేటాయించింది. మొత్తంగా ఈ బడ్జెట్‌లో రెవెన్యూ శాఖకు రూ.5,379 కోట్లు కేటాయించింది. రెవెన్యూ, సర్వే సెటిల్మెంట్, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, దేవదాయ శాఖల బడ్జెట్ ఇందులోనే కలిసి ఉంటుంది. రెవెన్యూ శాఖలో అంతర్భాగమైన విపత్తుల నిర్వహణ నిధి కింద రూ.2 కోట్లు కేటాయించింది. గతేడాదీ ఇంతే మొత్తాన్ని కేటాయించింది. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు సహాయక చర్యల నిమిత్తం ప్రభుత్వం ఆగమేఘాల మీద నిధులు విడుదల చేస్తోంది.

### ప్రతిష్టాత్మక రీ సర్వేకు ప్రాధాన్యం


జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకం కింద రీ సర్వేకు బడ్జెట్‌లో రూ.321 కోట్లను కేటాయించారు. ఈ పథకం కింద ఇప్పటికే 2 వేల గ్రామాల్లో రీ సర్వేను పూర్తి చేసి భూ హక్కు పత్రాల పంపిణీని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆయా గ్రామాలకు సంబంధించి 4.3 లక్షల పట్టా సబ్ డివిజన్లు, 2 లక్షల మ్యుటేషన్లను ఉచితంగా చేశారు. ఈ సంవత్సరం డిసెంబర్ నాటికి రాష్ట్రమంతా రీ సర్వే పూర్తి చేసే దిశగా రెవెన్యూ, సర్వే సెటిల్మెంట్ శాఖలు చేస్తున్న కృషికి ఎక్కడా ఆర్థికంగా ఆటంకాలు కలగకుండా బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. సర్వేకు అవసరమైన డ్రోన్లు, రోవర్లు కొనుగోలు చేయడంతోపాటు అత్యంత ఆధునిక రీతిలో జరుగుతున్న సర్వేకు అవసరమైన సకల సౌకర్యాలను ప్రభుత్వం సమకూరుస్తోంది. ఈ సంవత్సరం మే నాటికి మరో 2 వేల గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయడానికి రెవెన్యూ యంత్రాంగం శ్రమిస్తోంది. ఇందుకు తగ్గట్టుగా ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది.




వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన నాటి నుండి సామాజిక పింఛన్లకు కేటాయింపులు ఇలా...

| సంవత్సరం | కేటాయింపు (రూ.కోట్లలో) |
|---|---|
| మే 2019 - మార్చి 2020 (11 నెలలు) | 14,400.48 |
| 2020-2021 | 16,923.86 |
| 2021-2022 | 17,389.22 |
| 2022-2023 (2022 ఏప్రిల్ నుంచి 2023 ఫిబ్రవరి వరకు) | 18,110.02 |
| 2023-24 | 21,434.72 |

నోట్: టీడీపీ అధికారంలో ఉండగా చంద్రబాబు సర్కారు ఐదేళ్ల పాటు పింఛన్ల కోసం వెచ్చించిన మొత్తం కేవలం రూ.27,541 కోట్లు మాత్రమే




న్యాయమైన సమాజం అంటే, దానిపట్ల గౌరవం పెరగటం, ధిక్కారభావం తగ్గడం. ఇది కరుణ గల సమాజ నిర్మాణంలో మాత్రమే సాధ్యం
- డా. బీఆర్ అంబేడ్కర్



## ఇది పూర్తిగా సంక్షేమ బడ్జెట్



ఇది పూర్తిగా సంక్షేమ బడ్జెట్. గత ప్రభుత్వంతో అస్సలు పోల్చలేం. పేదలు, మధ్య తరగతి ప్రజల కోసం ఆలోచిస్తోంది ఈ ప్రభుత్వం. వైద్య రంగానికి, పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోంది. జిల్లాకో మెడికల్ కళాశాల తెస్తోంది. బడ్జెట్‌లో విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. రూ.30 వేల కోట్లు కేటాయించారు. అవసరమైతే ఇంకా ఖర్చుపెడతాం. జాతీయ విద్యా విధానం అమలుకు ముందుకొచ్చిన ఏకైక రాష్ట్రం ఏపీ. వనరులను తీసుకుని ఆదాయం సమకూర్చి ఖర్చు చేస్తాం. రాష్ట్రంలో జీడీపీ పెరిగిందంటే అభివృద్ధి జరుగుతున్నట్టే. గతంలో ఆకలి చావులు, రైతు ఆత్మహత్యలు జరిగేవి. ఇప్పుడు లేవు. ఉద్యోగులు ప్రభుత్వ కుటుంబ సభ్యులు. వారి సంక్షేమానికి కట్టుబడి ఉంటాం. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం.

– బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ మంత్రి

## విమర్శించే అవకాశం లేదు



రాష్ట్ర బడ్జెట్‌ను ప్రతిపక్షాలే కాదు.. ఎవరూ విమర్శించే అవకాశం లేదు. అంత చక్కగా ప్రాధాన్యత రంగాలకు గత ప్రభుత్వంకంటే ఎక్కువ నిధులు కేటాయించారు. జనవరి నుంచి 65 లక్షల మందికి పింఛన్ ఇస్తామని బడ్జెట్‌లో చెప్పారు. ఒకప్పుడు విద్యలో ఏపీ పదహారో స్థానంలో ఉండేది. గత మూడేళ్లలోనే విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టడం వల్ల ఇప్పుడు ఏపీ మూడో స్థానంలో ఉంది. పరిశ్రమలకి ఏపీలో అత్యధిక రాయితీలను ప్రభుత్వం కల్పిస్తోంది. అన్ని సదుపాయాలతో లక్షలాది ఇళ్లు నిర్మిస్తున్నాం.

– సామినేని ఉదయభాను, ప్రభుత్వ విప్

## టీడీపీ భయపడుతోంది



రూ.2.79 లక్షల కోట్ల బడ్జెట్ రాష్ట్ర ప్రజలను సంతోషంగా ఉంచుతుంది. బీఆర్ అంబేడ్కర్ చెప్పింది సీఎం జగన్ ఆచరణలో చేస్తున్నారు. దాదాపు రూ.13.50 లక్షల కోట్ల పెట్టుబడులకు జీఐఎస్ లో ఒప్పందాలు జరిగాయి. జీడీపీలో 27 శాతంగా ఉన్న ఏపీ తక్కువ కాలంలోనే 11 శాతం వృద్ధి సాధించింది. సుమారు రూ.60 వేల కోట్లు బడుగు బలహీన వర్గాలకి బడ్జెట్‌లో కేటాయించారు. ఈ బడ్జెట్ ను చూసి టీడీపీ భయపడుతోంది. ఏం మాట్లాడాలో కూడా తెలియక సస్పెండ్ చేయించుకుని ఆ పార్టీ నేతలు సభ నుంచి వెళ్లిపోయారు.

– కొరముట్ల శ్రీనివాసులు, ప్రభుత్వ విప్

## స్పష్టత లేదు

రాష్ట్రాన్ని మరింత అప్పుల్లోకి నెట్టేలా ఉంది ఈ బడ్జెట్. కేటాయింపులకు నిధులెలా తెస్తారో స్పష్టత లేదు. డీబీటీ పథకాలకే ప్రాధాన్యతనిచ్చారు. అంకెల గారడీ చేశారు. ఒకటో తేదీన ఉద్యోగులకి జీతాలెందుకు ఇవ్వట్లేదు? పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, హంద్రీ–నీవా ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయింపులు చాలవు. సీపీఎస్ రద్దు ప్రస్తావన లేదు. ఉద్యోగుల సమస్యలు, ఖాళీల భర్తీ వంటి డిమాండ్ల ప్రస్తావన లేదు.


– పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, షేక్ షాబ్జీ

## పొంతన లేదు

ఇది దగాకోరు బడ్జెట్. కేటాయింపులకు, ఖర్చులకు పొంతన లేదు. సాగు నీటి రంగానికి గత బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పిన ప్రభుత్వం కేవలం రూ.4 వేల కోట్లే ఖర్చు చేసింది. రహదారులకు రూ.9 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పినా ఒక్క పైసా ఖర్చు పెట్టలేదు. సంక్షేమం పేరుతో ప్రజల్ని మోసగిస్తున్నారు. రాష్ట్ర జీడీపీ 7 శాతం కూడా దాటకపోయినా అప్పుల కోసం 14 శాతం పెరిగినట్లు అబద్ధాలు చెబుతున్నారు.

– టీడీపీ నేతలు అచ్చెన్నాయుడు, బుచ్చయ్య చౌదరి, రామానాయుడు

## ఇది స్టిక్కర్ బడ్జెట్



ఆర్థిక మంత్రి అంకెలతో మాయ చేశారు. ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చి తీసుకునే రుణాలు ఎంత అనేది వెల్లడించాలి. కేంద్ర ప్రభుత్వ పథకాలు, నిధులకు ఈ ప్రభుత్వం స్టిక్కర్లు వేసుకున్న విధంగా ఇది ఒక స్టిక్కర్ బడ్జెట్. బడ్జెట్‌లో 80 శాతం రెవెన్యూ వ్యయం కాగా మూలధనం వ్యయం పెరగకపోవడం ఆందోళన కలిగించే అంశం.

– సోము వీర్రాజు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

# అవ్వా తాతలపై అనురాగం

**సామాజిక పింఛన్లకు బడ్జెట్‌లో రూ.21,434.72 కోట్లు**

- టీడీపీ ఐదేళ్లలో ఇచ్చింది కేవలం రూ.27,541 కోట్లే
- ఇప్పుడు ఒక్క ఏడాదికే భారీగా కేటాయింపులు
- మూడున్నరేళ్లలో 24 లక్షల కొత్త పింఛన్లు
- మంజూరులో పూర్తి ఉదారంగా రాష్ట్ర ప్రభుత్వం
- పంపిణీ విధానంలో విప్లవాత్మక మార్పులు

**సాక్షి, అమరావతి:** గత మూడున్నరేళ్లలో దాదాపు 24 లక్షల మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బడ్జెట్‌లోనూ అత్యధిక కేటాయింపులు చేసింది. అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రతి నెలా ఇచ్చే సామాజిక పింఛన్లకు బడ్జెట్‌లో ఏకంగా రూ.21,434.72 కోట్లు కేటాయించి అవ్వాతాతల సంక్షేమం పట్ల అనురాగాన్ని చాటుకుంది. రెండు ప్రభుత్వ శాఖలు మినహా మిగతా ఏ శాఖతో పోల్చినా పింఛన్ల బడ్జెట్టే అధికంగా ఉండటం రాష్ట్ర ప్రభుత్వ సామాజిక స్పృహ, ప్రాధాన్యతను చాటుతోంది. టీడీపీ అధికారంలో ఉండగా చంద్రబాబు సర్కారు ఐదేళ్ల పాటు పింఛన్ల కోసం వెచ్చించిన మొత్తం కేవలం రూ.27,541 కోట్లు మాత్రమే కావడం గమనార్హం. గత సర్కారు సరాసరిన నెలకు రూ.459 కోట్లు మాత్రమే అవ్వాతాతలకు పింఛన్ల కోసం వ్యయం చేసింది. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రతి నెలా పింఛన్ల పంపిణీకి రూ.1,750 కోట్లు దాకా ఖర్చు చేస్తోంది. ఇక చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయే ఆర్నెళ్ల ముందు వరకు 39–40 లక్షల మందికి పింఛన్లు ఇవ్వగా, ఇప్పుడు ప్రతి నెలా దాదాపు 64 లక్షల మంది పెన్షన్లు పొందుతున్నారు.

### పడిగాపులు లేకుండా ఇంటి వద్దే...

టీడీపీ హయాంలో కొత్తగా ఒక పింఛను మంజూరు కావాలంటే చుక్కలు కనిపించేవి. జన్మభూమి కమిటీలు, టీడీపీ నేతలు కనికరిస్తేనే పింఛన్లు మంజూరయ్యేవి. ఇదంతా ఒక ఎత్తు కాగా ప్రతి నెలా పింఛను డబ్బులు తీసుకునేందుకు అవ్వాతాతలు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఇప్పుడు వలంటీర్లే ఇళ్ల వద్దకు వెళ్లి చిరునవ్వుతో పంపిణీ చేస్తున్నారు. డోర్ డెలివరీ పద్ధతిలో పింఛన్లు అందించడం దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో మొదలైంది.



పింఛన్ల మంజూరు, పంపిణీలో ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం కీలక సంస్కరణలు తీసుకొచ్చింది. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పింఛనుదారులకు కూడా పెన్షన్లు అందుతున్నాయి.

కులం, మతం, పార్టీ వివక్ష లేకుండా సంతృప్త స్థాయిలో అర్హులందరికీ పింఛన్లు.

వృద్ధాప్య పింఛన్ల అర్హత వయసు 65 నుంచి 60 ఏళ్లకు తగ్గింపు.

తలసేమియా, సికిల్‌సెల్, తీవ్ర హిమోఫీలియా వ్యాధిగ్రస్తులు, పక్షవాతంతో చక్రాల కుర్చీ లేదా మంచానికే పరిమితమైన వారు, డయాలసిస్ చేయించుకుంటున్న దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధిగ్రస్తులు, లివర్, కిడ్నీ, గుండె మార్పిడి చేయించుకున్నవారు, కుష్టు వ్యాధి లాంటి 11 రకాల దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.5,000 నుంచి రూ.10,000 వరకు పింఛన్లు కింద చెల్లింపు.

# 2021–22లో భారీగా తగ్గిన అప్పులు

**కాగ్ నివేదిక చెప్పింది ఇదే..**

- 2021–22లో కేవలం రూ.25,011 కోట్లే ద్రవ్యలోటు
- ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల కన్నా తక్కువగా 2.08 శాతమే ద్రవ్యలోటు



**సాక్షి, అమరావతి:** 2021–22 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర అప్పులు భారీగా తగ్గాయి. దీంతో ఆ ఏడాది ద్రవ్య లోటు అదుపులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ అకౌంటెంట్ జనరల్ ఖరారు చేసిన అకౌంట్స్ ప్రకారం.. 2021–22 ఆర్థిక ఏడాదిలో ద్రవ్య లోటు రూ.25,011 కోట్లుగా ఉందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ గురువారం అసెంబ్లీలో 2023–24 వార్షిక బడ్జెట్ సమర్పణ సందర్భంగా వెల్లడించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో ఇది 2.08 శాతంగా ఉందని మంత్రి తెలిపారు. అంతేకాక.. ఇది ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల కన్నా తక్కువన్నారు. వాస్తవానికి.. ఆ ఏడాది బడ్జెట్ అంచనాల్లో ద్రవ్యలోటు రూ.37,029 కోట్లుగా ప్రతిపాదించారు. అలాగే, 2021–22 ఆర్థిక ఏడాది రెవెన్యూ లోటు రూ.8,610 కోట్లుగా కాగ్ ఖరారు చేసిందని, ఇది రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 0.72 శాతంగా ఉందని మంత్రి వివరించారు. మరోవైపు.. ద్రవ్య లోటు, రెవెన్యూ లోటును తగ్గించేందుకు 2023–24 ఆర్థిక ఏడాది బడ్జెట్‌లో గట్టి ప్రయత్నమే చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రాష్ట్ర అప్పులు రూ.4,83,008.96 కోట్లకు చేరుతాయని, ఇది రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 33.32 శాతంగా ఉంటుందని బడ్జెట్ పత్రాల్లో ప్రభుత్వం స్పష్టంచేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) ముగిసే నాటికి రాష్ట్ర అప్పులు రూ.4,26,233.92 కోట్లుగా ఉంటాయని పేర్కొంది.



# పేదలకు 'పౌష్టిక' భరోసా

- బడ్జెట్‌లో పౌరసరఫరాల శాఖకు రూ.3,725.32 కోట్లు
- గత బడ్జెట్‌తో పోలిస్తే రూ.6.08 కోట్లు పెంచిన ప్రభుత్వం
- 2022–23లో కేటాయింపులకు మించి రూ.9.85 కోట్ల ఖర్చు
- ఏప్రిల్ నుంచి అన్ని జిల్లాల్లో ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ

**సాక్షి, అమరావతి:** రాష్ట్రవ్యాప్తంగా పేదలకు పౌష్టికాహారాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఏప్రిల్ నుంచి అన్ని జిల్లాల్లో సార్టెక్స్ చేసిన బలవర్ధక ఆహారం (ఫోర్టిఫైడ్ బియ్యం) పంపిణీ చేయనుంది. ఈ మేరకు ప్రభుత్వం 2023–24 బడ్జెట్‌లో పౌరసరఫరాల శాఖకు రూ.3,725.32 కోట్లు కేటాయించింది. ఇది 2022–23 కేటాయింపుతో పోలిస్తే రూ.6.08 కోట్లు పెరిగింది. అయితే గత ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ కేటాయింపుల కంటే రూ.9.85 కోట్లు అదనంగా ఖర్చు చేయడం విశేషం.

### ఎండీయూ ఆపరేటర్లకు ఆర్థికసాయం

దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎండీయూ వాహనాల్లో ఇంటింటికీ రేషన్ అందిస్తుండటంతో ప్రతి నెల రేషన్ తీసుకునే లబ్ధిదారులు 84 శాతం నుంచి 94 శాతానికి పెరిగారు. దీనికితోడు ఎండీయూ వాహనాలతో ఉపాధి పొందుతున్న 9,260 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన యువతకు ఏటా ఆర్థికసాయం కింద వాహన మిత్ర పథకంలో భాగంగా రూ.10 వేలు ఇవ్వనుంది. గతంలో ఇన్సూరెన్స్ కింద ఎండీయూ ఆపరేటర్లు కట్టిన మొత్తాన్ని కూడా రీయింబర్స్ చేయనుంది. మరోవైపు రాష్ట్రంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, వినియోగదారుల ఫోరాలను బలోపేతం చేయడంతో గత ఆర్థిక సంవత్సరం కేటాయింపులకు మించి ఖర్చు చేసింది.

### కేంద్రంతో సమానంగా..

రాష్ట్రంలో 1,46,14,069 రైస్ కార్డుల్లో 4,26,17,894 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద 90,27,377 కార్డులకు మాత్రమే బియ్యం పంపిణీ చేస్తోంది. మిగిలిన 55,86,692 కార్డులకు రాష్ట్ర ప్రభుత్వమే సొంత ఖర్చుతో సబ్సిడీపై బియ్యం అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం సాధారణ బియ్యాన్నే రాష్ట్ర కోటా కింద ఇస్తుంటే.. ఏపీ ప్రభుత్వం ప్రజారోగ్యం దృష్ట్యా అదనపు ఆర్థిక భారాన్ని మోస్తూ నాణ్యమైన (సార్టెక్స్) బియ్యాన్ని మొత్తం కార్డులకు ఇస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో సార్టెక్స్ చేసిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేస్తున్న ప్రభుత్వం వచ్చే నెల నుంచి అన్ని జిల్లాల్లో ఇవ్వనుంది. వచ్చేనెల నుంచే రాయలసీమ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు కింద చిరుధాన్యాలు (రాగులు, జొన్నలు) పంపిణీ చేయనుంది.

# అక్కచెల్లెమ్మలకు అగ్రపీఠం

**మహిళలు, చిన్నారుల సంక్షేమానికి కేటాయింపులు ఘనం**

- మహిళా సంక్షేమం, అభివృద్ధికి రూ.77,914 కోట్లు
- చిన్నారుల కోసం రూ.20,592 కోట్లు
- ఆది నుంచి మహిళా సాధికారతకు జగన్ ప్రభుత్వం కృషి
- కాంట్రాక్టు, నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం
- స్థానిక సంస్థల్లో 50 శాతానికి మించి పదవులను మహిళలకే
- రాజకీయ పదవుల్లోనూ మహిళలకే ప్రాధాన్యం




**సాక్షి, అమరావతి:** తొలి నుంచి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళాభ్యున్నతికి బడ్జెట్‌లో అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. 2023–24 బడ్జెట్‌లోని జెండర్ బడ్జెట్‌లో మహిళల సంక్షేమానికి, అభివృద్ధికి కేటాయింపులు ఘనంగా చేసింది. కేవలం మహిళల అభివృద్ధికి రూ.77,914 కోట్లు కేటాయించింది. దీనిని రెండు ప్రధాన విభాగాలుగా చేసింది. ప్రత్యేకంగా నూరు శాతం మహిళల కోసమే ఉద్దేశించిన (పార్ట్–ఎ) పథకాలకు రూ.31,825 కోట్లు కేటాయించింది. మహిళలకు 30 నుంచి 99 శాతం వరకు లబ్ధి కలిగేలా ఉద్దేశించిన పథకాలు పార్ట్–బి ప్రోగ్రామ్‌లో రూ.46,088.7 కోట్లు కేటాయించింది. గతేడాది జెండర్ బడ్జెట్‌లో రూ.55,015 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది దాదాపు రూ.23 వేల కోట్లు అదనంగా కేటాయించడం విశేషం. లింగ ఆధారిత బడ్జెట్ కేటాయింపులతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలతోపాటు అన్ని ప్రభుత్వ శాఖల పరిధిలో మహిళా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ఈ నిధులను ఖర్చు చేయనుంది. మహిళా సాధికారతకు దోహదం చేసే సంక్షేమ కార్యక్రమాలు, స్వయం ఉపాధి, ఆర్థిక సాయం, మౌలిక సదుపాయాలు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టనుంది. నైపుణ్యాభివృద్ధి శిక్షణతో ఆర్థిక వనరులను అభివృద్ధి చేసుకునేలా ప్రోత్సాహం అందించనుంది. నీతి ఆయోగ్ సిఫారసుల మేరకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ) సాధించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పయనిస్తోంది.

### మహిళా సాధికారతలో అగ్రగామిగా

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలతో మహిళా సాధికారతను సాధించడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలుస్తోంది. మహిళలకు కాంట్రాక్టు, నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టమే తెచ్చింది. మహిళలు రాజకీయ రంగంలో రాణించేలా ప్రోత్సహిస్తోంది. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి నోచుకోకుండా దశాబ్దాలుగా కాలయాపన జరుగుతున్నప్పటికీ, ఎవరూ అడగకుండానే స్థానిక సంస్థల్లో 50 శాతానికి మించి పదవులను మహిళలకే కట్టబెట్టిన సీఎం వైఎస్ జగన్ దేశంలోనే కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారు. స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చారు.

**'దిశ'తో మహిళా భద్రత**

రాష్ట్రంలోని మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం దిశ బిల్లు తేవడంతో నేర నిరూపణ, శిక్షల్లో గణనీయమైన ఫలితాలు సాధిస్తోంది. 2019లో అసెంబ్లీలో ఆమోదించిన దిశ బిల్లుతో 21 రోజుల్లోనే కేసు దర్యాప్తు, నేర విచారణతో శిక్షలు పడేలా చేయగలుగుతున్నారు. 18 దిశ పోలీస్ స్టేషన్లు (అప్‌గ్రేడ్ చేసిన మహిళా పోలీస్ స్టేషన్లు), మహిళలు, పిల్లల భద్రతకు దిశ యాప్, దిశ ఫోరెన్సిక్ ల్యాబ్‌లు, ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేశారు. మహిళల కోసం 13 వన్ స్టాప్ కౌన్సెలింగ్ సెంటర్లు, మధ్యంతర లీగల్ షెల్టర్లు, హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు, దిశ పెట్రోలింగ్ వాహనాలతో ప్రభుత్వం రాష్ట్రంలో మహిళలకు భద్రత కల్పిస్తోంది.


### చిన్నారుల సంక్షేమానికి రూ.20,592.57 కోట్లు

రాష్ట్రంలో చిన్నారుల సంక్షేమానికి గతేడాది రూ.16,903 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.20,592.57 కోట్లు కేటాయించడం విశేషం. గతేడాది కంటే ఈ సారి దాదాపు రూ.4వేల కోట్లు అదనంగా కేటాయించింది. నూరు శాతం పిల్లలకే ఉద్దేశించిన పథకాలు (పార్ట్–ఎ)లో రూ.13,187 కోట్లు కేటాయించింది. 30 నుంచి 99 శాతం వరకు పిల్లలు లబ్ధిదారులుగా ఉండే పథకాల్లో రూ.7,405.57 కోట్లు కేటాయించింది. చిన్నారులకు అంగన్‌వాడీల్లో వైఎస్సార్ పోషణ, వైఎస్సార్ పోషణ ప్లస్ పథకాల ద్వారా పోషకాహారాన్ని అందిస్తున్న సంగతి తెల్సిందే. చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయం.

# వెల్లివిరిసిన సామాజిక న్యాయం

రాష్ట్ర ప్రభుత్వ తాజా బడ్జెట్ కేటాయింపుల్లోను సామాజిక న్యాయం వెల్లివెరిసింది. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ, నా అగ్రవర్ణ పేదలు... అంటూ ఎప్పుడూ ప్రస్తావించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడ్జెట్‌లోను వారికి ఎనలేని ప్రాధాన్యతనివ్వడం విశేషం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతోపాటు అగ్రవర్ణ పేదల ప్రయోజనం కోసం కాపు, కమ్మ, క్షత్రియ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య కార్పొరేషన్ల ద్వారా వారికి సంక్షేమ ఫలాలను అందిస్తోంది.

-సాక్షి, అమరావతి



ఆషా రాధిక



అభిరుచి



హంస ముఖంలో ముఖం పెట్టి మురిపెంగా చూస్తున్న అమ్మాయి.
నెమలి పింఛాన్ని ఆసక్తిగా చూస్తున్న బుట్టగౌను పాపాయి.
ఏనుగు తొండాన్ని ఆత్మీయంగా నిమురుతున్న యువతి.
ప్రకృతి... పక్షులు... సరస్సులు... పువ్వులు కళ్ల ముందే.
థీమ్ ఏదయినా సరే... ఓ అమ్మాయి రూపం తప్పనిసరి.
ఆర్టిస్ట్ ఆషా రాధిక బొమ్మల్లో కనిపించే ఆర్ద్రత ఇది.

# అంతరంగచిత్రం



ఆషా రాధిక పుట్టింది, పెరిగింది, చదువు, ఉద్యోగం అంతా హైదరాబాద్‌లోనే. ఆమె బొమ్మల్లో హైదరాబాద్ సంస్కృతితోపాటు హైదరాబాద్‌లో కనిపించని జీవన శైలి కూడా ద్యోతకమవుతుంటుంది. ఆమె 24 సోలో ఆర్ట్ ఎగ్జిబిషన్‌లు పెట్టారు. హైదరాబాద్ సాలార్‌జంగ్ మ్యూజియంలో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ, తెలంగాణ ఆర్టిస్ట్ ఫోరమ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న 'ఆర్ట్ ఆఫ్ ద హార్ట్' చిత్రలేఖన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన చిత్రకళా ప్రస్థానాన్ని 'సాక్షిఫ్యామిలీ'తో పంచుకున్నారు.

**కుంచె నేర్పింది!**

''నాకు పెయింటింగ్ హాబీగా మారడానికి కారణం మా అమ్మనాన్న. అమ్మ ఎంబ్రాయిడరీ చేసేది. దారంతో వస్త్రం మీద ఒక రూపం తీసుకురావాలంటే గంటల సేపు పని చేయాలి. బ్రష్‌తో అయితే నిమిషంలో వచ్చేస్తుంది. అలా సరదాగా మొదలుపెట్టాను. స్కూల్‌లో కాంపిటీషన్‌లలో ప్రైజులు వస్తుంటే ఆ ఉత్సాహంతో మరికొన్ని బొమ్మలు వేసేదాన్ని. ఇక నాన్నగారు మహాసంప్రదాయవాది. ఆడపిల్లలు స్కూలుకి వెళ్లడం, ఇంటికి రావడం తప్ప ఇక దేనికీ బయటకు వెళ్లరాదన్నంత నియమం ఆయనది. ఖాళీ సమయం అంతా ఇంట్లోనే ఉండాల్సి రావడంతో పెయింటింగ్స్‌లో ప్రయోగాలతో కాలక్షేపం చేయడం అలవాటైపోయింది. అలా కుంచే నాకు గురువైంది. సెవెన్త్ క్లాస్‌లో సమ్మర్ కోచింగ్ తప్ప పెయింటింగ్స్‌లో ప్రత్యేకమైన శిక్షణ ఏదీ లేకనే చాలా బొమ్మలు వేశాను. పెద్దయిన తర్వాత టెంపూరా ఆన్ పేపర్ కళను తెలుగు యూనివర్సిటీ, పెయింటింగ్ అండ్ స్కల్ప్చర్ డిపార్ట్‌మెంట్ హెడ్ శ్రీనివాసాచారి గారి దగ్గర నేర్చుకున్నాను.

**కాన్వాస్‌లాగానే మైండ్ కూడా**

నా కుంచె గర్ల్ చైల్డ్ ప్రధానంగా జాలువారుతుంది. నేచర్, పక్షులు, పూలు ఆహ్లాదాన్నిస్తాయి. ప్రసిద్ధ చిత్రకారుల చిత్రాలను చూసినప్పుడు తప్పనిసరిగా ప్రభావితమవుతాం. అయితే అది అనుకరణ కోసం కాదు. ఒక గమనింపు మనలో ఉంటుంది. ఆ చిత్రకారుల గీతను నిశితంగా గమనిస్తుంది మన మేధ. జగదీశ్ మిట్టల్ గారి కలెక్షన్స్‌లో 14వ శతాబ్దం నాటి చిత్రాలు కూడా ఉన్నాయి. ఆ మినియేచర్ ఆర్ట్ నా మెదడు మీద అలా ముద్రించుకుపోయింది. రామ్‌కుమార్, ప్రభాకర్ కోల్టే వేసే ఆబ్‌స్ట్రాక్ట్‌లు చాలా ఇష్టం. ఎన్ని చిత్రాలను చూసి, ఎన్నింటి నుంచి స్ఫూర్తి పొందినా మన మెదడు కాన్వాస్ మీద తనకు తానుగా ఓ కొత్త రూపాన్ని ఆవిష్కరిస్తుంది. నేను బొమ్మ వేయడానికి కాన్వాస్ ముందు కూర్చునేటప్పుడు ఫలానా రూపం రావాలనే ఆలోచన ఉండదు. కాన్వాస్‌లాగానే మెదడు కూడా క్లియర్‌గా ఉంటుంది. రంగులు ఒక్కొక్క లేయర్ వేస్తూ ఉంటే కొంత సేపటికి రూపం వస్తుంది. ఆ చిత్రంలో ఒక అమ్మాయి తప్పనిసరిగా ఉంటుంది. ఇక థీమ్ అంటే 'హర్ అబ్జర్వేషన్' అని చెప్పవచ్చు. ఒక అమ్మాయి ప్రకృతిని, తన పరిసరాలను గమనించడంతోపాటు మమేకం కావడం నా బొమ్మల్లో ఉంటుంది. ఒక అమ్మాయిగా బాల్యంలో నేను చూసినవి, ఊహించినవి, పెద్దయిన తర్వాత నా గమనింపుకు వచ్చినవి, ఒక అమ్మాయికి తల్లిగా ప్రేమానుబంధం నా బొమ్మల్లో ఆవిష్కారమవుతుంటుంది. ఇంట్లోనే ఆర్ట్ స్టూడియో ఏర్పాటు చేసుకున్నాను. నాలుగు వేల బొమ్మలు వేసి ఉంటాను. సోలో ప్రదర్శనలను గుర్తుపెట్టుకుంటాను, కానీ గ్రూప్ ప్రదర్శనల లెక్క ప్రత్యేకంగా గణనలోకి తీసుకోలేదు. అమెరికాలో నాలుగు రాష్ట్రాల్లోనూ నావి సోలో ప్రదర్శనలే.

చిత్రలేఖనం పట్ల ఎంత ఇష్టం ఉన్నప్పటికీ చదువు ప్రాధాన్యం తగ్గనివ్వలేదు. ఎస్‌బీఐలో 1992లో ఉద్యోగంలో చేరాను. ఇప్పుడు శంకరపల్లి బ్రాంచ్ మేనేజర్‌ని. 'ఆర్ట్ ఆఫ్ ద హార్ట్'లో పాల్గొన్నాను. సోలో ఎగ్జిబిషన్‌లు 2001 నుంచి మొదలుపెట్టాను. ఇప్పుడు 25వ ఎగ్జిబిషన్ నా చిత్రలేఖనం కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలవాలనే ఆకాంక్షతో సిద్ధం చేస్తున్నాను'' అని తన అంతరంగాన్ని ఆవిష్కరించారు ఆర్టిస్ట్ ఆషా రాధిక.

– వాకా మంజులారెడ్డి

'దివ్యాంగులు మెట్లు ఎక్కలేకపోవడానికి కారణం వాళ్లకు కళ్లో, కాళ్లో లేకపోవడం కాదు సమాజానికి సహానుభూతి లేకపోవడం' అంటుంది తమిళ రచయిత్రి కంభంపాటి శ్రీలత. డిస్‌లెక్సియాతో పుట్టిన కూతురి కోసం తానే టీచర్‌గా మారింది శ్రీలత. 'నార్మల్ వ్యక్తుల మెజారిటీ సమాజం దివ్యాంగుల పట్ల ఎటువంటి బాధ్యత వహించకపోయినా వాళ్లు తమ జీవితాలను నిశ్శబ్దంగా నిర్మించుకుంటూనే ఉంటారు' అంటుందామె. కూతురి జీవితాన్ని, ఆమెలాంటి దివ్యాంగుల జీవితాలను 'దిస్ కైండ్ ఆఫ్ చైల్డ్' పుస్తకంగా తీసుకొచ్చిందామె.

రియల్ స్టోరీ




# 'ఇలాంటి పిల్లల'కూ హక్కులుంటాయి!



శ్రీలత తాను రాసిన 'దిస్ కైండ్ ఆఫ్ చైల్డ్' పుస్తకాన్ని ఏడు అధ్యాయాలుగా విభజించింది. ఆ ఏడింటిలో ఒకదాని పేరు 'దృష్టి లేనిది ఎవరికి?'. 'ఈ సమాజంలో దృష్టి లేనిది అంధులకా దివ్యాంగుల పట్ల ఎటువంటి ఆలోచనా లేని సామాన్యులకా?' అని ప్రశ్నిస్తుంది అందులో.

'సమర్థత (ఎబిలిటీ) మీకు మాత్రమే ఉంటుందా? అందుకే దివ్యాంగులను డిజేబుల్ అంటారా? వారూ సమర్థులే. కాని వారి కదలికలకు వీలు కల్పించలేని నిర్మాణాలు, చదవడానికి వీల్లేని చదువులు, వారికి సమాన అవకాశం ఇవ్వలేని స్కూళ్లు... ఇవి వారిని సమర్థత లేనివారుగా చేస్తున్నాయి' అంటుందామె.

చెన్నైలో నివసించే శ్రీలత సుప్రసిద్ధ కవయిత్రి, రచయిత్రి. ఆమె రాసిన కవితా సంకలనాలు ఆదరణ పొందాయి. 'టేబుల్ ఫర్ ఫోర్' అనే నవల పెద్ద పురస్కారాల వరకూ వెళ్లింది. అయితే ఆ రాసిన పుస్తకాల కంటే తాజాగా వెలువరించిన 'దిస్ కైండ్ ఆఫ్ చైల్డ్' పుస్తకం విలక్షణమైనది. దానికి కారణం ఆమె కూతురు అనన్యకు 9 ఏళ్లు ఉండగా 'ఇలాంటి అమ్మాయిని స్కూల్లో ఉంచుకోలేం' అని ప్రిన్సిపల్ నిర్దాక్షిణ్యంగా చెప్పడమే. ఆ 'ఇలాంటి అమ్మాయి' (దిస్ కైండ్ ఆఫ్ చైల్డ్)ని గుండెలకు హత్తుకుని తానే చదువు చెప్పుకుంది శ్రీలత. దానికి కారణం అనన్య డిస్‌లెక్సియాతో బాధ పడుతూ ఉండటమే. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే అనన్యకు 'స్పెసిఫిక్ లెర్నింగ్ డిసేబిలిటీ' (ఎస్‌ఎల్‌డి) ఉంది. 'నా కూతురిని కూడా అందరి పిల్లలతో పాటు కూచోబెట్టి చదివించే స్కూళ్లు ఉండాలి. ఆ స్కూల్లో నా కూతురు స్థితిని స్వీకరించే పరిస్థితి ఉండాలి. నా కూతురే కాదు అలాంటి అందరు పిల్లలకు' అంటుంది శ్రీలత.

'న్యూరోడైవర్సిటీ'... అంటే మెదడు సంబంధమైన లోపాలతో పుట్టే పిల్లలు– ఆటిజమ్, డిస్‌ప్రాక్సియా, డిస్‌కాల్‌క్యులియా, డిస్‌గ్రాఫియా... తదితర అవస్థలతో బాధ పడుతుంటే వారి కోసం సమాజంలో ఎటువంటి ఆలోచనా ఉండదని ఈ పుస్తకంలో విపులంగా రాస్తుంది శ్రీలత. వారు చిన్నపిల్లలుగా ఉన్నప్పటి కంటే టీనేజ్‌కు వచ్చినప్పుడు ఎదురయ్యే మానసిక, శారీరక పరిస్థితుల గురించి చాలా అవగాహన లోపం ఉందని అంటుందామె. అందుకే తన పుస్తకంలో 'మా షరతులతో మేము' అనే చాప్టర్‌ను రాసింది. దివ్యాంగులు తమ పరిమితిని గుర్తించి ఆ పరిమితిని స్వీకరించి రాజీ పడక హక్కుల కోసం పోరాడాలని కోరుతుందామె. 'దివ్యాంగుల హక్కులు మానవ హక్కులు. మీరు జాలి పడి రాల్చే సౌకర్యాలు కాదు' అంటుంది శ్రీలత.

దివ్యాంగుల విషయంలో అన్నింటి కంటే ముఖ్యమైన సమస్య 'కేర్ గివర్స్'. అంటే 'చూసుకునేవాళ్లు'. తల్లిదండ్రులు, భార్యాభర్తలు... వీరు దివ్యాంగులతో ఎలా మెలగాలో ఒక చాప్టర్‌లో రాస్తే తోబుట్టువులు, పిల్లలు ఎలా మెలగాలో ఇంకో చాప్టర్‌లో రాసింది. 'పోలియోతో ఉన్న తండ్రితో నార్మల్‌గా పుట్టిన కొడుకు ఎలా మసలుకున్నాడో... తన తండ్రిని అర్థం చేసుకుని ఎలా బాసటగా నిలిచాడో ఒక కేస్‌స్టడీ ఈ పుస్తకంలో ఉంది' అని చెబుతుంది శ్రీలత.

అనేక మంది దివ్యాంగుల గెలుపు కథలను, తల్లిదండ్రుల, తోబుట్టువుల, సహాయకుల, స్పెషల్ ఎడ్యుకేటర్ల అనుభవాలను కథలుగా, ఇంటర్వ్యూలుగా, మౌఖిక కథనాలుగా ఈ పుస్తకంలో రికార్డు చేసింది శ్రీలత. దివ్యాంగుల నిజమైన అవసరాలు ఏమిటో సమాజానికి రావాల్సిన దృష్టి ఏమిటో ఈ పుస్తకం సమర్థంగా తెలియచేస్తుంది. 'ఇలాంటి పుస్తకాలు ఎంతమంది రాస్తే అంత మంచిది' అంటుంది శ్రీలత. అన్నింటి కంటే ముఖ్యం శ్రీలత కుమారుడు అనిరుద్ధ తన సోదరి అనన్యను చూస్తూ 'ప్రతి స్కూల్లో పిల్లలకు దివ్యాంగుల గురించి పాఠాలు చెప్పాలి. దివ్యాంగులతో ఎలా మెలగాలో పిల్లలకు సిలబస్‌గా ఎందుకు చెప్పరు? అప్పుడు కదా స్కూల్లో ఏ దివ్యాంగ పిల్లవాడైనా చేరితే ఇతర పిల్లలు అతనితో బాగా మెలిగేది' అన్న మాట ఎంతో ఆలోచించదగ్గది.

## సినిమా

### కీరవాణీ... మీరు టాప్ ఆఫ్ ది వరల్డ్

– రిచర్డ్ కార్పెంటర్



● రాజమౌళి, కీరవాణి



● రిచర్డ్ కార్పెంటర్

అమెరికన్ ప్రముఖ సంగీతదర్శకుడు, రచయిత, గాయకుడు రిచర్డ్ లిన్ కార్పెంటర్ ఇచ్చిన సర్‌ప్రైజ్ గిఫ్ట్‌కు కన్నీళ్లు పెట్టుకున్నారు సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి. ఇటీవల లాస్ ఏంజెల్స్‌లో జరిగిన 95వ ఆస్కార్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో 'నాటు నాటు' పాటకు కీరవాణి ఆస్కార్ అవార్డును (రచయిత చంద్రబోస్‌ను కూడా అవార్డు వరించింది) అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆస్కార్ వేదిక మీద తాను రిచర్డ్ కార్పెంటర్ సాంగ్స్ వింటూ పెరిగానని చెబుతూ, ఆయన స్వరపరిచిన ప్రముఖ పాటల్లో ఒకటైన 'టాప్ ఆఫ్ ది వరల్డ్' స్టైల్‌లో తన భావాన్ని పాట రూపంలో వ్యక్తపరిచారు కీరవాణి. ఈ విషయంపై రిచర్డ్ కార్పెంటర్ సోషల్ మీడియా వేదికగా ''బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ అవార్డు గెల్చుకున్న మీకు (కీరవాణిని ఉద్దేశించి) హృదయపూర్వక శుభాకాంక్షలు'' అని పేర్కొన్నారు. అలాగే ''మీకు, మీకు కావల్సిన వారికి మా ఫ్యామిలీ నుంచి ఓ చిన్న సర్‌ప్రైజ్'' అంటూ కీరవాణి విజయాన్ని ప్రశంసిస్తూ 'టాప్ ఆఫ్ ది వరల్డ్' స్టయిల్‌లోనే తన కుమార్తెలతో శుభాకాంక్షల పాట పాడి, ''ఈ అవార్డుకు మీరు అర్హులు. టాప్ ఆఫ్ ది వరల్డ్‌పై మీరు నిలబడ్డారు'' అని ఓ వీడియోను షేర్ చేశారు రిచర్డ్ కార్పెంటర్. ''ఇది (కార్పెంటర్ వీడియోను ఉద్దేశిస్తూ...) నేను అస్సలు ఊహించలేదు. ఆనందభాష్పాలు ఆగడం లేదు. ఈ ప్రపంచం నుంచి నాకు అందిన అత్యద్భుతమైన బహుమతి ఇది'' అని పేర్కొన్నారు కీరవాణి.

**మా అన్నయ్య కన్నీళ్లను ఆపుకోలేకపోయారు: రాజమౌళి**

రిచర్డ్ కార్పెంటర్ షేర్ చేసిన వీడియోపై రాజమౌళి స్పందించారు. ''సార్ (రిచర్డ్‌ను ఉద్దేశించి).. ఆస్కార్ ప్రచారం మొత్తంలో నా సోదరుడు (కీరవాణిని ఉద్దేశించి) ఎలాంటి భావోద్వేగాలకు లోనవ్వలేదు. ఆస్కార్ అవార్డు గెలవడానికి ముందు, గెలిచిన తర్వాత కూడా ఆయన తన భావోద్వేగాలను బయటపెట్టలేదు. కానీ మీ వీడియోను చూసిన క్షణంలో మా అన్నయ్య కన్నీళ్లను అదుపు చేసుకోలేకపోయాడు. తన చెంపలపై ఆనందభాష్పాల ధార కారింది. మా కుటుంబానికి మర్చిపోలేని క్షణాలివి. చాలా థ్యాంక్స్'' అని పేర్కొన్నారు రాజమౌళి.

### వేసవిలో నవ్వులు



● శ్రీనివాస్ రెడ్డి, హర్ష

సునీల్, శ్రీనివాస్ రెడ్డి, 'వెన్నెల' కిషోర్, ధనరాజ్ ప్రధాన పాత్రల్లో నూతన దర్శకుడు యలమంద చరణ్ తెరకెక్కించిన చిత్రం 'భువన విజయమ్'. లక్ష్మి సమర్పణలో కిరణ్, వీఎస్కే నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ని డైరెక్టర్ మారుతి విడుదల చేసి, చిత్రం విజయం సాధించాలని ఆకాంక్షించారు. ''హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'భువన విజయమ్'. క్యూరియాసిటీ పెంచే కథనంతో వినోదాత్మకంగా ఈ సినిమా సాగుతుంది. ఈ వేసవిలో సినిమాని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ఒకరు నెగటివ్‌గా కనిపించనున్నారు. ప్రేక్షకులు ఎప్పుడూ ఆమెను అలాంటి పాత్రలో చూడలేదు. ఇంకొకరు కన్నీళ్లు తెప్పించే పాత్రతో వచ్చారు.. అలాంటి పాత్రతో వచ్చినందుకు ఆనందభాష్పాలను ఆపుకోలేకపోయారామె. మరొకరు కథానాయికగా కనుమరుగై.. చెల్లెలిగా రిటర్న్ అవుతున్నారు. నటనకు ఒక్కసారి బ్రేక్ ఇచ్చాక మళ్లీ నటించాలంటే ఆ క్యారెక్టర్ ఎంతో బలమైనది అయ్యుంటేనే ఆ ఆర్టిస్ట్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. జయా బచ్చన్, షర్మిలా ఠాగూర్, జీవితలకు అలాంటి పాత్రలే దొరికాయి. అందుకే బ్రేక్‌లు తీశారు.. నటిగా మేకప్ వేసుకున్నారు. ఒక్కప్పటి ఈ స్టార్స్ రిటర్న్ కావడం అభిమానులకు ఆనందమే కదా. ఇక ఈ ముగ్గురి చిత్రాల విశేషాలు తెలుసుకుందాం.



● జయా బచ్చన్

### స్టార్ రిటర్న్స్

**తొలిసారి నెగటివ్‌గా...**

జయా బచ్చన్ కెరీర్ దాదాపు 60 ఏళ్లు. ఇన్నేళ్ల సుదీర్ఘ కెరీర్‌లో నటిగా ఎన్నో అద్భుత పాత్రలు చేశారామె. కెరీర్ ఆరంభంలో 'గుడ్డి' (1971)లో చేసిన పాత్రతో 'గర్ల్ నెక్ట్స్ డోర్' ఇమేజ్ తెచ్చుకున్న జయ ఆ తర్వాత 'జవానీ దివానీ'లో గ్లామరస్ రోల్‌లో మెప్పించారు. అలాగే అనామిక (1973)లో కాస్త నెగటివ్ టచ్ ఉన్న పాత్ర చేసి, భేష్ అనిపించుకున్నారు. అయితే ఇన్నేళ్ల కెరీర్‌లో జయ పూర్తి స్థాయి నెగటివ్ క్యారెక్టర్ చేయలేదు. ఇప్పుడు చేస్తున్నారు. 'రాఖీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ'లో లేడీ విలన్‌గా కనిపించనున్నారామె. దాదాపు ఏడేళ్ల తర్వాత జయా బచ్చన్ ఒప్పుకున్న చిత్రం ఇది. కరణ్ జోహార్ స్వీయదర్శకత్వంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. జయా బచ్చన్‌తో కరణ్ నెగటివ్ క్యారెక్టర్ గురించి చెప్పగానే ''నేనా? నన్నే తీసుకోవాలని ఎందుకు అనుకున్నారు?' అని ఆమె అడిగారు... 'మీరే చేయాలి' అంటూ జయాని కన్విన్స్ చేయడానికి చాలా ప్రయత్నాలు చేశారు కరణ్. ఫైనల్‌గా 'ఓకే' అన్నారామె. అయితే ఈ పాత్రని అర్థం చేసుకుని, ఒక క్రూరమైన మనస్తత్వం ఉన్న వ్యక్తిలా నటించడానికి జయ కొన్నాళ్లు ఇబ్బందిపడ్డారట. ఆ తర్వాత పూర్తిగా ఆ పాత్రలోకి లీనం కాగలిగారని, నెగటివ్ క్యారెక్టర్‌ని ఆమె ఎంజాయ్ చేస్తున్నారని చిత్ర యూనిట్ పేర్కొంది. రణ్‌వీర్ సింగ్, ఆలియా భట్ జంటగా రూపొందిన ఈ చిత్రం జులై 28న విడుదల కానుంది.



● షర్మిలా ఠాగూర్

**పుష్కర కాలం తర్వాత...**

పుష్కర కాలం తర్వాత షర్మిలా ఠాగూర్ ఓ సినిమా చేశారు. ఈ నెల 3న విడుదలైన 'గుల్‌మోహర్'లో ఆమె ఇంటి పెద్దగా లీడ్ రోల్ చేశారు. గుల్ మోహర్ అనే తమ ఇంటిని అమ్మేసి, తాను వేరే రాష్ట్రానికి వెళతానని ఇంటి పెద్ద కుసుమ్ బాత్రా (షర్మిలా ఠాగూర్ పాత్ర) చెబుతారు. అప్పుడు ఆ కుటుంబ సభ్యుల భావోద్వేగాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. 'బ్రేక్ కే బాద్' (2010) సినిమా తర్వాత మళ్లీ మంచి పాత్రలు వచ్చేంతవరకూ బ్రేక్ తీసుకోవాలనుకున్నారు షర్మిలా. 'గుల్‌మోహర్'లో తన పాత్ర కీలకం కావడంతో పాటు మంచి ఎమోషన్స్ కనబరిచే చాన్స్ ఉన్నందున ఆమె అంగీకరించారు. ఈ సినిమా ప్రివ్యూ చూసి, షర్మిలా ఏడుపు ఆపుకోలేకపోయారు. ''పన్నెండేళ్ల తర్వాత ఒక మంచి పాత్రలో తెరపై కనిపించడంతో నన్ను నేను నియంత్రించుకోలేకపోయాను. ఈ సినిమాని మూడుసార్లు చూశాను. చూసిన ప్రతిసారీ ఏడ్చాను. అంతగా ఈ పాత్రతో కనెక్ట్ అయ్యాను'' అని షర్మిలా పేర్కొన్నారు.



● జీవిత

**చెల్లెలిగా...**

కథానాయికగా గర్ల్ నెక్ట్స్ డోర్ అనదగ్గ పాత్రల్లో కనిపించారు జీవిత. 'తలంబ్రాలు', 'ఆహుతి', 'అంకుశం' వంటి చిత్రాల్లో చేసిన పాత్రలతో మంచి నటి అనిపించుకున్నారామె. 'మగాడు' (1990) తర్వాత నటిగా వేరే సినిమాలు ఒప్పుకోలేదు. ఇప్పుడు రజనీకాంత్ అతిథి పాత్రలో ఆయన కుమార్తె ఐశ్వర్య దర్శకత్వం వహిస్తున్న 'లాల్ సలామ్'లో నటించడానికి జీవిత ఒప్పుకున్నారు. ఇందులో ఆమెది రజనీ చెల్లెలి పాత్ర. ''నా కెరీర్‌లో రజనీ సార్‌తో సినిమా చేయలేదు. ఇప్పుడు కుదిరినందుకు హ్యాపీగా ఉంది. ఈ సినిమా ఒప్పుకోవడానికి కొంత టైమ్ తీసుకున్నాను. 'మీరు స్క్రీన్‌పై కనిపించి చాలా రోజులైంది కాబట్టి.. చేస్తే బాగుంటుంది' అని ఐశ్వర్య అనడం, నా ఫ్యామిలీ సపోర్ట్ వల్ల ఓకే చెప్పాను'' అని పేర్కొన్నారు జీవిత. దాదాపు 30 ఏళ్ల తర్వాత ఆమె కనిపించనున్న చిత్రం ఇది. కాగా నటిగా ఇన్నేళ్లు సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ నిర్మాతగా 'గడ్డం గ్యాంగ్, దెయ్యం' వంటి చిత్రాలను నిర్మించారు. గత ఏడాది 'శేఖర్' చిత్రానికి దర్శకత్వం వహించారు జీవిత.

### నిజం ఒక ధైర్యం



● నాగచైతన్య

'గాయపడిన మనసు ఆ మనిషిని ఎంత దూరం అయినా తీసుకుని వెళ్తుంది' అంటూ నాగచైతన్య చెప్పిన డైలాగ్‌తో 'కస్టడీ' సినిమా టీజర్ మొదలవుతుంది. నాగచైతన్య, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా అరవింద్‌స్వామి, ప్రియమణి, శరత్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం 'కస్టడీ'. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం మే 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను గురువారం విడుదల చేశారు. ''గాయపడిన మనసు ఆ మనిషిని ఎంత దూరం అయినా తీసుకుని వెళ్తుంది. అది ఇప్పుడు నన్ను తీసుకుని వచ్చింది ఒక యుద్ధానికి. ఇక్కడ చావు నన్ను వెంటాడుతుంది. అది ఎటునుంచి వస్తుందో ఎప్పుడు వస్తుందో ఎలా వస్తుందో నాకు తెలియదు. తెలుసుకోవాలని కూడా లేదు. ఎందుకంటే నా చేతిలో ఉన్న ఆయుధం ఒక నిజం. నిజం ఒక ధైర్యం. నిజం ఒక సైన్యం. యస్.. దట్ ట్రూత్ ఈజ్ ఇన్ మై కస్టడీ'' అని నాగచైతన్య పలికే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి.

### విజయంపై నమ్మకంగా ఉన్నాం

– నాగశౌర్య



● మాళవిక, నాగశౌర్య, వివేక్, అవసరాల శ్రీనివాస్

నాగశౌర్య, మాళవికా నాయర్ జంటగా అవసరాల శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. టీజీ విశ్వప్రసాద్, దాసరి పద్మజ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో నాగశౌర్య మాట్లాడుతూ– ''ఈ సినిమా కోసం మేం చాలా కష్టపడ్డాం. మా కష్టం థియేటర్స్‌లో తెలుస్తుంది. నా కెరీర్‌లో 'ఊహలు గుసగుసలాడే', 'జ్యో అచ్యుతానంద' సినిమాల గురించి ఎలా చెప్పుకున్నానో 'ఫలానా..' సినిమా గురించి అంతే బాగా చెప్పుకుంటాను. ఈ సినిమా విజయం పట్ల నమ్మకంగా ఉన్నాం'' అన్నారు. ''ఈ చిత్రంలోని పాత్రలు నిజజీవితంలో చూసినట్లుగా ఉంటాయి. ఎమోషనల్ మూవీ ఇది. నటనపై ఆధారపడ్డ సినిమా కాబట్టే సింక్ సౌండ్ ఉండాలని నిర్ణయించుకున్నాను. ఈ సినిమాలోని సంజయ్ పాత్రకు నాగశౌర్య బాగా సరిపోయాడు. ఏడు చాప్టర్లు ఉండే ఈ సినిమాలోని నాలుగో చాప్టర్ నాకు చాలా ఇష్టం. ఇంటర్వెల్‌కి ముందు వచ్చే ఈ చాప్టర్‌లో వచ్చే ఎమోషన్ ఇంతవరకు నేను తెలుగు సినిమాల్లో చూడలేదనేది నా అభిప్రాయం'' అన్నారు అవసరాల శ్రీనివాస్. ''నాగశౌర్య, మాళవికల సహజ నటన కోసం ఈ సినిమా చూడొచ్చు'' అన్నారు చిత్ర సహనిర్మాత వివేక్ కూచిభొట్ల. ''ఇంత మంచి సినిమాలో మమ్మల్ని భాగం చేసిన విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్లగారికి థ్యాంక్స్'' అన్నారు దాసరి ప్రసాద్.

### విల్లాలో ఏం జరిగింది?



● తేజ, శ్రీను

విజయ్, శీతల్ భట్ జంటగా విగస్ క్రియేషన్స్ సమర్పణలో విద్యా గణేష్ నిర్మించిన చిత్రం 'విల్లా 369'. సురేష్ ప్రభు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రానికి డా. రాకేష్ సహనిర్మాత. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసిన దర్శకుడు తేజ మాట్లాడుతూ – ''సురేష్ ప్రభు మంచి సబ్జెక్ట్‌ను ఎంచుకుని తీసిన సినిమా 'విల్లా 369'. ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''ర్యాడీ రఫీ కెమెరా పనితనం, సంగీత దర్శకుడు మహావీర్ మ్యూజిక్ ఈ సినిమాకి అదనపు ఆకర్షణ. త్వరలో చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అన్నారు విద్యా గణేష్. ''విల్లాలో ఏం జరిగింది? అనేది ఆసక్తికరంగా ఉంటుంది'' అన్నారు సురేష్ ప్రభు.

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 79 | 57,635 |
| నిఫ్టీ ▲ | 13 | 16,986 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు (భారతకాలమానం రాత్రి 11.30 ముగింపు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 11,679 | ▲ | 285 |
| డోజోన్స్ | 32,200 | ▲ | 326 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,410 | ▲ | 66 |
| డాక్స్ | 14,967 | ▲ | 232 |
| షాంఘై | 3,227 | ▼ | 36 |
| నికాయ్ | 27,011 | ▼ | 219 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్



# టీసీఎస్‌కు షాక్!

- సీఈవో పదవికి రాజేశ్ గోపీనాథన్ గుడ్‌బై
- కొత్త సీఈవోగా కృతివాసన్


రాజేశ్ గోపీనాథన్ — కృతివాసన్

న్యూఢిల్లీ: టీసీఎస్ ఎండీ, సీఈవో రాజేశ్ గోపీనాథన్ అనూహ్యంగా రాజీనామా ప్రకటించారు. దీంతో నూతన సీఈవోగా (డిజిగ్నేట్) బీఎఫ్ఎస్ఐ డివిజన్ గ్లోబల్ హెడ్‌గా ఉన్న కె.కృతివాసన్‌ను నియమించినట్టు కంపెనీ ప్రకటించింది. రాజీనామా ఇచ్చినప్పటికీ ఈ ఏడాది సెప్టెంబర్ 15 వరకు గోపీనాథన్ టీసీఎస్‌తోనే కొనసాగనున్నారు. ఈ కాలంలో కంపెనీ నిర్వహణ బాధ్యతలు సాఫీగా బదిలీ అయ్యేందుకు నూతన సారథికి సహకారం అందిస్తారని టీసీఎస్ ప్రకటించింది. కృతివాసన్‌కు టీసీఎస్‌తో 34 ఏళ్ల సుదీర్ఘ అనుబంధం ఉంది. 1989 నుంచి ఆయన టీసీఎస్‌తోనే కలసి పనిచేస్తున్నారు. తన కెరీర్‌లో కృతివాసన్ డెలివరీ, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ తదితర బాధ్యతల్లో పనిచేసినట్టు టీసీఎస్ తెలిపింది. టీసీఎస్ ఎండీ, సీఈవోగా ఉన్న ఎన్ చంద్రశేఖరన్ టాటా గ్రూపు చైర్మన్‌గా పదోన్నతి పొందడంతో.. సీఎఫ్‌వోగా ఉన్న రాజేశ్ గోపీనాథన్ సంస్థ బాధ్యతలు చేపట్టారు. ఆరేళ్లుగా సంస్థకు ఎండీ, సీఈవోగా సేవలు అందించారు. టీసీఎస్‌లో 22 ఏళ్లుగా గోపీనాథన్ పనిచేస్తున్నారు. ''టీసీఎస్‌లో నా 22 ఏళ్ల ఉద్యోగ మజిలీని ఎంతో ఆస్వాదించాను. చంద్రతో సన్నిహితంగా కలసి పనిచేయడం పట్ల ఆనందంగా ఉంది. నా ఈ మొత్తం ప్రయాణానికి ఆయన మార్గదర్శకుడిగా వ్యవహరించారు. ఈ దిగ్గజ సంస్థకు గడిచిన ఆరేళ్లుగా నాయకత్వం వహించడం పట్ల సంతృప్తికరంగా ఉంది. ఈ కాలంలో అదనంగా 10 బిలియన్ డాలర్ల ఆదాయం, 70 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ తోడయింది''అని గోపీనాథన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. తన వ్యక్తిగత ఆసక్తులకు సమయం కేటాయించేందుకు ఇదే సరైన సమయమని భావించి తప్పుకుంటున్నట్టు చెప్పారు.

## భారత్‌లో ట్రూకాలర్ కార్యాలయం




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కాలర్ ఐడీ వెరిఫికేషన్ ప్లాట్‌ఫామ్ ట్రూకాలర్ బెంగళూరులో కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. స్వీడన్‌కు వెలుపల ప్రత్యేకంగా కేంద్రాన్ని నెలకొల్పడం ఇదే తొలిసారి అని కంపెనీ ప్రకటించింది. అలాగే సంస్థకు ఇది రెండవ అతిపెద్ద సెంటర్ కూడా. 30,443 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ ఆఫీసులో 250 మంది సిబ్బంది వరకు పనిచేయడానికి ఏర్పాట్లు ఉన్నాయి. కొన్ని ఫీచర్లను తొలిసారిగా ఇక్కడి కస్టమర్లకు అందించడంతోపాటు ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు సేవలను విస్తరించడానికి ట్రూకాలర్ ఈ సౌకర్యాన్ని ప్రాథమిక కేంద్రంగా ఉపయోగించాలని యోచిస్తోంది. ట్రూకాలర్‌కు 33.8 కోట్ల మంది నెలవారీ యాక్టివ్ యూజర్లు ఉన్నారు. వీరిలో భారత్ నుంచి 24.6 కోట్ల మంది ఉండడం విశేషం.

# పతంజలి ప్రమోటర్ల వాటాలు సీజ్

- 25 శాతం ప్రజల వాటా నిబంధనలో వైఫల్యం
- బీఎస్‌ఈ, ఎన్ఎస్‌ఈ చర్య
- ఎలాంటి ప్రభావం పడదన్న పతంజలి ఫుడ్స్




న్యూఢిల్లీ: ప్రజల వాటా కనీసం 25 శాతం ఉండాలన్న నిబంధన అమలులో విఫలమైనందుకు పతంజలి ఫుడ్స్ ప్రమోటర్ల వాటాలను ఎన్ఎస్ఈ, బీఎస్ఈ స్తంభింప (ఫ్రీజ్) చేశాయి. ఈ చర్య కంపెనీ పనితీరుపై ఎలాంటి ప్రభావం చూపించదని పతంజలి ఫుడ్స్ పేర్కొంది. పతంజలి ఆయుర్వేద్ సహా 21 ప్రమోటర్ సంస్థల వాటాలను స్టాక్ ఎక్స్ఛేంజీలు ఫ్రీజ్ చేసినట్టు పతంజలి అంతకుముందు ప్రకటించింది. 'డిస్‌క్లోజర్' నిబంధనల కింద స్టాక్ ఎక్స్ఛేంజీలకు తాజా విషయాన్ని తెలియజేసింది. కనీస ప్రజల వాటా నిబంధన అమలుకు కట్టుబడి ఉన్నట్టు ప్రమోటర్ల నుంచి తమకు సమాచారం అందినట్టు పతంజలి ఆయుర్వేద్ తెలిపింది. ప్రజల వాటాను పెంచేందుకు మెరుగైనది ఏదనే విషయమై వారు చర్చిస్తున్నట్టు ప్రకటించింది. వచ్చే కొన్ని నెలల్లో ఈ నిబంధనను అమలు చేయనున్నట్టు పేర్కొంది. ప్రస్తుతం పతంజలి ఫుడ్స్‌లో ప్రమోటర్లకు 80.82 శాతం వాటా ఉంది. నిబంధనల ప్రకారం 75% మించకూడదు. అంటే మరో 5.82% వాటా విక్రయించాల్సి ఉంటుంది.

**నేపథ్యం...:** రుచి సోయా ఇండస్ట్రీస్ (పతంజలి ఫుడ్స్ పూర్వపు పేరు)ని దివాలా పరిష్కార ప్రక్రియ కింద 2019 సెప్టెంబర్‌లో పతంజలి గ్రూప్ సొంతం చేసుకుంది. దీంతో సంస్థలో ప్రమోటర్లు, ప్రమోటర్ల సంస్థలకు 98.87 శాతం వాటా లభించింది. 2022 మార్చిలో ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్‌కు పతంజలి ఫుడ్స్ వచ్చింది. రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరును రూ. 648 చొప్పున 6.61 కోట్ల షేర్లను విక్రయించింది. దీంతో ప్రజల వాటా 19.18 శాతానికి పెరిగింది. నిబంధనల ప్రకారం 2022 డిసెంబర్ 18 నాటికి ప్రజల వాటా 25%కి చేర్చాల్సి ఉంది.

**మరో ఎఫ్‌పీవో: బాబా రామ్‌దేవ్**

ఏప్రిల్‌లో మరో విడత ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీవో) చేపట్టనున్నట్టు పతంజలి ఫుడ్స్ ప్రకటించింది. తద్వారా ప్రజల వాటా కనీసం 25% ఉండాలన్న నిబంధనను అమలు చేస్తామని తెలిపింది. పతంజలి గ్రూప్ అధినేత బాబా రామ్‌దేవ్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. ఇన్వెస్టర్లు ఆందోళన చెందడానికి ఎటువంటి కారణం లేదన్నారు. పతంజలి ఫుడ్స్ కార్యకలాపాలు, ఆర్థిక పనితీరుపై ఎక్స్ఛేంజీల చర్య ప్రభావం చూపించదని భరోసా ఇచ్చారు. తాము 6% వాటాలను తగ్గించుకుంటామని, అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడమే జాప్యానికి కారణమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిశాక ఏప్రిల్‌లో ఎఫ్‌పీవో చేపడతామన్నారు.

## మారుతీ సుజుకీ ఎక్స్‌పీరియన్స్ డ్రైవ్



హైదరాబాద్: దేశీయ కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ తన ఎస్‌యూవీ ఆల్ న్యూ గ్రాండ్ విటారాతో ''ఎక్స్‌పీరియన్స్ డ్రైవ్''ను నిర్వహించింది. సుమారు 300 మందికి పైగా కస్టమర్లు ర్యాలీలో పాల్గొని ఆల్ న్యూ గ్రాండ్ విటారా సామర్థ్యాన్ని పరీక్షించారు. ఇటీవల జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ నెక్సా డీలర్లు పాల్గొన్నారు. సుజుకీ పేటెంట్ కలిగి ఆల్‌గ్రిప్ సెలెక్ట్ ట్రిమ్ ధర రూ.16.89 లక్షలు ఉంది. ఈ వేరియంట్ లీటరుకు 19.38 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని కంపెనీ పేర్కొంది.

**బులియన్** రూ.లలో

ముంబై

| | | | |
|---|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 58,341 | ▲ | 432 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 58,107 | ▲ | 436 |
| వెండి (కిలో) | 67,311 | ▲ | 450 |

# అయిదు రోజుల నష్టాలకు చెక్!

- కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్లు
- ఇంట్రాడేలో తీవ్ర ఊగిసలాట



ముంబై: అయిదురోజుల వరుస నష్టాల తర్వాత స్టాక్ సూచీలు గురువారం లాభాలు ఆర్జించాయి. అంతర్జాతీయంగా నెలకొన్న మిశ్రమ సంకేతాల నేపథ్యంలో సూచీలు ట్రేడింగ్‌లో అధిక సమయం నష్టాల్లోనే కదలాడాయి. అయితే చివర్లో బ్యాంకింగ్, ఇంధన, ఫైనాన్స్ షేర్లకు కనిష్టాల వద్ద కొనుగోళ్లు లభించడంతో అయిదు రోజుల తర్వాత నష్టాల నుంచి గట్టెక్కాయి. ఉదయం సెన్సెక్స్ 57,511 వద్ద బలహీనంగా ప్రారంభమైంది. ఇంట్రాడేలో 729 పాయింట్లు పరిధిలో 57,159 వద్ద కనిష్టాన్ని 57,887 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 79 పాయింట్లు పెరిగి 57,635 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 16,995 వద్ద లాభంతో మొదలైంది. రోజంతా నిఫ్టీ 212 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఆఖరికి 13 పాయింట్ల స్వల్ప లాభంతో 16,986 వద్ద నిలిచింది. మెటల్, ఐటీ, ప్రైవేట్ రంగ బ్యాంక్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.282 కోట్ల షేర్లను అమ్మేశారు. మొత్తం ఆరు ట్రేడింగ్ సెషన్లలో రూ. 8800 కోట్ల షేర్లను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,501 కోట్ల షేర్లను కొన్నారు. అంతర్జాతీయ బ్యాంకింగ్ సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో ఆసియా నష్టపోయాయి. స్విస్ సెంట్రల్ బ్యాంక్ నుంచి భారీ మొత్తంలో రుణాన్ని తీసుకుంటామని క్రెడిట్ సూసీ బ్యాంక్ తెలపడంతో యూరప్ మార్కెట్లు భారీ పతనం నుంచి తేరుకుని స్వల్ప నష్టంతో ముగిశాయి. అమెరికా స్టాక్ సూచీలు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

'సిలికాన్ వ్యాలీ బ్యాంక్, క్రెడిట్ సూసీ బ్యాంక్ సంక్షోభ ప్రభావం మరిన్ని బ్యాంకులకు విస్తరించవచ్చనే భయాలతో ఇన్వెస్టర్లు పొజిషన్లను హోల్డ్ చేసేందుకు ఆసక్తి చూపలేదు. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఈసీబీ) 50 బేసిస్ పాయింట్ల వడ్డీరేట్ల పెంపు నిర్ణయానికి మార్కెట్ వర్గాలు స్పందిస్తాయనే అంశంపై తదుపరి ట్రేడింగ్ ఉండొచ్చు' అని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్స్ సర్వీసెస్ హెడ్ సిద్ధార్థ ఖేమా తెలిపారు.

**మార్కెట్లో మరిన్ని సంగతులు**

అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ట్రాన్స్‌మిషన్ షేర్లు ఐదుశాతం అప్పర్ సర్క్యూట్ వద్ద లాకయ్యాయి. అంబుజా సిమెంట్స్ 4%, ఏసీసీ, అదానీ పోర్ట్స్ ఒక శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ అరశాతం చొప్పున లాభపడ్డాయి. అదానీ టోటల్ గ్యాస్ మూడుశాతం, ఎన్‌డీటీవీ రెండుశాతం, అదానీ పవర్ ఒకటిన్నర శాతం, అదానీ విల్మార్ ఒకశాతం నష్టపోయాయి.

# క్రెడిట్ సూసీకి 'స్విస్ బ్యాంక్' భరోసా

- 54 బిలియన్ డాలర్ల రుణానికి ఓకే
- బ్యాంకు షేర్లు రయ్




న్యూఢిల్లీ: ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న క్రెడిట్ సూసీకి స్విట్జర్లాండ్ సెంట్రల్ బ్యాంకు అండగా నిల్చింది. వ్యవస్థాగతంగా కీలకమైన బ్యాంకుపై ఇన్వెస్టర్లు, డిపాజిటర్లలో నెలకొన్న ఆందోళనలను తొలగించేందుకు, దానిపై నమ్మకాన్ని కలిగించేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా 54 బిలియన్ డాలర్ల మేర రుణాన్ని అందించేందుకు అంగీకరించింది. క్రెడిట్ సూసీ గురువారం ఈ విషయం వెల్లడించింది. దీంతో బ్యాంకు షేరు ఒక దశలో ఏకంగా 33% ఎగిసి 2.17 స్విస్ ఫ్రాంకులకు (1 స్విస్ ఫ్రాంకు సుమారు రూ. 89) పెరిగింది. అటు యూరప్ బ్యాంకింగ్ షేర్లు కూడా ఒక మోస్తరుగా పెరిగాయి. మరింతగా పెట్టుబడులు పెట్టేందుకు సౌదీ ఇన్వెస్టరు నిరాకరించారన్న వార్తలతో క్రెడిట్ సూసీ షేరు బుధవారం 30% కుప్పకూలిన సంగతి తెలిసిందే. అమెరికాలో వారం రోజుల వ్యవధిలో రెండు బ్యాంకులు (ఎస్‌వీబీ, సిగ్నేచర్) మూతబడటం, క్రెడిట్ సూసీ ఆర్థిక పరిస్థితిపై నీలినీడలు కమ్ముకోవడం తదితర పరిణామాలతో అంతర్జాతీయంగా బ్యాంకింగ్ సంక్షోభం ముంచుకొస్తోందన్న ఆందోళన నెలకొంది. అయితే, ఈ భయాలను తొలగించేందుకు, అంతర్జాతీయంగా కీలక బ్యాంకుల్లో ఒకటిగా ఉన్న క్రెడిట్ సూసీని నిలబెట్టేందుకు స్విస్ నేషనల్ బ్యాంక్ రంగంలోకి దిగింది. మూలధనం, లిక్విడిటీపరమైన నిబంధనలకు అనుగుణంగా క్రెడిట్ సూసీ ఉంటే బ్యాంక్‌కు అవసరమైన తోడ్పాటు అందిస్తామని ప్రకటించింది.

# ఈసీబీ అర శాతం వడ్డీరేటు పెంపు

ఫ్రాంక్‌ఫర్ట్: యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఈసీబీ) గురువారం భారీగా అరశాతం వడ్డీరేటును పెంచింది. అమెరికాలో రెండు బ్యాంకుల పతనం, క్రెడిట్ సూసీలో ఇబ్బందులు, గ్లోబల్ బ్యాంకింగ్ వ్యవస్థపై అధిక రేట్ల ప్రభావం గురించి భయాందోళనల నేపథ్యంలో ప్రస్తుతానికి ఈసీబీ వడ్డీరేట్లను పెంచకపోవచ్చన్న అంచనాలకు భిన్నంగా ఈసీబీ తాజా నిర్ణయం తీసుకుంది. దీనితో కీలక రుణ రేటు 3.5 శాతానికి చేరింది. తాజా నిర్ణయంతో తీవ్రంగా పెరుగుతున్న ధరల పెరుగుదలే తక్షణ కర్తవ్యమని సంకేతాలు ఇచ్చింది. ద్రవ్యోల్బణం 2 శాతం లక్ష్యంకాగా, ఇది 8.5 శాతానికి చేరుకోవడంతో పలు దఫాల్లో ఈసీబీ రేటు పెంపు నిర్ణయాలను తీసుకుంటూ వస్తోంది.



## సన్‌రైజర్స్ జెర్సీ ఆవిష్కరణ

ఐపీఎల్-2023కి సంబంధించి హైదరాబాద్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ సందడి మొదలు పెట్టింది. తాజా సీజన్ కోసం రూపొందించిన కొత్త జెర్సీని గురువారం ఆవిష్కరించింది. గత ఏడాదితో పోలిస్తే స్వల్ప మార్పులతో ఈ జెర్సీని సిద్ధం చేసింది. మరో వైపు మూడు సీజన్ల విరామం తర్వాత హైదరాబాద్‌లో క్రికెట్ అభిమానులకు ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా చూసే అవకాశం లభిస్తోంది. 2019 ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగిన తర్వాత కరోనా కారణంగా మళ్లీ నగరంలో మ్యాచ్‌లు జరగలేదు. ఈ నేపథ్యంలో హోం టీమ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లపై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. హైదరాబాద్‌లో జరిగే తొలి రెండు మ్యాచ్‌లకు (ఏప్రిల్ 2న రాజస్తాన్‌తో, ఏప్రిల్ 9న పంజాబ్‌తో) టీమ్ ఫ్రాంచైజీ ఫ్యాన్స్ కోసం టికెట్లను అమ్మకానికి ఉంచింది. రూ. 781 మొదలు రూ. 11,719 వరకు వేర్వేరు ధరల్లో టికెట్లు అందుబాటులో ఉన్నాయి.



# నిఖత్ జోరు



**ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో రెండో రౌండ్‌కు**

న్యూఢిల్లీ: వరల్డ్ ఉమెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ బాక్సర్, తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ శుభారంభం చేసింది. తన పంచ్ పవర్ చూపిస్తూ ఆమె రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. గురువారం జరిగిన తొలి రౌండ్ పోరులో డిఫెండింగ్ చాంపియన్ నిఖత్ 50 కేజీల కేటగిరీలో రిఫరీ స్టాప్స్ కాంటెస్ట్ (ఆర్ఎస్‌సీ) ద్వారా అనాఖనిమ్ ఇస్మాయిలోవా (అజర్‌బైజాన్)ను చిత్తు చేసింది. నిఖత్ పంచ్‌లను తట్టుకోలేక అనాఖనిమ్ చేతులెత్తేయడంతో రిఫరీ జోక్యం చేసుకొని బౌట్‌ను నిలిపేశారు. రెండో రౌండ్‌లో రామేసా బౌలర్ (అల్జీరియా)తో నిఖత్ తలపడుతుంది. ఇతర భారత బాక్సర్లలో సాక్షి చౌదరి, నుపుర్ షెరాన్, ప్రీతి కూడా తొలి రౌండ్‌లలో విజయాలు సాధించి ముందంజ వేశారు. సాక్షి (52 కేజీలు) 5-0 తేడాతో మారియా జోస్ (కొలంబియా)పై, నుపుర్ (81 ప్లస్ కేటగిరీ) 5-0 స్కోరుతో అబోలా జాక్‌మన్ (గయానా)పై ఘన విజయం సాధించారు. మరో వైపు 54 కేజీల విభాగంలో ప్రీతి కూడా ఆర్ఎస్‌సీ ద్వారా గెలుపొందింది. ఆమె జోరు ముందు హనా లకోటర్ (హంగేరీ) నిలవలేకపోయింది. నేడు జరిగే పోటీల్లో భారత బాక్సర్లు జాస్మిన్ లంబోరియా, శశి చోప్రా, శ్రుతి యాదవ్ బరిలోకి దిగుతారు.

# గుజరాత్ సంచలన విజయం


గుజరాత్ జట్టు సంబరం

- 11 పరుగులతో ఓడిన ఢిల్లీ
- ఉమెన్ ప్రీమియర్ లీగ్

ముంబై: స్వల్ప లక్ష్యాన్ని ఛేదించడంలో తడబడిన ఢిల్లీ క్యాపిటల్స్ అనూహ్య పరాజయాన్ని మూటగట్టుకుంది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 11 పరుగుల తేడాతో ఢిల్లీని ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. లారా వోల్‌వార్ట్ (45 బంతుల్లో 57; 6 ఫోర్లు, 1 సిక్స్), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యాష్లీ గార్డ్‌నర్ (33 బంతుల్లో 51 నాటౌట్; 9 ఫోర్లు) అర్ధ సెంచరీలతో చెలరేగగా... హర్లీన్ డియోల్ (33 బంతుల్లో 31; 4 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడింది. వోల్‌వార్ట్, గార్డ్‌నర్ మూడో వికెట్‌కు 53 బంతుల్లోనే 81 పరుగులు జోడించి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించారు. జెస్ జొనాసెన్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం ఢిల్లీ 18.4 ఓవర్లలో 136 పరుగులకే కుప్పకూలింది. మరిజాన్ కాప్ (29 బంతుల్లో 36; 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా, అరుంధతి రెడ్డి (17 బంతుల్లో 25; 4 ఫోర్లు), అలైస్ కాప్సీ (11 బంతుల్లో 22; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కొద్దిగా పోరాడారు. ప్రధాన బ్యాటర్లు షఫాలీ వర్మ (8), కెప్టెన్ మెగ్ లానింగ్ (18), జెమీమా రోడ్రిగ్స్ (1) విఫలం కావడం ఢిల్లీని దెబ్బ తీసింది. కిమ్ గార్త్, గార్డ్‌నర్, తనూజ కన్వర్ తలా 2 వికెట్లు పడగొట్టారు.

## క్వార్టర్స్‌లో గాయత్రి-ట్రెసా

**ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్**

బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ సూపర్ 1000 టోర్నమెంట్ మహిళల డబుల్స్‌లో భారత జోడి పుల్లెల గాయత్రి గోపీచంద్ - ట్రెసా జాలీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం 50 నిమిషాల పాటు జరిగిన ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి-ట్రెసా 21-14, 24-22తో ప్రపంచ మాజీ నంబర్ వన్ జపాన్ జోడి యుకీ ఫుకుషిమా - సయాకా హిరోటాను ఓడించింది. పురుషుల డబుల్స్‌లో మాత్రం భారత్ టాప్ జోడి, ఆరో సీడ్ సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి అనూహ్యంగా వెనుదిరిగారు. ప్రిక్వార్టర్ పోరులో సాత్విక్-చిరాగ్‌పై 10-21, 21-17, 21-19తో లియాంగ్ వి కెంగ్ - వాంగ్ చాంగ్ (చైనా) గెలుపొందారు. పురుషుల సింగిల్స్ విభాగంలోనూ భారత్‌కు పూర్తి నిరాశ ఎదురైంది. బరిలో ఉన్న ముగ్గురు ఆటగాళ్లు ప్రిక్వార్టర్స్‌లోనే నిష్క్రమించారు. అండర్సన్ అంటాన్సెన్ (డెన్మార్క్) 21-13, 21-15 స్కోరుతో లక్ష్యసేన్‌పై, మూడో సీడ్ ఆంథోనీ గిన్‌టింగ్ (ఇండోనేసియా) 22-20, 15-21, 21-17తో హెచ్ఎస్ ప్రణయ్‌పై, కొడాయ్ నరోకా(జపాన్) 21-17, 21-15తో కిడాంబి శ్రీకాంత్‌పై విజయం సాధించారు.




# వన్డే సమరానికి సై

- నేడు భారత్, ఆస్ట్రేలియా తొలి మ్యాచ్
- కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా
- ఆత్మవిశ్వాసంతో ఆసీస్
- మ.గం.1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

సాధారణంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య ఏ ఫార్మాట్‌లో పోరు అయినా ఆసక్తిని రేపుతుంది. కానీ బోర్డర్-గావస్కర్ ట్రోఫీకి ఉన్న ప్రాధాన్యత కారణంగా టెస్టు మ్యాచ్‌లపై ఇటీవలి వరకు అందరి దృష్టి నిలవగా, త్వరలో జరగబోయే ఐపీఎల్‌పై కూడా చర్చ షురూ కావడంతో ఈ వన్డే సిరీస్‌పై హడావిడి కాస్త తక్కువగా కనిపిస్తోంది. పైగా వరల్డ్ కప్ సూపర్ లీగ్‌లో కూడా ఈ సిరీస్ భాగం కాదు. అయితే ఈ ఏడాది చివర్లో భారత్‌లోనే జరిగే వరల్డ్ కప్ కోసం రిహార్సల్‌గా ఆసీస్ ఈ సిరీస్‌ను చూస్తుండగా... భారత్ కూడా మెగా టోర్నీకి తమ అత్యుత్తమ వన్డే టీమ్‌ను ఎంచుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ క్రమంలో మూడు వన్డేల్లో ఫలితంకంటే వ్యక్తిగత ప్రదర్శనలే కీలకం.



ముంబై: టెస్టు సమరం తర్వాత భారత్, ఆస్ట్రేలియా వన్డేల్లో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యాయి. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య నేడు వాంఖెడే మైదానంలో తొలి వన్డే జరుగుతుంది. ఈ ఫార్మాట్‌లో వరుస విజయాలతో టీమిండియా నిలకడ ప్రదర్శించగా...దాదాపు నాలుగు నెలల విరామం తర్వాత కంగారూ బృందం వన్డే బరిలోకి దిగుతోంది. బలాబలాల దృష్ట్యా ఇరు జట్లు సమంగా కనిపిస్తుండగా, అంతిమ విజేత ఎవరో చూడాలి. మరో వైపు వ్యక్తిగత కారణాలతో రోహిత్ శర్మ తొలి వన్డేకు దూరం కావడంతో హార్దిక్ పాండ్యా తొలి సారి వన్డే కెప్టెన్‌గా బాధ్యతలు చేపడుతున్నాడు. భారత్‌కు వన్డేల్లో కెప్టెన్‌గా వ్యవహరించిన 27వ ఆటగాడిగా పాండ్యా నిలుస్తాడు.

**పటిదార్‌కు అవకాశం!**

భారత జట్టు ఇటీవలి ఫామ్ చూస్తే తుది జట్టు విషయంలో ఎలాంటి సమస్య లేదు. అద్భుతమైన ఆటతో గిల్ తన ఓపెనింగ్ స్థానాన్ని ఖరారు చేసుకోగా, రోహిత్ గైర్హాజరులో కిషన్‌కు మళ్లీ టీమ్‌లో చోటు ఖాయం. వీరిద్దరు శుభారంభం అందిస్తే జట్టు భారీ స్కోరుకు అవకాశం ఉంటుంది. గత ఏడు వన్డేల్లో 3 సెంచరీలు బాదిన కోహ్లి ఆట గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తన 75 సెంచరీల జాబితాలో మరిన్ని చేర్చుకునేందుకు ఇది అతనికి మరో అవకాశం. మిడిలార్డర్‌లో మెరుగైన రికార్డు ఉన్న రాహుల్ కూడా సత్తా చాటాల్సి ఉంది. అయితే నాలుగో స్థానంలో రెగ్యులర్‌గా ఆడే శ్రేయస్ గాయం కారణంగా దూరం కావడంతో ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తికరం. సూర్యకుమార్ ఈ స్థానం కోసం అసలైన పోటీదారే అయినా ఆడిన 20 వన్డేల్లో అతని పేలవ రికార్డు సందేహాలు రేకెత్తిస్తోంది. కొత్త ఆటగాడు రజత్ పటిదార్‌నుంచి అతనికి పోటీ ఎదురవుతోంది. ఆల్‌రౌండర్లుగా హార్దిక్, జడేజా తమ స్థాయి ఆటను ప్రదర్శిస్తే తిరుగుండదు. ఇద్దరు ప్రధాన పేసర్లుగా షమీ, సిరాజ్ ఉంటే బ్యాటింగ్ బలం కోసం శార్దుల్‌ను ఎంపిక చేయవచ్చు. ఏకైక స్పిన్నర్ స్థానంకోసం అక్షర్, సుందర్ మధ్య పోటీ ఉంది.

**మ్యాక్స్‌వెల్‌పై దృష్టి...**



కమిన్స్, హాజల్‌వుడ్‌తో పాటు జాయ్ రిచర్డ్సన్ లాంటి పేసర్లు దూరమైనా ఆస్ట్రేలియా జట్టుకు ఎలాంటి ఇబ్బంది లేదు. కావాల్సినన్ని ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి. వరుసగా ఆల్‌రౌండర్లలో జట్టు నిండి ఉంది. గాయం నుంచి కోలుకొని చాలా రోజుల తర్వాత మ్యాక్స్‌వెల్ బరిలోకి దిగుతుండటం జట్టు బలాన్ని పెంచింది. ఫించ్ రిటైర్మెంట్ తర్వాత ఆడుతున్న తొలి సిరీస్‌లో అతని స్థానాన్ని భర్తీ చేసేందుకు హెడ్ ఉవ్విళ్లూరుతున్నాడు. టెస్టుల్లో చెత్త ప్రదర్శన చూపిన వార్నర్ ఇక్కడైనా రాణించడం కీలకం. ఎప్పటిలాగే స్మిత్, లబుషేన్ బ్యాటింగ్ జట్టుకు కీలకం కానుంది. మిచెల్ మార్ష్, స్టొయినిస్, సీన్ అబాట్, అస్టన్ అగర్...ఈ నలుగురు ఆల్‌రౌండర్లు తుది జట్టులోని రెండు స్థానాల కోసం పోటీ పడుతున్నారు. ఎవరికి అవకాశం దక్కినా వారు టీమ్ విలువ పెంచగల సమర్థులు. ప్రధాన పేసర్‌గా స్టార్క్ ముందుండి నడిపించనుండగా యువ ఆటగాడు ఎలిస్‌కు కూడా అవకాశం ఖాయం. లెగ్‌స్పిన్నర్ జంపా భారత బ్యాటర్లను ఇబ్బంది పెట్టడంలో ప్రధాన పాత్ర పోషించగలడు.

**తుది జట్లు (అంచనా)**

**భారత్:** హార్దిక్ (కెప్టెన్), గిల్, కిషన్, కోహ్లి, సూర్యకుమార్ / రజత్ పటిదార్, రాహుల్, జడేజా, సుందర్, శార్దుల్, సిరాజ్, షమీ.

**ఆస్ట్రేలియా:** స్మిత్ (కెప్టెన్), వార్నర్, హెడ్, లబుషేన్, మార్ష్/ స్టొయినిస్, మ్యాక్స్‌వెల్, క్యారీ, గ్రీన్, స్టార్క్, జంపా, ఎలిస్.

**పిచ్, వాతావరణం**

మొదటి నుంచీ వాంఖెడేమైదానం బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. భారీ స్కోర్లకు అవకాశం ఉంది. ఛేదన ఇంకా సులువు కాబట్టి గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవచ్చు. ఇరు జట్ల మధ్య ఈ మైదానంలో జరిగిన చివరి మ్యాచ్ (2020)లో ఆసీస్ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో వార్నర్, ఫించ్ మెరుపు సెంచరీలు చేశారు.

రాజ్యసభ

ఏపీ ఇన్ పార్లమెంట్

# 'పరిశ్రమ' హోదాతోనే పర్యాటక వికాసం

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



**న్యూఢిల్లీ, మార్చి 16:** పర్యాటక రంగానికి రాష్ట్రాలు పరిశ్రమ హోదా కల్పిస్తే అది మరింతగా రాణిస్తుందని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలదేనని తెలిపారు. రాజ్యసభలో గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. పరిశ్రమ హోదా పొందడం ద్వారా పర్యాటక రంగం, దాని అనుబంధ రంగాలు ఇతర పరిశ్రమలతో సమానంగా విద్యుత్ చార్జీలు, ఇతర పన్ను రాయితీలు వంటి వాటి ద్వారా లబ్ధిపొందే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రస్తుతానికి పర్యాటక రంగం వాణిజ్య విభాగంలో ఉన్నందున అధిక రేట్లను చెల్లించాల్సి వస్తోందన్నారు. పర్యాటకానికి పరిశ్రమ హోదా కల్పిస్తే భారీ పెట్టుబడులు అవసరమయ్యే ఆతిథ్యరంగంలో పెట్టుబడి ఖర్చు గణనీయంగా తగ్గి, ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులకు ప్రోత్సాహకారిగా మారుతుందని చెప్పారు. దేశంలో ఇప్పటికే 11 రాష్ట్రాలు (గుజరాత్, కేరళ, రాజస్థాన్, పంజాబ్, గోవా, కర్ణాటక, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, జమ్మూ కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, త్రిపుర) పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించినట్లు వివరించారు. మిగిలిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కూడా పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించాలని తమ శాఖ పదేపదే సలహా ఇస్తున్నట్లు తెలిపారు. ఆయా రాష్ట్రాల అధికారులతో ఉన్నత స్థాయిలో జరిగే ఇంటరాక్టివ్ సెషన్లలో, సమావేశాల్లో, కరస్పాండెన్స్ ద్వారా వాటిని ఒప్పించే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నట్లు మంత్రి వివరించారు.

**గిగ్ వర్కర్ల సామాజిక భద్రతకు నిధి**

గిగ్ ఆర్థికవ్యవస్థలో పనిచేసే వర్కర్ల (తాత్కాలిక కార్మికుల) సామాజిక భద్రత కోసం సంక్షేమనిధి ఏర్పాటు చేసినట్లు కార్మిక, ఉపాధిశాఖ సహాయమంత్రి రామేశ్వర్ తేలి చెప్పారు. విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న శ్రామికులందరిని కనీస వేతనం పొందడానికి అర్హులుగా చేస్తూ ప్రభుత్వం 2019లో వేతన కోడ్ చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం ప్రతి కార్మికుడికి వారు చేసేపని, కాలవ్యవధికి అనుగుణంగా కనీస వేతనాలను యాజమాన్యం నిర్ణయించాలన్నారు. కార్మికుడు పనిచేసే వ్యవధి.. గంట, దినసరి, నెలసరి అయినప్పటికీ వేజ్‌కోడ్ కింద కనీస వేతనం పొందడానికి అర్హుడని చెప్పారు. సేవారంగంలో గిగ్ ఆర్థికవ్యవస్థ గణనీయ పాత్ర పోషిస్తున్న దృష్ట్యా గిగ్ ప్లాట్‌ఫామ్స్‌పై పనిచేసే గిగ్ వర్కర్ల కోసం సామాజిక భద్రత కోడ్ చట్టం చేసినట్లు చెప్పారు. ఈ కోడ్ ద్వారా తొలిసారిగా గిగ్ వర్కర్‌ను చట్టం నిర్వచించినట్లు తెలిపారు. గిగ్ వర్కర్ల సామాజిక భద్రత కోసం పలు పథకాలను ప్రవేశ పెట్టనున్నామన్నారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం సామాజిక భద్రత నిధిని ఏర్పాటుచేసే సౌలభ్యాన్ని కోడ్ కల్పిస్తోందన్నారు. అదేవిధంగా అగ్రిగేటర్ తమ వార్షిక టర్నోవర్లో ఒకటి నుంచి రెండుశాతం లేదా వర్కర్లకు చెల్లిస్తున్న మొత్తంలో పరిమితులకు లోబడి ఐదుశాతం వరకు సామాజిక భద్రత నిధికి చందా ఇవ్వడం ద్వారా వర్కర్ల సంక్షేమనిధికి తోడ్పడవచ్చని మంత్రి పేర్కొన్నారు.

**కార్మికశాఖ నిధుల్లో 98 శాతం వినియోగం**

కార్మిక, ఉపాధికల్పన శాఖ ద్వారా వివిధ పథకాలకు కేటాయించిన నిధుల్లో 98 శాతం వినియోగించినట్లు కార్మిక, ఉపాధికల్పన శాఖ సహాయమంత్రి రామేశ్వర్ తేలి తెలిపారు. విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. 2021–22 ఆర్థిక సంవత్సరంలో కోవిడ్ మహమ్మారి ప్రభావం చూపడం వల్ల వివిధ పథకాలకు నిధుల వినియోగంలో కాలయాపన జరిగిందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కోచింగ్, గైడెన్స్, నేషనల్ కెరీర్ సర్వీస్, వర్తకులకు సంబంధించిన ప్రధాన మంత్రి శ్రమయోగి మాన్‌ధన్, నేషనల్ పెన్షన్ వంటి పబ్లిక్ ఫేసింగ్ స్కీమ్‌లు గణనీయంగా ప్రభావితమయ్యాయని వివరించారు. పరిస్థితులు చక్కబడిన వెంటనే రిజిస్ట్రేషన్లను మెరుగుపరిచేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.

**పర్యాటక పోలీసు ఏర్పాటు**

తమ శాఖ కృషితో ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, గోవా, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ, కశ్మీర్, మధ్యప్రదేశ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, యూపీ ప్రభుత్వాలు వివిధ రూపాల్లో టూరిస్టు పోలీసు ఏర్పాటు చేసినట్లు కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి.. వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

**ఇటుక బట్టీలకు ఆర్థికసాయం ఉండదు**

తమ శాఖ ద్వారా ఇటుకబట్టీ యూనిట్లకు జీవనోపాధి నిమిత్తం ప్రోత్సాహకాలు, ఆర్థికసాయం లేవని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ సహాయమంత్రి అశ్వినీకుమార్ చౌబే తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఇటుకబట్టీల నుంచి వచ్చే ధూళి ఉద్గార నియంత్రణ మార్గదర్శకాలు, రహదారులు వేయడం తదితర అంశాలపై జారీచేసిన నోటిఫికేషన్ అమలు చేయాలని రాష్ట్రాల కాలుష్య నియంత్రణ బోర్డులు/కమిటీలను కోరామని చెప్పారు.

లోక్ సభ

## ఏపీలో 4731 ఓడీఎఫ్ గ్రామాలు



ఆంధ్రప్రదేశ్‌లో 18,709 గ్రామాలుండగా 4,731 గ్రామాలను ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ (ఓడీఎఫ్) గ్రామాలుగా గుర్తించినట్లు కేంద్ర జలశక్తి శాఖ సహాయమంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ తెలిపారు. లోక్‌సభలో గురువారం వైఎస్సార్‌సీపీ ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ రెండోదశలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు 2022–23లో కేంద్రవాటాగా రూ.676.79 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

## ఉడాన్ ఆపరేటర్లకు రూ.2,433 కోట్ల వీజీఎఫ్

ఉడాన్ పథకంలో విమానాల సేవల నిమిత్తం ఎంపికచేసిన ఎయిర్‌లైన్ ఆపరేటర్లకు రూ.2,433 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) విడుదల చేసినట్లు కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా.. వైఎస్సార్‌సీపీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

## వాటర్ ఏరోడ్రోమ్‌లకు రూ.287 కోట్లు

దేశవ్యాప్తంగా 13 వాటర్ ఏరోడ్రోమ్‌ల అభివృద్ధి కోసం రూ.287 కోట్లు కేటాయించినట్లు కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు బాలశౌరి, లావు శ్రీకృష్ణదేవరాయల ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. గుజరాత్, అస్సాం, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అండమాన్ నికోబార్ దీవులు, గోవా, హిమాచల్‌ప్రదేశ్, లక్షద్వీప్‌లలో 56 సీప్లేన్ రూట్లు అనుసంధానించడానికి 25 వాటర్ ఏరోడ్రోమ్‌లు గుర్తించినట్లు వివరించారు.

## ప్రకాశం బ్యారేజీ వాటర్ ఏరోడ్రోమ్ అభివృద్ధికి రూ.20 కోట్లు

రివైవల్ ఆఫ్ అన్‌సర్వ్‌డ్, అండర్ సర్వ్‌డ్ ఎయిర్‌పోర్ట్స్ పథకం కింద ప్రకాశం బ్యారేజీ వాటర్ ఏరోడ్రోమ్ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి జ్యోతిరాదిత సింధియా తెలిపారు. వాటర్ ఏరోడ్రోమ్ అభివృద్ధిలో భాగంగా నగరం వైపు టెర్మినల్ బిల్డింగ్, కార్‌పార్కింగ్ తదితర అభివృద్ధి పనుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం భూమిని సేకరించాల్సి ఉందని వైఎస్సార్‌సీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, చింతా అనూరాధ, బాలశౌరి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

## ఏపీలో మెట్రో ప్రాజెక్టు ఏదీ లేదు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం మెట్రో రైలు ప్రాజెక్టు ఏదీ నిర్మాణదశలో లేదని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయమంత్రి కౌశల్ కిషోర్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ బి.వి.సత్యవతి ప్రశ్నకు జవాబిచ్చారు.

## హృదయ్‌లో 12 పట్టణాలు

ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి సహా 12 పట్టణాల్లో హృదయ్ పథకం అమలు చేస్తున్నామని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాలశాఖ సహాయమంత్రి కౌశల్ కిషోర్ తెలిపారు. కర్నూలు, రాజమండ్రి పరిసరాల్లోని పలు స్మారకకట్టడాలు కేంద్ర సంరక్షణలో ఉన్నాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

# ఇంటి వద్దే విచారించండి

**ఈడీకి ఎమ్మెల్సీ కవిత లేఖ**

- 20న తమ ఆఫీసులోనే విచారణకు రావాలంటూ కవితకు మళ్లీ ఈడీ నోటీసులు



**సాక్షి, న్యూఢిల్లీ:** ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో తాను నేరుగా విచారణకు హాజరుకాలేనని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంటి నుంచే విచారణ చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని తెలంగాణ ఎమ్మెల్సీ కవిత కోరారు. ఈడీ దర్యాప్తును విశ్వసించలేకపోతున్నానని తెలిపారు. గురువారం ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో విచారణకు ఆమె గైర్హాజరయ్యారు. తాను ఈడీ కార్యాలయానికి ఎందుకు రావడంలేదో తెలుపుతూ, మహిళగా తన హక్కులను వివరిస్తూ లేఖ రాసి, న్యాయవాది భరత్‌కుమార్‌తో పంపారు. 'ఈ ఏడాది మార్చి 11న విచారణకు హాజరుకావాలని ఈడీ సమన్లు పంపింది. చట్టాల ద్వారా రక్షణ కలిగిన మహిళగా తనను ఈడీ కార్యాలయానికి పిలవాల్సిన అవసరం లేదని, ఆడియో/వీడియో పద్ధతిలో విచారణకు సిద్ధమని తెలిపాను. ఇది కుదరదని అధికారులు అన్నారు. దీంతో మార్చి 11న ఈడీ విచారణకు హాజరయ్యాను. తెలిసిన వివరాలన్నీ అందించాను. నా ఫోన్ తెప్పించి, స్వాధీనం చేసుకుంటానంటే అప్పగించాను. సమన్లలో లేకపోయినా, ఇలా ఫోన్ తీసుకోవడం చట్టబద్ధం కాదు. అంతేగాక సూర్యాస్తమయం అయినా రాత్రి 8.30 గంటల వరకు కార్యాలయంలో కూర్చోబెట్టారు. మళ్లీ మార్చి 16న వ్యక్తిగతంగా హాజరు కావాలన్నారు. కానీ నేను అధీకృత ప్రతినిధి ద్వారా హాజరవుతాను. విచారణలో పాల్గొనడానికి నాకు ఇబ్బంది లేదు. అయితే కొందరు నిందితులతో కలిపి మార్చి 11న విచారిస్తామని చెప్పినా, ఆ విధంగా చేయలేదు. అందువల్లే సుప్రీం కోర్టును ఆశ్రయించాను. ఈ నెల 24న విచారణ జరగనుంది. అప్పటి వరకు ఈడీ విచారణ ఆపాలి' అని ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే, కవిత విజ్ఞప్తిని ఈడీ తిరస్కరించింది. ఈ నెల 20న ఈడీ కార్యాలయంలోనే విచారణకు హాజరుకావాలంటూ గురువారం మధ్యాహ్నం మరోసారి నోటీసులు జారీ చేసింది.

**ఎంపీ మాగుంటకు ఈడీ సమన్లు**

ఇదే కేసులో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఈ నెల 18న విచారణకు రావాలంటూ ఈడీ సమన్లు జారీ చేసింది. ఈ విషయాన్ని ప్రత్యేక కోర్టుకు ఈడీ అధికారులు వివరించారు.

**కవిత కూడా అనుమానితురాలే**

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కస్టడీ ముగియడంతో ఈడీ అధికారులు అరుణ్ పిళ్లైని ప్రత్యేక కోర్టులో హాజరుపర్చారు. సౌత్ గ్రూపులోని ఇతర వ్యక్తులతో కలిపి పిళ్లైని విచారించాల్సి ఉందని, అందువల్ల కస్టడీ పొడిగించాలని కోర్టును కోరారు. ఈ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కూడా అనుమానితురాలేనని, పిళ్లైతో కలిపి ఆమెను విచారించాల్సి ఉందని కోర్టుకు వివరించారు. ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి..పిళ్లైకు ఈ నెల 20 వరకు ఈడీ కస్టడీ పొడిగిస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు.

## నేడు చెన్నై టి.నగర్‌లో మహాకుంభాభిషేకం

**సాక్షి, చెన్నై:** చెన్నై టి.నగర్ జీఎన్ చెట్టి రోడ్డులో నిర్మించిన పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం మహా కుంభాభిషేకం నిర్వహించనున్నారు. సినీనటి కాంచన, వారి కుటుంబ సభ్యులు సుమారు రూ.40 కోట్లకుపైగా విలువ చేసే స్థలాన్ని అమ్మవారి ఆలయం నిమిత్తం టీటీడీకి విరాళంగా అందజేశారు. ఈ స్థలంలో శ్రీపద్మావతి అమ్మవారి ఆలయాన్ని రూ.10 కోట్లతో టీటీడీ నిర్మించింది. ఈ నెల 12వ తేదీ నుంచి కుంభాభిషేక ఏర్పాట్లు, పూజలు నిర్వహిస్తున్నారు. శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో విగ్రహప్రతిష్ట గురువారం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతుల చేతుల మీదుగా జరిగింది. ఉదయం విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి సమక్షంలో ప్రాణప్రతిష్ట, మహాకుంభాభిషేకం నిర్వహిస్తామని టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. అలాగే చెన్నై టి.నగర్‌లో ఉన్న శ్రీవారి ఆలయాన్ని త్వరలో పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

# మరో 'అగ్రిగోల్డ్' కానివ్వం!

**మార్గదర్శిపై తెలంగాణ హైకోర్టుకు నివేదించిన ఏపీ**




**సాక్షి, హైదరాబాద్:** మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ తన ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నగదును సొంత సంస్థల్లోకి మళ్లిస్తోందని, అవి నష్టాల్లోకి వెళ్తే వేలాది కుటుంబాలు వీధిన పడతాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. మార్గదర్శి మరో అగ్రిగోల్డ్, సహారా మాదిరిగా కాకముందే జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని తెలిపింది. దీనికి సంబంధించి పూర్తి ఆధారాలు ఉన్నందున పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో తమ సంస్థకు చెందిన పలు బ్రాంచ్‌లపై నమోదైన కేసులను కొట్టివేయాలని / దర్యాప్తుపై స్టే ఇవ్వాలని అభ్యర్థిస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసింది. విచారణను ఏపీలో కాకుండా మరో రాష్ట్రంలోని దర్యాప్తు సంస్థకు బదిలీ చేయాలని, అప్పటివరకు ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరింది. దీన్ని గురువారం విచారణకు చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ రెగ్యులర్ కేసులకు ఇబ్బంది లేకుండా సాయంత్రం 4.30 గంటల తర్వాత వాదనలు విన్నారు. పిటిషనర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా, ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి సుదీర్ఘ వాదనలు వినిపించారు. విచారణ 'పరిధి', కేసు మెరిట్ అంశాలపై వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేశారు. 'మార్గదర్శి అక్రమాలపై 409, 477(ఏ), 420 సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ పదేళ్లకు పైగా శిక్ష పడే కేసులే. ఏపీలో నమోదైన కేసులపై ఇక్కడ రిలీఫ్ కోరలేరు. ఒకట్రెండు అంశాల్లో మినహా ఏపీ హైకోర్టు పరిధిలోని అంశాలపై తెలంగాణ హైకోర్టు కలుగజేసుకునే అవకాశం లేదు. ఇది పునర్విభజన చట్టంలో స్పష్టంగా ఉంది' అని ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి నివేదించారు. 'పరిధి' అంశం తేలకుండానే మళ్లీ క్వాష్ పిటిషన్ దాఖలు చేయడం దర్యాప్తును అడ్డుకోవడమే అవుతుందన్నారు.

# ఆహారం అమోఘం.. ఆలోచన భిన్నం


మినప, రాగి, జొన్న ఇడ్లీలు

వ్యాపారమే ముఖ్యం.. లాభార్జనే ధ్యేయం.. ఇది నేటి వ్యాపారుల నిక్కచ్చి స్వభావం. అయితే ఆ దంపతులు దీనికి అతీతం. వారికి వ్యాపారం వ్యామోహం కాదు.. ధనాపేక్ష అంతకన్నా లేదు. వారికి కావాల్సిందల్లా నలుగురికి ఆరోగ్యాన్నిచ్చే ఆహారాన్ని అందివ్వడమే. కల్తీ లేని పదార్థాలను వండి పెట్టడమే. అందుకే ఒక చిన్న అల్పాహార హోటల్ ప్రారంభించారు. కానీ అక్కడ టీ, కాఫీలు ఉండవు.. అన్ని సంప్రదాయ వంటకాలే కనిపిస్తాయి. ఎక్కడా ప్లాస్టిక్ వస్తువు కనిపించదు. నీళ్లు కూడా కుండలోనివే.. కస్టమర్లు తాగడానికి రాగి చెంబులే ఇస్తారు. మరో విశేషం ఏమిటంటే బయట నూనెలైతే కల్తీ అవుతున్నాయని భావించిన ఆ దంపతులు వారి ఇంట్లోనే ఎద్దు గానుకను ఏర్పాటు చేసుకొని స్వచ్ఛమైన నూనెతో వంటలు చేసి.. హోటల్‌కు వచ్చేవారికి ఆరోగ్యమే తమ ధ్యేయం అన్నట్లు వారి ప్రస్థానం సాగిస్తున్నారు.


మినప గారెలు వండుతున్న హోటల్ యాజమాని కోటేశ్వరరావు

- రుచుల తాలింపు.. సంప్రదాయ వేళవింపు
- హనుమాన్ జంక్షన్‌లో పూర్తి సంప్రదాయ పద్ధతుల్లో నడిచే హోటల్
- హోటల్ ప్రాంగణంలోనే ఎద్దుతో కట్టె గానుగ ఏర్పాటు
- గానుగ నూనెతోనే ఆహార పదార్థాల తయారీ
- ఆరోగ్యకరమైన ఆహారంపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహన
- ఆదర్శనీయంగా అల్పాహార హోటల్ నడుపుతున్న దంపతులు

**కృష్ణాడెస్క్:** కాలమానం చక్రం లాంటిదని మన పెద్దలు అంటూ ఉంటారు. ప్రస్తుత ఆహారపు అలవాట్లపై ప్రజల్లో పెరుగుతున్న శ్రద్ధ, అవలంభిస్తున్న పద్ధతులు గమనిస్తే ఆ పెద్దల నానుడి నిజమే అనిపిస్తోంది. ఒకప్పుడు వంట నూనెలను ఎద్దు సాయంతో తిరిగే చెక్క గానుగలో తయారు చేసేవారు. క్రమంగా మానవుని మేధస్సుతో యంత్రాలను సృష్టించి వాటి ద్వారా నూనెలు తయారు చేయటం, ఆ తర్వాత నూనెలు నిల్వ ఉంచటం కోసం రకరకాల రసాయన ప్రిజర్వేటివ్స్ (సంరక్షణాలు) కలపటం మొదలుపెట్టారు. కానీ వాటిని వినియోగించి వండుతున్న ఆహారం తింటున్న ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ వెనుకటి పద్ధతులే ఆరోగ్యానికి సురక్షితమనే ఆలోచన ప్రజల్లో పెరుగుతుంది. సరిగ్గా ఇలాంటి ఆలోచనతోనే హనుమాన్‌జంక్షన్‌లో దంపతులు ఏర్పాటు చేసిన అల్పాహార హోటల్ ప్రజాదరణ పొందుతోంది.

### హోటల్ ప్రాంగణంలోనే ఎద్దు గానుగ

ఆకలి తీర్చుకునేందుకు వచ్చే కస్టమర్లకు వ్యాపార ధోరణిలో కాకుండా ఆరోగ్యకరమైన ఆహారం అందించాలనే ప్రధాన ఉద్దేశంతో బాపులపాడు మండలం కానుమోలుకు చెందిన చింతల కోటేశ్వరరావు దంపతులు హనుమాన్‌జంక్షన్‌లో ఇడ్లీ హోటల్ ఏర్పాటు చేశారు. దీనికి పేరు కూడా ప్రాచీన యోగ ప్రక్రియల్లో ఒకటైన రేకి అని పెట్టారు. అంటే ప్రాణశక్తి అని అర్థం.

### సొంతంగా నూనె తయారీ..

బయట నూనెలో కల్తీ అవుతున్నాయన్న ఆలోచనలతో హోటల్ ప్రాంగణంలోనే ఎద్దు గానుగను ఏర్పాటు చేసి వంటల తయారీకి కావాల్సిన వేరుశనగ నూనె, నువ్వుల నూనెలను తీస్తున్నారు. నిత్యం హోటల్ నిర్వహించటానికి కావాల్సిన వంట నూనెలను ఎద్దు గానుగ ద్వారా ఎంతో ఓర్పుతో 2, 3 గంటలు సమయం వెచ్చించి తయారు చేస్తుంటారు. ఆ నూనెతోనే పెసర, రాగి దోశలు, గారెలు వంటి అల్పాహారం తయారు చేస్తుంటారు. కట్టె గానుక కోసం రూ.1.60 లక్షలు వెచ్చించి, దానికి అవసరమైన చెక్క, రోకలి, రోలు ఏర్పాటు చేశారు. చిత్తూరు సమీపంలోని తవణంపల్లి గ్రామం నుంచి దిరిశెన చెక్క తీసుకుని వచ్చి గానుగ ఏర్పాటుకు కావాల్సిన రోలు మధ్య తిరిగే రోకలి, కొంకెమాను, బొమ్మ కొయ్యి, బాడిగ మాను, కాడి మాను తయారు చేయించారు.

### ఇంకా ప్రత్యేకతలు ఎన్నో..

ఈ హోటల్ మంచినీళ్లు తాగేందుకు కేవలం రాగి చెంబులు, మట్టి కుండలనే వినియోగిస్తున్నారు. ఆరోగ్యానికి మేలు చేసే వంటకాలు మాత్రమే ఇక్కడ విక్రయిస్తుంటారు. నాణ్యమైన మినుములు, పెసలు, రాగులతోనే వంటలు తయారు చేస్తున్నారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లను ఈ ప్రాంతంలోకి అనుమతించరు. కాఫీ, టీలు పూర్తిగా నిషేధం. హోటల్ ప్రాంగణంలో రకరకాల ఔషధ గుణాలు కలిగిన మొక్కలు పెంచుతున్నారు.

### వ్యాపారంగా చేయటం లేదు..



హోటల్ నిర్వహణను వ్యాపార ధోరణితో చేయటం లేదు. కల్తీ నూనెలు, ఆహార పదార్థాల వల్ల కలిగే అనర్థాల నుంచి మనల్ని మనమే రక్షించుకోవాల్సిన అవసరం ఉంది. దీని కోసం మన పూర్వీకులు ఆచరించిన వ్యవసాయ పద్ధతులు, ఆహారపు అలవాట్లను తిరిగి మనం అవలంభించాలి. దీని కోసం వంట నూనెల తయారీకి ఎద్దు గానుగ ఏర్పాటు చేశాం. లాభాపేక్ష లేకుండా కస్టమర్లకు ఆరోగ్యకరమైన ఆహారం వండి పెట్టడమే సంతృప్తిని కలిగిస్తుంది.

– చింతల కోటేశ్వరరావు, హోటల్ నిర్వాహకుడు

### గానుగ నూనె వంటకాలు ఆరోగ్యకరం..

ఆరోగ్యకరమైన ఆహారానికి రేకీ ఇడ్లీ హోటల్ పెట్టింది పేరు. ఎలాంటి కల్తీలు లేని సరుకులు, నూనెలు ఉపయోగించి మాత్రమే ఇక్కడ అల్పాహారం తయారు చేస్తుంటారు. దీంతో స్థానికుల నుంచి ఆదరణ లభిస్తుంది. ఇక్కడ లభించే ఇడ్లీ, పెసర, రాగి దోశలు చాలా రుచికరంగా ఉంటాయి.

– తన్నీరు బాల, హనుమాన్‌జంక్షన్



### మంచి ఆహారంతోనే ఆరోగ్యం..



ఆరోగ్యకర జీవితాన్ని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ ప్రస్తుతం అన్నిచోట్లా కల్తీ సరుకులు, ఆహారమే విక్రయిస్తున్నారు. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇలాంటి తరుణంలో రేకి హోటల్ అందిస్తున్న అల్పాహారం పూర్తిగా స్వచ్ఛమైన ఎద్దు గానుగ నూనెతో తయారు చేస్తున్నారు.

– యనమదల శ్రీ రంగనాథ్, హనుమాన్‌జంక్షన్ రూరల్

# నాడు క్షామం.. నేడు క్షేమం

- కొత్తగా వ్యవసాయ బోర్లు, విద్యుత్ సర్వీసులకు అనుమతి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతాంగం

**పలమనేరు(చిత్తూరు జిల్లా):** ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని రైతులకు డార్క్ ఏరియాల శాపం తీరింది. ఏళ్ల తరబడి కొత్త వ్యవసాయ బోర్లు వేసుకొనేందుకు, విద్యుత్ కనెక్షన్ పొందేందుకు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించింది. జిల్లాలో ఓవర్ ఎక్స్‌ప్లోటెడ్ గ్రామాల జాబితానుంచి 191 గ్రామాలను తొలగించింది. కొత్త ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని కేవలం ఆరు గ్రామాలు మాత్రమే డార్క్ ఏరియాలుగా ఉంటాయి. ఆ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాలు జిల్లా అధికారులతోపాటు సంబంధిత ట్రాన్స్ ఏడీలకు ఈ నెల 14వ తేదీన అందాయి. దీంతో డార్క్ ఏరియా జాబితానుంచి తొలగింపబడిన ప్రాంతాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### తొలగిన సమస్య

ఏపీ వాల్టా చట్టం–2002 (ఏపీ వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్టు–2002) మేరకు అప్పటి ప్రభుత్వం భూగర్భజలాల ఆధారంగా ఓవర్‌ఎక్స్‌ప్లోటెడ్ విలేజెస్‌లో భారీగా భూగర్భజలాలు అడుగంటాయని గుర్తించింది. జిల్లాలోని వందలాది గ్రామాల్లో కొత్తగా బోర్లు వేయకుండా నిషేధం విధించింది. ఆపై వర్షాలు పడి భూగర్భజలాలు పెరిగినా ఆయా గ్రామాలను నిషేధిత జాబితానుంచి తొలగించకుండా నిర్లక్ష్యం చేసింది. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. వర్షాలు కురిసినా రైతులు బోర్లు వేసుకోలేక పంటలు సాగుచేసుకోలేని దుస్థితి ఏర్పడింది. దీనిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దృష్టి సారించింది. పెరిగిన భూగర్భజలాల ఆధారంగా 2022 అగస్టులో గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్‌తో కొత్త జాబితా తయారు చేయించింది. దీని ప్రకారం డార్క్ ఏరియా పరిధిలోని పలు గ్రామాల్లో నిషేధం తొలగించింది. ప్రస్తుతం విడుదల చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 7 ద్వారా కేవలం ఆరు గ్రామాలు మాత్రమే డార్క్ ఏరియాలుగా మిగిలాయి. గుడుపల్లె మండలం జరుగుకొండ, సంగనపల్లె, సొడిగానిపల్లె, కుప్పం మండలంలోని ఎల్లజ్జనూరు, కుప్పం, కమతమూరులు మాత్రమే క్షామ పీడిత ప్రాంతాలుగా పరిగణించబడతాయి.

### అన్నదాతకు అండగా ఉంటాం

**– మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**

డార్క్ ఏరియా గ్రామాల్లోని రైతులు ఇప్పటి వరకు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. గత టీడీపీ ప్రభుత్వం వారిని పట్టించుకోలేదు. ఈ సమస్యను పలువురు రైతులు, ప్రజాప్రతినిధులు మా దృష్టికి తీసుకువచ్చారు. అన్నదాతకు అండగా నిలబడాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించాం. మూడేళ్లగా సమృద్ధిగా వర్షాలు కురవడంతో భూగర్భజలాలు పెరిగిన విషయం తెలియజేశాం. ఆయన ఆదేశాల మేరకు 191 గ్రామాలపై నిషేధం తొలగింది. ఇకపై వారు యథేచ్ఛగా బోర్లు వేసుకోవచ్చు.

### రైతులకు తీపి కబురు

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 191 గ్రామాలను డార్క్ ఏరియా జాబితా నుంచి తొలగించారు. ఆయా ప్రాంతాల రైతులకు ఇది నిజంగా తీపి కబురే. ఇకపై వారు ఎలాంటి అభ్యంతరాలు లేకుండా వ్యవసాయ బోర్లు వేసుకోవచ్చు. విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వెంటనే నూతన సర్వీసులు మంజూరు చేస్తాం.

– కృష్ణారెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ (ఆపరేషన్స్), తిరుపతి

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943